

చెన్నపట్టణము, నవంబరు ౧౯౨౭

సంపుటము ౪ ప్రభవ సంవత్సరము కార్తికమాసము సంఖ్య ౧౧

ఝ రీ త ర ణ ము

నుద్దిపల్లి వేంకటరమణయ్య గారు

ప్రథితమేవాడరాజ్యసంభరణశాలి,
వీరనిలయ సిసోదియావారిధీందుఁ,
డల్ల రాణా ప్రతాపసింహాధిపుండు
…నెడు నొక్కఁడుఁ జైత్రకాశ్వంబుమీఁద.

…ధాటిఁ దూఁపువలె దూఁకుటయె కాని
…నఁ బిక్కఁ జూపని మేలుతేజి
నాఁడు విడి హాల్దిఘాటు రణస్థలంబుఁ
బఱచెడు నలంఘ్యదైవవిపాకమునను,

తతపరాజయానలశిఖాదహ్యమాన
హృదయుఁడై పోఁగుచుండె నుర్వీధవుండు
నడచుచున్నాఁడొ హాయ మెక్కినాఁడొ కాక
యెఱుఁగ లేకుండఁ దను దాను మఱచిపోయి.

అరుగునది దుర్గమంబైన యటవిసీమ;
త్రోవఁ జూప లేఁ డొక్కపురోగముండు;
తటుకునను గొండకొమ్మున దారి యాఁగె;
మిగుల నొఱకమై కొండయు ముగిసె నచట.

తొంగిచూచెను తాడిలోతునను గ్రింద
నెడతెగని ఘోషమున సెలయేఱు పాఱు;
భయదమై మృత్యువదనగహ్వరముభాతి
నేబదడుగుల వెల్పున నెసఁగె లోయ.

చెంత వినఁబడెఁ బెనుకేక లింతలోన
వెనుదిరిగిచూచె మన్నీఁడు; కనఁగనయ్యెఁ
"జోకు మోతుక్రియుఁడ! పాఱిపోకు" మంచు
వెంబడించెడు రిపులయాశ్వికదళంబు.

తొమ్మిదీటెల మొనము మార్తురకుఁ దనకు;
నుఱుకవలె నద్దరికిఁ గాక దొరకవలెను
గఱకుఁదురకల క్రూరంపుఁ గరములకును;
తరమె యొక్కని కెదిరి యందఱను దఱుము?

మెల్ల వారువంబు మెడఁ దట్టె నా రౌతు;
వ్రాలి ముద్దుగొనియె ఫాలతలము;
"నాపటాణిమిన్న! నాకూర్మిచైతకా!
మనలఁ దరిసె నదిగొ మలకదండు.

నీదురింఖానముద్ధూత నిబిడధూళి
నందుకొనలేవుగద యెట్టిహాయములైన;
హెచ్చుఁగద ధైర్య మెక్కట్టు లెచ్చనీకు;
ఏటిలెక్క నీకీవాఁగు దాఁటివేయ?

సురిఁగిపోవఁగరాదది పిఱికితనము
ఏఱు తరియించి దాఁటింపు మీవిపత్తు"
ననుచుఁ బురికొల్పెఁ బరమసాహసుఁ డతండు
ప్రాణములకంటెఁ బ్రియమైనవావురంబు.

నల్లె యనురీతి శీర్షంబు నల్ల నూఁచి
కాళ్లు నాల్గును ముందఱఁ గలుపుకొనియె;
తటమునంచునఁ ద్రుటిసేపు తాళి మావు
కొలిచెఁ గంటితో నావలివలికి దవ్వు.

కొమ్మకొనఁ బిట్ట యెగురుచుఁ గూయుచాఁ
సరగ సకిలించి నొకమాఱు జవనహయము
పెనుతుపానున లేచెడు వీచిపోల్కి
నాకసమునకుఁ జంగునఁ జౌకళించె.

వీతి వేగాతిశయముచేఁ జెల్లగిల్లి
దరిని గల గండ్రశిల లేట దొరలి డుల్లె;
ఆహుమాయిరాహుతుల గాయముల నల్ల
కలుషితముసేసె విమలహా సలిలమెల్ల.

కరము కదలకుండఁ, గళ్లె మాడకయుండఁ,
జలన మొందకుండఁ జరణయుగము,
కూరుచుండె రాజకుంజరుఁ డలవోక
చక్కఁ జెనరకుండ జక్కిపైని.

నీలజీమూతమునఁ దటిన్మాలవోలెఁ
దళుకుమంచును మెఱసెఁ గత్తళముతోఁ
దయ్యమో బూతమో నాఁగ ధరణిభర్త
కంటి కగపడకుండఁగాఁ గడచె నేఱు.

ఈతఁగానితోఁ గెరటంబుఖాతిఁ జక్క
నేలికను బూని యద్దరి వ్రాలె జక్కి;
తత్తుఖళిపాతమునఁ జేసి ధరణీధరము
మ్రోఁగ నమ్మోటపెట్టిన దాఁగలిగతి.

ముక్కుపై వ్రేలు గదియించి బొమ్మలట్ల
మలతుదను నిల్చిపోయెను మలకపిండు;
బళిర, సెబాసు, బాపురే, వహ్వ యనుచు
వారినోళుల నొకపెట్టెఁ బలుకు లొదవె.

"మావునకును దగ్గ రావుతుం డితండు
రావుతునకుఁ దగ్గ మావు నిదియు
ఎవనివశము పట్ట నీసూరవరు" లంచు
మరలె వెనుక కంత దుర్కపౌఁజు.

ంగు ముందున కిడలేక యూఁగిపోయెఁ
న మును డస్సియున్న యాకత్తెలాసి;
సుచున్నను నిలక కాళ్లూఁగసాగ
తాఁకునఁ జెనుతల్లు కాఁడలట్లు.

న మాడిన చందాన మేననెల్ల
్దజలబిందుమౌక్తికశ్రేణి పర్వ;
ాలిమితిత్తుల యోజఁ బ్రక్కలను మిగుల
నెగురవేయుచు రోఁజె నాయెక్కిరింత.

చప్పనను డిగ్గి యెకిమీఁడు సైంధవంబు
వర్మమూద తద్భార మూడ్వంగఁ దొడఁగ;
అంతలోన నాసాంబ్రాణి యవనిఁ గూలె
వాన నానుగోడవలె గుభాలు మనుచు.

కా! చైతకా!" యంచు తుస్మేత లేచుఁ
డనుఁగుమోమును దనయొడియందుఁ జేర్చి
కనుల నీరొల్కఁ బుల్కుపుల్కనను దొరను
గాంచి యాతేజి కడసారి కన్నుమూసె.

"సుతులు తెగినను నమ్మిన హితులు తెగినఁ
గుడిబుజమువంటి మొనగాండ్రు పడిన నాజిఁ
జాటిసేయను నీవు జీవముల నుంటఁ
బ్రాపు నాకేది నీవె నన్ బాయ నింక?

ఓటమిని రాజ్యభ్రష్టత్వ మొకఁడె కల్గెఁ
గలుఁగ గాలేదు ధీరతాస్థలన మేమి
అకట! నీమృతిచే నిప్పు డదియు నొదవెఁ
బల్లటిలె మానసము ధృతిపాఁతు గదలి.

భూరి పాపిష్ఠవస్తు వీబామిడికంబు
తన్ను సేవించు విశ్వాసధనుల వైన
నిండుప్రాణముల్ చూచుచునుండఁ గొనెడు
స్వీయలాభపరాయణహేయబుద్ధి.

నన్నుఁ గాపాడి విడనాడినావె జీవ
మయ్యయో!"యంచు తేఁడు చింతాబ్ధి మున్గె
అతని స్మృతిపటాంతరమందు నపుడు తోఁచెఁ
జైతకకృతంబు లద్భుతచర్య లెన్నో.

యామునస్మృతి

మక్కపాటి వేంకటరత్నకవి గారు

ఏతమాలచ్ఛాయనే కదా! గోపాలుఁ డాప్తులతోఁ జల్దు లారగించె?
ఈతీరభూములందే కదా! గొల్లవ్రేతలతో శిఖిపింఛధరుఁ డాడె?
ఈపవిత్రోదమందే కదా! నౌకావిహారంబుఁ గావించె నచ్యుతుండు?
ఈనికుంజములయందే కదా! క్రీడించె రాధావధూటితో మాధవుండు?
శారదీయనిశాంత జ్యోత్స్నామనోజ్ఞ-మైన యీశాద్వలస్థలమందె కాదె
విశ్వమోహన మహనీయ వేణుగాన-మెలమిఁ గావించె మున్ను శ్రీకృష్ణమూర్తి.

భాషాసంప్రదాయములు

శ్రీ వరవస్తు వెంకటరామానుజస్వామి గారు, యమ్. ఏ.

(నాలుగవ సంపుటము, నాలుగవ సంచిక తరువాయి)

౧౨. భాషోత్పత్తి

పైశీర్షికతో నిదివరకు గీర్వాణభాష చేరియున్న 'ఇండోయూరపియన్' భాషాకుటుంబమునుగుఱించియు, నందలి కొన్ని ప్రత్యేకశాఖలనుగుఱించియు గొన్ని విషయములు తెలియజేయబడినవి. సందర్భవశమున భాషావిభాగములనుగుఱించికూడ గొంతవఱకు చర్చింపబడినది. ప్రస్తుతము భాష యేవిధముగా నేర్పడినదో, అది యెల్లప్పుడును మారుచుండుటకు గారణము లెట్టివో విమర్శింపబడును.

భాషయనునది యొకరియభిప్రాయమును మఱియొకరికి తెలియజేయు వ్యక్తధ్వనిరూపమగు సాధనమని చెప్పవచ్చును. దీనినిబట్టి భాషకు రెండుముఖ్యమైన గుణములు గలవని తెలియంగవలయును. భాషయనునది యభిప్రాయబోధకమును వ్యక్తధ్వన్యాత్మకమును నై యుండవలయును. మన మాడు మాట లభిప్రాయబోధకము లగునప్పుడే భాష యనిపించుకొనును. లేనిచో, జంతువులయొక్కయు, పక్షులయొక్కయు నరుపులవంటి నిరర్థకధ్వనినికూడ భాష యనవలసివచ్చును. అక్కట మున వేఱైనయొకభాష యది యర్థమగువారికే భాష యనిపించుకొనునుగాని మిగిలినవారికి, తెనాలిరామకృష్ణుడు చెప్పినట్లు, సోలలో పోసిన గవ్వలశబ్దమువలె వినబడును. కాబట్టి యభిప్రాయబోధకము లైనప్పుడే మన ముచ్చరించుశబ్దములు భాష యనిపించుకొనుచున్నవి. ఇట్లే యభిప్రాయబోధకము లయ్యు వ్యక్తధ్వనులే భాష యనిపించుకొనును కాని మిగిలినసాధనములు భాష యనిపించుకొనజాలవు. మనయభిప్రాయములను సైగలచే [illegible] మఱికొన్ని సాధనములచేకూడ తెలియజేయవచ్చును. వ్రాతమూలమున నొకరియభిప్రాయములను మఱియొకరికి తెలుపవచ్చును కాని వ్రాత యభిప్రాయములను పరంపరగా తెలియజేయునుగాని ప్రత్యక్షముగా దెలుపజాలదు. వ్రా[త] వర్ణములద్వారముగా నభిప్రాయసూచక మగుచున్నది. వర్ణాత్మకభాష సిద్ధించినగాని లిపి సిద్ధింపనేరదు. చిత్ర[...]ములవలన మనయభిప్రాయములను పరులకు ప్ర[...]ముగా దెలుపవచ్చును; కాని యీ[...] నిరూపపదార్థములను, సంబంధములను దెలు[...]పుట దుర్ఘటము. చిత్రములు మాత్రము శబ్దా[...]త్మకభాషవలె సాంకేతికము కాక సర్వజనులకును శిక్ష[...] యవసరము లేకయే యభిప్రాయములను తెలియజేయును. గణితశాస్త్రమునందువలె 1, 2, 3, x, y, z, మొదలగు సంజ్ఞలచే మనయభిప్రాయములను దెలియజేయవచ్చును. కాని యీవిధముగా మనము సర్వకాలములయందును వ్యవహరించుట కష్టసాధ్యము. హస్తచేష్టాదిసంజ్ఞలచే మాత్రము మనము సామాన్యాభిప్రాయములను నై వారికి సులభముగా దెలియజేయగలము. విశేషాభిప్రాయములు అనగా శాస్త్రీయవిషయములు తెలియబడకపోవచ్చును. కాని లోకయాత్రాసంబంధమగు విషయములన్నియు చేష్టలచే దెలుపవచ్చును. చిత్రములవలె నివికూడ స్వ[...] గ్రాహ్యములు గాని శిక్షాగ్రాహ్యములు కావు. ఒక[...]మగు చేష్టచే నన్ని దేశములలోను నన్ని జాతులవారికిని నొకేయర్థము సూచింపబడును. ఆకారణముచేతనే మన భాష తెలుగనివారితో సంభాషించుటకు మనము సంజ్ఞల నుపయోగింతుము. మఱియు 'నమెరికా' (America ఖండమున గొన్ని జాతులవారు సంజ్ఞలతోనే యభిప్రాయములను బోధించుకొందురని 'జేమ్సు' (James), 'శీమర్'

(Fisher) మొదలగు పాశ్చాత్యులు వ్రాసియున్నారు. సంజ్ఞలు మనుష్యునికి స్వభావసిద్ధములు. మనుష్యుడు భాష నుపయోగించుటకు బూర్వకాలమునుండియు వీని [నుపయో]గించుచున్నాడు. వీనివలననే ప్రప్రథమమునుండియు మనుష్యుడు జంతువులనుండి విభేదము నందుచున్నాడు. వర్ణాత్మక భాష నుపయోగించునప్పుడు కూడ మనము తదనుగుణములగు చేష్టలను జేయుచునే యుందుము. దూరమున మాటలాడుచున్న వారి మాటలు మనకు వినబడకున్నను వారి చేష్టలవలన వారు మాటలాడు విషయమును గొంతవఱకు మనము గ్రహింపవచ్చును. ఇట్లు వర్ణాత్మకశబ్దములవలననే కాక తదితర సాధనములచేగూడ మనయభిప్రాయములు బోధింప శక్యములగుచున్నను వానిని మనము భాషయని వ్యవహరింపము. వ్యక్తధ్వన్యాత్మకమగు సాధనమునే భాషయని వాడెదము. కాబట్టి యభిప్రాయబోధక వర్ణాత్మకశబ్దమే భాష యగుచున్నది. అభిప్రాయబోధకము కాకపోయినను, వ్యక్తధ్వనిరూపము-అనగా వర్ణాత్మకము కాకపోయినను, భాష యనుపించుకొనదు.

ఇప్పుడు వ్యక్తధ్వని యనగా నేమో విచారింపవలసియున్నది. మన ముచ్చరించువర్ణములు స్వరములనియు, వ్యంజనములనియు రెండువిధములుగా విభాగముచేయబడియున్నవి. వీనిలో స్వరములన్నియు ఆవు, పిల్లి, కుక్క, గుఱ్ఱము, మేక, కప్ప, కాకి మొదలగు పశుపక్ష్యాదుల యఱపులలో వినబడుచున్నవి. కాబట్టి స్వరములు మనుష్యజంతుసామాన్యములు కాని మనుష్యులచే మాత్రమ ముచ్చరింపబడుట లేదు. అచ్చులవలెనే యూష్మలనుగూడ నెంతకాలమైనను నెడతెగక యుచ్చరింపవచ్చును. అంతస్థలుకూడ వీనిని బోలియున్నవి. ఇవి యుచ్చారణమున స్వరములకును, స్పర్శలకును మధ్యస్థముగా నుండును. ఈయంతస్థలును, నూష్మలును పశుపక్ష్యాదుల యఱపులలో వినబడుచుండును. పైయూష్మజాతులవర్ణములను జనిపించునప్పుడు నిశ్వాసమునకు ముఖమార్గమున పూర్తియగు ప్రతిబంధక మెచ్చట నుండదు. స్పర్శ లుచ్చరించునపు డట్లుకాక, ఒక్కక్షణము నిశ్వాసవాయువు వర్ణోత్పాదకావయవముల పూర్తియగుస్పర్శచే నాపబడును. ఇట్టివర్ణములు స్వతంత్రముగా నుచ్చరింపబడక యచ్చులతోనైనను, నంతస్థములతోనైనను గలిసియే వినబడుచుండును. ఈస్పర్శలు పశుపక్ష్యాది జంతువులయొక్క ధ్వనులలో వినబడుట లేదు. ఇవి మనుష్యమాత్రోచ్చారితములు. ఇవియే మనుష్యుని జంతువులకంటె గొప్పవానినిగ జేయుచున్నవి. ఇవియే యర్థవ్యంజకములు. ఇవి యుండుటచేతనే మనుష్యు లుచ్చరించుధ్వనులు వ్యక్తము లగుచున్నవి.

భాషాశాస్త్రమున కృషిచేసినవా రందఱును భాషోత్పత్తినిగూర్చి యాలోచించి యూహలుచేసియున్నారు. మనమహాభారతపురాణాదిగ్రంథములలో భాష యీశ్వరునిచే సృష్టిచేయబడినదని చెప్పబడియున్నది. అప్పటివారు ప్రపంచమునందుండు మనుష్యపశుపక్ష్యాదులను నీశ్వరసృష్టములని తలంచుటచే వట్టిజనులచే నుపయోగింపబడు భాషకూడ నాతనిచే సృజింపబడినదని తలంచిరి. కాని యీశ్వరునిచే సృజింపబడిన యొకజాతి వస్తువు లన్నియు ప్రపంచమునం దెల్లెడలను నొకవిధముగా నుండగా భాషమాత్రము ప్రతిదేశమునను భిన్నభిన్నములుగా నుండుటకు సరియగుయుక్తి కనబడుట లేదు. భాష మనుష్యునకు స్వభావసిద్ధమని చెప్పుటకు గూడ వీలులేదు. అట్లైనచో ప్రతిపురుషునకును నాహారము తినుట, నడచుట మొదలగువానివలె భాషకూడ నేర్పనవసరము లేకయే రావలసియుండును. అట్టి యనుభవ మెవరికిని లేదు. భాష ప్రయత్నపూర్వకముగా నేర్చుకొనినగాని యేమనుజునకును రాదని చెప్పవచ్చును. మఱియు భాష మనుష్యునకు ప్రకృతిసిద్ధమైనచో జనకుల భాషయే వారిశిశువులకును రావలసియుండును. కాని సందర్భములనుబట్టి భాషాంతరమునుగూడ శిశువులు గ్రహించుట కలదు. ఆంధ్రదంపతు లేదైన నొకకారణముచే మహారాష్ట్రదేశమున నివాసముచేయుచున్నచో వారిశిశువులకు జనకులభాష యగు నాంధ్రభాషయే కాక యాదేశమున వ్యవహరింపబడుచున్న మహారాష్ట్రముగూడ వచ్చును. మఱియు బాధిర్యముకల పిల్లలకు భాష వినబడకుండుటచే మూకత్వము సంభవించుటకూడ కలదు. అట్టివారికి చికిత్సవలన బాధిర్యము పోయినచో నటుపై భాష యలవడును. కాబట్టి భాష దైవసృష్ట

మనికాని; మనుష్యులకు స్వభావసిద్ధమనికాని పాశ్చాత్య భాషాశాస్త్రజ్ఞు లంగీకరింపరు. వారు ప్రపంచ మీశ్వర సృష్టమనికూడ నంగీకరింపరు. ఏకకణాదిమనుష్యపర్యంతము నుండుజీవకోటియంతయు బూర్వపూర్వావస్థాపరిణామభేదముచే నేర్పడినదని చెప్పుదురు. ఆరీతినే భాషకూడ మనుష్యులయవ్యక్తధ్వనులనుండి క్రమముగా నేర్పడినదని వారియభిప్రాయము. మనుష్యుడు పూర్వావస్థయందు విశేషముగా జంతువులను బోలియుండెను. అప్పు డితడు జంతువులవలె రాగద్వేషాదుల నవ్యక్తధ్వనులచే దెలియజేయుచుండెను. కుక్క మొదలగు కొన్ని జంతువులు వానియఱపులభేదముచే గోపము,సంతోషము మొదలగుభావములను తెలియజేయుటయే కాక పరిచితులను స్వాగతముచేసి శత్రువులను భయపెట్టుటకూడ గలదు. ఈవిధముగానే మనుష్యుడుకూడ దత్పూర్వావస్థలో దనమనోభావముల నవ్యక్తధ్వనులచే దెలియజేయుచుండెను.

మనుష్యు డతిసూక్ష్మజీవమునుండి మనుష్యస్థితి ననేకసహస్రసంవత్సరముల కెట్లు పొందెనో దానినంతయు మాతృగర్భమున పిండము తొమ్మిదిమాసములలో బొందుచున్నదని జీవశాస్త్రవేత్తలు చెప్పుచున్నారు. అనగా గర్భస్థపిండము మనుష్యచరిత్రమును సంక్షేపముగా దెలుపుచున్నదని చెప్పవచ్చును. ఇట్లే శిశువుల భాష నేర్చుకొనువిధము భాషోత్పత్తిక్రమమును గొంతవరకు దెలుపగలదని భాషాశాస్త్రజ్ఞులయభిప్రాయము. పిల్లలు భాష పూర్తిగా వచ్చుటకుపూర్వము వారియభిప్రాయములు ననుకరణమువలన దెలియజేయుదురు. పిల్లియను పదమును నేర్చుకొనుటకుపూర్వమే యాజంతువును దానియఱపు ననుకరించి 'మియాం'అని తెలియజేయుదురు. ఈవిధముగానే ప్రాథమికావస్థలో జనులు తమయభిప్రాయముల కొన్నిటి నితరులకు దెలియజేసియుందురు. 'సంస్కృతము'లోని "కాక," "కుక్కుట" మొదలగు శబ్దములును, 'చీనా'భాషలోని "మియా" మొదలగు శబ్దములును, 'పాపుఆ' (Papua) భాషలోని "బోక్-కా" శబ్దములును నిట్లు పుట్టినవనుట నిస్సందేహము. ఇట్లు జంతువులనామములే కాక కొన్నిక్రియావాచకములుకూడ జనించుచున్నవి. సంస్కృతములోని 'హస్, పా.' మొదలగుధాతువు లిట్లు జనించియుండవచ్చును. ఇట్టియనుకరణ మనుకృతశబ్దమునకు సమానముగా నుండ నవసరము లేదు. అట్లుండుటకూడ గష్టము. ఒకేశబ్దము నేకుల కనేకవిధములుగా వినబడుచుండును. కావున నొకశబ్ద మనేకులచే ననేకవిధములుగా ననుకరింపబడవచ్చును. ఒకపక్షియొక్క శబ్దమే యొకజాతివారిచే 'బుల్ బుల్' అనియు, మఱియొకజాతివారిచే 'క్లో క్లో' అనియు, నింకొకజాతివారిచే 'హ్విట్ హ్విట్' అనియు ననుకరింపబడుచున్నది. ఎట్లనుకరింపబడినను వారియాసంఘములవారి కాపక్షిని స్ఫురింపజేయుచున్నది. అంతమాత్రము చేసిన జాలును. అప్పు డది యాపక్షికి నామము కాగలదు. ఈరీతిగా ననుకృతశబ్దము లసమానములైనను వాని యనుకరణములచే నేర్పడినభాష లనేకవిధములుగా నుండవచ్చును. విశేషముగా మార్పులను జెంది యభివృద్ధిపొందియున్న మనభాషలలో ననుకరణశబ్దము లిప్పుడు మనకు దిరోహితములైయున్నను, శిశువులభాషలలోను, వారివంటి యనాగరికజాతులభాషలలోను నీయనుకరణశబ్దములు విశేషముగా నగపడుటచే భాషయొక్క బాల్యావస్థలోకూడ నం దనుకరణశబ్దములు విశేషముగా నుండినవని చెప్పవచ్చును. ఇట్లఱపులచేతను, ననుకరణములచేతను, వానియొక్క యనేకవిధములగు మేళనములచేతను ప్రాథమికజనులు తమయభిప్రాయముల నొండొరుల కెఱిగించుచుండిరి. కాలక్రమమున మనుష్యులయభిప్రాయము లభివృద్ధిచెంది వారినాగరికత హెచ్చగా, వానిని దెలియజేయుటకు పదములు చాలకుండుటచే వారిలో గొందరు కొన్నిక్రొత్తపదములను గల్పించియుందురు. అవి కాలక్రమమున సర్వజనవ్యవహృతములైనచో భాషలో ప్రవేశించును. లేనిచో నశించును.

మఱియు మనుష్యుల కాశ్చర్యాదిభావములు కలుగునప్పుడు తదనుగుణము లగుధ్వనులు వారిముఖములనుండి వెలువడుచుండును. మనుష్యులకు నాగరికత హెచ్చిన కొలదిని వా రట్టిధ్వనుల నణచుకొనుచుందురు. కాని విశేషనాగరికులుకూడ నతితీక్ష్ణములగు భావముల ననుభవించునప్పు డట్టిశబ్దముల నుచ్చరింపక మానరు. ఇక జంతువునుండి విశేషము భేదింపని ప్రాథమికజను లట్టిధ్వను

లను విశేషముగా పాలగుట యాశ్చర్యము కాదు. అట్టి ధ్వనులు కాలక్రమమున నాయాభావములను దెలియజేయుశబ్దములుగా బరిణమించి భాషలో బ్రవేశించును. అనేకభాషలలో ననిష్టమును సూచించుపదము లోష్ఠ్యములతో బ్రారంభింపబడియుండుటచే సంస్కృతములోని 'ష్ఠీవ'యనుధాతువుకూడ నిట్లు జనించినదై యుండవచ్చును. మఱియు మనుష్యులు పనులుచేయునప్పు డూరకొనుటకంటె నాయాపనుల కనుగుణములగు ధ్వనులను జేయుచు బనిచేయుట సులభమనిపించును. ఇదికాక సంజ్ఞలు చేయునప్పుడు పైవా రాసంజ్ఞలను గమనించుటకుగా నాసంజ్ఞలతో శబ్దములను జేయుట సహజమై యున్నది. క్రమముగా నీశబ్దము లాయాపనులను బోధించునవియై భాషలో బ్రవేశించును. ప్రప్రథమమున పండ్లతో చేయుసంజ్ఞ ననుసరించు 'అద్' అనుశబ్దము క్రమముగా పండ్లు తినుట, అన్నము మొదలగునర్థములను దెలుపుశబ్దములకు మూలమగుచున్నది. ఈరీతిగానే 'వై, వాత, వాయు' మొదలగుశబ్దములుకూడ జనించియుండవచ్చును.

ఇట్లు చేష్టలతోను, అవ్యక్తధ్వనులతోను బ్రారంభమైనభాష క్రమముగా ననుకరణశబ్దములతోడను, భావచేష్టాద్యనుగతశబ్దములతోడను గూడినదై, యనేకవిధములగు వివిధమార్పులచేత నభివృద్ధినొంది చేష్టలను, నవ్యక్తధ్వనులను క్రమముగా విడనాడి భాషక్రింద నేర్పడి తిరుగ నిది కాలక్రమమున నీదిగువ వర్ణింపబోవు కారణములచే మార్పులను జెంది శాఖోపశాఖలుగా విజృంభించి యొకభాషాకుటుంబముక్రింద నేర్పడును. ఈరీతిగానే 'ఇండో-యూరపియన్' మాతృభాషకూడ జన్మించి క్రమముగా నభివృద్ధి పొంది దేశాంతరములలో నెల్ల వ్యాపించి యనేకభాషలుగా మారి యొకపెద్ద కుటుంబముగా నేర్పడినది. దీనికి 'ఇండో-యూరపియన్' భాషాకుటుంబమనియు, 'ఇండో-జర్మానిక్' భాషాకుటుంబమనియు పేరు.

౧౨. భాషావిపరిణామము

భాష యనునది యభిప్రాయబోధక మగు వర్ణాత్మకశబ్దము లేక వ్యక్తధ్వని యని యీవరకే చెప్పబడినది. మనుష్యులయొక్క యభిప్రాయములు సర్వదా మారుచునే యుండును. కాబట్టి వానిని దెలియజేయు భాషకూడ నెల్లప్పుడును మారుచునే యుండును. మఱియు వర్ణములు జిహ్వాద్యవయవములవలన బుట్టుచున్నవి గదా! అయవయవములలో శీతోష్ణస్థితి, ఆహారము, వృత్తులు మొదలగు ననేకకారణములచే మార్పు కలుగుచుండును. కాబట్టి వానివలన జనించు శబ్దములుకూడ తదనుగుణముగా మారుచుండును. అనగా భాష యెల్లప్పుడును మారుచుండును. దానికి మారుటయే స్వభావము. మఱియు బాలురు వృద్ధులు నుచ్చరించుశబ్దముల ననుకరించి భాషను నేర్చుకొనెదరు. వర్ణోచ్చారణావయవములు ప్రతిమనుష్యునకును భిన్నముగా నుండుటచే సరియగు ననుకరణ మసాధ్యమగును. ఆకారణముచే నుచ్చారణము ప్రతిమనుష్యునకును భిన్నముగా నుండును. వృద్ధులయుచ్చారణమును వినికదా యనుకరింపవలసియుండును. శ్రోత్రేంద్రియములలో భేదముండుటచే నొకవర్ణ మొకనిచే నొకవిధముగాను, మఱియొకనిచే మఱియొకవిధముగాను గ్రహింపబడవచ్చును. ఆశబ్దము ననుకరించుటలో వారిద్దరికిని భేదము కలుగును. ఇట్లు భాష మారుట కిన్నివిధములగు కారణములు గలవు. కాన ప్రతిభాషయు నెల్లప్పుడును మారుచుండుట యాశ్చర్యము కాదు. కాని యేభాషయైనను మార్పునొందక కొంతకాల ముండిపోయినచో మన మాశ్చర్యము పొందవలసియుండును.

భాష మారుట కనేకకారణము లున్నను వానిలో ముఖ్యములగువానిని కొన్నిటి నీక్రింద చేర్చి, యవి భాష నేవిధముగా మార్చునో తెలియజేసెదను:

౧. అనుకరణము లేక యన్యతరాకర్షణము:— అనుకరణేచ్ఛ మనుష్యజాతిసాధారణము. బాలురు వృద్ధులు చేయుపనుల ననుకరించుట మనమందఱము నెఱుగుదుము. నాగరకులకంటె ననాగరకులలో ననుకరణపుటలవాటు విశేషముగా నగపడుచున్నది. నాగరికులలో గూడ నీగుణము కొంతవఱకు గలదు. వారియలవాటు లన్నియు (fashions) నీగుణమును బురస్కరించుకొని యేర్పడినవే యని చెప్పవచ్చును. ఆదేవిధముగా వారి భాషకూడ నీయనుకరణేచ్ఛవలన విశేషము మార్పులను

పొందుచున్నది. కొన్ని జాతులవారు తమభాషను బూర్తిగా విడిచి వారిచుట్టుప్రక్కల నుండువారిభాషతో వ్యవహరించుట కలదు. ఇట్లు 'అమెరికా' దేశమునందుండు ననేకులు తమభాషలను వదలి 'యూరపు' ఖండములోని 'ఇంగ్లీషు' మొదలగుభాషల నవలంబించియున్నారు. కాబట్టి భాషాసామ్యమునుబట్టి జాతిసామ్యము నూహించుటకు వీలులేదు. భాషాసామ్యము పరస్పరసంబంధమునుబట్టి యేర్పడును. ఒకజాతివారైనను వివిధదేశములలోనుండి సంబంధాభావమువలన వేరు వేరు భాషలను వ్యవహరించుచుండవచ్చును. కొందఱు తమ భాషను బూర్తిగా విడిచి భాషాంతరమును గ్రహింపకపోయినను భాషాంతరపదములను విశేషముగా దమ భాషలో నుపయోగింపవచ్చును. 'ఇంగ్లీషు' భాషలో 'లాటిన్' పదములు విశేషముగా నున్నవి. తెలుగు మొదలగు ద్రావిడభాషలలో ననేకసంస్కృతపదములు ప్రవేశించియున్నవి. రెండుజాతులవారికి సంబంధము కలిగినప్పుడు వారియాచారవ్యవహారములందువలె వారిభాషలలోగూడ బరస్పరసాంకర్యము కొంత కలుగకమానదు. ఇట్లు పదములేకాక వర్ణములుకూడ నొకభాషనుండి మఱియొకభాషలోనికి బ్రవేశించును. ద్రావిడభాషకు స్వతఃసిద్ధములగు మూర్ధన్యవర్ణములు పరస్పరసంబంధమువలన 'ఇండో-యూరపియను' కుటుంబములోని భాషయగు సంస్కృతభాషలో బ్రవేశించినవి. వాక్యరచనారీతిని, బ్రత్యయములను నొకభాషనుండి మఱియొకభాష సాధారణముగా గ్రహింపదు. భాష వాక్యరూపముగా నుండునుగనుక వాక్యమునందలిపదముల పరస్పరసంబంధమును దెలుపురీతి ప్రతిభాషకును విలక్షణముగా నుండును. కాని యప్పుడప్పుడట్టి సాంకర్యముకూడ గనబడుట కలదు. ఉత్తరహిందూదేశములోని 'హిందీ, బెంగాలీ, అస్సామీస్' మొదలగు భాషలు 'ఇండో-యూరపియన్' కుటుంబములో జేరినవైనను ద్రావిడభాషాసంప్రదాయముల గొన్నిటి నవలంబించియున్నవి. ఉ. 'అస్సాం. manuh-bilak, మనుష్యులు; manuh-bilak or, మనుష్యు-ల-యొక్క; manuh-bilak-oloi, మనుష్యు-ల-కొరకు; manuh-bilak-ok, మనుష్యు-ల-ను; manuh-bilak-ot, మనుష్యు-ల-యందు; manuh-bilak-e, మనుష్యు-ల-వలన.

అనుకరణముయొక్క బలము అన్యతరాకర్షణములో (Analogy) విశేషముగా గనబడును. అన్యతరాకర్షణమనగా నొకపదముయొక్క రూపముగాని యర్థముగాని మఱియొకపదముయొక్క రూపముతోగాని యర్థముతోగాని పరిపోవునట్లు మారుట. పదములయొక్క యుత్పత్తి జనులకు దెలియనప్పుడు పరస్పరసంబంధములేనిపదములను సంబద్ధములని భ్రమపడి యేకరూపముగాగాని సదృశరూపముగాగాని వారు చేయవచ్చును. ఒకజాతిపదములు హెచ్చుగా వ్యవహరింపబడుటచే మఱియొకజాతిపదములుకూడ వీనికి సదృశరూపములుగా జేయబడవచ్చును. దీనికి అన్యతరాకర్షణము కారణమని చెప్పెదరు. 'ఇంగ్లీషు' భాషలో ననేకధాతువులకు భూతకాలమున -(e)d అను ప్రత్యయము చేర్చబడుచుండుటచే, come అనుధాతువునకుకూడ నట్లే came అనుటకు మారుగా comed అనురూపము పామరులచే హెచ్చుగా బ్రయోగింపబడుచున్నది. ఇట్లే -(e) s అను బహువచన ప్రత్యయమును భాషాంతరపదములకుగూడ జేర్చి యా యా భాషలలోని రూపములకు మారుగా క్రొత్తబహువచనరూపములు వాడబడుచున్నవి. సంస్కృతమునగూడ నిట్లు రూపాంతరము లేర్పడియున్నవి. అదంతశబ్దములలోనెల్ల తృతీయాబహువచనమున -భిస్ అను ప్రత్యయ మగపడుటచే వేదమున నదంతశబ్దములకుగూడ నీప్రత్యయము చేర్చి 'కర్ణైః' అను మొదలగు రూపములకుమారుగా 'కర్ణేభిః' అను మొదలగు రూపములు ప్రయోగింపబడియున్నవి. ఇట్లే నకారాంతశబ్దముల యాకర్షణచే నజంతశబ్దముల షష్ఠీబహువచనరూపములలోను, కొన్నినపుంసకశబ్దముల బహువచనరూపములలోను నకారము ప్రవేశించినది. మఱియు సర్వనామశబ్దముల సాహచర్యమువలన నకారాంతశబ్దముల తృతీయా షష్ఠీవిభక్తుల యేకవచనములలో గ్రమముగా -ఏన, -స్య అను ప్రత్యయములు వ్యవహారములోనికి వచ్చినవి. ఈ ప్రకారముగానే ధాతురూపములలోగూడ నన్యతరాకర్షణమువలన క్రొత్తరూపము లేర్పడినవి. 'అస్, అస్' మొదలగుధాతువుల ననుసరించి 'భూ' మొదలగు ధాతువులుకూడ లఙుత్తమపురుషైకవచనమున -'అ' యను ప్రత్యయమునకు మారుగా -'మి' యను ప్రత్యయమును గ్రహించినవి.

అస్మి, eiMi, esmi - గచ్ఛామి, basko; భరామి, fero.

ఇట్లు వర్ణములయందును, పదములయందును గాక స్వరములలోఁగూడ మార్పు కలుగవచ్చును. వైదికసంస్కృతభాషాజన్యము లగు నుత్తరహిందూదేశములోని 'హిందీ,' 'బెంగాలీ' మొదలగుభాషలు తజ్జనకములగు భాషల స్వరసంప్రదాయమును వదలి ప్రాచీనభాషల సంప్రదాయమును గ్రహించినవి. వైదికభాషలో నుదాత్తము, అనుదాత్తము, స్వరితము అని మూడుస్వరములు గలవు. తజ్జన్యములగు నుత్తరహిందూదేశపుభాషలలో స్వరదార్ఢ్యము ననుసరించినస్వరములు రెండే కలవు.

పదములయొక్క స్వరూపమే కాక యర్థముకూడ దఱుదుగా మారుట కలదు. ఏదైన నొకక్రొత్తపదార్థము జనులకు గనబడినచో నది తా మెఱిగినపదార్థములలో దేనిని బోలియున్నదో చూచి దాని కాపేరు నిడెదరు. కందేలువంటి జంతువును నీటికందేలనియు, మిరియమువలె కారముగానుండు కాయను మిరెప (మిరియపు) కాయయనియు, గాకివలె నుండు పక్షులను మాలకాకి, చెమరకాకి యనియు వ్యవహరించెదరు. గోవువంటిజంతువు గవయముకదా. హస్తమువంటి యవయవము కల జంతువును హస్తి యనెదరు. పదార్థాంతరములయందు ప్రసిద్ధములగు క్రియాగుణములు కలవానికి వానినిబట్టి నామకరణము చేయుటకూడ గలదు. అక్కారణముననే, గచ్ఛతీతిగౌః; పరుగిడునది పరుగుడు; కరోతీతి కరేణుః. పురాణగాథలన్నియు నీవిధముగా నేర్పడినవే యని చెప్పవచ్చును. నైసర్గికస్థితులు మనుష్యులచర్యలతో సరిపోల్చి వర్ణింపబడియున్నవి. కాలక్రమమున నీవిషయమును మనుష్యులు మఱచి యవి యథార్థమని తలంచి వానిని దేవతలుగా భావింప నారంభించిరి. దీనికి వ్యతిరేకముగా భాషకులు తమ కప్రసిద్ధములగు పదములను దమ కెఱిగిన పదములలోనికి మార్చుటకూడ గలదు. ఇట్లే కుహాకదానము శుక్కదాన మైనది. అంతరారోపణము అంతరార్పణ మైనది. ఆర్యసోమయాజులు ఆరుసోలలు, అయల సోమయాజులు అయిదుసోలలు నైనవి. 'హేమిల్టన్' (Hamilton) వంతెన యఱవములో 'అమ్మటన్' (Barber) వంతెన యైనది.

౨. స్పష్టప్రతిపాదనేచ్ఛ లేక దార్ఢ్యోపాదనము:— స్పష్టప్రతిపాదనేచ్ఛకూడ భాషావిపరిణామములో నన్యకారాకర్షణమువలె బలమైన హేతు వగుటయే కాక సామాన్యముగా నీరెండుకారణములును గలిసి యగపడుచుండును. మన మాటలయొక్క ముఖ్యోద్దేశము మనయభిప్రాయములను పైవారికి దెలియజేయుట కనుక మనయభిప్రాయములు పైవారికి సరిగా దెలియనప్పుడు మనము మాటలను గట్టిగాను, స్పష్టముగాను నుచ్చరించుటకు బ్రయత్నము చేయుదుము. అప్పుడు వర్ణములన్నియు స్పష్టముగా వినబడుటయే కాక పదములలో క్రొత్తవర్ణములు ప్రవేశించుటకూడ సంభవించును. కావుననే 'స్వర్ణము' 'సువర్ణ' మైనది. క్ష్మ, క్షమ యైనది. ఇట్లే మనభాషను బాగుగ నెఱుగనివారితో సంభాషించునప్పుడు మనము పదములను గిగ్గరగాను, స్పష్టముగాను నుచ్చరింతుము. శీఘ్రముగా గ్రహించువారితో మాట్లాడునప్పుడు కొన్ని పదములను వర్ణములను విడిచిపెట్టుటకూడ సంభవించును. స్పష్టప్రతిపాదనేచ్ఛచేతనే యేకార్థపదములను రెంటి నప్పుడప్పుడు మనము వాడుట కలదు. "అధికస్య అధికం ఫల"మ్మనున ట్లొకేయభిప్రాయము ననేకపదములతో దెలిపినయెడల దానికి స్పష్టత సంభవించును. ఈరీతిగానే 'యగ్గినిప్పు, చాదరేకులు, చెయిగోలుము, గజకరభము' మొదలగుపదములు వాడుకలోనికి వచ్చినవి. కొన్నియెడల నిట్టిపర్యాయపదములు క్రమముగా నర్థభేదములను గ్రహించి ప్రత్యేకపదములుగా నేర్పడును. ఉ. యశస్సు, కీర్తి-ఒకేపదము స్వల్పభేదములతో నిట్లు వివిధార్థములలో వాడబడుటకూడ గలదు. ఉ. మిత్రః, మిత్రమ్. కయ్యము, కార్యము.

౩. అలసత లేక లఘ్వీకరణేచ్ఛ:— మనుష్యులకు స్వభావసిద్ధమైన యలసతవలన పదములయొక్క స్వరూపమే కాక యర్థముకూడ మార్పును బొందవచ్చును. మనుష్యులకు గష్టపడుట కిష్టముండదు. ఎల్లప్పుడును వారు సుఖమును గోరుచుందురు. కాబట్టి పదముల నుపయోగించునపుడు వానియర్థములను బాగుగా పరిశీలింపక స్థూలదృష్టితో నుపయోగించుచుందురు. వారు వివక్షించునర్థ మాపదమునకు ముఖ్యార్థము కాకపోవచ్చును. కాని కాలక్రమమున నదియే ముఖ్యార్థముగా మారును.

'అసహ్య' యనుపద మిట్లే యర్థమున మార్పును పొందినది. ఈవిధముగానే విశేషార్థబోధకపదము సామాన్యార్థకముగాను, సామాన్యార్థబోధకపదము విశేషార్థకముగాను మారుచుండును. శయ్యాశబ్దభవమగు 'సేజ్' యను పదము మహారాష్ట్రిభాషలో గుఱ్ఱములు పండుకొనుటకు వేసిన పరిగడ్డిపడక యనునర్థమున వ్యవహరింపబడుచున్నది. సామాన్యస్త్రీవాచకముగా నుండిన 'సాని' యనుశబ్ద మిప్పుడు వేశ్యావాచకముగా మారినది. గోరసాని మొదలగు కొన్ని సమాసములలో మాత్రము ప్రాచీనార్థమును బోధించుచున్నది. దీనికి వ్యతిరేకముగా నదీవిశేషవాచకమగు గంగాయనుపదము నదీసామాన్యవాచకమై తుదకు జలవాచకమైనది. మృగశబ్ద మిట్లే జంతువాచకమైనది. వ్యాకరణమున, ననగా ప్రత్యయములలో గూడ, నీయలసత మార్పును గలుగజేయును. కొన్ని శబ్దములకు రెండుమూడువిభక్తులలో నొకేరూప మగపడుచున్నది. విభక్త్యర్థములు ప్రత్యేకపదములచే బోధింపబడుచున్నవి. లేట్ వ్యవహారమునుండి నశించినది. లిట్, లఙ్, లుఙ్ లక్షణము పాటింపబడుచుండుట లేదు. ఇట్లే లిఙ్ లోట్లును, లుట్ లృట్లును.

పదములయర్థమునకంటె, వ్యాకరణమునకంటె పదస్వరూపమునందు నీయలసత విశేషము మార్పును గలుగజేయును. సులభముగా నుచ్చరింపబడని వర్ణములు సులభముగా నుచ్చరింపబడు వర్ణములలోనికి మారుచుండును. కొన్నివర్ణములు పూర్తిగా లోపించి పదములు లఘ్వీకరింపబడుచుండును. లఘ్వీకరణేచ్ఛ యలసతవల్లనే పుట్టుచుండును. ఇట్టివర్ణలోపముచే గలుగు లఘ్వీకరణము ప్రకృతిప్రత్యయములుస్పష్టముగా కనబడుభాషలలో కంటె నస్పష్టప్రత్యయభాషలలో హెచ్చుగానుండును. మఱియు గ్రాంథికభాష లిఖితమై స్థిరపడియుండుటచే దానికంటె వ్యావహారికభాషలో విశేషముగా మార్పు కలుగుచుండును. గ్రాంథికభాషయగు సంస్కృతభాష యిప్పటివఱకును నొకేరీతిగా నుండగా వ్యావహారికభాష ప్రథమమున ప్రాకృతభాషలలోనికిమారి తిరుగ గాలక్రమమున 'హిందీ, బెంగాలీ' మొదలగు భాషలలోనికి మారినది. ఈరీతిగానే భాషాంతరసంబంధము విశేషముగా లేనిభాషలు మిగిలినవానికంటె స్వల్పముగా మారుచుండును. కావుననే 'లిథురేనియన్' భాష 'ఇండో-యూరపియన్' భాషలన్నిటిలోను స్వల్పముగా మార్పులను పొంది ప్రాచీనావస్థలో నున్నది.

వర్ణములలో మార్పులనేకవిధములుగా నుం[illegible] వర్ణాగమ వర్ణలోపములనుగూడ వర్ణవిపరిణామములక్రిందనే పరిగణింపవలసియుండును. ఈమార్పులవలన బదముల వ్యుత్పత్తిని దెలిసికొనుట కష్టముగా నుండును. 'హిత' యనురూపము 'ధా' ధాతువుతో సంబంధించినదనియు, 'ఏధి' యనురూపము 'అస్' ధాతువునుండి వచ్చినదనియు భాషాశాస్త్రము దెలుపనిచో నెవరు చెప్పగలరు? అయినను సంస్కృతభాషానియమముల ననుసరించియే యీరూపము లాయాధాతువులనుండి న్యాయముగా వచ్చినవని నిరూపింపవచ్చును. వర్ణవిపరిణామస్వరూపము తెలియజేయుటకు దానికొన్ని భేదము లిచ్చట వర్ణింపబడును.

వర్ణసమీకరణము (Assimilation):—ఒకవర్ణము దానికి పూర్వమునగాని, పరమునగాని యుండు వర్ణముయొక్క బలముచేత నావర్ణములోనికిగాని, దానికి సమానమగు వర్ణములోనికిగాని మారవచ్చును. రెండు భిన్నవర్ణముల నుచ్చరించుటకంటె సమానవర్ణముల నుచ్చరించుట సులభము కనుక నీమార్పు సుఖాకాంక్షవలన గలుగుచున్నదని చెప్పవచ్చును. సంస్కృతభాషలోని సంధికార్యములు చాలవఱకీజాతిలోనివై యున్నవి.

ఉ. అద్ + న=అన్న; విద్యుత్ + జిహ్వ=విద్యుజ్జిహ్వ.

శశ (ప్రాచీనరూపము, శస)

షట్ + నవతి=షణ్ణవతి.

ప్రాకృతభాషలలో నిట్టివర్ణవిపరిణామములు విశేషముగా నగపడుచుండును. ఆభాషలలో సంయుక్తాక్షరములు నిలువవు. వానిలో మొదటిదికాని రెండవదికాని మిగిలినదానిలోనికి మారి ద్విత్వవర్ణ మేర్పడుచుండును.

ఉ. సం. చక్ర	ప్రా. చక్క
,, అగ్ని	,, అగ్గి
,, సార్థ	,, సత్థ
,, మన్మథ	,, మమ్మహ

దీనికి విపరీతముగా నప్పుడప్పుడు సమానమగు రెండువర్ణములలో నొకటి యుచ్చారణసౌకర్యార్థము వేరువర్ణములోనికి మారుటకూడ గలదు.

ఉ. అశ్మః; సం. పురుష. ప్రా. పురిస

వర్ణపరివృత్తి (Metathesis):— ఒకానొకప్పుడు త్వరవలన గొన్నివర్ణములతరువాత నుచ్చరింపవలసిన వర్ణమును మనము ముందుగా నుచ్చరింతుము. వ్రాతలో కూడ నిట్టిపొరపాట్లు మనకు సంభవించుచుండును. మన యాలోచన ముందు పరుగిడుటచే వెనుకపదములను వ్రాయుటకు పూర్వమే ముందుపదము నొకదానిని మనము వ్రాయుట సంభవించును. అట్లే వర్ణములయుచ్చారణలోగూడ స్థాలిత్యము సంభవింపవచ్చును. అప్పుడు వర్ణములు వ్యత్యాసముగా నుచ్చరింపబడును.

"వారాణస్యా మథురావంశీశ్వరస్థవల" యని హనుమంతభద్రుడు ప్రయోగించియున్నాడు. ఈరూపమునుండియే 'ఇంగ్లీషు' భాషలోని 'బనారెస్' (Benares) అనుపేరేర్పడినది. ప్రాకృతభాషలలోను, 'హిందీ, మరాఠీ' మొదలగు భాషలలోను, 'కరేణూ,ఆలాన' యనుపదములు 'కణేరు,ఆణాల' యనురూపములతో నున్నవి. మహారాష్ట్ర శబ్దము ప్రథమమున 'మరహట్ట' యనురూపమును పొంది, తరువాత 'మరాఠీ' యనురూపమును బొందినది.

వర్ణలోపము:— త్వరగా మాటలాడునప్పుడు తేల్చిపలుకబడు వర్ణములు కొన్ని లోపించుట కలదు. సుబంతవిభక్తిరూపములలోను, ధాతువులయొక్క రూపములలోను నిట్టివర్ణలోపము తరచుగా సంభవించుచుండును.

ఉ. రాజన్ + అ = రాజ్ఞా
జ + గమ్ + ఉః = జగ్ముః

కొన్నిపదములలో నొకేవర్ణము రెండుపర్యాయములు వరుసగా వచ్చినయెడల త్వరచే నొకటి విడువబడుట కలదు.

శేవవృధః = శేవృధః
జహీహి = జహి
శిమ్ప్రపింజరః = శిష్పింజరః

పదాదిని సంయుక్తాక్షరమున్నచో నుచ్చారణసౌకర్యార్థ మందొకయక్షరము విడువబడుట సంభవించును ఇట్లే 'శ్చంద్ర, స్తనయిత్న, స్తాయు, స్తేనస్' మొదలగుశబ్దములు 'చంద్ర, తనయిత్న, తాయు, తేన,' మొదలగురూపములను బొందుచున్నవి.

వర్ణాగమము:— పైరీతి నుచ్చారణసౌకర్యార్థము పదాదియందలి సంయుక్తాక్షరములోని యొకయక్షరము విడిచిపెట్టబడక, తత్పూర్వ మొకయచ్చును జేర్చి దాని నుచ్చరించుటకూడ గలదు. 'ఇంగ్లీషు' భాషలోని 'స్కూల్' (School) అనుపదము మనభాషలలో 'ఇస్కూ'లైనది. సంయుక్తాక్షరములతో ప్రారంభము కాని పదముల యాదినిగూడ నిట్టచ్చులు వచ్చిచేరుట కలదు. అరవభాషలో నిది విశేషముగా నగపడుచున్నది.

సం. రామః, అర. ఇరామన్
సం. లక్ష్మణమ్, అర. ఇలక్కణం

సంస్కృతములోని 'ఉలోక' యనుపదముకూడ నీరీతిగానే యేర్పడియుండవలయును. ప్రాకృతమున స్త్రీ శబ్దము 'ఇత్థి' యనురూపమును బొందుచున్నది. అట్టి యచ్చునకు ప్రాతిశాఖ్యలలో 'స్వరభక్తి' యని సంజ్ఞ కలదు. ఇది తరచుగా రేఫలకారములకు గాని యనునాసికవర్ణములకుగాని పరముగా వచ్చుచుండును. ఇట్లు, 'ఇంద్ర, యజ్ఞ' యనుపదములు 'ఇందర, యజన' యని యుచ్చరింపబడుట కలదు. సంయుక్తాక్షరము లుచ్చరించుట కష్టమగుటచే నిట్లు మధ్య నొకయచ్చును జేర్చి వానిని విడదీసి యుచ్చరించుట సంభవించును. హలంతశబ్దము లజంతములుగా మారుటకుగూడ నిదియే కారణము. పదాదియందలి నకారహల్లు నకారమువలె నుచ్చరించుట మన కనుభవసిద్ధము.

పైని వర్ణింపబడిన మూడుకారణములే కాక భాష మారుటకు మఱికొన్ని కారణములుకూడ గలవు. ప్రజలయొక్క వ్యాపారములు, వారు నివసించుదేశము యొక్క నైసర్గికస్థితి, శీతోష్ణస్థితి మొదలగునవన్నియు వారియుచ్చారణమున మార్పులను గలుగజేయుచుండును. ఇట్లు భాష మారుట కిన్నివిధములగు కారణము లున్నను దీనికి ప్రతికక్ష్యగా భాషను మారకుండజేయుటకుగూడ ననేకకారణములు కలవు. జనులకుండు పరస్పరసంబంధ

ముచే నొకరియుచ్చారణమును జూచి మఱియొకరు తమ యుచ్చారణములోని మార్పులను దిద్దుకొనుచుందురు. జనులకు పరస్పరసంబంధమును గలుగజేయు నినుపదారి బండ్లు, పాఠశాలలు, గ్రంథముద్రణము మొదలగునవన్నియును, గొంతవఱకు భాషలో మార్పుల రానీయకుండ నాపును. అయినను మార్పును గలుగజేయు కారణములు ప్రబలములగుటచే భాష మారుచునే యుండును. నాగరికతాఫలితములగు నినుపదారులు మొదలగువాని నెఱుగని జనులలో భాష శీఘ్రముగా మారుచుండును. మఱియు బరస్పరసంబంధమునకు బ్రతిబంధకములగు నదులు, పర్వతములు, రాజ్యాంగదేశవిభాగములు మొదలగునవికూడ భాషావిపరిణామమునకు గారణము లగుచున్నవి ఇట్టి వానిచే వ్యవహితులగువారు మొదట నొకేభాష మాటలాడుచుండినను గొలదికాలములోనే భిన్నభాషల వ్యవహరించువా రగుదురు. వారికి పరస్పరసంబంధము దుష్ప్రాప్యమగుటచే వారిభాషలు భిన్నభిన్నములగు వ[illegible]లను బొంది వేరువేరువిధములుగా మారుచుండును. ఇట్లు కాలక్రమమున నొకభాషనుండి యనేకభాషలు జన్మించుచుండును. ఒకభాషను వ్యవహరించువారికి మఱియొకభాష యర్థమగునంతకాల మవి భాషాభేదములు (Dialects) అనిపించుకొని యట్లర్థముకాని స్థితిని బొందినప్పుడు ప్రత్యేకభాషలని (Languages) వ్యవహరింపబడును. ఇట్టి పరస్పరసంబంధము కల భాషలకు భాషాకుటుంబమని వ్యవహారము కలదు.

బంగారుఫలము

అధికార్ల సూర్యనారాయణరావు గారు

జానకీసఖి చేత బూని నొకనాడు
శృంగార మగునొక్క బంగారుఫలము;
తిలకించుకండ్లకు తొలినోముఫలము,
పట్టెడుచేతికి బహుళవైభవము,
గడియించునాత్మకు కైలాససుఖము,
శృంగారమైన యాబంగారుఫలము.
"ఉవిద! నీచేతిలో నున్న ఫలమేమి?
ఎట్లుండు భుజియింప? నెవ్వారికొరకు?"
అనుచు నే బ్రశ్నింప వనిత కన్నులను
దివ్యమా తేజంబు దీపించుచుండ,
ఫలముకాంతులబోలు లలితహాసంబు
వదనసీమను గాయ, పలికె నీరీతి:

"అర్థించువారికే ఐశ్వర్య మబ్బు,
ఇచ్చువారలభాగ్య మిక చెప్పనేల?
కనువారికే సర్వకలుషహరణంబు,
తినువారి పుణ్యంబు గణుతింప నేల?
సంతాపదావాగ్ని జల్లార్పగలదు;
అనుపమానందసౌఖ్యము లీయగలదు;
తినెడివా రొకరైన తీరు, నిద్దరికి
ఆత్మ మలమలమాడ్చు నాకలిబాధ;
ధరణిలో నాకున్న ధనమెల్ల నిదియె;
చెలికాడ! నీ కిచ్చు శ్రీయెల్ల నిదియె;
కలసి తినుచో దేవఫలము కాగలము;
వలచువారలబలము ప్రణయసత్ఫలము.

ఉత్తర రామ చరిత్ర

అవ్వారి సుబ్రహ్మణ్య శాస్త్రి గారు

భవభూతి రచితమైన యుత్తరరామచరిత నాటకమునకుఁ బ్రకృతి వాల్మీకి రచితమైన శ్రీమద్రామాయణోత్తరకాండమందలికథయై యున్నది. ఆకథాంశములను గొన్నిటిని సూచించియుఁ, గొన్నిటిని విడనాడియుఁ, గొన్నిటిని లాతిపర్యవసానముల కుపయోగించుకొనియుఁ, గొన్నిటిని మార్చియుఁ, గొన్ని క్రొత్తలు కల్పియు భవభూతిమహాకవి నాటకమును వ్రాసియుండెను.

పట్టాభిషేకానంతరమున శ్రీరాముని నంది జనులు నుతించుటను వాల్మీకి వాకొనెను. ఆవిషయమును భవభూతి మహాకవి ప్రస్తావనలో నటునిచేత "తేనహి నిరూపయతా రాజ్ఞస్సుపరిశుద్ధా ముపస్థానపద్ధతిం భావః!" అని సూచన సేయించి దానిచే సీతాపవాద మెల్లయెడల వ్యాపించియున్న దను నంశమును వాల్మీకిప్రోక్తమును బ్రసంగ సంగతితోఁ జెప్పించుచున్నాఁడు. "సర్వథా ఋషయో దేవతాశ్చ శ్రేయో విధాస్యంతి" అనివాక్యార్థసూచన చేయుచున్నాఁడు. మఱియు "యేనామ కేచి దిహ నః ప్రథయ న్త్యవజ్ఞాం జానంతి తే కిమపి తాన్ప్రతి నైష యత్నః" అని యితరస్థలమునఁ జెప్పఁబడిన కవియౌద్ధత్యము గూడ నీప్రసంగముననే "వాచాం సాధుత్వే దుర్జనో జనః" అని లోకుల పామరత్వము మీఁద విసువుకొనుటచే వ్యక్తపఱుపఁబడె. పట్టాభిషేకమునకు వచ్చిన జనకుఁడున్ను గుహ రాజులు మొదలైనవా రందఱును వెళ్లిరనియు, వానరులును, రాక్షసులును రెండుమాసములుండిపోయిరనియు వాల్మీకి వ్రాసెను. అదియంతయుఁ బ్రస్తావనలో సూత్రధారుఁడు "కి మిదానీం విశ్రాంతచారచరణాని చత్వరస్థానాని" అని యడిగినప్పుడు నటునిచేఁ జెప్పించెను.

ఈప్రసంగములోఁ గలిపి ఋశ్యశృంగుని యజ్ఞమునకు వసిష్ఠుఁడును, అరుంధతియు, కౌసల్యాకైకయీసుమిత్రలును బోయిరని తనచేఁ గల్పింపఁబడిన యంశమును జెప్పెను. ఈకల్పన సీతను, గర్భభారాలసను, గాఱడవులకుఁ బంపుటయందలి యసంభవతను దీసివేయుచున్నది. తల్లులును, వసిష్ఠుఁడు,నరుంధతియు నయోధ్యలో నుండిరేని వారు నిరోధించరా? కావున నిది యసంభవము అనిపించుచున్నది. అట్లనిపించకుండుట కీకల్పన పనికివచ్చుచున్నది. ఇదిగాక "యుక్తః ప్రజానా మనురంజనే స్యాః" అను వసిష్ఠునిసందేశమున కాయన దూర

స్థుఁడై యుండినప్పుడే పామరజనాపవాదము గూడ సహింపఁగూడ దనునర్థముఁ జేసికొనుటకు శ్రీరాములవారి కవకాశము కలిగినది. లేక వసిష్ఠులవారే సమీపమున నున్న "సతాం కేనాపి కార్యేణ లోకస్యారాధనం మతమ్" అనుసిద్ధాంతము నెట్లు సమన్వయించి శ్రీరామచంద్రునకుఁ గఱపియుండునో ఇట్టియాశంక లెవ్వియు నడ్డుకొనకుండ భవభూతిమహాకవి శ్రీరామాజ్ఞానువర్తులైన రామలక్ష్మణ భరత శత్రుఘ్నాదులనుమాత్రమే యయోధ్యలో నిలిపి వసిష్ఠాదులగు పెద్దలను దూరమునకుఁ దలుముచున్నాఁడు. జనకుఁడు వెళ్లుటను వాల్మీకి కథారూపమునఁ జెప్పి యూరకుండెను. భవభూతి దానిని సీతారామపాత్రౌచిత్యపోషణద్వారమున రసపోషణ కుపయోగించుకొనుచున్నాఁడు. తండ్రివియోగమున జానకికి వైమనస్యము కలిగినది. ఆమె వైమనస్యమును బోగొట్టుటకు శ్రీరామచంద్రుఁడు ధర్మాసనమును విడిచిపెట్టి వాసగృహమున కేఁగె. సీత గురుబంధువియోగములు సంతాపకరములనుచున్నది. దీనిచే నాయికకుండవలసిన శాలీనత సీతయందుఁ జూపఁబడినది. శృంగారనాయకులలోని యనుకూలునిరీతి శ్రీరామునియందుఁ బ్రదర్శింపఁబడినది. ఈవియోగమునే సంతాపకరముగ భావించి విమనస్కురాలగు సీత శ్రీరామచంద్రవియోగమున కెంతగా సంతాపమందియుండునో అని వర్ణింపఁబడఁబోవుసీతాశోకమున కీకల్పన పరిపుష్టి నొసఁగెడిని. అట్లే ఈపాటసీతావైమనస్యమున కోర్వఁజాలని శ్రీరామచంద్రుఁ డడవిలోసీతనొంటిగ డింపించి యెంతగా శోకవ్యాకులుఁ డయ్యెనో! అని శ్రీరామునియందుఁ బ్రదర్శింపఁ బడఁబోవు శోకసమృద్ధికిసైత మీకల్పనచేయూఁత నొసఁగుచు రసపోషక మనఁబడుచున్నది.

అష్టావక్రుని రాక శ్రీమద్రామాయణమునఁ గన్పట్టలేదు. భవభూతి కల్పించినాఁడు. ఈకల్పనలో బావమఱఁది యజ్ఞమునకుఁబోక సీతావినోదమునకై శ్రీరాముఁ డింట నుండెననుటచే సీతయందు శ్రీరామునికిఁ గలప్రేమ వ్యక్తమగుచున్నది. "ధర్మాసనా ద్విశతి వాసగృహం" అనుటచే రాజధర్మభర్తృధర్మములకు సమప్రాధాన్య మిచ్చి యీకల్పనచే బంధుప్రేమకన్న సీతాప్రేమ కాధిక్యమునొసఁగుచు శ్రీరామునిచ్చట ననుకూలనాయకునిగఁ బ్రదర్శించుట కవిశస్తమైనది. మఱియు నీయష్టావక్రాగమనకల్పనలో గర్భిణి యగు సీతకోరిక దీర్చుటయందలి యావశ్యకత తల్లులయొక్కయు, శాంతయొక్కయు, నరుంధతియొక్కయు సందేశమువలనఁ దెలియుచున్నది. దీనివలన సీత నిద్ర లేచునప్పటికి లక్ష్మణుఁడు రథముతో సన్నద్ధుఁడై యుండినప్పుడు తనతో వచ్చెదనన్న శ్రీరాముఁడు రాలేదేలొకో యని సీత కనుమానము కలుగలేదు. తన కోర్కెఁ దొందరగాఁ దీర్చవలసిన దగుటచే శ్రీరాము డితరకార్యవ్యగ్రతచే రాలేదని తలఁచి శ్రీరాముఁడు లేకుండఁ దాను వెళ్లుటకు సమ్మతించెనేమో సీత. అభిజ్ఞానశాకుంతలము షష్ఠాంకములో వసుమతీదేవి నిట్లే "కార్యజ్ఞా కార్యోపరాధం మే పరిహారతి" అనిభర్తృకార్యానుకూల్యము గలదానినిగా మహాకవి

కాళిదాసుఁడు చూపినాఁడు. ఇదియునుం గాక యీయష్టావక్రప్రసంగములోని వసిష్ఠసందేశ మొకటి ముఖ్యముగ లోకాపవాదభీతుఁడు గాఁబోవు రామచంద్రుని విచారసాగరములో నొకప్రవాహమునకు నెట్టుటకు వీలగుచున్నది. శ్రీరాములవారికి సీత నడవులకుఁ బంపుటచేఁ గల్గు మహాకఠినత్వమును గురుభక్తిరసముచేత లోపింపఁ జేయుచున్నది. భద్రుఁడు సీతాపవాదమును శ్రీరాములతోఁ జెప్పెడిదినముననే ప్రాతఃకాలమున నంతఃపురమందు శ్రీరాముఁడు గర్భిణియగు సీతను 'నీ కేమికోరిక గలదు? చెప్పుము' అనెను. 'గంగాతీరతపోవనముల సంచరింపఁ గోరిక గలదు. ఒకరాత్రియైనఁ దపోవనమున నివసింపవలెను.' అని సీత కోరుకొనెను. ఇది యిట్లు చూపుట భవభూతికిష్టము కాలేదు. సీత తపోవనసంచారకాంక్షకుఁ గారణమును బ్రదర్శింప నమకట్టి చిత్రదర్శనమును దననాటకములో సమకూర్చెను. చిత్రములోఁ బూర్వము చూడఁబడిన యడవులు, కొండలు, నదులు, బయళ్లు మొదలైనవి చిత్రింపఁబడియున్నవి. వానినన్నింటిని వివరముగాఁ జూచి యప్పటిసందర్భము లన్నియు స్మృతికి వచ్చినపిమ్మట యెంతెంతలేసి కష్టములైనను స్మరింపఁబడునప్పుడు వినోదముగనే యుండును; కాన వనసంచారకౌతూహలము జానకికిఁ గలిగినదని చెప్పవలెనని నాటకకవి యుద్దేశము. ఇదిగాక యీనాటకమున సంభోగశృంగారము మొట్టమొదట సమృద్ధిగ వర్ణింపఁబడుచుండుటచేతను, చిట్టచివరఁ గూడ నదియే ప్రదర్శింపఁబడుఁ గావునను, ద్వితీయాద్యంకములం దెల్లయెడలఁ గరుణవిప్రలంభము వర్ణింపఁబడుఁ గావునను, ప్రవాసవిప్రలంభమును స్మరణరూపమునఁ గొంత చూపించి సీతారాముల పరస్పరవియోగాసహిష్ణుత నత్యంతసంతాపపారవశ్యములతోఁ గన్పింపఁజేయవలయు నను కవియూహయు నీచిత్రదర్శనముచేతనే నెఱవేఱినది. ఇంక నన్యసందర్భములలో సీతారాముల యుత్తమగుణములెల్లఁ బొనఁగ్రుచ్చినట్లు చూపఁబడినవి.

సందేశము

శ్రీమతి టి. సరస్వతి గారు

౧

ద్విపద:—

నీలనీరదపంక్తి నీరసంబయ్యె
వజ్రనిర్ఘోషంబు వ్యర్థమైపోయె
కలకహంసకలకంఠ కలకలస్వనము
కర్ణపర్వంబయి కలశవారాశి
అమృతగానంబులో నైక్యమైపోయె
పాలమున్నీటిలో పవళించియున్న
కమలనాభుండట్టె కనువిచ్చినాడు
కమలాలయంబైన కమలాకరంబు
కలుషించిపోగాంచి కన్నీరునించి
జడమయిపోయిన సత్యలోకంబు

పంకిలంబై యున్న ప్రకృతిమార్గంబు
చల్లారిపోయిన జ్ఞానదీపమ్ము
సంస్కరింపగనెంచి చక్రంబుపైన
సాత్త్వికదృష్టులు సారించినాడు.
శాంతిపుష్టికములు జపియించుకొంచు
విద్యుద్విమోహిత విశ్వజగంబు
మేఘంబులను బాపి మేల్కొల్పినాడు
అరులచక్రంబుతో సరికట్టినాడు
చూచివచ్చెదుగాని లేచిరావోయి
శారదదేవత సాక్షాత్కరించె
రావోయిరావోయి రత్నాలతునక!

౨

రాజరాజేశ్వరి రాజసమూర్తి
ఆంధ్రవీతిపూజ లంగీకరించి
చల్లనిదరహాస చంద్రికల్ గురిసె
చంద్రికలో నూత్న సారస్యమెనసె
చంద్రమండలమూర్ధ్ని సౌందర్యమొలికె
రణదుంధుభులుమ్రోగ రాజచంద్రాజ్ఞ
జాతీయసైన్యంబు సన్నద్ధమయ్యె
వీరహైందవగీతి విస్తృతంబయ్యె
స్వాతంత్ర్యకేతన చ్ఛాయలలోన
జయజయస్వనములు శ్రావ్యంబులయ్యె
ఉత్సాహవార్ధిలో ఉద్యోగవీచి
స్వచ్ఛందనృత్యంబు సవరించుచుండె
చండప్రతాపుడై మండె భాస్కరుడు
ఆయుధపాణివై అరుదెంచుమోయి
రంగమ్మునకు నుష్ణరక్తంబు దాల్చి
రాజపుత్రుండవై రావోయి వత్స!

౩

అనుకూలపవమాన మభిముఖంబయ్యె
సంకల్పలతికలు సఫలంబులయ్యె
రైతులకష్టాలు రతనాలు పండె
శాలిభూముల స్వర్ణసస్యముల్ నిండె
జనయిత్రి శ్రీదివ్య సాన్నిధ్యమందు
రాజన్యసభలోన రాజకీయజ్ఞు
లభిమానధనులయి ఆత్మలర్పించి
ప్రాణసర్వస్వంబు పందెంబునొడ్డి
చతురంగమాడంగ చనుదెంచినారు
ఆబాలగోపాల మార్యపుత్రకులు
వేయికన్నులతోడ వేంచేసినారు
ధర్మదేవత తొంగి తలయెత్తిచూచె
వీక్షించెదవుగాని వెడలిరావోయి
వాయువిమానంబు వాకిటనిల్చె
శాంతిపథంబున కదలిరావోయి!

౪

నీలతమస్విని నిశ్చలంబయ్యె
నిశ్శబ్దమై సృష్టి నిద్రాణమయ్యె
చుక్క రేరేనికై దిక్కులుచూచె
ఆలయాంతస్సులో అంధకారంబు
ఆర్ష వాటికలలో అజ్ఞానతమము
విజ్ఞానదీప్తితో విదలించుకొంచు
స్వీయరోచిస్సుతో ఛేదించుకొంచు
శతసహస్రజ్యోతి జాజ్వల్యమాన
తేజస్స్వరూపంబు దిగ్భ్రాంతిగొలుప
దీపావళీపుణ్య దివసంబువచ్చె
సుప్రసన్నములైన జ్యోతులలోన
దేవీపరంజ్యోతి తిలకింపవచ్చు.

భీష్మతమస్విని బెదరింపలేదు
క్రూరనిశాచరుల్ వారింపలేరు
కార్తికశుభదీప కళిక గ్రహించి
స్నేహపూర్వంబుగా జేరరావోయి
రావోయిరావోయి రత్నాలతునక!



ఉ. ఈ విధి నేఁ జిరంబుగ వరించిన మార్గములు లోకదృష్టి కిం
తే వెడచేసినై చెను మదీయకృతార్థతపెంపు నాదు సం
భావనమెల్ల నొక్క లఘుపాత్రమునందు నె ముంచివైచె దిక్
ప్లావితమౌ యశంబు నొకపాటకె అమ్ముడుపుచ్చె నంతయున్! [కొం. జ.]

చిత్రకారుడు: శ్రీ డబ్ల్యు. ఏ. ఆర్యదాసుగారు, చెన్నపురి.



మృగతృష్ణ
చిత్రకారుడు : శ్రీ కే. వెంకటప్పగారు—మైసూరు.



కూపపరిసరము
చిత్రకారుడు: శ్రీ ఏ. డి. తామసుగారు.

ఇవి యిటీవల బొంబాయినగరమున జరిగిన చిత్రకళా ప్రదర్శనమున ప్రదర్శింపబడిన చిత్రములనుండి కైకొనబడిన సుందర త్రి[illegible] చిత్రముల ప్రతికృతులు.

[టైమ్సు ఆఫ్ ఇండియా, ౧౬-౧౦-[illegible]]

కాళిదాసకవి కార్తికేయభక్తుఁడు

సి. శివయ్యశాస్త్రి గారు

కాళిదాస కవీంద్రుఁడు కవిగణనావసరమున ప్రథమగణనం గన్నవాఁడు. తనకవితాకుసుమవాసనల నీయాదేశమునక సకలాశావకాశములను వాసింపఁజేసిన యసమానుఁడు. ఇమ్మహనీయుని జీవితచరిత మింతకు విబుధ వివాదగ్రస్తమై యిదమిత్థమను పలుకునకుఁ గడుదవ్వున నున్నది. ప్రకృతవ్యాస మీకవితల్లజుని యిష్టదైవముం గూర్చినది.

రూపకత్రయము నాందీశ్లోకములు శివపరములగుటం గొందఱు శైవుఁడందురు. గ్రంథములయం దెందును శివప్రాముఖ్యముం బొందుపఱుపకున్కిని, బొందుపఱుపఁబడినశివస్తుతులు శైవములయియున్నను గేవల తత్త్వమాత్రప్రతిపాదకము లగుటం జేసియు వేదాంతి యనియు, మీఁద మిక్కిలి యద్వైతి యనియు నందురు కొందఱు. నాందీపద్యములు శైవములై యున్నంత నభిమతదైవము శివుఁడని నిర్ణయించుటకు వలనుగలుగునా యని సందియంపడువాఁడను. సుదృఢముగ శైవులని నిర్ణయింపఁబడిన కవయితలు పలువురు తమకావ్యములయందు విష్ణువును నుతియించియున్నారు. అల్లసానిపెద్దన్న వైష్ణవుఁడయ్యు శంకరుని స్తుతించినవాఁడు. నంది తిమ్మన శైవుఁడయ్యు విష్ణుస్తోత్రము సల్పినాఁడు. శ్రీనాథుఁ డారాధ్యబ్రాహ్మణుఁడయ్యు గ్రంథములయం దెల్లెడల విష్ణుస్తవమొనర్చియుంటయు సుప్రసిద్ధము. కావ్యముల యుపక్రమోపసంహారములు చాలవఱకు సంప్రదాయ బద్ధములు. కారణాంతరములును నుండకపోవు. కావున గ్రంథాదిపద్యములంబట్టియ కవి యభిమతదైవము నిర్ధరించుట కాంక్షితఫలముం గాంచుట కుర వగు తెఱువు కాదనుకొందు.

కాళిదాసుఁ డనుపేరుం బట్టియు, లోకవ్యాప్తములగు కథలంబట్టియు నీకవి గాళీభక్తుఁ డనుటయుం గలదు. లోకమునందలి పరంపరాగతములగు కథలు కేవల కల్పితములని నిరాకరింపఁదగదు. కాని యవి యలవడిన యాధారముల బలాబలముల ననుసరించి యుండును. ప్రబలాధారము లితరము లలవడినతఱిఁ గథలుంగలసినఁ గలమునకుం గొంత బలమగు. కలియకపోయిన వానికి స్థల మలవడుట కానిపని. కాళికాలయమున శయనించిన మన కవీంద్రుని నోటం గాళీమహాదేవి పీటీరసము నించుట నితని కీలలితకవిత యలవడ

నని, "త్వన్యేన కశ్చిత్కవయాంబభూవ తాం బాలసారేణ పరో జనన్యాః" అని నీలకంఠ దీక్షితకవి గ్రంథస్థను సహితము గావించి యున్నాఁడు. కాని కాళీభక్తుండగుట నిటు జనులచే వ్యవహరింపఁ బడిన "కాళీదాసుం"డని కాదే యుండవలయు?

"జ్యాపో స్సంజ్ఞా ఛందసో ర్బహుళం," అనుపాణిన్యనుశాసనమువలన "వైదేహీబంధోః" అను మొదలగువానివలె సాధువైన దందిమో? ఇయ్యది సామాన్యానుశాసనము గాక యందందుఁ గన్పట్టు క్వాచిత్కప్రయోగములకు సాధుత్వముం గల్గించుపొంటె నిబద్ధమైనదనుట సుస్పష్టము. జనులు సామాన్య శాస్త్రమునఁ బ్రాప్తించు "కాళీదాసుఁ"డను సరళరూపముం బరిత్యజింపవలయునని యెందో మాఱుమూలల నడఁగియున్న యీవిశేషానుశాసనము నాధారముఁ జేసికొని పట్టి బలాత్కారముగ హ్రస్వపఱుపవలసినంతటి నిర్బంధమేమి వచ్చినది? మాతాపితృనిర్దిష్ట మనుకొందమన్న వీ రెన్నఁడో తమకుమారుఁడు కాళికాదేవికి భక్తుఁడు కాఁగలఁడని దివ్యజ్ఞానమున నూహించినారనుటయు నసంభవము. ఇట్లు హ్రస్వసహితముగఁ బొందుపఱుచుటకు మాత్రము కారణము మృగ్యము.

కతిపయకారణములం గాళిదాసకవీంద్రుని యభిమతదైవము కార్తికేయుండై యుండు నొక్కొ యని యొకయూహ పొడమెడు. కాళిదాసుఁ డాదికవియగు వాల్మీకిమహాముని శిష్యుఁడగుట సుప్రసిద్ధము. ఎన్నఁడో చన్న వాల్మీకియు, నాల్గవశతాబ్దమువాఁ డనుచున్న కాళిదాసుఁడును విభిన్నకాలీనులగుట, శిష్యత్వ మెట్లు పొసఁగు ననుకొనవలదు. కవియుం గావ్యమును నొక్క తెఱఁగ. కావ్యముం గాంచిన కవిం గాంచవలసిన యక్కఱ యుండదు. కవికిఁ గావ్య మపరావతారము. కవికి శిష్యుఁ డనుటయుఁ, గావ్యమునకు శిష్యుఁ డనుటయుఁ దుల్యములే. లలితోపమానరమణీయమై, మృదుపదసముదయమునకు సదనమై రాజిల్లురామాయణము కాళిదాసునికవితకు మూలాధారమనుట నిర్వివాదాంశము. రామాయణమున రాముఁడు జానకి నెడబాసి కాననమునం గ్రుమ్మరుచు, ఖగనగాదులకుఁ దన కాంతోదంతముం దెల్పుచుఁ, గరుణారస ముట్టిపడం గావించినవిలాపమును గాళిదాసకవి తన విక్రమోర్వశీయము నాలవయంకమున సొంపుగ జతపఱిచియున్నాఁడు. అరణ్యకాండమందలి-

"కచ్చిత్ క్షితిభృతాంనాథ,
సీతా సర్వాంగసుందరీ,
రామా రమ్యవనోద్దేశే
మయా విరహితా త్వయా."

అనుశ్లోకమునందలి 'కచ్చిత్' పదమును మాత్రము వీడి పర్వతప్రతిధ్వనిరూపప్రత్యుత్తరమున కనుకూలముగ 'సర్వ' అనుపదమును నెలకొల్పి పద్యమును సర్వమునే గ్రహించినాఁడు. మఱియుఁ బరమపావనంబగు సుందరకాండమందలి రామనామాంకితాంగుళీప్రదానకథను సంగ్రహింపఁగుతుకియై, తన శాకుంతలమున మూలమున లేని యంగుళీయకవృత్తాంతమును నెలకొల్పి, 'అభిజ్ఞానశాకుం

తల' మని పేరిడినాఁడు. వేయేల? కాళిద మహాకవికి వాల్మీకియే గురువు. అమ్మహాకవి యాదికావ్యమునందుఁ గాళిదాస కవికిఁ గల భక్తి గౌరవము లపారములు. అక్కావ్యముతోడ నీకవికిఁ గల నిరవధికపరిచయము నకు మేర యిడఁ దరముగాదు. కానఁ బరికించు కొలఁదిఁ బదోద్ధరణములకును, బధానుకరణ ములకును, బద్యప్రయోగములకును నెన్న యేని నుదాహరణము లలవడుచుండు.

ఇఁకఁ గాళిదాసకవీంద్రుని కార్తికేయ పక్షపాతముంగూర్చి యించుక కలముం గద లింతము.

మనకవిశేఖరుఁ డాదికావ్యముతోఁ జిర పరిచితుఁడగుట తొలుతఁ బాలకాండమందలి-

"కుమారసంభవశ్చైవ
ధన్యః పుణ్యస్తథైవ చ"
"భక్తిశ్చ యః కార్తికేయే
కాకుత్స్థ భువి మానవః,
ఆయుష్మాన్ పుత్రపౌత్రైశ్చ
స్కందసాలోకతాం వ్రజేత్."

అను కుమారోపాసనాఫలశ్రుతిం జదివి దృఢ తరవిశ్వాసముం గనుపఱుప స్కాందపురాణ మందలి స్కందసంభవకాండసాహాయ్యమునఁ దొలుదొల్తఁ గుమారసంభవకాండమును రచి యించెను. పిమ్మట సుందరకాండమునందలి హనుమత్సందేశము మనసున నుంచుకొని మేఘదూతకావ్యమును రచియించెను. దాని తోఁ దనివిసనక రామాయణ ప్రధాననాయ కుఁడగు రామచంద్రుని పూర్వులగు సూర్య

గా
కుమ
తాదిః
కుమా
కా
ప్రాం
వ్యములును
రఘువంశకావ్య
విహారవిక్రమాభిషే కా
రుల జన్మవిక్రమవిహారాదుల కు
బొందుపఱిచియున్నాఁడు. మచ్చునకుఁ గొన్ని టి నుదాహరించెద.

"సురసరిదివ తేజో వహ్నినిష్ఠ్యూత మైశమ్."
"యో హేమకుంభ స్తననిస్సృతానాం,
స్కందస్య మాతుః పయసాం రసజ్ఞః."
"అప్యేన మద్రే స్తనయా శుశోచ,
సేనాన్య మాలీఢ మివాసురాస్త్రైః."
"బ్రాహ్మే ముహూర్తే కిల తస్య దేవీ,
కుమారకల్పం సుషువే కుమారం"
"ఉమావృషాంకౌ శరజన్మనా యథా."

వెండియు రాజకుమార రాజాత్మజాదు లగు పదంబు లనేకంబు లుండఁ బల్మఱుఁ గుమారపదమునే ప్రయోగించువాఁడు.

"కుమారభృత్యా కుశలై రనుష్ఠితే,
భిషగ్భిరాప్తై రథ గర్భభర్మణి."
"జనాయ శుద్ధాంతచరాయ శంసతే,
కుమారజన్మామృతసమ్మితాక్షరం."

."

...వాన్

...ర్థై,

...స్త్వవశీకృతా
వాసవీనాం చమూనా
మర్త్యాదిత్యం పులితమహాముఖే
సంభృతం తద్ధి తేజః."

అనుశ్లోకము కాళిదాసునకుఁ గల కుమారస్వామ్యభిమానమును దెల్పక చెప్పుచున్నది. కానిచో, "ఉపాస్యాపార్శ్వైః స్నపయతు భవాన్" అని చెప్పుట యొప్పును నే?

విక్రమోర్వశీయపంచమాంకమున—

"అయుపో యౌవరాజ్యశ్రీః
స్మారయ త్యాత్మజాయ తే,
అభిషిక్తం మహాసేనం
సేనాపత్యే మరుత్వతా."

లరిపురాణమున యౌవరాజ్యాభిషేకము కార్తికేయునకు నింద్రుఁ డొసర్చిన దేవసేనాధిపత్యముతోఁ బోల్చఁబడియున్నది. విస్తృతికి భీతిలి విరమింపవలసియున్నది గాని యిట్టివి యెన్నియేని గన్పట్టు.

కనుకఁ గాళిదాసకవి రామాయణమందలి కుమారోపాసనా ఫలశ్రుతిం బఠించి ప్రథమమునఁ గుమారగౌరవాపాదక మగు కుమారసంభవ కావ్యమును విరచించుటచేతను, వితరములగు రఘువంశ మేఘసందేశ విక్రమోర్వశీయాదులందలి కుమారోపమానములచేతను, లాంఛనదములున్నను బల్మారు గుమారపదము నేయుపయోగించియుంటను, సర్వమునకును గార్తికేయునే నిదర్శనముగా నినుటఁ బెట్టుదలఁ గలవాఁ డౌటచేతను గార్తికేయభక్తుఁ డై యుండునా యని యొక యూహ పొడముచున్నది.

కవులు తా ముపాసించు దైవములం దను కావ్యములయందలినాయకుల కుపమానములుగఁ బొందుపఱచు నాచార మిందూహ హా వించుక బలపఱచు ననుకొందు. కార్తికేయభక్తుఁడని నిర్ణయించుటఁ గాళిదాసుఁడను నామమును(కాళస్య శివస్యాపత్యం పుమాన్= కాళీ=కార్తికేయః, తస్య దాసః=కాళిదాసః.) అని సమన్వయించుటకు వీలగుచున్నది.

ఊహలకు మానవుఁడు బద్ధుఁడుగాఁడు. ఊహ లోకానోకరతఁ కేవల సాహసమూలకము లగుటయు సంభవించు. హృదయ కుహరమున నుప్పతిల్లిన యూహల నుత్తమానయులౌ పాదమూలములు నిడి యౌచిత్యమరయుటయు మానవున కుచితేతరము. ఊహలేమాత్రమేని నౌచిత్యనిర్ణయ కారకములో, ప్రేరకములో యయిన మనుజుఁడు కృతకృత్యుఁడు. కాన సహృదయుల పరశహృదయములే పరిమాణములు.

వేమనతారావళి

శ్రీరంగం నల్లాన్‌చక్రవర్తి రఘునాథాచార్యులయ్యవార్లుగారు

సరసకవివతంసుఁ బరమహంసుని నిన్నుఁ-బడసి పుత్త్రుఁగాఁగ భరతభూమి
సాటిదేశములకు బ్రశస్తిగాంచెఁ గరమ్ము-విశ్వదాభిరామ వినుర వేమ.

ఉ. ఆయతశక్తియుక్త మఖిలాఘభిదానిపుణంబునైన నా
రాయణపాదపద్మమున యం దుదయించిన వంశమందు భ
ద్రాయితమూర్తితో లసదిరాపటుధారలతో సుకీర్తితో
నాయమరాపగోపముఁడవై చెలువొందితివార వేమనా!

చ. నినుఁ గని కీర్తిగన్న జననీజనకుల్ ధరలోన నెవ్వరో
యని పలురీతులన్ వెదకి యప్పటికిన్ ఫలసిద్ధిఁ బొంద కె
వ్వని మత మెట్లొ యట్లె నుడువన్ దొరకొన్న జనంబులోన నె
వ్వనిపలుకుల్ గ్రహింపఁగలవాఁడను వేమనయోగి, చెప్పుమా.

ఉ. భోగపరాయణుండవయి పూర్వవయస్సును గొంతపుచ్చి యా
పై గురువర్యుఁ గొల్చి యతిభక్తిని విద్య గ్రహించినందునన్
బాగుగ భోగమందుఁగల బాధలు నీమదికెక్క మాకు నా
యోగతులన్ వచింపఁగ సమర్థుఁడవైతివి నీవు వేమనా!

చ. మతములనన్నిటిన్ గలిపి మాటికి మాటికిఁ దిట్టినాఁడ వు
ద్ధతిమెయి వేమనార్య, యటులౌటను నీతలఁపేమొ కాని నీ
మతమది ద్వైతభిన్నమని మానసమందుఁ దలంచినాఁడ "నే
నతఁడ, యతండు నేన"యని యచ్చట నచ్చట నీవు పల్కుటన్.

శా. కాయ మశాశ్వతంబనియె కాదు ధనంబునుగూడ నశ్వరం
బే యనియొక్క కాదు జగమెల్లను మిథ్యయ యంచు నొక్క

నీయెడ లగ్నమయ్యె నల నిర్గుణతత్త్వమునందుఁ గాదు కా
దో యమివర్య, వేమ, భవదూర్జితలాలసచేతనే సుమీ.

మ. అరయం జెప్పెడి దొండుఁ జేయునది యొండై నన్ "వయం ధర్మశా
స్త్ర రహస్యాన్యఖిలాని విద్మ" యను తత్త్వజ్ఞమ్మన్యులం
దరికిన్ బాగుగ సిగ్గువచ్చునటులన్ వాకొన్న ధర్మంబు లా
చరణంబెట్టి యనంతరం బొరుల కిచ్చన్ దెల్పితో వేమనా!

ఉ. జ్ఞానివి కాన నీ వితరసన్న్యసనవ్యధితాత్ములట్లు నె
మ్మేనను గావిదోవతుల మేటి బడాయిగఁ దాల్పఁబోక కా
షీన మొకండె తాల్చుచును వెండియు నొక్కొకవేళ నద్దియున్
మానియునుం జరించెదవు మానితవర్తన, యోగివేమనా!

ఉ. ధారుణి శయ్యగా స్వభుజదండమె తల్గడగా విరక్తియే
దారగ నాత్మదర్శనమె తంత్రముగాఁ బరమాత్మభూయమే
సారఫలంబుగా గురునిశల్ తృణముల్ వలె వేగు నీకు సం
సార విమోచనప్రవణసార్థవహుండవు కాన వేమనా!

చ. పరమము నిర్గుణంబు నగు బ్రహ్మముదప్పు మఱెద్దియున్ హృదం
తరమున నెంచ వట్టియమినాథుఁడ వీ విటు లెల్లదిక్కులన్
దిరిగి సునీతిబోధన మదే పనిగా నొనరించుచున్న సో
దరులగు నాంధ్రదేశ్యుల హితంబును గోరితె కాదె వేమనా!


చ. .హమునకుం బరమ్మునకు నెంతయు దూరగులై చరించు ని
మ్మహిఁ గల వర్తమాన కవిమానులయట్టుల కాక కాంచి తీ
విహమున సౌఖ్యమే వలచితేని భృశం బిడు హేమతారకం
బహితజిగీషు, వేమ, పరమందు సుఖంబిడు బ్రహ్మవిద్యయున్.

క. నీవురసవాదవిదుఁడవు-కావున హేమంబుఁ జేయఁ గలిగితి వైనన్
తావక సోదరులగు మా-కావిద్య నొసంగకుండు టర్హమె వేమా!

ఉ. ఈవల హేమతారకము నిచ్చితివేని జనమ్ము శాశ్వతం
బై విలసిల్లు బ్రహ్మము నొకప్పుడు నెంచఁగఁబోక నశ్వరం
బై వివిధార్తిహేతువగు నట్టియిహంబె వరించునంచు వే
మా, విమలాత్మకా, యొసఁగ మానితివేమొ సువర్ణతంత్రమున్.


ప్రాచీన భారతీయ లోహపరిశ్రమలు

బొంబాయిరాజధానియందలి రాగి, ఇత్తడి సామానులు—౧౯ శతాబ్దపు టుత్తరార్ధము





౧. (ఎ), (బి). రాగిపాత్రలను జేయునాతడు



౨. రాగి, ఇత్తడి సామానులను చేయుటకు వలసిన ఆయుధములు

ఉ. అచ్చతెనుంగు బాసపయి నాదర మెక్కువ కాన నీకు నీ
విచ్చకువచ్చినట్లు వచియించినపల్కులె పద్యరూపమై
ముచ్చట మాటకట్టు జనమున్ ముద మొందఁగఁ జేయు వేమనా,
సచ్చరితవ్రతా, నిగమసారవిదున్నత, సర్వసన్నుతా!

చ. తెలుఁగుకవిత్వమందు గడిదేరిన లాక్షణికుల్ సుధీమణుల్
పలికిన పద్యబంధపరిపాటి నొకానొకవేళ మీఱినన్
తెలుపఁగ నన్నిపద్యములు తథ్యము నీతిని బోధచేయుచున్
సులభముగా వివర్ణులను చూఱకొనందగు వేమ, నీ కృతిన్.

ఉ. నాఁటికవీంద్రులందు సిరినాథుఁడు సీసము, తిక్కయజ్వ పై
పోటిగఁ గందపద్యములు ముద్దులు గుల్కఁగ నల్లిరందు రా
మాటలకేమిగాని కవిమండలియంతయు మెచ్చునట్లుగా
నాటవెలంది నల్లునెడ నన్యుఁడు నీ కెనరాఁడు వేమనా!

ఉ. ఒక్కొకచోటఁ బండితుల యూహలకే విషయంబు కాదు వే
ఱొక్కొకచోటఁ బామరుల యూహలకే యది గోచరించు ని
ట్లక్కజమైనభావము తనంతట వేమన, నీకుఁ దోఁచుటల్
వాక్కమలాక్షి నీకు తలవాకిట కాపుర ముండుటన్ గదా.

ఉ. ప్రాయముగాఁ బురాణకవివర్యులు లక్షణలక్ష్యబద్ధులై
పాయని పారతంత్ర్యపరభావపథానుసృతుల్ త్యజించి శో
భాయుతమున్ స్వతంత్ర మగు భావము కబ్బమునం దిమిడ్చి జా
తీయకవీశ్వరప్రథమతీర్థుఁడ వైతివి నీవు వేమనా!

ఉ. యుక్తిగఁ బల్కువారిపయి యుక్తిగఁ బల్కి జయించుటొండె లో
కోక్తుల నింపుగాఁ దమపయుక్తపదంబులఁ దెల్పుటొండె చి
చ్ఛక్తి మెఱుఁగ మహారజతతంత్రములన్ బొనరించుటొండె నీ
ప్రాక్తనపుణ్యకర్మ పరిపాకమునన్ లభియించె వేమనా!

మ. అవనిన్ వైద్యులు వైద్యుఁగాఁ బరమవేదాంతుల్ సువేదాంతిఁగాఁ
గవివర్యుల్ కవివర్యుఁగా నిఖిలసంస్కర్తల్ సుసంస్కర్తఁగా
శివభక్తుల్ శివభక్తుఁగా యతికులశ్రేష్ఠుల్ యతిశ్రేష్ఠుఁగా
నవయోగుల్ నవయోగిఁగాఁ దలఁతు రేనాఁడున్ నినున్ వేమనా!

పుష్పాంజలి

సురేశ్వరాచార్యు లెవ్వరు?

మానవల్లి రామకృష్ణకవి గారు, యం. ఏ.

అద్వైతమతవ్యవస్థాపకు లగు శ్రీశంకరభగవత్పాదులకు ముఖ్యశిష్యు లగుసురేశ్వరాచార్యులు బృహదారణ్యకభాష్యవార్త్తికమును, తైత్తిరీయభాష్యవార్త్తికమును, నైష్కర్మ్యసిద్ధి యనుప్రకరణగ్రంథమును రచించిరి. ఇందులో మొదటిది చాలఁ బెద్దగ్రంథము. దానిలోఁ బీఠికాభాగమునకు సంబంధవార్త్తిక మని పేరు. ఈమూఁడుగ్రంథముల నధ్యాయాంతగద్యభాగముల శంకరభగవత్పాదశిష్యు లగుసురేశ్వరులచే విరచిత మగు నాయాగ్రంథమున నని యున్నది. ఈసురేశ్వరులు పూర్వాశ్రమమున నేనామముతోఁ బ్రసిద్ధ వడసిరి? ఈసందేహము నెల్లరకుఁ జాటించుటయే యీవ్యాసోద్దేశము. మేమును మామిత్రులు సీవిషయమై యాంగ్లేయభాషాపత్రికలలోఁ గొంత చర్చించినారము. తద్భాషాపరిచయము లేనిశిష్టులకై నూతనలబ్ధాధారహేతువులఁ జూపుచు నాంధ్రభాషలో దీని విశదీకరించుట చర్వితచర్వణదోష మంతగాఁ గానేరదు.

సురేశ్వరులు మండనమిశ్రు లనియు, విశ్వరూపాచార్యుఁ డనియు, ఉంబేకుఁ డనియు, భవభూతి యనియు వివిధప్రవాదములు గలవు. వీరెల్లరు గ్రంథకర్త్తలు. వీరి నిబంధనము లిప్పుడు లభించుచున్నవి. మండనమిశ్రులు విధివివేకము, భావనావివేకము, విభ్రమవివేకము, స్ఫోటసిద్ధి, బ్రహ్మసిద్ధి యనునైదు గ్రంథములు రచించిరి. వానిలో దేనిఁ జూచినను గ్రంథాధ్యాయాంతముల "ఇత్యార్యమండనస్య కృతిషు" అని కాని, "ఇత్యాచార్యమండనస్య కృతిషు" అని కాని కానఁబడుచున్నది. విశ్వరూపాచార్యులకృత యాజ్ఞవల్క్యస్మృతివ్యాఖ్యాన మగపడుచున్నది. దానిలోఁ బ్రకరణాంతమున గద్యమున, "విశ్వరూపకృతవివరణబాలక్రీడాయాం" అని యున్నది. ఉంబేకుఁ డనునతఁడు కుమారిలభట్టవిరచిత మగు శ్లోకవార్త్తిక మనుగ్రంథమునకు సుమారు రెండువేలశ్లోకములకు మాత్రమే తాత్పర్యటీక యనువ్యాఖ్యానము రచించినట్లు తద్గ్రంథలబ్ధిచే దెలియుచున్నది. మఱియు మండన

మిశ్రకృత మగుభావనావివేకమునకు వ్యాఖ్యాన మొకటి యుంబేకకర్తృత్వముతోఁ బ్రచురింపఁబడియున్నది. మొదటిదానిలో "ఇతిభట్టోంబేకవిరచితాయాం తాత్పర్యటీకాయాం" అనుగద్యము కూర్పఁబడెను. భవభూతి యను కవిమాలతీమాధవము, ఉత్తరరామచరితము, మహావీరచరితము అనుమూఁడునాటకములు రచించె నవి సుప్రసిద్ధములేకదా! భవభూతికి శ్రీకంఠపదలాంఛనుఁ డనుబిరుదము గలదు. శ్రీకంఠుఁ డనునొకయాచార్యుఁడు బ్రహ్మసూత్రములకు భాష్యము రచించెను. పైఁ బేర్కొన్ననామములన్నియు సురేశ్వరునివా యని సందేహము. వేర్వేఱు పేళ్ల వేర్వేఱు గ్రంథము లుండ నవియెల్ల భిన్ననామములతో నొక్కఁడే రచించెనా యని విస్మయము కలుగక తప్పదు.

ఇఁక వీరియైక్యమును బ్రతిపాదించుహేతువులు విచారింతము.

ఉంబేకుఁడు భవభూతి యనుటకు— (౧) మాలతీమాధవాదర్శపుస్తకములో, "ఇతి భట్టకుమారిలశిష్య పదవాక్యప్రమాణ పారీణ భట్టోంబేకవిరచితే మాలతీమాధవే" యని గద్యము కనఁబడినట్లు శంకరపండితులుగారు గౌడవధగ్రంథపీఠికలో వ్రాయుచున్నారు. దీని వలన భవభూతి కుంబేకనామము కలదనియు, నతఁడు కుమారిలశిష్యుఁ డనియుఁ దేలినది. (౨) చిత్సుఖాచార్యవిరచిత మగు తత్త్వప్రదీపిక యను గ్రంథమున నాప్తవాక్యప్రమాణము నిర్దేశించుచుఁ దద్గ్రంథకర్త మాలతీమాధవకర్త యగు నుంబేకు నాప్తుఁగా గ్రహింపఁ దగునా యని పూర్వపక్షము సేయుచున్నాఁడు. మఱియు నవినాభావ నిర్వచనముచర్చించునప్పుడు "సంబంధో వ్యాప్తిరిష్టాత్ర లింగధర్మస్య లింగినా" యను కుమారిలశ్లోకమున కుంబేకుఁ డిట్లు చెప్పెనని చిత్సుఖాచార్యులు వ్రాయఁగాఁ దచ్ఛిష్యుఁడగు ప్రత్యగ్రూపాచార్యుఁడు దానికి వ్యాఖ్య వ్రాయుచు, "ఉంబేకో భవభూతిః" అని వివరించెను. (౩) భట్టోంబేకకర్తృత్వముతో నుండెడు శ్లోకవార్త్తిక వ్యాఖ్యానమున మొదటి శ్లోక మిట్లున్నది:

> యే నామ కేచిదిహ నః ప్రథయం త్యవజ్ఞాం
> జానంతు తే కిమపి తాన్ ప్రతి నైష యత్నః
> ఉత్పత్స్యతే మమతు కోఽపి సమానధర్మా
> కాలో హ్యయం నిరవధి ర్విపులాచ పృథ్వీ.

ఈశ్లోకమే మాలతీమాధవమున నటీసూత్రసంభాషణమున "తస్యకవేరియంవాచోయుక్తిః— యే నామ.....పృథ్వీ" యని కానవచ్చుచున్నది. ఇందుచే భవభూతి కుంబేకనామము సిద్ధమగుచున్నది.

ఇతఁడు కుమారిల శిష్యుఁడా?— (౧) భట్టోంబేకుఁడు శ్లోకవార్త్తిక వ్యాఖ్యానమున కైనచయున ప్రశంసలో భట్ట కుమారిలుఁడు మీమాంసాభాష్యకారుఁ డగుశబరస్వామి మతమునకు విరుద్ధముగాఁ బ్రవచింపఁగా దాని ఖండించుచు నీక్రింది శ్లోకమును గురువచన ఖండన సమర్థకముగా సూచించెను:

"గురోరప్యవలిప్తస్య కార్యాకార్యమజానతః, ఉత్పథప్రతిపన్నస్య న్యాయ్యం భవతి శాసనమ్" అని.

ఇది వ్యాసభారతములోనిది. దీనిచేఁ దా గురుపంక్తి ఖండింపఁదగు నని సమర్థించె. (౨) శ్లోకవార్త్తికమున కుంబేకుఁడు ౨౩౦౦ శ్లోకములవఱకు వ్యాఖ్య రచించి విడిచిపెట్టఁగా భట్టకుమారిల పుత్త్రుఁడగు జయమిశ్రుఁడు దానిఁ బూరించెను. దీనిచే నుంబేకుఁడు కుమారిల జయమిశ్రుల నడుమకాలమున నున్నందున నతని శిష్యత్వ ముండిన నుండవచ్చును.

సురేశ్వరులు విశ్వరూపాచార్యు లనుటకు హేతువులు:—(౧) సురేశ్వర కృతమని ప్రసిద్ధిఁ బొందిన నైష్కర్మ్యసిద్ధికి మళయాళ దేశాదర్శములలో, "ఇతి గోవింద భగవత్పూజ్య పాదశిష్య విశ్వరూపాచార్య కృతాయాం నైష్కర్మ్యసిద్ధౌ" అని యున్నది. (౨) విద్యారణ్యులవారు వివరణప్రమేయ సంగ్రహమున—

"అధ్యాపనస్యాహమితి మమేతి చాకార ద్వయం స్నేహతారతమ్యా దుపపద్యతే, తత్తారతమ్యం చ తదేతత్ ప్రేయః పుత్రాత్, ఇత్యస్యాః శ్రుతే ర్వ్యాఖ్యానావసరే విశ్వరూపాచార్యై ర్దర్శితం—

'విత్తాత్పుత్రః ప్రియః పుత్రాత్ పిండః పిండాత్తథేంద్రియమ్, ఇంద్రియేభ్యః ప్రియః ప్రాణః ప్రాణాదాత్మా పరః ప్రియః' ఇతి."

అని విశ్వరూపాచార్యశ్లోక మని యుదాహరించిరి. ఇది సురేశ్వరుల బృహదారణ్యక వార్త్తికమున మొదటియధ్యాయమున నాల్గవ బ్రాహ్మణమున నున్నది. దీనిచే విద్యారణ్యులు సురేశ్వరవిశ్వరూపుల యేకత్వ మంగీకరించిరి. (3) మలయాళ దేశమున వ్యవహారమున నున్న యాచార్యవిజయ మను శంకరవిజయమునఁ దద్గ్రంథకర్త్త గోవిందుఁడు విశ్వరూపాచార్యుఁడు శంకరులతో వాదించి పరాభవము నొంది సన్న్యసాశ్రమము స్వీకరించి సురేశ్వరనామమున శంకరుల రెండుభాష్యములకు వార్త్తికములు రచించెనని చెప్పుచున్నాఁడు.

భవభూతి సురేశ్వరుల యేకత్వము—
యాజ్ఞవల్క్యస్మృతికి బాలక్రీడ యనువ్యాఖ్య విశ్వరూపాచార్యులు రచించిరికదా. దానికిని మూఁడువ్యాఖ్యలు గలవు. అందుఁ గర్త్తృనామరహిత మగునొకదానిలో మొదట—

"యత్ప్రసాదాదయం లోకో ధర్మమార్గస్థితః సుఖీ, భవభూతిసురేశాఖ్యం విశ్వరూపం ప్రణమ్య తమ్."

అని మూలకర్త్తృనమస్కార మగపడుచున్నది. దీనిచే భవభూతియు, సురేశ్వరుఁడును, విశ్వరూపుఁడు నొక్కఁడె యని తద్వ్యాఖ్యాత యభిప్రాయము.

పైపంక్తులవలన భవభూతి కుంబేకుఁ డని నామము. అతఁడు గోవిందభగవత్పాదుల శిష్యుఁడు; విశ్వరూపసురేశ్వరనామములఁ బ్రసిద్ధిఁ జెందెను. ఇందు నేను సూచించునది యేమన, "భవభూతి" యనుశబ్దరచనచే నితని కాపేరు కావ్యములలో ప్రఖ్యాతమైనట్లు భోజచరితములో నున్నది. ఉంబేకుఁడనుటయు

యితేనియింటివారివ్యవహారనామము. ఇతఁడు శంకరులతో వాదించి యోడి వారిగురువు లగు గోవిందపాదులవలన నాశ్రమాంతరము స్వీకరించి విశ్వరూపాభిధానము చెందెను. సురేశ్వరనామము యతులలోని బిరుదనామముగా గ్రహింపఁదగు.

ఇఁక మండనమిశ్ర-సురేశ్వరులయైక్యవిషయము విచారింతము. విద్యారణ్యులవారి శంకరవిజయమున శంకరులు కుమారిలభట్ట దర్శనము చేసి యతఁడు జీవ ప్రాయశ్చిత్తవిధిలో నుండఁ దా రచించినసూత్రభాష్యము చూపి దానికి వృత్తిఁ గూర్పుమని కోరఁగా నాస్థితిలో నతఁడు వ్యాఖ్య వ్రాయనేరక యతనిమిశ్రుఁ డగుమండనమిశ్రునియొద్దకుఁ బొమ్మని చెప్పఁగా నాచార్యు లాకాశయానమున మాహిష్మతీపురమునకుఁ జనియె ననియు నచ్చట మండనునితో వాదించి యోడించి యతనికిఁ బరమహంసాశ్రమ మిచ్చి సురేశ్వరనామముతో నతనిశాఖ యగుతైత్తిరీయమునకును, బృహదారణ్యమునకును దా రచించినభాష్యములకు వార్తికములు రచింప ననుజ్ఞ యిచ్చినట్లున్నది. దానిలో మండనమిశ్రులఁ గుమారిలుఁడు సూచించుచుట్టమున—

> ఉంబేక ఇత్యభిహితస్య హి తస్య లోకై
> రుంబేతి బాంధవజనై రభిధీయమానా;
> హేతోః కుతశ్చిదిహ వాక్సురుపాభిశప్తా
> దుర్వాససాజని వధూర్ద్వయభారతీతి.
>
> —(౭-౧౧౬)

అని యతనిభార్య యగుద్వయభారతికి "ఉంబ" యనియు నతని కుంబేకుఁ డనియు బేళ్లున్నట్లు శంకరవిజయకారుఁడు చెప్పుచున్నాఁడు. మఱియు నతఁ డందే—

> సర్వాసు శాస్త్రసరణీషు సవిశ్వరూపో
> మత్తోఽధికః ప్రియతమశ్చ మదాశ్రమేషు;
> తత్ప్రేయసీం శమథ నేంద్రవిధాయ సాక్ష్యే
> వాదే విజిత్య త మిమం వశగం విధేహి.
>
> 7-112.

అని చెప్పినట్లున్నది.

మఱియు—

> ఇత్థం స ఉక్తో భగవత్పదైః
> శ్రీవిశ్వరూపో విదుషాం వరిష్ఠః;
> చకార భాష్యద్వయవార్తికే ద్వే
> హ్యాజ్ఞా గురూణాం హ్యవిచారణీయా.
>
> (13-68)

అనుటచే విశ్వరూపోంబేకనాముఁడగు మండనమిశ్రుఁడు శంకరులతో వాదించి యోడి తురీయాశ్రమము గ్రహించి సురేశ్వరుఁడయ్యెనని శంకరవిజయకారుని తాత్పర్యము. అతఁ డైతిహ్యము విన్నయట్లు రచించెనని తోఁచుచున్నది. మండనమిశ్రుఁడే సురేశ్వరుఁ డనుటకు వేఱు యాధారములు లేవు.

ఉంబేక మండనమిశ్ర లొక్కరే యని వాదించుటలో నొకటిబాధకము మండనమిశ్రునిభావనావివేక మను గ్రంథమునకు భట్టోంబేకవిరచిత మగు వ్యాఖ్యాన మగపడుటయే. దోషమేమి, మూలకారుఁడే స్వోపజ్ఞవ్యాఖ్య గూర్చె నందురేమో! మూలమే కారికావృత్తిరూపమున నున్నది. ఆరెంటికిని వ్యాఖ్య వివరణము. ఎట్లైనను రెండునామధేయములఁ

గర్తృత్వమేల శాసింపవలయు? శైలియు భేదిల్లుచున్నది. ఉంబేకమండనుల యైక్యమును సూచించిన గ్రంథములు విద్యారణ్య శంకరవిజయమును, చిద్విలాసకృతమగు శంకరవిలాసమును మాత్రమే. వీనిలో రెండవది మొదటి దానికిఁ బ్రతిలేఖ. అట్లైనచో శంకరవిజయ ప్రామాణ్యము చర్చింపఁదగు.

శంకరవిజయము విద్యారణ్య కృతమని దానిలో నున్నది. గ్రంథకర్త తాను వ్యాసాద్రి కవికృత మగు శంకరవిజయము ననుసరించెనని చెప్పుచున్నాఁడు. అయ్యది దానికి మూలమైనచో నది లభించునా? అది తంజాపుర పుస్తకభండారమునను, గేరళమునఁ దిరుచూరు మఠమునను నున్నది. దానిలో మండనమిశ్రుల ప్రశంసయే లేదు. గోవిందకృతమగు నాచార్య విజయమున విశ్వరూపాచార్యులు సురేశ్వరులైనట్లున్నది కాని మండన మిశ్రుల ప్రశంస లేదు.

పై యంశములను బట్టిచూడ శంకరులు విశ్వరూపుల నోడించి సురేశ్వరులఁగాఁ జేసి వార్తికముల వ్రాయించెననియు, సురేశ్వరుఁడు చతుర్థాశ్రమమును గోవింద భగవత్పాదుల యొద్ద స్వీకరించెననియు, విశ్వరూపనామ మొకటే పరమహంసాశ్రమనామమై యుండునని[illegible] బూర్వాశ్రమమున నతని పుట్టుకపేరుం[illegible]ఁడనియుఁ, బద్య మొకటి రచించుటచే భవభూతి యనియు వెలసెననియుఁ దేలుచున్నది.

భట్టకుమారిలుఁడు చతుర్థాశ్రమమును స్వీకరించినట్లు శంకరవిజయాదులఁ గానరాదు. కాని నైష్కర్మ్యసిద్ధి వ్యాఖ్యానమున "తాం ప్రత్యవ్యక్త మేవేతి ముక్త్వాన్యత్సిద్ధాంతం దర్శయతి పరమహంసాశ్రమానుష్ఠానపూర్వమమలాం గ్రంథే భట్టాచార్యాః పునః ప్రయాతి వేదాంత నిషేవణేన ఇత్యాదినా" యని చెప్పఁబడుటచేఁ గుమారిలుఁడు కడపట సన్న్యాసాశ్రమము ధరించినట్లు తోఁచుచున్నది. ఈ శ్లోకపాదము శ్లోకవార్తికమున నాస్తికవాద నిరాకరణఘట్టమున నున్నది. "ఆత్మాస్తితాం భాష్యకృదత్ర యుక్త్యా దృఢత్వమేతద్విషయశ్చ బోధః; ప్రయాతి వేదాంత నిషేవణేన" అని.

మండనమిశ్రులే సురేశ్వరులన శంకరవిజయకారునకుఁ గల కారణము లేవన: మండన మిశ్రుల బ్రహ్మసిద్ధిలోని ద్వితీయ తృతీయ కాండములలోని యంశములే సురేశ్వరుని సంబంధవార్తికములో నున్నవి. అవి బౌద్ధ ప్రభాకర మతఖండనయుక్తులు. వారిరువురు నొక్కరే యని యంగీకరింపకున్న సురేశ్వరులు మండన మిశ్రుల బ్రహ్మసిద్ధిలో నుండి గ్రంథచౌర్యము చేసినట్లేర్పడును. ఈకారణమున శంకరవిజయకారుఁడు వారిరువురు నొక్కఁడే యని శాసించెను. శాస్త్ర గ్రంథములలోఁ బూర్వపక్షానువాదమున నే కాక పరగ్రంథ పంక్తులు పూజ్యార్థమునఁ గూడ ననువాదము సేయుదురు. బ్రహ్మసిద్ధిపైఁ బ్రభాకర శిష్యుఁడగు శాలికనాథుఁడు "అద్వైతాభిమానీ తు భవా నాత్యంతికమేవ నిషేధ మఖిలవ్యక్తి సోఽయమాత్మీయ ఏవ బాణో భవంతం ప్రహరతి—

"లబ్ధరూపే క్వచిత్కించిత్తా
దృగేవ నిషిధ్యతే;
విధాన మంతరేణాతో న
నిషేధస్యసంభవః."

అని బ్రహ్మసిద్ధిలోని శ్లోకము నుదాహరించి దూషించుచున్నాఁడు. మఱియు "తత్రాస్యాః పండితమ్మన్యోమన్యతే" యని బ్రహ్మసిద్ధికారుని జాతినిర్ణయమును నిరాకరించుచున్నాఁడు. ఈఖండనములకు సురేశ్వరుఁడు ప్రతిసమాధానములఁ జేర్చి బ్రహ్మసిద్ధికారుని యుక్తులతో నీసమాధానములఁ గూర్చి ప్రభాకర భర్తృప్రపంచ మతఖండనమును సంపూర్ణము చేసెను. ఇట్టి యనువాదము నే గ్రంథచౌర్యముగా లోకము గ్రహించునేమో యని మండనమిశ్ర సురేశ్వరైక్యమును బ్రతిపాదించిన శంకరవిజయకారుఁడు విశ్వరూపుఁడే మండన మిశ్రసురేశ్వరు లని కథ కల్పించి యుండును.

మండనమిశ్ర సురేశ్వరులమతము లభిన్నములుగా సంక్షేపశారీరకగ్రంథకారుఁ డగు సర్వజ్ఞాత్ముఁడు చెప్పుచున్నాఁడు. మఱియు మండనుఁడు భర్తృహరి ప్రతిపాదిత మగుశబ్దబ్రహ్మస్ఫోటవాదము ననుసరించి బ్రహ్మసిద్ధియు, స్ఫోటసిద్ధియు రచించె. సురేశ్వరుఁడు స్ఫోటమును నిరాకరించె. మండనుఁడు జ్ఞానకర్మసముచ్చయవాది. సురేశ్వరుఁడు కర్మ నిరసించి జ్ఞానమే ప్రతిపాదించె. మఱియు మండనమతమునే చాలవఱకు వాచస్పతిమిశ్రుఁడు గ్రహించి శంకరభాష్యమునకుఁ బ్రస్థాన భేదమును భామతీగ్రంథమున సూచించెను. సురేశ్వరమతము నిష్టసిద్ధికారాదులు, నానందగిరియు ననుసరించి వార్తికకారమతమని శంకరభాష్యమునకుఁ బ్రస్థానాంతరము కల్పించిరి. పంచపాదికావివరణకారులు తద్భాష్యమునకు మూఁడవ ప్రస్థానమును నిశ్చ[illegible]రి. వివరణ, వార్తికకార, భామతీమతములు మూఁడునుగలిసి ప్రస్థానత్రయమని మాయభిప్రాయము. కొందఱు భామతి,కల్పతరు,వివరణములు గలసి యీనామము చెందెనని చెప్పుదురు. ఈమూఁడు గ్రంథములు నేక మత (మండన మత) ప్రభవిష్ణువులే కావున వానికి వేర్వేఱఁ బ్రస్థానశబ్దము చెల్లఁజాలదు.

నిశ్చింత

దీపాల పిచ్చయ్యశాస్త్రి గారు

పరిపరిగతుల సర్వవ్యాపకుని నిన్ను వెదకఁబోయితి నెంత వెఱ్ఱి నయ్య,
నీనామరహితత నే నెఱింగియు నట్టె పిలువఁబూనితి నెంత వెకలి నయ్య,
ఆకారశూన్యుఁడ వౌ టెఱింగియు నిన్ను నరయఁ గోరితి నెంత మొఱకు నయ్య,
సర్వసముఁడ వన్న సంతన యెఱిఁగియుఁ బొగడసాగితి నెంత మొరటునయ్య,
అవగతంబయ్యె నిగమరహస్యమెల్ల-ఆకళింపయ్యెఁ బ్రకృతిగూఢార్థమెల్ల
నేని నీపాట నేఁటికి నెఱుఁగనయ్యె-స్వాంత మింతకుఁ దండ్రి! నిశ్చింతమయ్యె.



వినోద విమర్శము

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

బ్రహ్మశ్రీ నడుకుదుటి వీరరాజు పంతులు గారు శ్రావణభారతిలో సర్వలక్షణసార సంగ్రహమునుగూర్చి వ్రాసినవ్యాసము విలువ గలది. అందలి విషయములను గూర్చి నాకుఁ గల యభిప్రాయభేదముల నించుక యెఱిఁగించు కొనుచున్నాఁడను.

౧

గసడదవాదేశ విచారము

“ఎల్ల ప్రథమలమీఁదను వచ్చు నెల్ల శబ్దంబుల పరుషంబులకును నెల్లచోటులను గసడదవాదేశము నిత్యమే యనియుఁ గావున నే తిమ్మకవిచంద్రుని లక్షణము ప్రమాణయుక్తమనియు దానం జేసి ‘సవి కృతిశబ్దాత్పరతః సాసంస్కృతికానాం భవన్తి గసడదవాః’ అను సూత్రమాధారరహితమనియు సిద్ధాంత మగుచున్నది” [illegible]ని వారు వ్రాసిరి. సంఖ్యాపరిమాణ వాచక[illegible]మీఁదమాత్రమే యెల్ల పదంబులకచటతపలకు నెల్లచోట్లను గసడదవాదేశము నిత్యము గావచ్చుననియు,తక్కిన ప్రథమాంతముల మీఁద అవ్యయములమీఁద క్రియలమీఁద నీయాదేశము బహుళముగా వచ్చుననియుఁ బెక్కు ప్రయోగములఁ బరిశీలించి నేను నిర్ణయించుకొంటిని. వీనికి వలసిన ప్రయోగములను బసవపురాణపీఠికలోఁ జూపితిని. ప్రథమమీఁది కచటతపలకు గసడదవాదేశము లేని ప్రయోగములు గూడఁ బెక్కులు గలవు. కొన్ని యవ్యయములపై నీయాదేశము కల్మి నిత్యముగాఁ గానవచ్చును. మఱికొన్ని యవ్యయములపై నీయాదేశము లేమి నిత్యముగాఁ గానవచ్చును. క్రియలపై నటునిటుగూడఁ బ్రయోగములు గలవు. ద్రుతాంతములు గాని క్రియలు గూడ, కలదు, లేదు, ఇత్యాదులు ప్రథమాంతములతోఁ దుల్యములని యే నా తలఁపు. శబ్దవ్యుత్పత్తిని బరిశీలింప నవి ప్రథమాంతములే యగును. నే నిట్లు చెప్పుట కాధారమయిన ప్రయోగములఁ గొన్నింటిని బసవపురాణపీఠికలోఁ జూపితిని గాన చర్విత చర్వణమని యిక్కడఁ జూపనయితిని. అక్కడ నేనుజూపిన ప్రయోగములెల్లఁ బ్రాసమునుబట్టి యున్నవే. కవి జనసంజీవనీకారాదు లీయాదేశము ప్రాసస్థాన ప్రసక్తమే యనుట యాకాలమున కీయాదేశముశిథిలమగుటనుసూచించును. ప్రాచీనులు ప్రాసస్థలములందొకవిధముగాను,తక్కినస్థలము

లందు వేఱొకవిధముగాను బ్రయోగములఁ జేసిరనుట కాధారము గానరాదు. ప్రాసేతర స్థలములందుఁగూడఁ బ్రాచీను లీయాదేశమును బాటించిరి. శిలాతామ్రశాసనము లీవిషయమును నిరూపించుచున్నవి. కాని ప్రాసస్థలములందు నేను జూపిన ప్రయోగములంబోలెఁ బ్రాసేతరస్థలములందునుగూడ నీయాదేశమును బాటింపక పోవుటయుఁ గొన్నిశాసనములందుఁ గాననగును. సంబోధనప్రథమమీఁద నీయాదేశము లేమి నిత్యము.

గీ. పలికినప్పుడు దేనియ లొలికిపడెడు
జళుకుఁజూపులఁ గ్రొమ్మించులులుకుపడెడు
ములికినాటిది గాఁబోలుఁ జెలి! కిరాట!
కలికి సిలుకలకొలికి యీ తెలికి జోటి!
—క్రీడాభిరామము.

ఇక్కడ 'చెలి!' సంబోధనము తర్వాత 'కి' 'గి' కాలేదు. సంఖ్యాపరిమాణవాచకములమీఁద నీయాదేశము నిత్యముగాఁ గలదనుటకు వింతవింత ప్రయోగము లనేకములు శాసనములందును, గ్రంథములందును గలవు.

చ. హృదయము లుల్లసిల్లఁ బరి
నింతులు మేడల నుండి పాడఁగా
నది విని క్రోలుచుం బరవ
శాత్మకమై న్వమృగంబు వెద్దయుం
గదలకయున్నఁ గుంటువడి
కాదె మృగాంకుఁడు రేలు గొన్నిగొ
న్నిదిశల నభ్రవీథికన
నిల్చుఁ బ్రభాతము డాసినప్పుడున్.

ఈపద్యము కేయూరబాహుచరిత్రము ప్రథమాశ్వాసము లోనిది. ముద్రితమయిన పుస్తకములోనిది గానరాదు. ఆదేశము కల్మికి శ్రీవీరరాజుపంతులుగారు చూపినప్రయోగములుచాలియేయున్నను విడువఁబడినపద్యము గాన దీని నిక్కడ వెల్లడించితిని. వికృతిశబ్దములకంటెఁ బరమయిన సాంస్కృతికశబ్దముల కచటతపలకు గసడదవాదేశ మింత స్పష్టముగా బహుస్థలములఁ బ్రాచీనభాషలోఁ గానవచ్చుచున్నను 'నవికృతిశబ్దాత్పరతః సాంస్కృతికానాం భవన్తి గసడదవాః' అను సూత్రము గలయాంధ్రశబ్దచింతామణి నన్నయభట్టరచితమే యనియు, దాని చొప్పున సాంస్కృతికశబ్దములకు నాదేశము రాదనియు వాదించు పండితు లింకను గలరు!

౨

స్నానశబ్దవిచారము

కూచిమంచి తిమ్మకవి యుద్ధరించిన ప్రయోగములు:—

స్నానముచేసి ధౌతపరిధానము గట్టి
—హరవిలాసము

స్నానమును సంధ్యయును బితృతర్పణంబు
—విష్ణుభజనానందము

స్నానంబుదీర్చి ధౌతములైనవస్త్రముల్.
—మత్స్యపురాణము

సరియయినవే; కాని స్నానశబ్దమునఁ [illegible] మాతృకమున 'తకారము' గలదనుట (స్త్నానమనుట)మాత్ర మంగీకారార్హము గాదు. ఈ పాఠములే కల్పితము లని యెగురఁగొట్టఁ జూచిన వజ్రాయుధపత్రికావిలేఖకుల వ్రాత

(ఆవ్రాఁత నేను జూడలేదు.) యు నంగీకారార్హము గాదు.

శ్రీవీరరాజుపంతులుగా రుద్ధరించిన ప్రయోగములు తిమ్మకవియుద్ధరించిన ప్రయోగములతోఁడివే; ప్రామాణికములే. కాని 'స్నాన' పదమున తకారముగలదనియు 'స్త్నానమని' యుండవలసియుండగా నజ్ఞానముచే లేఖకులు తకారమును విడనాడుచున్నారనియు వ్రాయుట మాత్రముసాహసమనినాతలఁపు. పంతులుగా రిట్లువ్రాసిరి:—

"మహాకవులు స్త్నానశబ్దమును తకారమునకు యతి సెల్లునట్లు ప్రయోగించియుండ, లేఖకమహాశయులు తమయజ్ఞానముచే నందున్న తకారమును విడిచిపెట్టి 'స్నాన'మనియే వ్రాఁతప్రతులయందు లిఖించినారు. కావుననే పైపొత్తములను ముద్రింపించిన పండితులు స్త్నానశబ్దమును తకారరహితముగనే (స్నాన-అని యతిని బరికింపకయే) యచ్చొత్తించినారు. (చూ. వావిళ్లవారిరుక్మాంగద, కాశీఖండములు; సరస్వతీపత్త్రికనుండి వెలువడిన హరవిలాసము. 1901.) మఱియు, "స్త్నానంబు దీర్చి..." అను మత్స్యపురాణ ప్రయోగమును లేఖకులు తకారశూన్యముగ వ్రాసియుండుటచేతనే, కవితాపత్త్రికయందు మత్స్యపురాణమును బ్రకటించిన శ్రీవేంకటరామకృష్ణకవులో, వారికి లభించిన తాటియాకుఁబ్రతిని వ్రాసిన లేఖకుఁడో దానియతి కుదరకపోవుటచేఁ గాఁబోలు, (సీసపాదమగుటం జేసి) 'తానంబుదీర్చి' అని సవరించి యతిని సరిపుచ్చినారు!

ఇంతమంది కవులు * స్త్నానశబ్దమును తకారయుక్తముగఁ బ్రయోగించియుండఁగా, అంతమందిలేఖకులు దానిలోని తకారమును వదలివేసియుండఁగా, స్త్నానశబ్దమున తకారము నెవ్వరో చేర్చినారని తలంచుట యసమంజసము గాదా?

కావున తిమ్మకవి యిచ్చిన మూఁడు ప్రయోగములనుబట్టియు, పై కాశీఖండ, రుక్మాంగదచరిత్రముల ప్రయోగములను బట్టియు స్త్నానశబ్దమున తకారము గలదనుట సిద్ధాంతమగుచున్నది."—

తరువాత పంతులుగారు స్నానశబ్దమున తకారము గలదనుటకు ప్రాతిశాఖ్యసూత్రము నుజూపిరి. వారుచూపిన ప్రాతిశాఖ్యసూత్రము ఛందస్సునకుఁ జెందినదిగాని భాషకుఁగాదు. ఛందోలక్షణములు భాషకు సరిపడవు. మునిత్రయమువారు పెక్కుపట్టులందు 'ఛందసి-భా

---

* శ్రీపీఠికాపురసంస్థానాధీశ్వరులు నన్నిచోడని కుమారసంభవము వ్రాఁతప్రతి నొకదానిని గొంతకాలముక్రింద వ్రాయించి తెప్పించియున్నారు. ఆప్రతియందు దశమాశ్వాసము 77-వ పద్యమున, "క. ఆహరి విడిచి నిసర్గ, స్త్నిహంబునఁ బాలు తెంచెఁ దెచ్చెర........." అని స్త్నిహాశబ్దము తకారయుక్తముగ వ్రాయఁబడియున్నది. (ముద్రిత పుస్తకమున తకారము తొలఁగింపఁబడినది. చూ. 10-ఆ., 442-పద్యము.) దీని యతిస్థానము తకారమును దెలుపకున్నను, ఆపొత్తమును బూర్వమునుండియుఁ బరంపరగా వ్రాయుచువచ్చిన లేఖకులు మాతృకాపాఠ స్త్నిహామును మాత్రము విడువక యందున్న తకారము నల్లే యుంచుచువచ్చిన దాని కెంతయు సంతసింపవలసి యున్నది.

షామామ్'అని వేఱుపఱిచి లక్షణములఁ జెప్పిరి. మునిత్రయమువారు మొదలగు సంస్కృత వ్యాకరణకర్తలు భాషాస్వరూపమును బాగుగా గుర్తించి సుసూక్ష్మములగు నుచ్చారణభేదములనుగూడఁ జూపుచు లక్షణకల్పనము చేసిరి! సంస్కృతభాషామహారణ్యమున స్వైరవిహారముసల్పినసర్వజ్ఞసింహములుగాని వారుసామాన్యులుగారు! ఋషులు, ఋషికల్పులు, నిరంకుశులు, వశ్యవాక్కులు నగు వ్యాసవాల్మీకికాళిదాసాదికవులుగూడ నీ "స్త్నాన"రూపమును బఠింపరయిరి! వేలకొలఁదియేండ్లనుండి వెలయుచున్నట్టియు, నతివిపులమయినట్టియు, సంస్కృతభాషావాఙ్మయమున నెక్కడను స్త్నానరూపము గానరాకుండఁగా, నిప్పటి కేనూఱేండ్లకుముందున్న శ్రీనాథుఁడు సంస్కృతభాషా మర్యాదా విరుద్ధముగాఁ దెలుఁగుఁగవిత్వములో వైదిక వర్ణక్రమోచ్చారముగల స్త్నాన పదమును బ్రయోగించెననుట భావ్యమా? స్త్నానముతోపాటు పంతులుగారు స్త్నేహమునుగూడ వ్రాసిరి. హావిష్కృతి ఘృతాచీ— పూష్ణే స్వాహా—సర్వస్మై—ప్రాశ్ ఛ్ఞితూత్ (సంహిత) యదశ్త్నాతి (కాశకము-ఇట్టిరూపము సంహితలోలేదట)—సంవథ్సరమ్—రక్ష్షోహాణో—ఇత్యాది వర్ణక్రమ శబ్దోచ్చారరీతులను గూడ నిఁక భాషలోఁ జొప్పింపవలసినదే! స్నానశబ్దమందలి 'స్నా' వలె స్నేహశబ్దమందలి 'స్నే' కూడ నెక్కడనేని త, థాదులతో యతిమైత్రిని జెందుట కానవచ్చెనా? దీనిని యోజింపవలదా? వేదస్వరోచ్చరిత పదములను, వేదోదిత శబ్దములను, వేదపరిభాషాయుక్త వాక్యములను నిరంకుశముగా నాంధ్రకవులు వాడిరని పంతులుగారు చూపిన ప్రయోగములలో త్త్రియంబకము వేదమంత్రానుకరణము. అందు 'త్రియంబకం యజామహే' అనియే చెప్పవలెను. తక్కినవి మందాకినీనదిలోస్నానముచేయు వైదికబ్రాహ్మణుల పలుకుల ననుకరించి వర్ణించుటలో నౌచితీ నిర్వాహమునకై కైకొనఁబడినవి. అట్టిపట్టులందు వైదికబ్రాహ్మణులు వైదికోచ్చార పరిచయాధిక్యముచే స్నేహ, స్నాన, సంవత్సర, ప్రశ్నాదిశబ్దములను స్త్నేహ స్త్నాన, సంవథ్సర, ప్రశ్ఛ్నాది విధ వర్ణక్రమోచ్చారముతో నుచ్చరించినట్లు ప్రయోగించినను హృద్యాతిహృద్య మగును కాదా? ఇట్టి ప్రయోగములు పంతులు గారి వాదమునకుఁ బ్రయోజకము లగునా?

శ్రీనాథాది ప్రయోగములు ప్రామాణికములంటిరి. స్నానశబ్దమున తకారము లేదంటిరి. ఇఁక యతిసెల్లుట యెట్లు? అని ప్రశ్నమేని, ఇదిగో ఉత్తరము!

తెలుఁగు లాక్షణికులు పలువురు తద్భవ వ్యాజయతి యని యొక యతిని బరిగణించిరి. విజ్ఞానమునకు విన్నాణము, విజ్ఞాపనమునకు విన్నపము, యజ్ఞమునకు జన్నము, [illegible]కు ఆన మొదలగువిధములఁ దద్భవ రూ[illegible]ములు గలవుగాన 'జ్ఞ' తద్భవత్వమున 'న'గా మాఱుచున్నది. ఇది వ్యాజముగాఁ 'జ్ఞ'కును, 'న' కును యతి చెల్లుచున్నది. జ్ఞలో 'న' కారములేదు. వేదమునందును లేదు.

అట్టి 'జ్ఞ'కుఁ దద్భవవ్యాజమున 'న'కారమునకు యతిసెల్లినది! ఈయతి నన్నియకృతిలో లేకున్నను నన్నియ కేఁబదియేండ్లకుఁ దర్వాత నున్నవాఁడగు పావులూరి మల్లన గణితములో నున్నది.

"సూనుల నల్వురం బడసె సూరిజనస్తుత సత్యభారతీ, జ్ఞానులఁ బద్మగర్భవదనంబులు నాలుగుఁబోలె వారిలో…" లాక్షణికులెల్లరును మల్లన ప్రయోగము నొక్కదానినే పరిగణించిరి. ఈయేక ప్రయోగమునుబట్టి లక్షణమును గల్పించుట యుక్తముగాదేమో యని సంశయించి వెదకితిని. నన్నియకు నూఱేండ్ల తర్వాతివాఁడగు నన్నిచోడని కుమారసంభవమునఁ గూడ నిట్టియతి గానవచ్చినది.

…నస్వరూపమై సర్వాత్ముఁడున్నఁ దా
జ్ఞేయస్వరూపమై నెఱసి యుండు.
—సప్తమాశ్వాసము

కాన యీయతిప్రామాణికమే. 'జ్ఞ'కు 'న'కు యతిచెల్లినట్లు, 'జ్ఞ'కు, 'క'కుఁగూడ యతిచెల్లుననికొందఱనిరి. 'ప్రజ్ఞ'-'పగ్గ' గాఁ దద్భవరూపముండుట కలదుగాన, యిదికూడఁ బరిగ్రాహ్యమేయనవచ్చును. అప్పకవ్యాదులు పరిశీలితముగా విడనాడిరి గాని యీతద్భవవ్యాజయతి యొక్క జ్ఞ-న—జ్ఞ-క-లకు మాత్రమే కాక, తాన మనితద్భవతగల స్నానశబ్దమునకు నింక నిట్టివానికిఁగూడఁ జెల్లఁదగినది. స్నానశబ్దమున 'స్నా'లో తకారము లేకున్నను దద్భవత్వమున 'త'గా మాఱుననుటచే 'స్నా'కును, 'త'కును శ్రీనాధాదులు యతిని జెల్లించిరి.

ఆనాఁడీయతి తద్భవత్వమును బడయు పదములకే యేర్పడినదయియుండును. తాన మని తద్భవతఁ బొందఁదగిన స్నానశబ్దమునకే యానాఁడీయతి గలదుగాఁబోలును. స్నేహమున కున్నట్లు గానరాదు. 'జ్ఞా'ధాతువులోని 'జ్ఞ' విజ్ఞానవిజ్ఞాపన సంజ్ఞాదిపదములలో 'న'గా మాఱుచున్నది గాన 'జ్ఞా' ధాతుజన్యము లగు నెల్లశబ్దములలోని 'జ్ఞ' లకు 'న'తో యతిమైత్రి గల్గెను. తద్భవవ్యాజయతు లిట్టి వింక నేవేని యుండవచ్చును.

ఎక్కడే నొకటిరెండుచోట్ల స్తానమని లిపియుండుఁగాక! అది శాస్త్రవిరుద్ధ మయియుండఁగా నెట్లు ప్రమాణమగును? ఆవ్రాసినవారు, స్నానపదమందలి 'స్నా'తో 'త'కుయతిమైత్రిని జూచి యాపదమునఁగూడ 'త' కలదుగాఁ బోలునని తలంచి యట్లువ్రాసియుండఁగూడదా?

'చాకలి'కి- త్సాకలి 'చల్ల'కు 'త్సల్ల' 'లచ్చారావు'కు 'లత్సారావు' - మొదలగు విధముల వ్రాఁతలు నేఁడును గలవు! తాటియాకు ప్రతులలోని, శాసనములలోని, వింతవ్రాఁతలు లెక్కకు మిక్కిలి కలవు. పంతులుగారును వానినెఱుఁగుదురు. అవియన్నియును బ్రామాణికములే, యని సాధింపశక్యముగాదుగదా! ఆయా దేశకాలములం దటువంటి యిటువంటి యుచ్చారణరీతులు, లిపిరీతులు సామాన్యవ్యవహారమున నుండెడివని యెఱుఁగనగును. అట్టివానిని బట్టికూడ రూపభేదములు, వికృతులు వెలయుచుండును. శాస్త్రకారులు వానిలో గ్రాహ్యములఁ బరిగణింతురు! 'తాన' మనువికృతి యిట్టివిధమునను బుట్టియుండవచ్చును. వికృతిపదములోని యక్షరములెల్లఁ బ్రకృతి పదములో నుండి తెలియునని పంతులుగారును దలంపరు.

పన్నా

(చరిత్రాత్మకము)

కొత్త జగ్గయ్య చౌదరి గారు

తే. వెలదు 'పన్నా'యనెడు పుణ్యకాంత మూర్తి-సాహసౌదార్య గాంభీర్య శౌర్యములకు
నాటపట్టయి రాకొలమందుఁ బేరు-గన్న 'సంగ్రామసింహు' వంగడపు దాసి.

తే. నీచకులమునఁ బుట్టిన నెలఁత యైన-నుత్తమ కులాంగనలయందు నుండఁదగిన
విమల సద్గుణగణముల వెలయు నామె-సర్వలోకైక నిర్మలాచారగతుల.

చ. విలసిత సద్గుణంబులు, వివేకధనంబు, నుదారవృత్తి, పె
ద్దలయెడ భక్తిసంపదయుఁ, దాల్మియు, నేర్పును, చిత్తశుద్ధి యూ
కలికికి భూషలై మెఱయుఁ గావున మెచ్చనివార లుండ; రే
కులమునఁ బుట్టినన్ బుధులు కోరెడి దాగుణమే కదా సదా.

గీ. ఫణుల శిరములపై దివ్యమణులు, గాజు గనులలో రత్నములు, ఘోరవనములందు
నోషధులు, హీనకులముల నుత్తములును-గలుగుట స్వభావ మనునుడి కల్లయగునె ?

క. తన కన్నుంబిడి ప్రోచెడి-జనవిభు, సంగ్రామసింహు, సత్యవ్రతునిన్
వినయప్రబుద్ధయై స-త్యనురక్తిన్ దవిలి కొలుచు నహరహ మెలమిన్.

సీ. వేతన మొసఁగిన వేళ సంతోషించి లేనివేళలఁ గోప మూనఁ బోదు
పనిమెత్తేనియు విసుగును జెందక తనకు విధించిన పను లొనర్చు
జననాథుసేవకే తనజీవితం బెల్ల ధారవోయంగఁ దాఁ దలఁచుచుండు
ప్రభువంశమునకు నపాయంబు గల్గుచోఁ దనకొంప బోయిన దని వగర్చు
పుడమిజనములు గోనములప్రోవటంచు-నీనుతి యొనరించుచుండు నావనిత నెపుడు
స్వీయధర్మంబు నేవేళఁ బాయకుండు-వారి నెవరు నుతింపరు? వసుధపైని.

సీ. పద్మనందుని వంశపాలనమ్మునకు నై శ్రమఁగొన్న 'మంత్రిరాక్షసు'నకైన
'జస్వంతసింహు' వంశముఁ బ్రోచి స్థిరకీర్తిఁ గనిన యా 'దుర్గదాసు'నకునైన
ప్రాజ్యమహారాష్ట్ర రాజ్యంబు నిలుపనెంచిన 'నానఫడనవీసు'నకు నైన
తన రక్షకుని చెఱఁ దప్పింప నిజశక్తి ధారవోసిన 'యుగంధరు'నకైన

స్వామి కైంకర్యక నిత్యావాసమయములను-గలుష మేమైనఁ గలిగినఁ గలుగవచ్చుఁ
గాని యట్టిది యొకయింత గానఁబడదు-శ్లాఘ్యతమమైన యీయమ చరితమందు.

ఉ. ఆనవలాశిరోమణి గుణాళి నెఱింగనవార లౌట భూ
జానియు వానికాంతయుఁ బ్రశాంతియుతాత్మకు లాపె నెప్డు స
న్మానముఁ జేయుచుందురు కుమారికవోలె ననూనరాగసం
ధానవిధాన తత్పరతఁ దత్సతి భాగ్యవిశేష మెట్టిదో?

తే. అమ్మహీనాథు సుతుని క్షేమాదికముల-నరయుచు నిజాత్మజునికన్న నధికమైన
ప్రేమఁ బెంచుట వారల బిడ్డ నాపె-పోషణమునందె యుంచిర శేషగరిమ.

క. ఈరీతిఁ గొంతకాలము-పారముదాశలనఁ గడచెఁ, బదపడి యాధా
త్రీరమణుఁడు ముదిమిఁ గనె-శారీరపటుత్వ మెల్ల సన్నగిలంగన్.

చ. ముదుసలియాటచేతఁ దన ముందటిశక్తి తొలంగె; నెప్పు డా
పదలనె శంకఁ జేయుట స్వభావముగాఁ దనరారెఁ; బ్రేమపెం
పొదవఁగఁ బెంచినట్టి సుతు నోమెడివా రెవరంచుఁ దాఁ బదిం
బదిగఁ దలంపసాఁగె నరపాలకశేఖరుఁ డాత్మలోపలన్.

గీ. వత్సరముపైన వేఱొక్క-వత్సరంబు-పైఁబడుకొలంది నమ్మహీపాలు జవము
బలమును దినక్రమమ్మునఁ దొలఁగుచుండె-దివ్వెయందలి తైలంబు దీయునటుల.

చ. చనచన నా నృపాలకులసాగరచంద్రుఁడు కొన్నినాళ్లకున్
దనువుఁ దొఱంగి దివ్యసురధామముఁ జేరె జనాళు లెల్ల ర
య్యనఘుని చావుకై పటుతరార్తిని గుందఁగ, నెంతవారికిన్
దనువు లశాశ్వతమ్ములు గదా యనుసూక్తి నెఱింగి రెల్లరున్.

చ. అటు ధరణీధవుండు మృతి నందఁగ నాతని యర్ధభాగ ము
త్కటమగు చింతతోడఁ గనుఁదమ్ముల జాలున వేఁడి బాష్పముల్
జొటజొట రాల్చి, మూర్ఛ గని, సొక్కి, యెట్టులో సేదదేఱి, పి
మ్మట దరిఁ జేరి యేడ్చెడికుమారకు నక్కునఁ జేర్చి గ్రుచ్చుచున్.

తే. "మద్విభుని సహితముగ నే మహిఁ దొఱంగు-తఱి సమీపించె నిప్డుఁ డీచిఱుతవాని
నెవ్వ రోమఁగలారలో యెఱుఁగ"ననుచుఁ-జెంతనే యున్న 'పన్నా'ను జేఱి పలుక.

చ. పొరలెడి దుఃఖసాగరముఁ బుక్కిటఁ బట్టుచు 'పన్న' బాలునిన్
గరముల నంది ప్రేమమెయిఁ గౌఁగిటఁ గ్రుచ్చుచుఁ బల్కె నిట్టు లా

ధరణిపురాంతతో "జనని! తావకసంతతివంటిదాన నా
కొఱఁగియు నన్ను నీసుతు సుఖేచ్ఛనుగూర్చి తలంక నేటికిన్.

చ. "నను బిననాఁటనుండి కరుణాభర మొప్పఁగఁ బెంచి పెద్దదా
ని నగునటుల్ పొనర్చిన వినిర్మలభావపరంపరాభితో
భినవగు నీదురంతపరివేదనఁ గాంచియు నక్కటక్కటా
తనువును బాయలేనయితి దైవకృతంబునఁ జేసి తల్లిరో!

చ. "ఇంతకుఁ గర్మసూత్రబల మీవిధి నుండఁగ నెవ్వ రేమి గా
వింతురు? చిట్టిబాబునకు వేడుకలైనను దీరనీక వి
శ్రాంతిని గూర్చె నైహికవిచారములన్ దమకున్ విధాత తా
నెంతటి నిష్ఠురాత్మకుఁడొ? యెంత వివేకవిహీనుఁడో కదా!!

తే. "పసినిసువితండు పెద్దయై ప్రాజ్యరాజ్య-భార మూని ప్రజాపరిపాలనంబు
సేయుటను గాంచి సమ్మోదతోయనిధిని-మునిఁగి యాడుటకై నోచుకొనరు మీరు.

క. "కాన దురంతపుదుఃఖము-బూనంగావలసె మనకుఁ; బుత్త్రునిసౌఖ్య
శ్రీనియతి కెంతమాత్రం-బేనియు లోపంబు గలుగనిత్తుమె తల్లీ!

చ. "తలఁకకు మింక నీమదిని దావకపుత్త్రుని రక్షణార్థము
త్పలనయనా! వచించెద యథార్థ మొకం డిదె, వీనిసౌఖ్యసం
కలనము కేకొ అంతయును గల్గఁగనీయను బ్రాణ ముండఁగా
బలి యొనరింతు నాసుతుని ప్రాణము లేనియు; విశ్వసింపుమా.


క. "కావునఁ జింతాదంతుర-భావము విడనాడి నీదుపతితో స్వర్గ
శ్రీవిభవ మంద నింకన్-బావన సహగమన మొనరుపఁగఁ జను"మనుచున్.

తే. ప్రియకుమారకు నొకపరిఁ బ్రీతిమెయిని-గౌఁగిటన్ గ్రుచ్చి, కందోయిఁ గారు నీట
జిలక మాడించి 'పన్న' చేతుల కొసంగి-చనియె సహగమనంబును సలుప నామె.


(సశేషము)

ప్రాచీనభారతీయలోహపరిశ్రమలు

బొంబాయిరాజధానియందలి రాగి, ఇత్తడి సామానులు—౧౯ శతాబ్దపు టుత్తరార్థము



3. ఘటపాత్రపై చిత్రములను



౪. దేశీయమగు తకిమెనయంత్రము



కొత్తపల్లి సూర్యరావు గారు

పదునాలవ యంకురము

ఆఁడుదానికి - అందునను నిర్గంధకుసుమమునకు, సగము కాలము పైఁగా నవ్యదేశములలోఁ గడపినదానికి విశాఖపట్టనమండలములోఁ బ్రస్తుతము తక్కినజిల్లాలలో వలె విద్యావ్యాపనము తక్కువ యని తెలియుచున్నది. ఒక్క వృత్తాంతపత్రిక లేదు. ఒక్కవిద్యాసభ లేదు. సమాజములని కొన్ని యున్నవి. అవియన్నియు సంస్కరణాభిలాషులు స్థాపించినవి. పాశ్చాత్యవిద్యాధికులు,గనిసులు విహరించువిహారస్థానములుగాని సరస్వతీవిహారస్థానములుగావు. ఇంటిలోఁగూర్చుండు నీ కేమి తెలియునందురేమో. పదిమందిలోఁ దిరుగుమావారు కొంచెమైన తెలుఁగరా! ప్రసంగవశమునఁ జెప్పుచుండువారు. ఆయనకేమంత యేమి తెలియునందురా,నమస్కారము! పూర్వము కొందఱు కవులుండిరి. జగద్విఖ్యాత పండితు లున్నారుగాని వారా సంస్కరణములజోలి తలపెట్టరు. స్త్రీలలో సంస్కరణాభిలాషిణులును దక్కువయేకాని యుద్యోగవశమున వచ్చి విదేశీయులభార్యల సహవాసమునఁ గొందఱు లేచుచున్నారు. పాప మిక్కడివారి కేగోలయుఁ గలియదు. లేవదీయువా రేమిచెప్పిన నదియే వీరిమార్గముగాని స్వతంత్రముగా నేమియుఁ బలుకలేరు. నిత్యానిత్యవిచారము,సత్యాసత్యనిర్ధారణము వీరియొద్ద లేదు. పురుషులైన నుద్యోగవిశారదులేకాని శారదావిశారదులు లేరనవచ్చును. ఒక్కరు చెప్పినారు,కొందఱు పత్రికాధిపతులు పురపాలకసంఘము మొదలగువారు బడులు పెట్టించి విద్యావ్యాపనము చేయుచున్నారుగదా యని పెక్కతావులవారికి వ్రాసినట్లే-మాపత్రికలను మీయధికారము క్రిందిపాఠశాలలకుఁ జెప్పించి మాకుఁ గొంత ప్రోత్సాహము కలిగింపుఁడనికోరఁగా మీపత్రికలభాష మాకక్కరముగాదని వ్రాసినారఁట-ఇంతకంటెఁ బ్రబల దృష్టాంత మేమి కావలయును? కవులుకొందఱున్నారుగాని వారిదియుఁ గ్రొత్తమార్గమే. కతిపదము లుండఁగూడదు, నియమ ముండఁగూడదు. తోఁచినట్లు వ్రాయుటయే వారిదారి. ఇట్టిమగవారుగల తావుల స్త్రీలభాషాభివృద్ధి యడుగవలయునా. ఏనారీమణిచేతఁజూచిన బ్రాహ్మవివాహము, ఏవనితహస్తమువను దురాచార సంస్కరణోపన్యాసము - ఏ నాతియొద్దను గాంచినను, పునర్వివాహమండనము - ఇవి భాషావిషయములోఁ బద్దుపడునా!

ఇతరస్థలమునుండివచ్చిన యొక్కయుద్యోగియిల్లాలుమాత్ర మిక్కడఁ గొంతకవిత్వవిలసనము కలిగించుచున్నది. అనుభవము లేనివారు కావునఁ బలువురు పురుషులే-నీకంటము నీకంటమే, చేపకంటము చేపకంటమే- ఆఁడుదానికవిత్వము వినవక్కఱలేదు. ఎవ్వరిచేతనో చేయించుకొని వచ్చినది. ఇందు పేనమామ పోలికలున్నవిగాని స్త్రీకవిత్వమునూఁకు పలుమగాడని వదంతులు కలిగించిరి. కొంతకాలముక్రిందట నిక్లే యొక్క గొప్పవాఁడు తానురచించినగ్రంథము నచ్చువేయించినాఁడు- దానిఁగాంచి యితనికిఁ గవిత్వమురాదు. తనదగ్గఱనున్న యొక్కపిల్లవాఁడు రచించినది - తనపేరుపెట్టుకొన్నాఁ

డన్నారు. దగ్గఱనున్న పిల్లవాఁడు కవిత్వము చెప్పుచుం డఁగాఁ దగుమనుష్యుఁ డామాత్రము నేర్చికొనకుండునా! అని యెవ్వరును దలఁపలేదు. ఈమె కవిత్వము నేర్చిన మాట సత్యమే. మగలచే వ్రాయించికొనివచ్చి సభలోఁ జదువువారు-ఉందు రుందురు. నా యెడమచెవిత్రాడు తెగినది కట్టుకొనుదాఁక నిలువు మనవట్టివారు-కావునఁ బదిమందిలోఁ జదువ సాహసింపరు. మా తాత చెప్పువాఁ డు-పిఠాపురములో నొక్కయాశుకవి కామరాజుగారి యొద్దికి వచ్చి-నే నాశుకవినని "కమలహిత తేజ కవిరాజ కామరాజ" అని చదివినాఁడఁట- ప్రక్కఁగుర్చీమీఁదఁ గూర్చున్న పేరరాజు పంతులుగారిని జూపించి వీరిమీఁద నొకపద్యము చెప్పుఁడనఁ "గమలహిత తేజ కవిరాజ పేరరాజ" యన్నాఁడఁట - కట్టకట్టి కవిత్వకంథ నెత్తి మీఁదఁ బెట్టుకొన్నవా రనుభవశాలులుగారు. సహజము గా హృదయమునఁ బుట్టవలయును. ఈకవయిత్రి యెంత నేర్చినదో-అంతేకాని యొక్క పుస్తకము చేతితోఁ దాఁ కదు. కంటితోఁ జూడదు - నోటితోఁ జదువదు - ఇంక భాషాభివృద్ధి యెట్లగును? విద్యాకృషి చాలించినది. కవిత్వముమీఁదఁ బడినది. చూచినదానిమీఁద నెల్లఁ బద్య ము-ఒక్కసభలోఁ గట్టకడపటఁ జదివినపద్యములు పత్రి కలోఁ బడినవి. సభ చాలించునప్పు డొక్కరు లేవ వద్దు, కూరుచుండుఁడు. రాజహంసమ్మగారు పద్యములు చదివెదరని యఱచినారఁట - అలబలముతో లేవఁబోవు సభఁ గొందఱు లేచినవారు లేచినట్లే నిలిచిరి. లేవఁ బోవువారు కొంద ఱర్ధముక్తాసనత నుండిరి. కూర్చుండిన వారు కూర్చుండినట్లే యుండిరి. రాజహంసమ్మగారు గొడుగువంకి యెడమచేతికిఁ దగిలించుకొని- నడుమనుండి తప్పుకొనివచ్చుటలో నొక్కటి రెండు కుర్చీలకాళ్లు తగిలి పడఁబోయినపిమ్మట కంటిసులోచనములు తీసి వైచి చేతఁబట్టుకొని తిన్నఁగాఁ బీఠముకడకు వచ్చి చది విరి. ఆపద్యము లివి:—

సీ. దీపము ల్వెట్టిరి దిక్కులఁ జీఁకట్లు
పడియెను వచ్చిరి పౌరులెల్లఁ
గుర్చీలు వేసిరి కూర్చుండి రందఱు
ముందుగా సంగీతమును బిదపను
సంస్కృతశ్లోకము చదివిరి శాస్త్రులు
చప్పట్లుగొట్టిరి సభికులంత
ఎక్కిరి పీఠంబు నెచ్చుకంఠముతోడ
నిచ్చి రుపన్యాస మెవరొకాని
క్రొత్తదానవగుటఁ బ్రొద్దున నే పద్య
మల్లియుంట వీరియాఖ్య నాకుఁ
దెలియ లేదు మొదటఁ; దెలిసె నిప్పుడు గాని
పద్యమందుఁ గూర్ప వల్లఁ గాదు.

అని చదువఁగనే బలేబలే చక్కఁగా నున్నది. స్వభా వోక్తి కిది యుదాహరణము- అని యధ్యక్షుని కరతాళ ములు- తక్కినవా రెవ్వరును ముందుపద్యము వినవలెనని కాఁబోలు— తెలియకపోవుటచేతనో— మిన్నకుండిరి. నే నొక్కఁడనేనా నాతో నెవ్వరును జప్పట్లు గొట్ట లేదని యధ్యక్షుఁడు సిగ్గుపడుచుండ-రెండవపద్యము—

గీ. జ్యోతిషంబు రాదు సూచన చెప్పెద
నింక మీరు లేచి యింటి కేఁగి
భోజనంబు చేయఁబోయెద రిఁక మిమ్ము
నిలిపి కష్టపెట్ట నేరనయ్య!

ఈపద్యము విని వహ్వా-ఇట్టి యూహగలపద్య మే మగవారును జెప్పలేరు. క్రొత్తకల్పన-అని చప్పట్లుగొ ట్టిరి. తర్వాత నొక్కపెద్దవారు లేచి సభవారిపక్షమున నధ్యక్షుని శాంతమునకుఁ బొగడి రాజహంసమ్మగారివంకఁ దిరిగి స్త్రీలలో మనరాజహంసమ్మ- అక్కగారు-అన్నా రు: ఎల్లవారు-కాదుకాదు, మీరు పెద్దలు-దీవింపవలెను- అని. మన రాజహంసమ్మ - చెల్లెలు! ఏమి బాగుగానున్న దా!-మనకుఁ జెవులుపండువుగాఁ బద్యములు చదివినది. మనలో స్త్రీలు చాలమంది పదిమందిలోనికి వచ్చుటకే బెదరెదరు-ఇంకఁ బద్యము లెట్లు చదివెదరు! పద్యములు చదువుటకు శక్తిగలవారే లేరు. కవిత్వము చెప్పుట యెక్కడి మాట-కాఁబట్టి యీమె యీపట్టణములో నున్నదినము లలో-మనమనభార్యలైన సోదరీమణులను-ఈమె చేతి క్రిందఁ గొన్నినాళ్లు చదువు వృద్ధిచేసికొనుటకై యత్నిం చునట్లు మనము చూడవలయును. మన మేలుకొనకు-ఈ [illegible] జాలనాళ్లు మనయూరులోనే యు ద్యోగములో నుండునట్లు భగవంతునిఁ బ్రార్థింతము—

కాదుకాదు-అధికారులకు వ్రాసి వేసుకొందము అనిము
గించిరి.

ఈపద్యములు ముద్రింపఁబడిన బొంబాయి తెమఁగు పత్రికపట్టుకొని రాజహంసమ్మవదినెగారు పట్టనములో నాల్గునాళ్లు-ఎక్కుగుమ్మము దిగుగుమ్మము. గ్రహచారవశమున మాయిల్లు వారియింటికి సమీపము-అనుదినము మాయింటికి వచ్చి అన్నగారు! ఈపద్యములలోఁ దప్పులున్నవా! అబ్బే! తప్పులెక్కడ! తీఁగతీసినట్లున్నవి. ఆహా! అమృతత్వము! చక్కఁగా నున్నవి. అని మావారు చెప్పినపిమ్మట-ఈభాగ్యమునకు నేను మా మేనమామ వ్రాసిపెట్టినపద్యములు తెచ్చి చదివితినని లోకులు-ఇదిఏమి సంస్కృతమా! సంగీతమా! స్త్రీకంఠమని పురుషకంఠమని నవ్వుచున్నారు. అని యామె చెప్పెను. అక్కగారు! బహుచక్కఁగా నున్నవి. మీకేమి చేతఁగాదా! మీయింటినిండఁ బుస్తకములే! మీయింటిలోని పుస్తకములు చూచినారు మీకుఁ గవిత్వము రాదనుకొనిన మన కేమి? భావ...కిగోడవరేమియు నక్కఱలేదు. ఆయనమాత్రము-తానే రచించి సభలోఁ జదివించినాఁడనని చెప్పుదాఁక మన కొక్క చేసుకొన్నను లోపమేమి? లోకముచూచి యోర్వలేదు. ప్రతివిషయమునకు లోకము వెనుకప్రక్కను గుంటిమాటలాడుచుండును. అని సమాధానపఱచిరి. ఈ కవయిత్రి విక్టోరియా రాణిగారిమీఁదఁ జెప్పినపద్యములు కొన్ని స్వభావోక్తిమాధకములు-పద్యములన్నియు జ్ఞప్తి యందు లేవు. సీసములోఁ గొంతకడపట "...టికా ఉకుడబ్బాలు తీసిమీఁద, బాలుపంపించుచున్నావు బాలురకును, దెంచుచున్నావు బిడ్డలఁ దెంచినట్లు, లండనపురంబునందుండు రాజ్యలక్ష్మి, వినుత యొడ్వర్డుతల్లి సాధ్వితల్లి" ఈపద్యములు ముద్రితములైనట్లు తెలియదు.

మావారు నన్ను నీవుకూడఁ గవిత్వము మొదలు పెట్టుము. మీ మేనమామ కవీశ్వరుఁడుగదా! పోలికలు రావా యన్నారు.

మా మేనమామలు గోదావరిలో నున్నారు. ఆయనయే బ్రతికియుండిన నీవెట్టివారిట్లు లేతురా? నాకుఁ గంచుకాఁగడాలు పెట్టి వెదకిన నక్షరముముక్క లేకుండఁ బోవునా-మీరుసరి, యేదిక్కులు లేనివా రంటిని.

వారు—నా కంఠమునకు లేదుగాని యిక్కడకు వచ్చినప్పటినుండి యీవెఱ్ఱికొంత పుట్టుచున్నది.

నేను—ఆఁడువారినిఁజూచి కవిత్వము చెప్పఁదొడఁగుట-మంచివెఱ్ఱియే-మీకు మగవారిసావాసమేది.

వారు—లేకేమి, డ్రయివరు, గార్డు, బొగ్గులవాఁడు-ఎంతమంది నిత్యము నాతో రైలుతో రైలెడు జనులు.

నేను—బాగుగాఁ జెప్పినారు. ఎవ్వరిప్రపంచము వారిది-మీరు రైలుకవిత్వము చెప్పుఁడు. ఆకు కవిత్వమునకుబుసులుగా—

•

ఇట్లేదోవిధముగా విశాఖపట్టణములోఁ బ్రొద్దులు పుచ్చుచున్నారము. కుఱ్ఱవానికిఁ జదువుకొనుటకు మేమింటిలోఁ బలకలు బలపములు పెట్టుకొని బరులు, గుణింతము, పేరులు - మాచదువు తిరుగఁ దోడవలసిన యవసరము వచ్చినది. వానితోపాటు బాలశిక్ష, సుమతి శతకము, నీతిమంజరి వల్లించినారము. మావాఁడు బడినుండి యింటికి వచ్చి, యయ్యవారు చెప్పిన పాఠములలోని సారము మాకుఁ జెప్పుచుండువాఁడు. అయ్యవారితనము చేయుటకుఁ బంతుళ్లను దిద్దు పాఠశాల యొకటి యక్కడఁ గలదు. పిల్లవాండ్రను గంతులు వేయించుటకు, మట్టిపిడకలు చేయించుటకు, త్రాళ్లు పేనుటకు నేర్పుగల వారేకాని యాపాఠశాలలో శిక్షింపఁబడిన యయ్యవారి కొక్కనికి పదము- ఇది తెనుఁగా, సంస్కృతమా తెలియదు. అర్థము తెలియదు. వ్యాకరణజ్ఞానము: పుంలింగ స్త్రీలింగము లెఱుఁగరు. బాలురకు నేర్పునది యేమి- పల్లబల్లమీఁది దానిని వ్రాసికొమ్మని- రెండు డెలుకలను వ్రాసికొనిరమ్మని - ఒకరివెనుక నొక్కరు నడువుఁడని-నిలువుఁడని కూర్చుండుఁడని మాత్రము-ఒక్కనాఁడు ఘనపదార్థము ద్రవపదార్థము నని చెప్పి- నీవింటినుండి వచ్చునపుడు రెండు ఘనపదార్థముల పేళ్లు, రెండు ద్రవపదార్థముల పేళ్లు వ్రాసికొనిరమ్మని యయ్యవారు మాశాస్త్రికిఁ జెప్పినారట-ఇంటికి వచ్చినాఁడు. నాన్నా! నీళ్లు ద్రవపదార్థము, మజ్జిగ ద్రవపదార్థము, బెల్లము, తిరుగలియిని ఘనపదార్థములు గావా యని యడిగినాఁడు. ఓసి! బెల్లము నోటిలోఁ బడవైచుకొనిన ద్రవమగును గావున

ద్రవపదార్థము రాయని తండ్రి నవ్విరి. నాన్నా! అట్లయిన మఱి శైలు ద్రవపదార్థమా ఘనపదార్థమా-ద్రవపదార్థము వలెఁ నేలను బ్రాఁకును. ఘనపదార్థమువలెఁ గదలకుండ గట్టిగా నుండునని-యడిగినాఁడు. మే మిద్దఱమును గడుపుబ్బ చెక్కలగునట్లు నవ్వుకొన్నారము. ఇన్ని సంవత్సరములు వచ్చినవిగాని యింతగట్టిగా నెన్నఁడును నవ్వలేదు. కుఱ్ఱవాండ్ర యజ్ఞానపుమాటలలో నానందము పట్టఁజాలకుండఁ బుట్టుచుండును. వాస్తవముగా సంతానము నరులకున్న భాగ్యములలోఁ గొలఁకటిది. మా పిల్ల-అమ్మా! యెందుకే నవ్వినారు! అని యడిగినది. దాని కేమనిచెప్పి యర్థమగునట్లు బోధింపఁగలను? బాలుర ప్రశ్నలకుఁ బెద్దవారు కొన్నింటికిఁ బ్రత్యుత్తరము చెప్పఁజాలరు. మావానితో మేము పాఠములు, నర్థములు, పద్యములు నేర్పుకొంటిమి. రాత్రులలోఁ దండ్రి యూరిలో నున్నపుడు తండ్రి- లేనియపుడు నేను- చదివించుచుండువారము. ఒకనాఁడు-నన్ను-అమ్మా! "తిలకింపఁగ భూమిలోనఁ దిరముగ సుమతీ" అనఁగా నర్థ మేమని ప్రశ్నించినాఁడు. వానికర్థము మనస్సునకుఁ బట్టునట్లు చెప్పలేకపోయితిని. పుస్తకములో నున్న యర్థము-తిలకింపఁగన్=చూడఁగా; భూమిలోనన్=ఈ లోకములో; తిరముగన్=నిశ్చయముగ; సుమతీ! పదార్థమునుబట్టి భావము వాని కెట్లు తెల్పిన బోధపడును! క్రమక్రమముగా ననుభవమునుబట్టి భావమగును - ఏదో చెప్పి సమాధానము చేసితిమపుఁడు. ఈ ప్రసంగము మా పొరుగునమున్న యొక్కరితోఁ జేసితిమి. అయ్యా! ఆమహాత్ముఁడు మాపై నెగిరిపడినాఁడు. "మూర్ఖులు చేయుపని యిది, బొడ్డూడని కుఱ్ఱవానినోటఁ బద్యములా! నోరుతిరుగునా! అర్థమగునా! మొదటినుండి మా మనలోనున్న దురభ్యాసమే యిది. చక్కఁగాఁ దెనుఁగు మాటలు చెప్పి—అదిగో నదియే చిక్కు. మాటచెప్పి వాఁడు వ్రాసిన ట్లూరకుండక, నడచి యనుదానిని నడిచి యని, నిలచి యనుదానిని నిలిచి, యని యరగను అనుదానిని ఎఱుఁగను అనిదిద్ది వానిబుద్ధి మార్చివైచుచు మొద్దును జేయుచున్నారు. వాని నోటికివచ్చిన ట్లెల్ల మాటలాడ నీయవలయును. చేతికివచ్చిన ట్లెల్ల వ్రాయనీయవలయును. ఇదితప్పు-అదియొప్పని దిద్ది వానికిఁ జెప్పఁగూడదు. అర్థము చెప్ప నక్కఱలేకుండఁ జదువుకొనఁదగిన పుస్తకములెన్నో యున్నవని కాశీయాత్రచరిత్రము మొదలైన కొన్ని పేరులు చెప్పినారు. మీపిల్లలను మీచేతులతోఁ బాడుచేసికొనుచున్నారని, తర్వాత మీరు విచారించెదరని కారాలు మిరియాలు నూఱినారు. చూచినా[...] యీజిల్లాలోని విద్యావిశేషములని మావారు నాతోఁ బలికిరి. మావెఱ్ఱిమేము మానలేదు.

మూఁడేండ్లక్కడ నున్నారము. సముద్రప్రాంతమగుటచే నాకారోగ్యముగా లేదు. ఒక రుజ యంకురించినది. తీవ్రముకాదు; నెల కొక్కసారి కాళ్లు మెఱుఁగు చూపుట-ఏనుఁగుకాలో, బోదకాలో-యగునని మెట్టో యని నేనేన్న. మందుకొనలేక, మందులకొఱకుఁ దిరుగలేక వారు-సంరక్షణ జరుగక పిల్లలిద్దఱును - దైవమా యిన్నిదినములు మఱచిపోయిన ట్లింకను గొన్నినాళ్లు మఱచిపోరాదా యని యపుడు దైవప్రార్థన - విధిని దుడిచి వైచికొనఁగలమా. శేషాద్రిశాస్త్రులుగారని గొప్పవైద్యు లుండువారట - వారిశిష్యుఁడని యొకనిం బిలిచి చూపించినారు. అనుపానములు మ్రింగలేక నేను, నూఱి, కాఁచి, వడియఁగట్టి యీయలేక వారు-విసుగుకొనుట - మాయమ్మను రప్పించినారము. మాయత్తగారు కొన్నినాళ్లున్నారు. ఎవ్వరు వచ్చినను నాకు స్వాస్థ్యము కుదురలేదు. కొన్నినాళ్లుండి వారిద్దఱును వెళ్లినారు. తర్వాత మాచిన్నమ్మమ్మను రప్పించి యింటిలోఁ బెట్టుకొన్నారము. ఆమెకుఁ గడుపునొప్పి రోగము-మూఁడుమూఁకుపూఁటలకుఁ గడుపులో శూల. సోడాగుండ నీళ్లలోఁ గలిపికొని త్రాగుట; గట్టునఁ ద్రేఁచుట-మా రోగముల కా పెరోగము జత-శివశివ! మావారికి మతిస్థిమితము లేక నాల్గునెలలు సెలవుపెట్టినారు. మా పుట్టినింటఁ గొన్నినాళ్లు-మా యత్తింటఁ గొన్నినాళ్లునుండి యాచుట్టుప్రక్కల వైద్యులచే నౌషధము పుచ్చుకొంటిని-ఏమైనఁ బయిశాంతికే యైనదిగాని మూలముట్టుగఁ బోఁగొట్టు వైద్యు లగపడలేదు. ఒక్క స్త్రీ తరితివైద్యుఁడు ధ్వనినిబట్టి మందులిచ్చెదనని, మొగము వైఖరిం జూచి యిచ్చెదనని వచ్చినాఁడు. నాకుఁ గోపము వచ్చినది. మందీయకుండఁ గుదిర్చెదవాయని యడుగఁదలఁచితిని. నారోగము లైలుపాగ పడక, లైలుహాత నిద్రాభంగము

చేసి వచ్చినదని చెప్పినాఁడు. చప్పిడిపథ్యము చేసినఁ గుదిర్చెదను మంచియౌషధ మిచ్చెదనని చెప్పినాఁడు. రైళ్ల నిద్రాభంగము చేయుటయేమి, ఉప్పు లేని చప్పిడియేమి– నాయనా నాకు మందులవలదు; ప్రాణములవలదంటిని. దేహము కృశింపదు, బలహీనమెక్కువ; నడువఁజాలను, తిండి తగ్గినది. అరుచి, ఒక్కొకప్పుడు వమనము. ఇదియే వారికిని దొరుకఁబడలేదు; చివరకు గుంటూరు తీసికొనివెళ్లవలయును: అక్కడ వేపచెట్లగాలి మంచిది; గుంటూరునీళ్లు మంచివి; అక్కడ దొరసాని ఆసుపత్రి పెట్టినది. మంచిసాధకురాలు– ఇది గాపన్న పది– అని మావారికి నెవ్వరో స్నేహితులు చెప్పినారఁట. చిన్నమ్మమ్మను దీసికొని గుంటూరు వెళ్లితిమి. ఆయనయూహ యిది దౌహృదలక్షణమని–గ్రహచారము, చెప్పుకొన్న నీర్గు–వమనము, నరుచి, బలముగా నుండియు నలుసట, స్వల్పాహారము. చూచినవారెల్ల నట్లేయని తలంచిరి. వారియూహకుఁ దగినట్లుగా నైదు నెలలు నేను బాధ పడితిని.

గుంటూరులో నప్పటికి స్నేహితులేకాని యిప్పటివలె బంధువులు లేరు. బంధువులను మించిన మిత్రకోటి కలదనిన నతిశయోక్తి కాదు. రైలుసమీపమునఁ బేటలో సత్రములో బసచేసితిమి. అక్కడివారందరును, మీరూరకే నీరుగాలి కుదుర్చునని యుండక వైద్యముకూడఁ జేయింపుఁడు, దొరసానికిఁ జూపుమన్నారు. ఒక్కనాఁడు తీసికొనివెళ్లి చూపించినారు. ఆహా! ఆమె యాదరణము! అక్కడ నున్నవారి వాత్సల్యము! ఆసుపత్రిభవనము! వారు చేయు చికిత్స యక్కఱలేకయే రోగములు పటాపంచలగునట్లు గనఁబడియెను. నారోగ మిక్కడఁ దప్పక కుదురునని నేను తలఁచుకొంటిని. ఇక్కడఁ గుదురకున్న నెక్కడను గుదురదని సంతోషపడితిని. పరీక్షించి దొరసాని నన్నాసుపత్రిలోనే యుంచుమని చెప్పినది. అన్నము రెండుపూటలఁ బట్టుకొనివచ్చి పెట్టుచున్నది. మానినది మంచు– అట్లే చేయుటకు సమ్మతించినారు. కొన్నినాళ్లయిన పిమ్మట శస్త్రము చేయవలయు నన్నది.

నా కజీర్ణరోగము ముందా, శస్త్రముచేయవలసిన దాని కారణము ముందా యని యాలోచన. అజీర్ణమునకు హేతువు లేదు; నిత్యశనివారములు, నిత్యాదివారములు, శోకములేని సోమవారము, మూఁడువాళ్లఁ బ్రతివారములో నొంటిపూఁట భోజనము. రాత్రియైనను రొట్టెలు పిట్టులు నే నెఱుఁగను. ఈపోష్య ముండఁగూడదని కంఠశుద్ధి – డొక్కశుద్ధి – ఒక్కపండు, కొంచెము నీరు, అంతియకాని యందఱు ననుకొనురీతి గఱువఁ ద్రేఁచునట్టు నప్పుపిండిఫలహారము నే నెన్నఁడును జేయను. నాబుద్ధికిబట్టి యజీర్ణమునకుఁ గారణము తెలియదుగాని యొంటిపూఁటఁ దిని యొకపూఁట దినకుండుట చేతనే కలుగునేమో యజీర్ణము. దొరసాని చెప్పువఱకు మావారికి నాదిరోగము కాదనియే.

పాపము మాచిన్నమ్మమ్మ కడుపునొప్పితోనే గుంటూరులోఁ జైత్రవైశాఖములు రెండునెలలు మాతో బాధపడినది. గుంటూరు మనప్రాంతములకు నీలగిరియని చెప్పవచ్చును. కృష్ణానది నాశ్రయించియుండిన కతమునఁ బర్వతములలో నిమిడియున్నను వసంతర్తువులో గుంటూరును మించలేక కొంత బెజవాడ పరితాపపడుచుండును. నాయనలార! మాకు గుంటూరులో బహుసౌఖ్యముగా నడచినవి రెండునెలలు–కొళాయి లున్నవిగాని యవి దినములో రెండుమూఁడుగంటలకంటె నీరుండుకాల మెన్నఁడును లేదు. ఏవీథివారు తమ కిష్టులో వారికిమాత్ర మవి రెండుమూఁడుబిందెల నీళ్లుపోయును. మఱియొకరిద్దఱు వచ్చిరా; రొండచే నోరెండి తానే నాపలనఁగాదని కేమునిపనింకఁ బ్రజలగతి యేమి? బావు లున్నవి. ఎండిపోయిన కాలములలోఁ ద్రవ్వఁబడిన యూటనూతు లున్నవి. ఆబావులలో నాబోటిది బాల్చి పడవేయ లేదు, వేసి పట్టిదే లాగలేదు. ఉత్తరదేశములో నున్నపుడు దళసరి డొంగాలు, బాల్చీలు; ఇక్కడ బొక్కెనలు. బాల్చీ గుంటూరులో రూపాయి, త్రాడు రెండురూపాయిలు. బిందెఁడునీరు గిలకమీఁదఁ దోడి బిందె యొకబుజమునఁ బెట్టుకొనిన బాల్చీ, త్రాడును నావంటిది మోయలేదు. బిందెకంటె చెట్టింపుబరువు. బిందెమోయుట కొక్కటె, త్రాడుమోయుటకొక్కటె యుండవలయును. బాల్చీతోఁ దగవులుపడుచు నాలుగైదుసారులు నూఁతిగజములలోఁ దుమండి లాగలేక–పోష్యగాఁడు, విలుచుకొని తినుట కష్టమని గారె యొక్కమాటే తిన మొదలు పెట్టినాఁడు

నన్నట్లు బిందెకే త్రాడుగట్టి బావిలోఁ బడవైచి యొక్క-
సారియే లాగి నిరాయాసముగాఁ దీసి యొకవైపున బిందె,
రెండవవైపునఁ ద్రాడును బెట్టుకొనిపోవు సబలలు నున్నా
రు. దీనిం గాంచియే గుంటూ రారోగ్యమును జేయునందు
రేమో కాని యక్కడను రోగిణులు, రోగులు గావలసి
నంతమంది కనఁబడినారు.

నారోగము కుదిరి యింటికి ఆసుపత్రినుండి
వచ్చినపిమ్మట-అమ్మమ్మకు దొరసాని వైద్యము చేయింప
వలె ననుకొంటిమి. నాకు వలదే! దొరసానిని ముట్టుకొన
లేనే-దానిచేతినీళ్లు త్రావలేనే-నాకేమి, రోగము
సదేండ్లనున్నది-కుదరదు. దీర్ఘరోగము-కుదరకున్న నా
కొఱ కేడ్చువారెవరే! అని చెప్పుచుండెడిది. ప్రతిదినము
సత్రములోని బావినీళ్లతోడుట యెనిమిదిగంటలకన్నము
వండుట-తొమ్మిదిగంటలకాసుపత్రికిఁ దెచ్చి నాకు పెట్టు
ట-తిరిగివచ్చి స్నానముచేసి తానును, మనుమఁడును, పిల్ల
లును భోజనముచేయుట. యుదయమునఁ గలపని;సాయం
కాలమున సరిగా నాలుగుగంటలకంతయును వండి తెచ్చిపెట్టి
పోకున్న గేటు మూసివైచెదరని భయముచే శ్రద్ధగాఁ
గాలప్రకారము రెండునెలలు నాకొఱకు నియమపూర్వక
ముగాఁ బనిచేసి చెఱలో నున్నట్లు బాధపడినది.

పదునేడవ యంకురము

గుంటూరుప్రశంస యింకొక్కసారి చేయనిండు.
చైత్రవైశాఖమాసములలో నెండ చెప్పనలవిగాదు. తొ
మ్మిదిగంట లైనప్పటినుండి యుదయమునఁ దలుపులు
మూసికొని లోన వట్టివేళ్ల తడికలు గట్టించుకొని నీళ్లు
చల్లించుకొనుచుఁ గూర్చుండవలసినదే. సాయంకాల
మైదుగంట లైనపిమ్మట నేమో కొంత యెండవేఁడిమి
తగ్గును. బావిలోనుండి యొక్క గబ్బరుగొట్టమును నోటి
లోనికిఁ జొప్పించుకొని పీలుచుచుండవలసినదేకాని యీ
దాహమునకు మంచినీరు కావలయునని యొక్కరితోఁ
జెప్పుట, వారు తెచ్చుట-యింతవఱకుఁ బ్రాణములు నిలు
చునా యనుశంక నావంటిదానికి. అదియేమి గుంటూరో
తల్లీ! ఎండలలో నెండలు, వానలలో వానలు, చలియ
ప్పుడు చలి-అక్కడివారిలో సుకుమారు లన్నిపనులును
దొమ్మిదిగంటలలోనే సరుకుకొనవలసినదే-ఇప్పుడు తలఁచి
కొనిన జాలివేయును. అరండలుపేట వీథులలోను
కుంచము ప్రమాణగట్టిన మామిడికున్న లున్నవి. వానిని
జూచిన కన్నులే కన్నులు. అట్టివా యెండలో నెండిపో
యినవి. రెండునెలలుండి యాస్పత్రినుండి యింటికి వచ్చిన
తర్వాత చూచినాము. ఏ మెంచిచింతయో బ్రదికి
యున్నదిగాని సుకుమారములగు సహకారము లాతాప
ములో నిల్చునవా? రైలుస్టేషనున్నది బాబూ'అది మాలు
పేరుగల నరకము. ఎప్పుడు చూచినను మిరెపకాయల
యొగుమతి-కొట్టు. ప్రత్తి పొగాకుగాటు-ధనియముల
రాసులు-అంతవేసవిలో వర్తకులును, వారియొద్ది నేవకు
లును మిరెపకాయలను మధ్యాహ్నసమయమున నక్క
డనే తూచి బస్తాలలో వేసి-వేయునప్పుడు రోకళ్లతో
దంచి కాళ్లతోఁ గ్రుమ్మి - రైలులోఁ బడవేయుట-
చూచిన నీపనివాండ్రు దేవునిముద్దుబిడ్డలు కాఁబోలును
వారికొక్కటుమ్మకూడ రాదు; ఆకూస మైన లేదని
వారి యారోగ్యస్థితికొక్క నమస్కారముచేయ బుద్ధి
పొడమును. ఇంతకంటె నెక్కుడు చెప్పితినా కోపము
వచ్చును గుంటూరువారికి; కోపమురానే వచ్చినది. మా
పిఠాపురము స్టేషనులోని రొయ్యపొట్టు బస్తాలకంటెఁ
దీసిపోయినదా యీ మిరెపకాయల గుంటూరనన్నా
రొకరు పిఠాపురము మాదిగాదు. రాత్రిపూఁట యిండ్ల
లోఁ బండుకొనలేము - ఆడువాండ్రను నగలభయముచే
నిండ్లలోఁ బెట్టి తాళమువేసి తాము వీథులలో మంచము
వేసికొని యీవూలనుండి యావూలకుఁగల యిండ్లవారి
నొకరినొకరు పిల్చుకొనుచు విసనకఱ్ఱలు చేతఁబట్టుకొని
మగవారు విహారము. కొంచె మాప్రమాదులై యుండినఁ
బ్రక్కగుడ్డ యెత్తుకొనిపోవుదొంగలు. కాఁబట్టి వీథిరా
రండబఱుకు పంతులవెంబడిని తమయిండ్లకు ప్రహరికిరుగుట-
ఆయరండలు పేటలోనిభయముఁ దలఁచుకొన్న నాకు
గుండె లిప్పు డదరును.

అట్టితరుణములో పీరు కూరకని నారకని దూరము
నున్న యంగళ్లకుఁబోయి శ్రమపడిరి. నేనెంత లెండు,
ఉన్నన్నిదినములు నాసుపత్రిలోనే యున్నదానను.
మేడమీఁద నుండుటచేత నేనంత కష్టపడలేదు. మాముస
లమ్మ చెక్కవబాధ. మొట్టమొదటఁ దెచ్చిన సామగ్రి
తోనే, నాయనమ్మకు వారొక్క యర్ధణా సోడాపొడరు

తెచ్చి పెట్టినారు. ఆశూలనొప్పికి వేళపాళలు లేవు. ఇష్ట మువచ్చినపుడు వచ్చుటయే. వచ్చుచున్నపు డేపనియుఁ జేయలేక యింతగుండ గలిపి నోటిలోఁ బోసికొని మ్రింగి గోడనుఁజేరబడి నారాయణా నారాయణా యనుచు మూలుగుతో నాలుగైదునిమిషము లుండుట—సోడా త్రేన్పు రాఁగానే లేచి మెల్లఁగాఁ బనిపాటలకై బోవు చుండుట - ఇట్లు దినమునకు నాలుగైదుసారులు. గుం టూరు వచ్చినతర్వాత నీప్రకారము నాలుగైదునాళ్లు పోనిచ్చి రాత్రివేళ నొప్పివచ్చుట మానినది. ఇంకొక యర్ధణాకు గుండ తెచ్చినారు. కొన్నినాళ్లకు పగటిపూఁట రెండుసారులు మాత్రమే నొప్పివచ్చుచుండెను. పదేను దినములవాఁటికి దురా యిక్కట్టునలె-చిన్నమ్మమ్మకు మందు వైద్యము లేకుండఁగనే కడుపునొప్పి పోయినది. నాకొ క్కనెల యౌషధమిచ్చి తర్వాత శస్త్రము చేసినారు. నాలుగైదుదినములకుఁ గట్లు విప్పినారు. రానురాను బాధ తగ్గినది. ఇంటికిఁ బంపివైచిరి. ఇంకమీఁద జబ్బుండ దని దొరసాని చెప్పినది. మ మ్మొక్కదమ్మిడి యిమ్మని [illegible]లేదు. మాకీ రెండునెలలకు మున్నూఱురూపాయ లైనవి. సెలవుపుచ్చుకొనఁ బోవునపుడు మాత్రము మీ రాసుపత్రికేమైన ధర్మముచేసెదరా యనిమాత్రము నవ్వుచు—మమ్మందఱ నన్నితావులకుఁ దీసికొనివెళ్లి— ఔషధశాల, రోగులుండుభాగము, వంటయిండ్లు, బాలు రుండు తొట్టెలు, కాలుసేతులు ఖండింపఁబడిన స్త్రీలు గల మందవములు-ప్రసవమందిరములు, అందున్న పలువిత ముల గర్భిణీస్త్రీలను జూపించి, వీరు వీకీయూరి వా రా యూరివారని తెలుపుచు, మావారినిగూడ నాగర్భిణీ స్త్రీల నడిమికిఁ దీసికొనిపోయి, యింగ్లీషు కేమో చెప్పి, మమ్మందఱ నింకొక్కగదిలోనికిఁ దీసికొని వెళ్లినది. అక్కడ సీసాలలో నశ్మరీరోగము, మూత్రకృచ్ఛ్రములచే బాధపడినవారి పొత్తికడుపులు కోసితీసినరాళ్లు, పేరులు వ్రాసిపెట్టియున్నవి కనఁబఱిచినది. అహో యెంతటిపని చేయుచున్నారని పరమాశ్చర్యము నొందితిమి. మరల యథాస్థానమునకుఁ దీసికొనివచ్చి కూర్చుండుమని మాకుఁ గుర్చీలువైచి లోననుండి యొక వెండి పళ్లెరము తెచ్చి మాయెదుటఁ బట్టుకొని నిలిచినది. రెండు కమలాఫల ములు, నేఁబదిరూపాయలును ఒళ్లెములో వేసి మావారు దొరసానికి సలాముచేసిరి. మేమందఱమును సలాములమ్మా సలామంటిమి. ఆమెకూడ నిండుసలాములు, మీరింత యిచ్చెద రనుకొనలేదు. నాతలంపునకు మించినది యిచ్చి నారని సంతోషించి నాకొక్క తెలుఁగుబైబిలిచ్చినది. దానివెల యెనిమిది అణాలు. మావారి కొక్క యింగ్లీషుబైబిలిచ్చినది; యేమో మతమువిషయమై మాట లాడినది. నీవు మా యేసుక్రీస్తును నమ్మెదవా. నీ యభి ప్రాయ మేమని వారి నడిగినది. కార్యార్థులము. ఎవ్వరి మతము వారికి. మీరు చేయుచున్న పనులు శ్లాఘ్యములు. ఇతరమతస్థులలో నింత, యెదుటివారిం గాంచినఁ దమ వలెఁ జూచికొని యాదరించు ననసూయాస్వభావము లేదు. దివ్యమైనమతము మీది. మా మతములలోకంటె మీయొద్ద,మీమతములోనున్న విశేషము సర్వసమత్వము. మామతమునందును నింతకంటె నెక్కుడు విశేషమున్నది గాని, బహిరంగముగ నాచరించువారు కనఁబడరు. మా మతస్థులకంటె మీవా రల్పసంఖ్యాకులగుటనో యేమో మీరు చేసిన పనులన్నియు నెప్పటికప్పుడు స్పష్టముగాఁ దెలియవచ్చును. మాకృష్ణుఁడేమి, మీక్రీస్తేమి పేరులు భేదమేకాని, మాదేవుఁడని మీదేవుఁడని మాకు లేదు. మే మద్వైతులము. అందఱకు దేవుఁ డొక్కడే—మత భేదము, నామభేదము నని యామెకుఁ గలఁతపుట్టునట్లు గబగబ నాలుగుముక్కలు చెప్పినారు. "మంచిది బైబిలు చదువుఁడు, ఏసుక్రీస్తు దేవునికుమారుఁడు, ఇక్కడ మేము స్త్రీలకు బాలురకు, ఆసుపత్రి పెట్టితిమి, దేవుని కృపచేత రోగములు కుదురునట్లు చేయుచున్నా"మని "మఱచిపోకుఁడు" అని సలాముపెట్టి పళ్లెము పట్టుకొని లోనికిఁ జనినది.—గేటుదాఁకఁ బోయిన మమ్ముఁ బిలిచి 'నే నపుడపుడుత్తరములు వ్రాసెదను. ఆసుపత్రిరోజని సంవత్సరమున కొక్కనాఁడు వచ్చును, మీరేమైనఁ జందా పంపుచుండుఁ' డని కోరినది. మా పేరులు, విలాసము వ్రాసికొన్నది.

దొరసానికిఁ దెలిసినయెడలఁ జంపివేయును, అక్కడఁ బనిచేయువాండ్రందఱు నిర్ధనులు. తిండికొఱకై పనిచేయుచున్నారు. అందఱును బనిచేయుట తిండి కొఱకేకాని—వీరిది దుస్థితి. రాత్రియుఁ బగలు మంచ ములయొద్దనుండి సమస్తోపచారములుఁ జేయుదురు. ఎవ్వ

రుగా వచ్చి వెళ్లుచున్నారా యమ్మా! యని సలాము పెట్టి సాగనంపుదురు. వారి కొకరికిఁ దెలియకుండ నొకరికిఁ జేతి యొకరూపాయ యిచ్చితిమి. వారికిఁ దృణము మహోపేరువు. ద్వారపాలకుఁడు బసకు వచ్చెదను స్వామీ యన్నాఁడు. బసలో వాని కొక్కరూపాయ, సరి క్రొత్త కోటొక్కటి యిచ్చితిమి. ఒకనాఁ డూరు చూచుటకు నిల్చినారము. రెండవనాఁడు స్నేహితుల యింట నిర్బంధింపఁబడితిమి. మూఁడవనాఁడు బెజవాడ వచ్చి చిన్నమ్మమ్మ గంగా రనాచారమునకై కృష్ణలో స్నానముచేయించి - ఆసాయంకాలమే తాడేపల్లిగూడెములోనే రైలుదిగి ముందు మా యత్తవారింటికి వెళ్లినారము. పిల్లవాని కుపనయనము గావించితిమి. సెలవు దినములు కావచ్చుటచే నన్నక్కడ దిగవిడిచి, అమ్మా! జాగ్రత; నాన్నా, ఉత్తరములు వ్రాయుచుండుమని మమ్ము విడువలేక తచ్చాడుచు వెళ్లినారు. అత్తగారు నన్నొక్కపని చేయనీయలేదు. ఆ వృద్ధదశలోనే నన్నుఁ బదునైదుదినములు కాపాడినారు. భోజనముచేసి మధ్యాహ్నము చావడిలోఁ జాఁపవేసికొని మామగారు రేదో గ్రంథము చూచుకొనుచుండువారు. నేను, నన్నుఁ జూడ వచ్చు నిరుగుపొరుగువారు, వారికోడండ్రు—అత్తగారు —లోగుమ్మములోఁ గూర్చుండి లోకాభిరామాయణము. పిల్లలు తాతగారియొద్దఁ గూర్చుండి తాతా! రై లెప్పుడైనఁ జూచినావా? రైలుకూఁత వింటివా యని యడుగువారు—ఆయన! ఓసీ! రైలునకు గుఱ్ఱములను గట్టెదరా! యెద్దులను గట్టెదరా! నీళ్లు త్రాగునుగదా, గడ్డి యెప్పుడైనఁ దినునా? యని యడుగువారు.

మనుమఁడు—తాతా, రైలుకు గుఱ్ఱాలెందుకు, ఎద్దులెందుకు?

తాత—మఱి యెట్లు నడచునురా?

మనుమఁడు—నీళ్లుపోసి బొగ్గులువేసి మర త్రిప్పి వేసినఁ బరుగెత్తును.

మనుమరాలు—కాదురా! అన్నయ్యా! లోచన్ సింగు పచ్చజెండా చూపకుండా నడవదురా.

తాత—లోచనసింగే కాని నేను జెండా చూపిన నడువనఁటే—అమ్మా, నీవు చెప్పవే, బండి కెద్దులా గుఱ్ఱాలా కట్టెదరు.

మనుమరాలు—లేదు తాతయ్యా! గార్డు ఊఁదును, రైలు నడచును.

తాత—ఏమో నేను నమ్మను, లోచనసింగు వెనుకనుండి త్రోయునేమో—నేను జూచికాని నమ్మను.

మనుమరాలు—నన్నెత్తుకొని యొకనాఁడు జెండా ఆడించినాఁడు—కదలినది.

తాత—లోచన్‌సిం గవ్వరే! అమ్మాయీ!

ఈమాటకు సమాధానము, నేను, మామగారు వినవట్లు వచ్చినవారి కోడండ్రతో—లోచనసింగువి[illegible] [illegible]డ్డింటకుఁ బ్రేమ యెక్కువ. ఒక్కనిమిషమై[illegible] వానిని విడువరు. ఖరగ్‌పూరులో నున్నపుడు, రాత్రియుఁ బవలును వాఁడు మాయింటిలోనే యుండువాఁడు. నాకు జబ్బుచేసినపుడు నెలదినములు వానికి సెలవిప్పించి, విశాఖపట్టణము వానిని బిలిపించినారు అనియుఁ జెప్పి, దర్వాత నపుడపుడు జరిగినవిషయములు, మాకు నుఱుపు రాని ఆగరాపారా, బంగాళీబాబులు, ఆవుమాడలు, గ్రుడ్డిపిల్ల, కలకత్తావిశేషములు, వేణుగోపాలశెట్టికము వలెఁ బదిపది చిల్లరమాటల కొక్కసారి రామముగారు, మావారి నాదరించుట—మొదలైన పూర్వవృత్తాంతము, లాటరీవేయుట, గోపిగానిని దిట్టిపోయుట చెప్పుచుండు దానను.

[సశేషము]

ఏల మీరు కామినియాతైలమునుమాత్రమే వాడవలెను?

(రిజిస్టరు చేయబడినది)



ఎందుకనగా:

కామినియాతైలము వెంట్రుకలకు చాలలాభకరమైనది.

కామినియాతైలము వెంట్రుకలు ఊడిపోవుటను ఆపును.

కామినియాతైలము వెంట్రుకలు పొడవుగాను, దళము గాను కాంతిగాను పెరుగుటకు తోడ్పడును.

కామినియాతైలము సువాసనతైలము మాత్రమే కాదు. అయితే వెంట్రుకలు పెరుగుటకు కావలసిన ఓషధులు ఇందులో గలవు.

కామినియాతైలము పుర్రెకు చల్లదనమును గలిగించి మెదడకు విశ్రాంతి నిచ్చును.

చదువుడు, ఆలోచింపుడు, ఆర్డరును పంపుడు.

కలకత్తాలోనున్న ఫార్వర్డుపత్రిక తెలిపినది:—"ఆంగ్లో ఇండియన్ డ్రగ్ అండ్ కెమికల్ కంపెనీవారిచే ంపబడిన అత్తరులు, వాసనతైలములు విభజింపబడి, పరీక్ష చేయబడుటవలన అందులో హానికరమైన వస్తువులు లేదని రుజావుపరచబడినది. కామినీయా వాసనతైలమునందు మనోహరమైన అత్తరు చేర్చబడినది. మెదడుకు లువను గలిగించును."

సి. యం. ఆర్. కార్వెల్లో, ఎస్. ఏ. పర్జను, పెరా ద్వీపమునుండి వ్రాసినది:— "కామినియాతైలము క్కిలి మంచిదనియు, తృప్తికరమైనదని నిస్సందేహముగా కనుగొంటిని. ప్రత్యేకముగా చుండుకు, పుర్రెకు జ్వరలో గుణమును గలిగించును. ప్రస్తుతము వాడుచున్న నా రోగులకందరికిని దీనిని శిఫార్సుచేసితిని."

బుడ్డి 1 కి ధర రూ. 1—0—0	వి. పి. ఖర్చులు రూ. 0—6—0
బుడ్లు 3 కి ధర రూ. 2—10—0	,, ,, ,, 0—12—0

హెచ్చరిక:—ప్రతిపట్టణమునందును, గ్రామమునందును యున్న సుప్రసిద్ధమైన దుకాణములందు కామి యాతైలము విక్రయించబడుచున్నది. మీరు అనుకునట్టి దుకాణమునందు దొరకనిచో అతనిపేరును మాకు లుపుచూ, ఆర్డరును మాకు నేరుగా పంపుడు. కొందరు వర్తకులు ఎక్కువలాభమునకై ఆశపడి పేరులేని ర్తకునకుతులు గలవి, తక్కువరకములు "శ్రేష్ఠమైనదని" తెలుపుదురు. గనుక అట్టి తంత్రములను నమ్మి మోస కుడు. ఎల్లప్పుడును కామినియాతైలమునే పట్టుపట్టి తెప్పించి వాడుడు. ఇతరమైనవాటిని తెప్పించవద్దు.

ఆంగ్లో ఇండియన్ డ్రగ్ అండ్ కెమికల్ కంపెనీ,

285, జుమ్మామసీదు, బొంబాయి.

సోలమన్ చక్రవర్తి

నాళము కృష్ణారావు గారు

చారుతరకీర్తి సోలమన్ చక్రవర్తి
విక్రమంబున ధారుణీచక్రమెల్ల
పాలనము సేయుచుండఁగ వచ్చెవాని
సింహపీఠిక చెంతకు 'షీబ' రాణి.

వాని మహనీయ సురుచిరవర్తనంబు
వాని యనుపమ శేముషీ వైభవంబు
వాని రమణీయ మధురవాక్పాటవంబు
గాంచు వేడుకతో నరుదెంచె రాణి.

[illegible]కొలువున ఱేనిసన్నిధిని నిలిచె
పువ్వుగుత్తులఁ గేల్దోయిఁ బూని రాణి;
ప్రకృతి సుకుమార సౌందర్యభరిత మొకటి
రమ్యకృత్రిమ నవకళారచిత మొకటి.

'ఏది సహజంబొ, యిం దేది కృత్రిమంబొ
నుడువుఁడీ' యని ధరణీశు నడిగె రాణి;
పువ్వుగుత్తులవంక కీల్బొమ్మవోలె
తేఱిచూచుచు నృపుఁ డట్టె యూరకుండె.

సభ్యులెల్లరు తలలూఁచి సంభ్రమమున
ముక్కుపై వ్రేలి నిడికొని గ్రుక్కుమిక్కు
ననకయుండిరి; క్రమ్మఱ నడిగె రాణి
అధిపుహాసంబు పోఁడఁగని యాత్మ నలరి:
'ఏది సహజంబొ ఎయ్యది కృత్రిమంబొ
అరసి వేగమె దేవర యానతిండు
అఖిలశాస్త్రవిశారదు లైన మీకు
ఎఱుఁగరానట్టి మర్మముల్ ధరణిఁ గలవె?'
ఏమియును మాఱు పలుకక భూమివిభుఁడు
దేనికో వేచియున్నట్లు దెసలు చూచె;
వినఁబడియె నంత గద్దియ వెనుక నున్న
ద్వారమవతల భ్రమరఝుంకారరవము.

చిఱునగవు నెమ్మొగమ్మునఁ జెంగలింప
'తలుపు తెఱుఁ' డని మెల్లఁగఁ బలికె ఱేఁడు;
పెదవి దాఁటెనో లేదో భూవిభునిపలుకు
పరుగువాఱి కవాటమ్ము తెఱచె భటుఁడు.

ఝుమ్ముఝుమ్మని చంచరీకమ్ము లెగసి
రభసమున నాసభామందిరమ్ముఁ జొచ్చి
జాణ యగు రాణివామహస్తమున నున్న
కుసుమమంజరిచుట్టును ముసరికొనియె.

అదియె నిక్కంపుపూగుత్తి యనుచుఁ దోఁప
సార్వభౌముఁడు మందహాసమ్ము చేసె;
ప్రజల ముసిముసినగవులు గుజగుజలును
ఒక్కపెట్టునఁ గొలు వెల్లఁ బిక్కటిల్లె.

అచ్చెరువు తెచ్చుపాటును బిచ్చలింప
శిరము ముందుకుఁ గుంచి యాషీబరాణి
పుడమియేలికవ్రాలను మోకరిల్లి
వేయినోళుల వినుతించె విభునిప్రజ్ఞ.



పూడిపెద్ది వెంకటరమణయ్యా గారు

"మ. అతఁడా వాతపరంపరాపరిమళ వ్యాపారలీలన్ జనా
న్వితమిచ్చోటనిచేరఁబోయి కనియెన్ విద్యుల్లతావిగ్రహన్
శతపత్రేక్షణఁ జంచరీకచికురన్ జంద్రాస్యఁ జక్రస్తనిన్
నతనాభిన్ నవలా నొకానొకమరున్నారీశిరోరత్నమున్."

నిజంగా యీక్షణంలో ప్రవరుడు మహాఅదృష్టవంతుడంటాను. ఆగాలి పీల్చినవాడు సుఖంలో తేలి పైమరచిపోతాడుగానీ మరేమీనా వుందా? కాని ఇట్లీముండాకొడుకు ప్రవరుడలా అయ్యేడుకాడు! పిల్లాడు బహోమ్ములాగు జనాన్విత మిచ్చోటనిమాత్రం తెలుసుకున్నాడట! ఇలాటి ఆలోచన కప్పుడవకాశం యెలా కలిగిందో! స్వర్గద్వారం తెరుస్తూవుంటే ద్వారపాలకుల స్వభావనిర్ణయంచేస్తూ నిలబడ్డవాడొక్కప్రవరుడే కనబడ్డాడు! ఈమనుచరిత్ర చదువుతూవుంటే ఆహిమవన్నగప్రాంతం, అక్కడి ఉద్యానవనాలూ, వాటిలో అపూలమొక్కలూ, వాటిమధ్యను తిరిగే అవరూధినీ, ఇవన్నీ తలుచుకుంటే నాకు సీమలోని ఆకెవకటిరోజులు జ్ఞాపకంవస్తున్నాయి! హాంప్షైరులోని బంగళా ముందుతోట క్లారాతోకూడా నాకళ్లకు కనుతూంది! నాకాళ్లు జల్లుమంటూంది! అవన్నీ అవోరోజులు! అప్పుడుగానీ నే నీమనుచరిత్ర చదివివుంటే క్లారాను తప్పకుండా పెళ్లాడివుందును. లోపల కొట్లాడుతూన్న విలాసశృంగారాలు పై పుటకడానికి కావ్యసహాయం వుండాలంటాను—కవికానివాడికి—నిజంచెప్పవలసివస్తే ఆయింగ్లీషు స్త్రీలకున్న విలాసాల్లో పాతికోవంతయినా మన హైందవస్త్రీలకు లేవంటాను. అందులోనూ నాఅదృష్టం కాబోలు శ్యామల వట్టిమొద్దు. ఒక్కటయినా విలాసచేష్ట లేదుగదా. అది యెంతసేపూ యీమనుష్యజన్మం యేదోవ్యవహారం తెలిపిచేసుకోడాని కొత్తే మనిన్నీ ఎలాగో బొట్టమోపుగా నిలబడి యీవ్యవహారం దక్కబెట్టుకుపోదామనిన్నీ చూస్తూన్నట్టుంటుంది. ఈ సృష్టిఅంతా శ్యామలలాగే వుంటే ఇక దాన్ని అనుభవించేవాడెవడు? ఆమీద దానికది ఓర్గో బిరక్తో నేను చెప్పలేనుగాని నాతో కలిసిమెలిసి పూలతోటలో తిరగడానికయినా ఒప్పుకోదు! జన్మంయెత్తేక నాలుగూ అనుభవించాలా వద్దా? ఈయావనం నాలుగురోజులూ కళ్లుమూసుకుంటే తరవాత అంతా వట్టిదే! ఏముంది! అనుభవించడం చేతకాకపోయిన తరవాత యీసృష్టిసామ్రాజ్యానికి పట్టంకట్టుకుంటేమాత్రం యేంలాభం!...

ఈసంగతులన్నీ పూసగుచ్చినట్టు శ్యామలతో చెప్పేను. చెప్పేదేమిటి? క్లారా కెవరుచెప్పేరు? ఎకసెకలాడే ఆ నడుంమీద తూగుతూన్న భారంతో కొంచెం వంగి పాదాలు నేలకంటీ అంటడంగా నడుస్తూ క్లారా అనాడునావేపు కున్నితంగా సవిలాసంగా అమృతంపా రంలాగు వెన్నెలతీగెలాగు పారేసిన ఆ క్రీగంటిమాపు క్లారా కెవరు తీర్చిదిద్దేరు? సహజంగా వుండాలి. నేను తిరిగీ ఇండియాకు ప్రయాణం అవుతున్నానని క్లారా తో చెప్పేసరికి ఆమెముఖవికాసం—

"ఉ. ఎక్కడిదియ్యూరు కాల్ నిలువ
కింటికిఁ బోయెద నంచుఁ బల్కె- దీ
నెక్కటి మీ కుటీరనిల
యంబులకున్ సరిరాక పోయెనే
యిక్క డిరత్నకందరము
లిక్కడినందనచందనోత్కరం
బిక్కడి గాంగసైకతము
లిక్కడి యీలవలీనికుంజముల్."

అన్నపద్యానికి వ్రాసినబొమ్మలాగే వుంది! నేనూ ప్రవ రుడులాగు నాశ్యామలే నాకు స్వర్గంఅని, నామీద నదే మో విలాసాలూ చమకులూ ద్రిమ్మరిస్తుందని తిరిగివచ్చే శాను. వచ్చేసరి కేముంది? మట్టిబొమ్మ! వట్టిపెద్దమ్మ! ...ఎంతధనముంటే రేమిటి? పురుషుడి కెంత తెలివి తేట లుంటేరేమిటి? ఇల్లాలిలో శృంగారవిలాసాలు లేకపో తే ఏం ప్రయోజనం! నాకు శ్యామలమూలాన్ని ఏమీ సుఖంలేదని మాఅమ్మతో చెప్పేను. మాఅమ్మ దానిని దిద్దుతానంటుంది. ఏందిద్దుతుంది? అపురూపంగా పూచిన గులాబిపువ్వుకోసి నేనందిస్తే శ్యామ లందుకోదు సరిగదా, దూరంగా పారిపోతుంది! అప్పుడు నామన స్సెంతచివు క్కుమంటుందో మాఅమ్మ కేం తెలుస్తుంది? ఆవిడ అస్త మానం "సర్దుకోవాలి నాయనా, చిన్నపిల్ల పి"ఢ్గంటుంది. అయితే ముసలికాలంలో నా ముచ్చట్లు తీరుస్తుంది!

"ఉ. చూచితిపుష్కరం రఘుశక్కటక
మూచిలిమోపదారవిందయై
లేచి కుసంబులుఁ దుఱుము
లేనదు మల్లెలనాడ నయ్యెడన్
బూచిన యొక్క పోకనును
బోదియఁ జేరి విలోకనప్రభా
వీచికలం దదీయపద
వీకలశాంబుధి జెల్లిగొల్పుచున్."

సిగ్గయితే యిలావుండాలి! సిగ్గులో సౌఖ్యతరంగా లు వెల్లివిరియాలి! సిగ్గులో శృంగారదేవత నాట్యం చెయ్యాలి! నాకిలాటివిశ్వర్యం ఎలాపడుతుంది?... శ్యామలమూలాన్ని నాకు రోజురోజూ జీవితంమీద అసహ్యం వస్తూంది. కొంపదీసి సన్న్యాసినైపోతా నేమో?......ఏంసన్న్యాసం? వెఱ్ఱిముండాసన్న్యాసం! సన్న్యాసికావడం అంటే జీవచ్ఛవం కావడం అన్నమాటే! అంతేకాక ఒకవ్యక్తికోసం ఇంకొకవ్యక్తి సౌఖ్యపరి త్యాగం చేసుకోవడమంత వెఱ్ఱిపని అదేగాని మరొకటి లేదు. ప్రాపంచికవిషయంలో శ్యామ లోకకోసనూ నే నొకకోసనూ వున్నాము. మాయిద్దరికీ యిక కలయి కెలా కుదురుతుంది? ఎన్నివిధాల ఆలోచించినా నేను సుఖ పడడాని కేమీ త్రోవ కనబడకుండా వుంది! ప్రకృతిని స్వసుఖానికి ఉపయోగించుకోగలిగినవాడే పండితుడు; వాడే జ్ఞాని. అంతేగాని కూపస్థమండూకంలాగు కూలబడ్డ జన్మ మెందుకూ?...నిన్నరాత్రి నే నీమాటలన్నీ చెప్పి శ్యామల్ని చక్కా వెన్నెల్లో వుద్యానవనవిహారంచేద్దాం రమ్మన్నాను. దానికి జబాబుగా శ్యామల వెఱ్ఱివెఱ్ఱిగా వెగటువెగటుగా నవ్వింది! ఆనవ్వుతో నేను నిలువు నీరైపోయేను! నేను చదివిన ద్రౌపది నవ్వుకంటె శ్యా మలనవ్వు తీక్ష్ణంగా కనిపించింది. పాపం! రారాజైన దుర్యోధను డానవ్వు సహించలేకపోతే తప్పా? నేను న్నూ శ్యామలనవ్వుకి ఉగ్రుడనై పోయేను. వెంటనే యేదో తెగతెంపు చేసుకుందామనుకుని మళ్లా మా ముసలి దానిముఖంచూచి వూరుకున్నాను...ఈయౌవనం కాస్తా పీళ్ల ముఖాలుచూడడంతో గడిచిపోతే యిక సుఖంఅనుభ వించడానికి హెచ్చరి కేముంటుంది?...ఏమయితే అదే కానీ! నే నొకదొరసానిని పెళ్లాడేవస్తాను. కావలసినంత డబ్బుంది; విద్యవుంది; నేను తలుచుకుంటే యేంచెయ్య లేను? దొరసానికోసం నీమ మళ్లా వెళ్లనక్కర లేదు? విశాఖపట్నంబీచిని వాళ్లు తెగదొర్లుతూ వుంటారు. మంచి విలాసవతిని ఎంచుకో పెళ్లాడేస్తాను. అన్యాయంగా యెం

దుకు సౌఖ్యపరిత్యాగంచేసుకోవాలి? విశాఖపట్నంలో రీచిని ఒక మేడ కొంటాను. దానిచుట్టూ ఉద్యానవనం వుండనేవుంటుంది. నౌకర్లనీ చాకర్లనీ పెడతాను. రెండోవాళ్ల వూసు లేకుండా నేనూ నాదొరసానీ యిరవైనాలుగ్గంటలూ సౌఖ్యసముద్రంలో కెరటాలమయి పెనుచుకొంటూ ఉయ్యాల లూగుతాం. విలాసోద్యానంలో వింతవింతపూలు పూస్తాం. శృంగారదేవతకి సున్నితం చేర్పుతాం. ఆనందానికొక వింతఅందం తెస్తాం. "ఆనందో బ్రహ్మ" యని వరూధిని జ్ఞాపకంచేస్తూంది. కాని నే నిలావుంటే నన్నే దొరసాని పెళ్లాడుతుంది హిందువుణ్ణిని గదా?... క్రైస్తవుణ్ణివయిపోతాను. ఒక ఆదివారం నాడు చర్చిలోకెళ్లి స్నానంపుచ్చుకుంటాను. మిషనరీదొర్లిలా నెత్తిమీద నన్ను పెట్టుకుని మరీ క్రైస్తవుడుగా మార్చేస్తారు. క్లారాకోసం సీమలో నాకీబుద్ధి పుట్టిందిగాని శ్యామన్నీ తలుచుకొ వూరుకున్నాను. ఇప్పుడాఆశకూడా తీరింది. దానికారణాన్నే చర్చిలో ప్రవేశిస్తున్నాను. తరవాత నన్నెవరేంచేస్తారో చూస్తాను!

౨

ఈయింగ్లీషుఆడవాళ్లకి శృంగారాలు పెట్టని సొమ్ములు. వాళ్ల అవయవసౌష్ఠవంకూడా మహాలలితంగా కనబడుతుంది. నిన్న సాయంకాలం చర్చినుండి వస్తూవుంటే నా మైరిసు నన్ను ముద్దుపెట్టుకుంటూన్నప్పుడు నే నెక్కడో మాయమైపోయేను. జన్మంయెత్తినందుకు సార్థకం అయిందనుకున్నాను. ఇంగ్లీషువాళ్లలో యిన్నిలాలిత్యాలున్నాయి కాబట్టే వాళ్లకి రాజ్యాధిపత్యం వచ్చింది. నారాణీస్థానం ఆక్రమించడానికి మైరిసుకంటె తగిన ఆడదేదీ? హిందువులకు లోకాన్ని అనుభవించడమే తెలియదు. వాళ్లెంతసేపూ ఆధ్యాత్మికమేకాని ఐహికంతో సంబంధం కలుగచేసుకోమంటారు. సుఖం అనుభవించాలిగాని యెక్కడైతే యేమిటి? వెఱ్ఱివుండావాళ్లు! అసలు చలి జాకెట్టుముడతలలోంచి, ఆలేసుఅల్లికలలోంచి తుషారలలో వెన్నెలలా ప్రకాశిస్తూన్న ఆమైరిసుశరీరసౌందర్యం అనుభవించడంకంటె యీ నాకమ్మలకింకేం కావాలి? అవి దండలా? వలిచేసిన దవ్వముక్కలు కావూ?... చాలాసేపయింది మైరి యెక్కడకివెళ్లింది చెప్మా" అని మతాంతరుడై శృంగారరసప్రవాహమున నీదులాడ జాక్ దొరగామారిన జగన్నాథరావు త్రుళ్లిపడ్డాడు. మైరిసు తూరీగలాగు వుండివుండి యెక్కడికో యెగిరిపోతూవుంటుంది. జగన్నాథరావు కది నచ్చలేదు. భార్యాభర్తలంటే ఒకతీగలోని రెండుజంటలలాగు ఒకరిలో ఒకరు కలుసుకుపోవాలి. దానిచిగురు ఎఱ్ఱదనం దీనిమీదా దీనిపూలవికాసం దానిమీదా ప్రతిఫలించాలి. ఏది పుష్పించిందో యేది చిగిర్చిందో తెలియకుండా వుండాలి. ఎవరిఅలుకలులుకులు వాళ్లు ప్రత్యేకించి అనుభవించేటట్టయితే యికప్రణయైక్యత యెలా కుదురుతుందని జాక్‌దొరగారివూహ! "అప్పలసామీ" అని జగన్నాథరావు బట్లరును పిలిచేడు. వాడురాగానే "దొరసాని యేదీ" అని అడిగేడు. ఎవరినో చూడబోయిందని అప్పలసామి బదులుచెప్పేడు. జగన్నాథరావు తెల్లబోయేడు. 'నాతో మాటవరసకైనా చెప్పకుండా మళ్లీ యిది యెక్కడకి పోయింది చెప్మా! కాఫీవేళయిపోతూంది!' "నాతో చెప్పమని దొరసాని నీకేమేనా చెప్పిందా?" అని జగన్నాథరా అప్పలసామి నడిగేడు. ఎవరో మార్టిన్ దొరను చూడడానికి దొరసాని వాల్తేరు వెళ్లిందనిన్నీ, ఎన్నిగంటలకు తిరిగివచ్చేదీ తెలియదనిన్నీ, "మిమ్మల్ని తనకోసం కనిపెట్టుకోవుండక కాఫీతాగివేయమని చెప్పింది" అనిన్ని బట్లరు చెప్పేడు. ఆమాటవిని జగన్నాథరావు తిరిగీ ఆలోచనలో పడ్డాడు. 'ఎవడో యీమార్టిను? నాకు కాఫీ యెలా నోటికిపోతుంది? నామైరిసు ప్రక్కను కూర్చుని తనచిన్నివ్రేళ్లతో కప్పునోటికందిస్తూ తనకమ్మనియూర్పులు నాచెక్కిలిమీద విసుస్తుందనుకున్నాను. అనేకవిధాల యిప్పుడిప్పుడు సౌఖ్యపల్లవాలను తొడుగుతూన్న నామనోరసాలంమీద మైరిసు కోకిలాకంఠనినదం వినబడకపోతే యీ నా జన్మానికి వసంతోదయం యెక్కడిదీ? అట్టే ఆలస్యం చేయదనుకుంటాను. ఆలస్యమయితే అయిందిగాని మైరిసు రాందే కాఫీ యెలాతాగుతాను?... ప్రియురాలికోసం వేచివుండడంలోనూ ఒకతమాషా అయినసుఖం వుంది. ఇప్పుడు మైరిసు మైరిసు మరింత హెచ్చుతుంది. కాని నాకెందుకీయనవసరవియోగం? అవసరం వుంటే ఏనలుడులాగో, శ్రీరాముడులాగో మైరిసుకోసం వెతుకులాడడంలో లాలిత్యం, దుఃఖంలో కలిసిపోయేసుఖం వుంటుందేమో? ఇన్ని లాలిత్యాలు వుండి యేంచెప్మా

యీయింగ్లీషుభార్యాభర్తలకు ప్రత్యేకత కనబడుతోంది? ఇది యింగ్లీషుమర్యాదక్రింద తేలింది. తేల్తేనేమిటి? బైబిలు ప్రమాణం కాదుగదా? సుఖానికడ్డుతగిలే యిలాటి మర్యాదలు కొన్ని విడుచుకోవలసిందే. ఈమర్యాదవల్ల మైత్రిసుప్రవర్తనలో కొంచెంలౌలిత్యం తగ్గుతూంది. అవి దేమేమో జాన్ దొరగారాలోచించుకుంటూ వుండగావరాండాలో టక్కు-టిక్కు-మని అడుగులచప్పుడువినబడింది. మైత్రిసువస్తూందని జాన్ దొరగారి ముఖ వంపయింది. దిగ్గవలేచి యెదురుగుండా వెళ్లేడు. నవ్వుతూ మైత్రిసు చేయందుకొని ముద్దుపెట్టుకోపోయేడు. "అబ్బ నేను చాలాఅలిసిపోయేను. ఇప్పుడు నన్నేమీ మాట్లాడింౘ" కని చేయి విదల్చుకుంటూ తనగదిలోనిక్కి మైత్రిసు పోయింది. జగన్నాధరావు కొంచెం చిన్నబోయేడు. మళ్లా మనస్సును సమాధానంచేసుకున్నాడు. "పాపము! మల్లెపువ్వులాటునా మైత్రిసు బహుసున్నితమైనం"దనుకుంటూ కాఫీబల్లదగ్గరకుపోయి కొంచెం కాఫీ తాగి తిరిగీ కుర్చీలోకూలబడ్డాడు. తిరిగీ ఆలోచనలోపడ్డాడు. 'మార్టినసే పేరుగలవాడు మైత్రిసు బంధువులలో లేడు. ఇంతచీకటినే వాడిబంగళాకు యీమె యెందుకు వెళ్లాలి? అడిగితెలుసుకుందామంటే తప్ప! తనంతట తానైనాతో చెప్తుందా? అలాఅయితే ముందే చెప్పను. నేనామెగదిలోకి వెళ్లడానికి వీలులేదు. రమ్మని కబురంపుతే కోప్పడుతుందికాబోలు. నాలా తిరస్కూడా వియోగం తెలియదా?' అంటూ! ఆలోచించుకుంటూ జగన్నాధరావు ముండ్లమీద కూర్చున్నట్టు కూర్చున్నాడు. ఆమె యెప్పుడు పైకివస్తుందా అని ఆగదికేసి కళ్ళు విశాలంగావిప్పి చూస్తున్నాడు. బట్టలు మార్చుకుని, జల తిరిగీ దువ్వుకొని, బుగ్గలకు గులాబీరంగద్దుకొని, క్రొత్తజోడు తొడుక్కొని మైత్రిసు టక్కు-టిక్కు-మనుకుంటూ బల్లదగ్గరకు వచ్చింది. ఇంతసేపూ వియోగాంధకారంలో కొట్టుమిట్టాడుతూన్న జగన్నాధరావు కన్నులకామె వెన్నెలబొమ్మలాగు కనబడుతేమో, ఆబుగ్గలమీది చంద్రకాంతప్రసూనాలమీద వానిచూపు తుమ్మెదలెంత విలాసంగా తిరుగులాడునో, ఆమాడ్కి-తీవలలో నెన్ని ప్రణయగీతా లాలపించిపాడునో కాని, పాపం, జగన్నాధరావు మనస్సు మనస్సులాలేదు. మైత్రిసులావచ్చి క్రీగంటిని జాన్ దొరగారిముఖవిలాసం చూచి చూడనట్టు కుర్చీలో కూర్చుని కాఫీకప్పు మూతిదగ్గర పెట్టుకుంటూ ఎందుకోకాని చిన్న నవ్వు నవ్వింది. చిన్నబోయియున్న జగన్నాధరావు మనస్సున అది చాలావాడిగా తాకింది.



ఆనవ్వు కర్థంఏమిటి చెప్మా అని ఆలోచించేడు. జాన్ దొరను కాఫీతాగడానికి రమ్మని మైత్రిసు పిలవలేదు. సరిగదా, కాఫీపుచ్చుకున్నావా? అని అతనిని అడగనేనా అడగకుండా తాను కాఫీ తాగేస్తూంది మీదుమిక్కిలి నవ్వుకుంటూందికూడాను. జగన్నాధరావుకీ ఈ మనసు బోతుతనం మరింత లావయిపోయింది ఏదోవిధంగా మైత్రిసు ప్రవర్తనకు సమాధానం వస్తేనేకాని నాకేమీ తోచదనుకున్నాడు. సుఖంకోసం యింకో అవతారం యెత్తిన నాకీతూందోళనెందుకన్నాడు. ఇంతకీ నేను లోలోన కుళ్ళుతూవుంటే మరింత నరకం అన్నాడు. ఎలాగో లాగు నాలుగుప్రశ్నలూ అడిగి నాసౌఖ్యానికిక యిలాటి అంతరాయం లేకుండా చేసుకుంటానని, "మైత్రి! యీ యీదయం నీవు చాలాసుఖంగా గడిపేవనుకుంటా"నన్నాడు. ఆమాటలలో గద్గదికలాటిధ్వని వుంది. మైత్రిసు పోల్చింది. "ఔను, నన్నిలాఅడిగినందుకు నీకనేకవందనా"లంది మైత్రిసు. ఆజబాబులో వొకవిధమైనశక్తి బయల్దేరి జాన్ హృదయాన్ని తాకింది. వెంటనే అది బండరాతిని కొట్టిన బిల్లపెంకులా చెల్లాచెదరయిపోయింది. కొం

దువుగాపుట్టి హిందువుగా పెరిగి హైందవమర్యాదల కలవాటుపడ్డ వాడి కాజబాబు ఎలా కనిపిస్తుంది! జగన్నాథరావు వడవడావణికేడు. పైరి సది కనిపెట్టింది. మొగం చిట్లించుకుంది. కొంతసేపటికి జగన్నాథరావు సాహసం తెచ్చుకుని, "పైరీ! నీకోసం యీ వుదియం అల్లా చాలా తహతహలాడేను సుమా! ఎక్కడికి వెళ్లేవో చెప్పనే నా చెప్పేవు కావు! ఎవరా మార్టిన్ దొర? నీకు బంధువుడా? నన్ను నీతో కూడా తీసికొని వెళ్లేవు కావేమి? నేనుకూడా అతని పరిచయం చేసుకుందునే! అదికాక, పైరీ! నేనాత్రంగా చూస్తూన్న సమయంలో నువ్వు కనబడకపోతే నాకెలా వుంటుందో చెప్పు! నీవు నన్ను కాస్త కనిపెడుతూవుండాలి గాని యిలా వేధిస్తూవుంటే యెలాగ!" అనేసరికి పైరిసు దిగ్గున బల్ల దగ్గరనుంచి లేచింది. "జాగీర్దారా, నీమాటలకూ నీ ప్రశ్నకీ నాకేమీ అర్థం బోధపడలేదు. ఆడవాళ్లూ మనుష్యజాతిలో వాళ్లే. వాళ్లకీ కొన్ని సొంతపను లుంటాయి. ఇరవై నాలుగుగంటలూ మగవితో కనిపెట్టుకో వుండడానికి నేను హిందూభార్యను కానని మాత్రం నీవు జ్ఞాపకం వుంచుకోవాలి. ఇప్పటి నీయీ ప్రవర్తన నాకేమీ నచ్చలేదు. నీ చూపులూ మాటలూ కూడా అనుమానాన్ని సూచిస్తున్నాయి. దానివల్ల నాకు చాలా పరాభవం అయింది. నీవిలా నన్ను క్రిందు చేయడానికి నీ కధికారం లేదు. నీతప్పు నీవు తెలుసుకుని దానిని ఒప్పుకొని నా మన్నన పొందు తేనే కాని నేను నీతో సమానంగా యీ యింట్లో మసలలేను" అని తీవ్రంగా చెప్పి కందిగడ్డలా యెఱ్ఱపడిన ముఖంతో తనగదిలోకి పోయింది. జగన్నాథరావు నిలువునీరయిపోయాడు. పెదవి వణికింది; ముఖంమీద ముచ్చెమటలూ క్రమ్మేయి. కన్నులు చెమ్మగిల్లేయేమో! ఉః అని జగన్నాథరావు కుర్చీలోంచి లేచి వరాండాలోకి వచ్చేడు. చేతిరుమాలుతో ముఖం తుడుచుకున్నాడు. ఇలా విక్కించుకున్నాడు, 'అబ్బ! మీడిపండయిపోయింది పైరిసు! యెంత టెక్కు చూపించింది! డీనిధర్మమా అని నాకు పెండ్రాడే తెలిసి తెచ్చింది. ఇప్పుడిప్పుడు మొగ్గదొడుగుతూన్న నా ప్రణయలత ఇట్టే తెంపేసింది. సున్నితంలేని శృంగారం యేం చెయ్యనూ! ఆడుదానికి శరీరంకంటె మనస్సు మనస్సుకంటె మాటలూ సున్నితంగా వుండాలిగాని అటుంటివి యిబ్బై తే యెలాగు? ఇంగ్లీషు ఆడమనస్సు యిలాగే వుంటుందా? క్లారా యెప్పుడూ నాకిలా కనబడలేదు. అయితే పెళ్లి యీదాకా వున్న లాలిత్యం పెళ్లయినతరవాత పోతుంది గాబోలు. దరిద్రుడు వానలో తలగడుక్కుందా మనుకునేసరికి వడగళ్లు కురిసిందట. ఇక నాకీజన్మానికి సుఖంలేదు గాబోలు! నాకూ పైరిసుకీ మరిజత పడదు. నేను దానిమన్నన పొందాలట! నేచేసిన తప్పేమిటో? ఇలా అయితే నే నెలా గడుపుకోవడం? శృంగారంకోసం పోతే దుఃఖం వెంటాడుతూందేమిటి! అయినా ఆడుదానికింత స్వేచ్ఛ తగదంటాను. ఆడది మగవాడిని గుఱ్ఱాన్ని తోలినట్టు కమ్చీ పట్టుకుని తోలుతే యెలాగు? ఈ భాగంలో మహమ్మదీయస్త్రీలు నయమంటాను. దక్కావాళ్లు అసూర్యంపశ్యలై వుంటారు. అందానికి లోటు లేదు. పోతుతీగ వాళ్ల కంటపడుదుగదా. ఆకట్టుకున్న వాడే జుర్రుకోవాలి శృంగారమంతాను. జనానాలోని ఆవుద్యానవనంలో ప్రియుడితో కూడా ప్రుల్వయిపోతుంది. వాళ్లకీ ఆటంకాలూ వుండవు... చెడ నీ చెడ్డాను, మహమ్మదీయులోకం కూడా కొంత చూస్తాను. ఈముండతో చెప్పకుండా లేచిపోతాను. తరవాత అది తలబ్రద్దలుకొట్టుకోనీ, నాకేమిటి? కుక్కచుట్టుకున్న కుండకి శుద్ధేమిటి?'

3

జాగీర్దారుగారయిన జగన్నాథరావుగారు ఇస్లామిడుసాహెబుతో నాలుగువిధాలా నచ్చచెప్పి జన్నాసాహెబయేడు. వేళతప్పకుండా నమాజ్ చేస్తున్నాడు. నాటినుండీ తనకు వడ్డీ యివ్వనక్కరలేదని బాకీదార్ల పేర రిజిష్టరీ వుత్తరాలు వ్రాసేడు. వ్రేళ్ల వుంగరాలు తీసేశాడు. ఆఫాయిజమా, మిగాళ్ల వరకూ ఆలాల్చీ, ఆబోడి తలమీద దబ్బకాయచిప్పటోపీ, ఆభుజంమీద గులాబి రంగుపువ్వుల యెఱ్ఱరుమాలూ, కాలిజోళ్ళూ జగన్నాథరావు పిచ్చితురకలాగే వున్నాడు. సాయిబుకు తగిన బూబుకోసం చూస్తున్నాడు జన్నా. అమీరు[illegible] పెళ్లీడు పిల్ల వుందని విన్నాడు. తనకామె నీయవలసిందని బడేమియాచే సిఫార్సు చేయించుకున్నాడు. పెళ్లాడేడు. జన్నాకి బూబును చూడాలి అని పెళ్లికామ్యనాలోనే తహతహ లావయింది గాని వాళ్లు లాబూబును కంటపెడతారా? తరవాత యెలాగైతేనేం బూబూసాయిబూ

కలుసుకున్నారు. తిరిగి తనకు సౌఖ్యదినా లారంభించే యనుకున్నాడు జన్నా. ఒకక్షణమైనా ఉన్నీని విడువ కూడదనుకున్నాడు. దినమల్లా జనానా ఉద్యానంలోని ద్రాక్షపొదల్లో ఉన్నీతో కూడా దాగుడుమూత లాడుకోవా లనుకున్నాడు. జన్నా అస్తమానం జనానాలో వుంటే క్రొత్తపెళ్లి కూతుర్ని చూడవలసిన తక్కిన బాబులాజనానాలోకి రా వీలులేకపోయింది. అంచేత ఉన్నీ యేదో ఓ నెపంమీద జన్నాను ఎడపెడుతూవుండేది. జన్నాకి చాలాయిబ్బందిగా ఉండేది. దేనికోసం అయితే తాను దేవులాడుతున్నాడో ఆసుఖాని కిక్కడ కూడా ఎంతరాయం వచ్చింది.

జన్నా వొకనాటిమధ్యాహ్నం "ఉదయంనుండీ ఉన్నీనిచూడలేదు! ఎప్పుడు చూస్తే అప్పుడే పరిఆగి సర్దుకోవడానికేజన్మం రెండువుసామా? లేకపోతే సౌఖ్యం మనకెవరేనా పుణ్యాని కిస్తున్నారా? నేనిలా యిరుక్కుని వుండలేను. సంధ్యారాగంలో రెక్కలు దక్కా విప్పి యెగురుతూన్న పక్కిలాగు శృంగారాకాశాన్ని అనురాగంలో నాయిష్టం వచ్చినంతసేపూ సంచ గరవలసిందేకాని యీ కారుకారుమబ్బులూ యీచిదప చిదపముసురులూ నాకు పనికిరావు." అనుకుంటూ జనా



జనానాలోకి
దతికిలబడిపోయి
జనానాలోకి
దాసీచేత వున్నీకి
డు జనానాలో
ఆమాటలు వినగా
కిక్కు గట్టిగా మా
గబగబా ఊపిరితీసి
నేమిటో చెప్పి,
మాట్లాడుతూంది.
కంఠమాత్రం రావద్దు
శించే పురుషుడికి ఖు
బాబుగారు చెప్పే"
రావుకు మతిపోయింది
కూలబడ్డాడు. అంచేత
చేసేడు. 'నాభార్య
ఇంకా భార్యయెం
భార్యజనానాలోకి
జోరా! నాకీతి చూ
మారుగా వస్తున్నాయి!
భావమన్నట్టుంది నా
శృంగారంకోసం బంగా
న్నాను! పాపం, శ్యా
కాదు! కోటలో పళ్లు
యుడు. దిక్కుమాలిన శ

ఆపూలతోటలో
ఆచిన్న బంగళాలో
శ్యామలసమాజంగా అం
పోయిన దగ్గరనుండీ కెం
ఆచిఁకిచీరా చి. పిరికలా
కాల్వలజాడలు కనబడు
మగనిముఖలక్షణాలు
పందంపొందిపోతూవుం
చెరగు ముఖంలో దాచుక

...కిముట్టూవున్న
...న్నాంది. పువ్వుల
...ఆశ్లేషించింది. పరిజ
...పూ" అని పిలి
...ంది. జాలిగా మైన
...న్నాథరావు వచ్చేడు
...శ్యామల గబగబా
...వఁగి యిటూఅటూ
...స్లుగ్గమ్మేయి. నిరాశ
... రెక్కడనుంచో
...ంది. త్రుళ్లిపడి శ్యామల
...రంగా తొంగరుచెట్టు
...ంతోడుక్కొని దబ్లూ
...శ్యామలవృష్టిలూ వాని
"శ్యామలా! క్షమించు"
...ముల అతనిని పోల్చింది.
...ట్లో పరుగునవచ్చి శ్యా
...షుడు కన్నీరుగా గిరిపో
...న్నాథరావు వక్షముమీద
శ్యామల. చెట్టుకొమ్మల
...లముఖంమీదప్రసరించింది.
పువ్వులు వాళ్లిద్దరిమీదా జల




జీగా రాలేయి. ఒకటో రెండో కన్నీటిబొట్లు జగన్నాథరావు కండ్లనుండి శ్యామలచెక్కిళ్లమీద రాలేయి. నిజమైన శృంగారంయిదీ అని జగన్నాథరావొక్కనిట్టూర్పు విడిచేడు.

ఆదిమాంధ్ర కన్య

శాస్త్రివులపల్లి రామమూర్తిగారు

వారిదరాశినా నెరి వెండ్రుకలకొప్పు గీటుఁ జెంద,
...త బాలార్క కాంతితో నుదుటఁ గుంకుమబొట్టు ముదముఁ గొలుప,
వెల్గు సురచాప మనఁబొప్పు నాణిముత్తెపు నత్తు రాణ సెలఁగ,
...లోని మెఱపుఁదీవియఁ బోలి ముక్కడ్డబాస తళుక్కురనఁగ,
...ములరీతి ఘల్లురనఁగ - కర్షకుల వేల్పు వర్షర్తుకన్యవోలె
...జాతీయ వేషంబుతోడ - నలరుఁ బచ్చపైరుల నాదిమాంధ్రకన్య.



భైరవరాగము:—రూప అనుపమ సుందర అంగవిభూతి ధరే శశిసీస విరాజే । గంగజటానికే
ముక్తలనేగలముండనమాల భుజంగ నిసాజే । ధ్యావతిజాతి ప్రభాతహీగావర
నారినసంగవిలాస సమాజే । భైరవరాగకో యావిధ ధ్యాయీయాదే అంతరపాప నసావనకా
జయపురచిత్రము : దివాన్ బహాదూరు గోవిందదాసు చతుర్భుజదాసుగారి యనుమతిని

పరాకాష్ఠ

శ్రీ శివశంకరశాస్త్రి గారు

ఆమె మానవయువతియే యగుట నిజము:
కాని ఆయమపల్కులు కర్ణగోచ
రమ్ము లైనంత నాకు నిర్జరమనోజ్ఞ
మధురసంగీత నాదముమాడ్కి దోచు!

ఆమె మానవయువతియే యగుట నిజము:
కాని ఆయమరూపంబు కానవచ్చి
నంతనే నాకు సర్వలోకైకనయన
హారి సౌందర్యదేవతయట్లు తోచు!

ఆమె మానవయువతియే యగుట నిజము:
కాని ఆయమ మెత్తనిమేను సోకి
నంతనే నాకు పారవశ్యమ్ము కలిగి
అద్వితీయ బ్రహ్మానందమట్లు తోచు!

స్నిగ్ధహృదయాబ్జ మైన నా జీవితేశ్వ
రీ కృపాలోకనము ప్రసరించువరకు
భ్రమరరూపమ్ముతో నామె శ్రవణపాళి
చాటపాడుచు వేడుదు ప్రత్యహంబు.

స్నిగ్ధహృదయాబ్జ మైన నా జీవితేశ్వ
రీ కృపాలోకనము ప్రసరించువరకు
సుమపరాగమ్ము నై యామె సుందరాంఘ్రి
పంకజము లంటి సేవింతు ప్రత్యహంబు.

అన్యభావము లన్నిటి నవల ద్రోసి
చిత్తసద్మమునం బ్రతిష్ఠించి దేవి,
నిన్ను ధ్యానించుచుంటిని నిరత మేను:
నీకుమాత్రము నామీద నెనరు లేదు!

ప్రవిమల ప్రేమరససుధాపానమత్త
వివశహృదయుండ నై లజ్జ విడిచి దేవి,
స్తవము చేయుచునుంటి నిత్యంబు నిన్ను:
నీకుమాత్రము నామీద నెనరు లేదు!

దైవవశమున నీసన్నిధాన లాభ
మొదవగా దేవి, గర్వము నుజ్జగించి
పాదములమీద వ్రాలితి భక్తితోడ:
నీకుమాత్రము నామీద నెనరు లేదు!

ఆర్ద్రహృదయముతో ప్రియురాలు మున్ను
నా కొసంగిన ప్రణయచిహ్నముల నెల్ల-
మరణకాలమునందు సమ్మదముతోడ
ఎడదపై జేర్చి ప్రాణముల్ విడుతుగాక!

నిఖిలసౌందర్య సముదాయ నిలయమైన
ప్రణయినీ దివ్యముఖ చిత్రపటముమీద-
మరణకాలమునందు సమ్మదముతోడ
వీక్షణము నిల్పి ప్రాణముల్ విడుతుగాక!

అఖిలమధురాతిమధుర నామాతిశాయి
యైన ప్రియురాలి నామధేయమ్ము నేను-
మరణకాలమునందు సమ్మదముతోడ
తడబడక పల్కి ప్రాణముల్ విడుతుగాక!

దీపావళి

(ఒక కథ)

యస్. వి. రామమూర్తి గారు, బి.ఏ.


౧

నాడు దీపావళి. సంధ్యాకాలము. లక్ష్మీనగరమందలి పెంటపోగులతో నిండిన పాడుగృహములు సయితము శక్తికొలదిని ప్రకాశవంతములైయుండెను. రాజమార్గమందలి బాలురును, బాలికలును తెల్లనిపళ్లెరము లందు దీపపుప్రమిదలనుంచి మందిరోపరిమార్గమునుబట్టి పనుచుండిరి. దీపములకంటెను వారి ముఖారవిందము లెక్కువ ప్రకాశవంతములై యుండెను. ప్రతిగృహమును దీపమాలికలచే సుశోభితమై యలరారుచుండెను. ఒక్క సత్యదేవునిగృహముమాత్ర మంధకారమయమై గంభీరముగ నిలువబడియుండెను. ఆగృహము తనపూర్వపు ఔన్నత్యమును మరచిపోలేదు. ఆసువిశాలగృహపురోభాగమున పూర్వము ద్వారపాలకులు సశస్త్రపాణులై యితరులు లోనికి పోకుండ వారించుటకు నిలువబడినచోట ప్రస్తుతకాలమున జిల్లేడుపొదలు దట్టముగా మొలచియుండెను. ఒకానొకప్పుడు పైయంతస్తులనుండి వెలువడుచుండిన నవయౌవనవతుల మధురగానరుతమునకు మారుగ నేడచ్చోటినుండి పావురముల కుహూధ్వనులు వినవచ్చుచున్నవి. గృహకుడ్యములు భర్తృరహితయగు కాంతా హృదయమువలె విదీర్ణములగుచుండెను. కాల మెట్టిమార్పులనైనను జేయుచుండును గదా! కాలానుసారముగ ప్రకృతిలోని పదార్థములు క్రమముగా జీర్ణించి, ఒకటొకటిగా లుప్తమగుట ప్రపంచధర్మమైయున్నది.

అమావాస్యరాత్రి. ఇతరగృహములలోని సముజ్జ్వలకాంతులకు నోడి వెన్నిచ్చి పరుగిడిన యంధకారము సత్యదేవపండితునియొక్క ఆవిశాలగృహాంతర్భాగమున దాగుకొనియుండి నట్లుండెను. ఆసమయమున సత్యదేవపండితుడు తనగదిలో సన్ననిదీపపు వెలుతురునందు కూర్చుండి ఆలోచనానిమగ్నుడై యుండెను. నాటికొకమాసము నుండియు నాతని యర్ధాంగియగు పార్వతి రోగపీడితయై మంచము పట్టియుండెను. అదియే ఆతనివిచారమునకు కారణము. పాపము, సత్యదేవుడు దారిద్ర్యమును, దుఃఖము ననుభవించుటకు సంసిద్ధుడై యుండెను. కాని, ఈయనాతవిపత్తు నాత డెట్లోర్చుకొనును? తనప్రణయనిధానమును, ప్రాణాధికయు నగు ప్రాణేశ్వరి పార్వతి శరీరసంకటకమున కాత డెట్లోర్చుకొనును? అతడు ప్రతిదినమును పార్వతి పరుండిన మంచముతలవైపున కూరుచుండి, యాయమ కష్టతరముఖకమలమును గాంచుచు లోలోపలనే దుఃఖించుచుండును. ఎప్పుడైనను పార్వతి తనజీవనముపై నాశ వదలి, నిస్పృహాసూచకవాక్యముల ననినచో, వాతడు ఎంతో ప్రయత్నముపై తనదుఃఖమును ప్రచ్ఛన్నము గావించి, "భయములేదు, పార్వతీ! శీఘ్రకాలములో నీవు స్వస్థత నొందగలవు" అని యామెకు ధైర్యము గొలుపుచుండును.

సత్యదేవపండితుడు పేరుప్రఖ్యాతులుగల కుటుంబములోనివాడు. ఆతనిపూర్వులు ప్రతిష్ఠితధనసంపన్నులు. జమీందారులతో వడ్డీవ్యాపారము జేయుచు అమితముగ ధనోపార్జనము గావించియుండిరి. వారివ్యవహారము లెప్పుడును గొప్పభూస్వాములతోడనే జరుగుచుండెడివి.

1857 వత్సరమున భారతదేశమందలి యుపద్రవముల సందడిని వారివద్ద అప్పుగొనినవా రందరును అప్పుల నెగవేయుటచే వారి కమితముగ ధననష్టము సంభవించెను. అంతకుపూర్వము మానవుల విశ్వాసగౌరవములు ప్రస్తుతకాలమందువలె అతిచౌకగా నమ్ముడుపోవుచుండెడివి కావు. పత్ర మెట్టికాగితమైనను, రిజిస్ట్రీషను డిపార్టుమెంటు లేకున్నను 1857 సం.వరకును



"పార్వతి పరుండిన మంచముచెంత …పైన కూరుచుండి యాయన శుష్కించిన ముఖకమలమును గాంచుచు లోలోపలనే దుఃఖించుచుండును."

ఒకరివద్ద యప్పుదీసికొని ఒకరు ఎగవేసి యుండిరనమాటయే లేదు. మాటనమ్మకముపై లక్షలక్షలాది రూపాయల వ్యవహారము జరుగుచుండెడి సుదినము లవి. 1857 వత్సరమున భారతదేశమునం దుద్భవించిన "సిపాయిల తిరుగుబాటు" అను మహాప్రళయమున రూపుమాసిన ఎస్టేటులనేకములు. ఖజానాలు కొల్లగొట్టబడెను. అన్నిటితోపాటు సత్యదేవుని పూర్వుల సంపదయును సన్నగిలెను. పిమ్మట కొన్నిదినములకు దేశమున శాంతి నెలకొలుపబడినను కాలము మారిపోయినది. దేశపరిస్థితులు మారునపుడు — దేశీయ జీవనవిధానమును మారుట సహజమేకదా! మానవులమాట నమ్మకము చెడినది. లిఖిత రూపములగు పత్రము లావరణలోనికి వచ్చినవి. అందును తెల్లకాగితములు, ఎర్రకాగితముల భేదమొకటి వచ్చినది. అప్పుపత్రములన్నియును పనికిరాకపోయెను. పనికిరాకపోవుట యవనేమో, ఎవ్వరికిని తెలియదు. "అప్పుపత్రమేమి, పనికి రాకపోవుటేమి? ఋణముదీసికొనిన వారు వాని చెల్లించక తీరునా; ఎరుపు తెలుపు కాగితములలో నేమున్నది!" అని యాలోచించెడి ఋణగ్రస్తుడొక్కడును లేకుండెను. "అప్పు తీర్చినన్న అంతే చాలును, బ్రదుకు జీవుడా" యని ఋణగ్రస్తులందరును మొండికెత్తి మాడెంకకైచి కూరుచుండిరి. అందుచే ఋణదాతలపత్రములు నాలుక గీచుకొనుటకైనను పనికిరానివయ్యెను. ఆవు పోయినను, కట్టుత్రాడు కంబమునకు మిగిలినట్లు ధనముపోయినను సత్యదేవపండితునికి తనపూర్వుల సంపత్సూచకములగు వడ్డిపత్రములమూటమాత్రము మిగిలినది. అతని భాగ్యక్షీణముతోపాటు ఆపత్రములందలి యత్న

రము లస్పష్టము లయ్యెను. అయినను సత్యదేవు డాపత్రములను తన ప్రాణముకంటె నధికముగ భావించుచు వానిని భద్రపరచుచుండును. ప్రతివత్సరమును దీపావళి గడచిన పాడ్యమినాడు ప్రతియింటను లక్ష్మీపూజ జరుగుచుండునపుడు మనసత్యదేవపండితు డాలక్ష్మీపూజకు మారుగ లక్ష్మీస్మారకచిహ్నములగు సుమారు అరువది లక్షలరూపాయిల విలువగల ఆపత్రములను పూజించుచుండెడి వాడుక కలదు.

౨

అమావాస్యరాత్రి. దీపములు తమయల్పజీవనముల బరిసమాప్తి నొందించుకొనుచు మానవజీవితపు టంత్య పరిణామమును జ్ఞప్తికి దెచ్చుచుండెను. ఏవైపుచూచినను జూదగాండ్ర సమూహములే. జూదమున నారాత్రి గెలిచినవారికి సంవత్సరము పొడుగునను యోగమటయే నట. బంగారునాణెముల భాగ్యచక్రగతి గవ్వలపాటుపై నాధారపడియుండెను. ఆకారణమున 'గవ్వవిలువ చేయ' దను లోకోక్తి అసత్యమగుచుండెను. అత్యున్నతస్థితియందుండినవారి జీవనము నొకప్పుడు నిర్భాగ్యులయు, నిరుపయోగులయు జీవనముపై నాధారపడియుండుట ప్రపంచధర్మమేకదా! ఆనాటిరాత్రి సారాదుకాణములందు సారాయికిమారుగ నీళ్లు విక్రయింపబడుచుండెను. రాజమార్గమందు సంచరించుచుండిన ప్రజలందరును ఒకరిధనమును జూదమున గెలువవలయునను నుద్దేశముతోడనే యుండిరి. అట్టి నిశీథసమయమున మనసత్యదేవపండితుడు తనభార్యపరుండియున్న గదిలో యామెప్రక్కను కూరుచుండి యుండెను. నాటి ప్రాతఃకాలమునుండియు పార్వతిస్థితి యేమియు బాగుగ నుండలేదు. విషమజ్వరముచే నామెకు గంటగంటకు మూర్ఛ వచ్చుచుండెను. మధ్యమధ్య స్మృతి కలిగినపుడామె మెల్లన కన్నుల విచ్చి క్షీణస్వరమున—"నేడు దీపావళికదా!—"అని యేమో చెప్పబోయి మరల కన్నుల మూసుకొనుచుండును. ఇదంతయు జూచి, సత్యదేవునికి ధైర్యము సడలెను. పార్వతి జీవించునను నాశ యతనికి లేకుండెను. అయిన నెట్లయినను పార్వతిని—తనయర్ధాంగలక్ష్మియగు పార్వతిని—మృత్యుముఖంబునుండి మరలించుటకు తగిన ప్రయత్నము జేయ నిశ్చయించుకొనెను. ఆమె సారెసారెకును నస్పష్టముగ బల్కుచుండెడు 'నేడుదీపావళికదా?' అనుప్రశ్నమున కుత్తరముగ నాతడు, 'ఔను, నేడే దీపావళి' అనుచు పలికె, పార్వతి తనయశ్రుపూరితదృక్కులను గృహమున కటునిటు బరపి, "మనగృహమున దీపము లుంచలేదేమి? అయ్యో! నేడు గృహమున నంధకార ముండరాదు. మీకు సాధ్యము కానిచో నన్ను మంచముపైనుండి మెల్లన లేవనెత్తుడు. నేనైనను ఇంట దీపములు ముట్టించెదను" అనియెను. పాపము, సత్యదేవు డెట్టి ప్రత్యుత్తర మొసంగవలయునో తెలియక, హృదయభేదకములగు నామాటలకు వెక్కివెక్కి యేడువసాగెను.

లక్ష్మీనగరమున శంకరశాస్త్రి ప్రసిద్ధవైద్యుడు. ఆయూర నుండిన సంజీవనీఔషధాలయ మాతనిదే. అందొక ముద్రణాయంత్రముకూడ కలదు. ఉన్న తగుమాత్ర సాధనములను గూర్చిన కరపత్రములను ముద్రించి ప్రకటిత మొనర్చుట కాముద్రణాయంత్ర మాతనిచే నెలకొలుపబడియుండెను. పౌరులరోగము లన్నియు కల్పితము లనియు, అబద్ధము లనియు నాతనియుద్దేశము. అందుచే పొలిటికల్ ఎకానమీ శాస్త్రానుసారము ఈ కల్పితరోగము లనెడు పౌరులవిలాసములపై [illegible]న్ను (సుంకము) విధించిన నంత దేశక్షేమ మగున[illegible]తని నమ్మకము. "నిర్ధనులైనను సరే—సుంక మీయలేక వారు చచ్చినను సరే—వారేల రోగులు కావలయును?— ఈదొంగరోగములచేతనే భారతదేశమున కిట్టి దుర్దశ కలిగిన" దని యాతనియూహ. అందుచే రోగుల యొద్ద ధనమును గ్రహించుటయు నొకవిధముగా దేశోద్ధారకకృత్యమేయని శంకరశాస్త్రిగారి యాలోచన. ధర్మార్థము మందుల నొసంగెడు పాశ్చాత్యౌషధాలయములవలననే దేశమందు బలహీనులసంఖ్య దినదినాభివృద్ధి గాంచుచున్నదని మ-రా-రా-శ్రీ వి. శంకరశాస్త్రి గారి యభిప్రాయము.

మన సత్యదేవపండితుడు నెలదినముల నుండియు పార్వతి రోగనివారణార్థమై శంకరశాస్త్రిగారి సంజీవనీ ఔషధాలయమునందే మందుగొని భార్య కొసంగుచుండెను. కాని, ఆయౌషధసేవవలన పార్వతిరుగ్మత యేమాత్రమును కుదురలేదని మన మీవరకే యెఱింగితిమి.

భయంకరమగు అమావాస్యరాత్రి. నిశీథసమయము. అర్ధరాత్రము దాటియుండుటచే నభోభాగమందలి

తార లక్ష్యంక ప్రకాశవంతములై యుండెను. నగరమం దొకటొకటిగ లుప్తమగుచుండిన దీపములను జూచి పరిహసించుచున్నవేమో యనునట్లు తారలు మినుకు మినుకు లాడుచుండెను. అట్టి సమయమున భార్యతలపై ప్ర[illegible]య్యెత్తినవానివలె కూరుచుండియుండిన సత్యదేవపండితుడు నిశ్చితమనస్కుడై లేచి వైద్య శేఖరుడగు శంకరశాస్త్రి యింటికి పయనమయ్యెను.

3

శంకరశాస్త్రి తనగదియందు కూరుచుండి నూతనముగ తనచే సంపుటిచేయబడిన "అమృతబిందు" ఔషధమునుగూర్చిన విజ్ఞాపనపత్రమును లిఖించుచుండెను. ఆపత్రములోని భావప్రాగల్భ్యము, ఆకర్షణశక్తియు గాంచినచో శంకరశాస్త్రికి, సుప్రసిద్ధభిషఙ్మణియను నామమాట యటుండనిండు, సులేఖకవిద్యానిధి యని మాత్రము చెప్పకతప్పదు. ఆతడపుడు సిద్ధపరచుచున్న కరపత్రములోనియంశముల నిట పొందుపరిచియున్నాము:

[illegible]తబిందు అమృతబిందు అమృతబిందు

అన్ని రోగములకును అమూల్యమగు ఔషధము. శారీరకవ్యాధులకు శంకరునిశూలము; అస్వస్థతాంధకారమునకు ప్రచండభానూదయము. ఈయౌషధరాజము, మున్ను రామానుజుడగు లక్ష్మణదేవరను సజీవునిగ నొనర్చిన సంజీవిపర్వతస్థానమునకు సమీపముననున్న యొకానొకపర్వతమున కొకానొకసిద్ధుడు తనఘోరతపఃప్రభావమున మహేశ్వరుని కృపచే నెరింగియుండెను. పిమ్మట ఆమహానుభావునిచే మాకది వాత్సల్యపూర్వకముగ ప్రసాదింపబడినది. ఇది అన్నివైద్యచిట్కాలవలెనే యని యూహింపరాదు.

అమూల్యమగు మాయమృతబిందు సుఖరోగములకు సుఖకరమగు ఔషధము. బహు సంఖ్యాకులగు అప్సరోంగనలకు వశవర్తుడైన సహస్రాక్షుడు సయితము దీనిని సేవించుచుండెడివాడని నారదాంజనేయ మేడవయాశ్వాసమున స్పష్టముగ నున్నది.

మా అమృతబిందు కఫరోగములను కానరానీయదు. శ్లేష్మరోగములపై చెప్పరాని ప్రభావము. వాతజాడ్యములకు వాత. పైత్యరోగముల పేరుమాపును. వేయేల! రుగ్మతలన్నిటిని రూపుమాపజేయగల శక్తికలది. దేహము రోగపీడితమై యున్నపుడే మాయమృతబిందును సేవింపవలయునని యూహింపరాదు. ఈయౌషధరాజము ముందు రాబోవు రోగములను వారింపగల మహోపకారి. ప్రతియింట బాలగోపాల మందరిచేతను తప్పక సేవింపదగినది. పథ్యము లేదు. వెలసీసా ఒకటికి ౨ రూపాయలు మాత్రమే. గుణమునకు గ్యారంటీ. మోసపోకుండ సీసాపై ముద్రించిన మా 'నాగుపాము' మార్కును గమనించియే కొనుడు. సీసాలు వలయువారు—ఆధునికధన్వంతరి, బ్రహ్మశ్రీ వి. శంకరశాస్త్రి, సంజీవని ఔషధాలయం, లక్ష్మీనగరం అని వ్రాయవలయును.

ఇట్లు:
దేశసేవాపరతంత్రుడు,
వి. శంకరశాస్త్రి.

వైద్యుడు శంకరశాస్త్రి తనవిజ్ఞాపనపత్రమును వ్రాయుట ముగించి, బిగ్గరగా చదువనారంభించెను. అప్పు డాతని నేత్రములందు స్వాభిమానమును, ఆశయు నుట్టిపడుచుండెను. ఇంతలో వెలుపలనుండి ఎవ్వరో యాతనిపిలిచినట్లు వినవచ్చెను. స్వరమునుబట్టి ఆతడు సత్యదేవుడే యని వైద్యు డూహించెను. ప్రసన్నవదను డయ్యెను. రాత్రికాలమున మ-రా-రా-శ్రీ వి. శంకరశాస్త్రిగారికి డబుల్ ఫీజు ఇవ్వవలయును. లాంతరు చేకొని వెలుపలికి వచ్చి చూచుసరికి, అనుకొనినట్లు సత్యదేవపండితుడు విషణ్ణవదనుడై కానవచ్చెను. వెనువెంటనే సత్యదేవుడు వైద్యునిపాదములపై వ్రాలి—"శాస్త్రిగారూ! మీరెట్లైన ననుగ్రహింపవలయును. నా భార్య పార్వతి కొనయూపిరితో నున్నది. ఎట్లైనను ప్రాణము నిలువబెట్టుడు. కారుణ్యము వహించి కష్టపడి ప్రయత్నింపుడు. అటుపైని నాయదృష్ట మెట్లున్న నట్లగును. మీరు ఇపుడు మాయింటికి విచ్చేసి ఆమెను పరీక్షించినచో నాకు ధైర్యము కలుగును. ఆమె మరణించినను చేయవలసినకార్యము చేసినందులకు నాకు కొంత మనశ్శాంతి కలుగును. ద్రవ్యరూపముగా మిమ్ము సంతోషపెట్టుటకు నాప్రస్తుతస్థితి చాలదు. అయినను నాయావజ్జీవమును మీపరిచర్య చేయుదును. ఆజన్మాంతము మీ

యశోగానము గావించుము. ధన మొసంగుటకు మాత్రము నాకు శక్తి లేదు. పరమేశ్వరుని సాక్షిగ పలికిన నావాక్యముల మన్నించి ఒక్కసారి—కేవల మొక్కసారి దయచేయుడు" అను దీనాలాపములకు శంకరశాస్త్రికి మొదట కొంచెము కనికరము కలిగినను, అది అంత్యావస్థయందుండిన దీపికాజ్వాలవలె ఒక్కసారి మెరసినను, వెంటనే శాశ్వతముగ చల్లారెను. ఆయుత్తరక్షణమున ఆతని హృదయరంగమున స్వార్థతాంధకారము గ్రమ్ముకొనెను. పాపము, సత్యదేవుడు భగ్నమనోరథుడై యింటికి వెడలిపోవచ్చెను.

౪

అమావాస్య రాత్రి. వృక్షము లందును నిశ్శబ్దమే.



"పరమేశ్వరుని సాక్షిగ పలికిన నావాక్యముల మన్నించి ఒక్కసారి—కేవల మొక్కసారి దయచేయుడు."

జూదమందు గెలిచినవారు నిద్రించుచుండిన తపసంతానములను మేల్కొలిపి సంతోషసూచకముగ మిఠాయి మున్నగు పారితోషికముల నొసంగుచుండిరి. ఓడినవారు క్రోధితులగు తమకాంతలను క్షమాపణ చేసికొనుచుండిరి. ట్టిసమయమున నొకఘంటాశబ్ద మాయంధకారమును, నిశ్శబ్దమును ఛేదించుకొనుచువచ్చి ఆనగరమంతటను నిండెను. కాలపురుషుని నిరాటంకమగు తాండవమువలె ఘంటాశబ్దము తాళధ్వనివలె నుండెను. తుదకాశబ్దము సత్యదేవపండితుని గృహాభ్యంతరభాగమునయున్న ప్రాతయిండ్లదరికివచ్చి లుప్తమయ్యెను. తిరిగి యెప్పటివలెనిశ్శబ్దమే.

అట్టిసమయమున మనసత్యదేవుడు నిరాశాసముద్రమున మునిగియుండెను. ప్రాణాధికయగు పార్వతికొసగ మిప్పించునంతటి శక్తియైన నాతనికి లేకపోయెనే యను విచార మాతనికి మెండయ్యెను ఇక నేమి చేయగలడు? నిష్ఠురుడగు వైద్యుడు శంకరశాస్త్రి ఎంత బ్రతిమాలినను రాకపోయెనే! ఏమి ప్రయోజనము? పాషాణము ద్రవించునా? మోడు చిగురించునా? వట్టిది. తనపూర్వుల పేరుప్రతిష్ఠలపై నాధారపడియున్న సత్యదేవుని యహంకార మొక్కసారి శిథిల మయ్యెను. ఆతనికి నాడొక క్రొత్తవిషయము తెలిసెను. అరువదిలక్షల రూపాయల అప్పుపత్రములు అరువదిగవ్వల విలువైనను చేయవని ఆతనికి తోచెను. ఆతడు తనపెట్టెయందు భద్రముగ ముఖ్యములుగుడ్డలో మూటగట్టి దాచియుంచిన ఆయప్పుపత్రముల నొకటొకటిగా దీసి చేరువనున్న దీపముఖమున భస్మముచేయ నొడగెను. భోగము లనుభవించిన మానవశరీరము తుదకు చితిపై నుంచబడి యాహుతియగురీతిని ఆకాగితములు వరుసగా తమముఖ్యములుగుడ్డ ముద్దుజీవనమును ఆదీపికాజ్వాలయందు పరిసమాప్తినొందించుకొనుచుండెను. ఇంతలో నెవ్వరో సత్యదేవపండితుని వెలుపలనుండి గొంతెత్తి పిలిచిరి. ఆతడు త్రుళ్లిపడి కలవరొందెను. లేచి వాకిలిలోనికి వచ్చి, చీకటిలో తడవుకొనుచు ద్వారము నద్దకు వచ్చి, తలుపులు తెఱచి చూచుసరికి ఎవ్వరో చేతులందు దివిటీల గొని నిలువబడియున్నట్లును, మార్గమున నొకచెట్టుక్రింద సైరావతములబోలు బలిష్ఠముల తేరగు రెండెడ్లనువారిబండియు నాతనికి దృగ్గోచరం బయ్యెను. ఇంతలో నాబండిలోనుండి యొక సుందరయువకుడు క్రిందికి దిగెను. ఆతనితలపై నెఱ్ఱనిపట్టుపాగయును, నొసటిపై నర్ధచంద్రాకారముగ గంధపుబొట్టును, దాని నడుమ నొకయెఱ్ఱనిచుక్కయు నుండెను. పెదవులపై కోరమీసములును, ముఖారవిందమునుండి వెలువడుచున్న కాంతులును, చూచినను జూడ నాతడొక గొప్పకుటుంబములోనివాడని స్పష్టమగును. ఆతనియంగరఖా, పైజామా, కమరబందునుండి వ్రేలాడుచుండిన ఖడ్గమును, కంఠమందలి బంగారుగొలుసును ఆతని యప్పటివేషమును పూర్తిగావించెను. ద్వారమునందు నిలువబడియున్న సత్యదేవపండితుని జూచినంతనే యాతడు సవినయముగా నమస్కారము జేసెను. ఆతని వినీతభావమునకు గొంత తడవు లజ్జితుడై సత్యదేవపండితుడు, "అయ్యా, తమ రెచ్చోటినుండి విచ్చేయుచున్నారు? మీ పేరేమి? ఇట్లడిగినందులకు క్షమింపుడు" అనుచు మెల్లన ప్రశ్నించుసరి కాయువకుడు వినమ్రుడై, "నా పేరు రామసింగు. నేను మీ దాసుడను. ఈదాసుని నివాసము రాజపురము. అచ్చోట నేనొక జాగిరుదారుడను. మీ పూర్వులు మా వంశీయులపై నమితానురాగమును జూపియుండిరి. కొలది మాత్రమైన యిప్పటి మా ప్రతిష్ఠసంపదలకు మీపూర్వవంశజులే కారణము. వారికృప లేకున్న నే నిట్టి యున్న స్థితికి వచ్చియుండను. మీ పవిత్రనామమును నా బంధువులనోట వినియుండి, మీదర్శనము చేసికొనుటకై వచ్చితిని. తమదర్శనభాగ్యము నాకు లభించినది. నాజన్మము సఫలమైనది" అని ప్రత్యుత్తర మొసంగెను. సత్యదేవపండితుడు తెల్లబోయెను. రామసింగుమాట లాతని కర్థముకాకుంటచే వెఱ్ఱిచూపులుచూడ నారంభించెను. ఆతనినేత్రము లశ్రుజలపూర్ణము లయ్యెను. అది కలయో నిక్కమో యాతడు యూహింపలేకపోయెను; కాని, పైపైక ప్రతిష్ఠ సత్యదేవుని హృదయమందలి కోమలభాగమునంటంజేసి యాతడు కొంతవరకు రామసింగు వాక్యములకు గర్వపడ నారంభించెను. అందుచే, కొలదికాలము క్రిందట నాతనిముఖమునం దేర్పడిన దీనత మటుమాయ మయ్యెను. గంభీరభావ మేర్పడ, "మీరు నన్నూరక పొగడుచున్నారు. మాపూర్వుల యుచితమగు గౌరవము నందుటకు నాకర్హత లేదేమోయని భావించుచున్నాను" అనునంతలో రామసింగునౌకరులు గృహాంగణమున నొక రత్నకంబళమును బరచిరి. ముఖ్యపాత్ర లిరువురును దానిపై నధిష్ఠించిరి.

తరువాత వారిసంభాషణమందు సత్యదేవపండితుని పితామహుడు రామసింగు పితామహునకు ఏబది వేలరూపాయలు వడ్డీకిచ్చియుండినట్లును, రామసింగు గయకు జని, తనపూర్వులకు శ్రాద్ధాదిక్రియ లొనర్చ బూనియున్నట్లును, అట్లు చేయుటకు బూర్వము వారిని ఋణవిముక్తులజేయదలచియున్నదనియును, అందుచే ఆర డేబదివేలరూపాయలు సత్యదేవునకు చెల్లించుటకు వచ్చియుండెననియు స్పష్టమయ్యెను. సవినయముగ, సద్భక్తి

పూర్వకముగ నామహాశయుడు రామసింగు, పండితజీ వైపు ముఖము ద్రిప్పి, "నాపూర్వుల పత్రములన్నియు మీవద్ద నున్న వనుకొందును?" అనుసరికి—ఏమిచెప్పను?—మన సత్యదేవుని ముఖమండలము వర్ణనాతీత మయ్యెను. దేహమంతటను చెమట గ్రమ్మెను. తల తిరుగ నారంభించెను. "నాడు దీపపుజ్వాలయందు కాలి భస్మమైనపత్రములలో నీపత్రముకూడ దహింపబడియుండునా, దేవుడా?" అనునొక పెద్దసంశయ మాతని హృదయమందు పడెను. అందుచే, అతనిగుండెలు తటతట కొట్టుకొన సాగెను. అత డేమియో గుటకలువేయ నారంభించెను. "ఇంకను కొన్నిపత్రము లటులనే యున్నవి కదా! అదృష్టవశమున ఆపత్రము వానిలో నుండరాదా?" అను నూహచే నాతడు కొంతవరకాశావహుడై "ఉండవచ్చును" అని నీళ్లునములుచు ప్రత్యుత్తర మొసంగెను. ధర్మపరాయణుడగు రామసింగు "వెదకుడు, దొరకినచో ధనము చెల్లించి నాపత్రమును నేను దీసికొందును" అనియెను. సత్యదేవుడు మెల్లన లేచెను కాని యాతని హృదయము చల్లబడియుండెను. లోనికి బోవ నుద్యుక్తుడై యాతడు మెల్లనడుగులు వైచుచు తనలో నిట్లు వితర్కించుకొనసాగెను.

"ఈశ్వరా! పత్రము దొరకునా? పత్రము లేనిచో రామసింగు ధన మేల నిచ్చును? 'ధనమిచ్చి పత్రమును దీసికొందు'నని యాత డనెను కదా! ఆహా! చేతిలోపడుటకు సిద్ధముగనున్న యమృత భాండము పగిలిపోవునేమో!" ఈవిధముగ నాశ యొకవంకను, నిరాశ యింకొకవైపున తన హృదయరంగమున పెనగులాడుచుండ సత్యదేవుడు లోనికింజని మినుకుమినుకులాడుచు తానింతకుముందు గావించిన పైశాచికకృత్యమునకు హాసించుచున్నదో యను దీపపుకాంతిని, కాలగామిగిలిన కాగితముల కుప్పను గాంచెను. ఆపత్రముల నాత డట్టునిటు తిరుగవైచి చూచుచు కొంతసేపటి కాతడొక పెద్ద కేక వైచి, యొకానొకపత్రమును చేతగొని, బిగ్గరగ నవ్వుచు, పిచ్చియెత్తినవానివలె గంతులిడ నారంభించెను. పిమ్మట అదేపనిగ, ఆతడు తనభార్య పరుండియుండిన మంచము వద్దకు పరుగిడి, యామె మెడచుట్టును తనచేతులు పెనవైచి లేవనెత్తి, కౌగిలించుకొని, ముద్దిడి, "గృహిణీ, పార్వతీ! ఈశ్వరుని కృపయున్నచో నిన్నిప్పటికైనను బ్రతికింపగల సామర్థ్యము నాకు కలదు." అని సంతోషముతో నుప్పొంగుచు ప్రసన్నవదనుడై యాత డీవలకు వచ్చెను. తనప్రాణాధికయగు పార్వతి ఈలోకమును వీడి ఒక యరగంటకు బూర్వమే స్వర్గారోహణమొనర్చెనని పాప మాయున్మత్తున కెట్లు తెలియును! ఒక్కక్షణముక్రిందట ప్రేమపూర్వకముగ తాను గాఢాలింగన మొనర్చినది తనపార్వతి కాదనియు, అది ఆమెయొక్క జీవరహిత కళేబరమనియు సత్యదేవునకు తెలియనే తెలియదు. పొంగివచ్చుచున్న తన సంతోషతరంగములను బలవంతముగ నాపుకొని చావడిలోని కాతడు సత్వరంబుగ విచ్చేసి, రామసింగు నుద్దేశించి, "అయ్యా! ఇదిగో మీపత్రము చూచుకొనుడు" అని యాకాగితము నాతని హస్తముల నుంచెను.

ఆకస్మికముగ ఫలప్రాప్తిబొందువానికి అనుమానము హెచ్చు. కాగితము చేతిలో పడినతోడనే రామసింగు దానిని ముక్కముక్కలుగాచింపి మొగమున కొట్టి మోసగించునేమోయని సత్యదేవునిమనమున సంకోచము నుదయించెను. కాని యట్టి సందియమునకు తావులేదు; ఏలయన రామసింగు ఆకాగితమును దివిటీలదీప్తిని చూచుకొని, తృప్తిజెంది, తనపందుగుపెట్టెలోనుండి ఏబది, వేయిరూపాయలనోట్లను దీసి తివాచిపైనుంచి, "మహాశయా, సత్యదేవా! ఇదిగో మీరూపాయలు. ఇప్పటికి నాపితామహుడు ఋణవిముక్తుడయ్యెను. ఇక నాకు సెలవొసంగుడు" అనుచు నాతడు తివాచిపైనుండి దిగ్గన లేచి, నమస్కరించి, ఆయూర తనబంధువు లెవ్వరో యున్నారనియు, మరునా డచ్చటనే యుండి, మరుసటిరాత్రి స్వగృహమునకు ప్రయాణము గావింతుననియు నుడివి, యచ్చోటినుండి వెడలెను.

* * * *

సత్యదేవునిహృదయము కొట్టుకొనసాగెను. నాడి తీవ్రమయ్యెను. అతడు నాల్గువైపుల తనవిశాలదృష్టుల బరపి చుట్టుప్రక్కల నెవ్వరును లేకుండుటచూచి ఆ నోట్లకట్టను తనకంపితహస్తములనందుకొనెను. తనయుబ్బు ప్రకృతిని వెల్లడించుట కాతడు నోట్లను రామసింగు సముఖమున లెక్కింపనైనను లేదు.

౫

అమావాస్యరాత్రి. స్వర్గీయదీపికలగు తారలదీప్తి సన్నగిలుచుండెను. సత్యదేవు డింటిలోనికి జనెను. ఆతని హృదయ మాసమయమున నిర్మలౌదార్యప్రకాశముచే నిండియుండెను. ఊరిలోనివారి నందరి నాహ్వానించి, యిష్టదైవ మగు సత్యనారాయణవ్రత మతిశోభతో చేయవలయునని యాతని మొదటి యాలోచన. వ్రతమునాడు తనభార్య పార్వతి ధరించుట కే చీరకొనవలయునను నాలోచన రెండవది. ఇంతలో గృహాంతర్భాగమున దేవు

ములచే స్ఫురితమయ్యెయుండెను. "ఈశ్వరానుగ్రహమువల
మాయిరువురిజీవనమును సుఖముగా గడపుట కీధన
చాలును. చాలు ననసేల! ఇంకెంటు కావలసినదేమి
అని యాతడు ప్రసన్నహృదయుడు డగుచుండెను.
భార్యరోగమునకు వారి నిరుపేదతనమే కారణమ
యూహించిన యాత డీవార్త వినినంతనే పార్వ
నీరోగిణియై లేచి కూరుచుండునని యాతనియుద్దేశము.
యాలోచన యాతనిమనస
నందు కలిగించిన సంతో
మనకు మేరయే లేకుండె
అయ్యో! పాపము! ఇ



"మహాశయా, సత్యదేవా! ఇదిగో మీ రూపాయలు. ఇప్పటికి నాపితామహుడు ఋణవిముక్తు డయ్యెను."

నిల్లు సమీపించి ఆతడు తనయింటివేల్పులకు మనోవాక్కాయకర్మముల సాష్టాంగప్రణామ మాచరించెను. తరువాత మరల చావడిలోనికివచ్చి, కాలగా మిగిలిన యప్పుపత్రము లన్నింటిని భద్రముగా పూర్వపు ముఖములుగుడ్డయందుంచి పెట్టెలో దాచెను. దినదినము క్షీణించుచుండిన తనవంశీయులపై నభిమాన మొక్కపరి ద్విగుణ మయ్యెను. ఆత డాసమయమున ధైర్యోత్సాహ

యూహా లోకమ్మున మస్తిష్కమునందు కల్ల
మొనర్చుచుండ, ఆతడు పార్వతి పరుండియున్న మ
మును సమీపించి, (యాతనియూహాప్రకారము)
రించుచున్న యామెను మేలుకొలుపు నుద్దేశము
నామెపై చేయివైచి కదల్చి, "పార్వతీ, లెమ్
కన్నుల తెరువుము. శ్రీ సత్యనారాయణమూర్తి
ప్రార్థన నంగీకరించినాడు; మనపై తనయద్వితీ

ఉపకారమును కలిగించినాడు......ఇటుచూడు......" పార్వతి లేశమాత్రమైనను కదలకుండుట జూచి, అతడు ఆయమముఖము పైనుండి కప్పియున్న దుప్పటికొన నెత్తి చూచుసరికి—ఏమున్నది? చూచుటయే తడవుగ అతని నోటినుండి కరుణాపూరితమగు "ఆహా!" అను శబ్దము మాత్రము వెడలెను. అతడచ్చటనే మంచముతలపై పు చతికిలబడి వేడికన్నీరు కార్చసాగెను "అయ్యో! ఈ సంపదకు మూల్యము పార్వతి జీవమా?." అని యాతడు గొంతెత్తి యేడువ నారంభించెను. "తనపవిత్రసభాభవనమునకు పార్వతి మణినిగొని, ఆమెకు మారుగా, దైవము నా నెత్తి నీ పాడుధనమును గొట్టెనా? ఈధనమేల? ధనములలో ధనము, లెక్కింపరాని నాధనము, నాసుగుణరాశి, పార్వతి లేకపోయిన తరువాత ఈపాడురూపాయ లేల?— అయ్యో!అయ్యో!" అని యాతడు పలువిధములవాపోవ దొడగెను.

* * * *

౬

అంధకారమయమగు అమావాస్యరాత్రి, అంధకారమయమగు జీవితములలోనే సమాప్తమ రెయ్యెను. పొలములందుకాపులు సంతోషపూర్వకముగయుచ్చైస్స్వరముల పాటలు పాడుకొనుచుండిరి. చలిచే వడకుచుండిన బాలురు సూర్యుడెప్పుడుదయించునాయని యాతురపడుచుండిరి. చెరువుగట్టుపై నీళ్లుతెచ్చువెపమున కూడిన యువతులందరును లోకాభిరామాయణము మా[illegible] లాడుకొనుచుండిరి. వారిలో నొకతె నీటిలో కడవ ముంచుచునాబుడబుడశబ్దము తనయత్తగారు నిద్రించునప్పటి గుఱ్ఱును పోలియున్నదని పరియాచకములాడి తక్కిన వారినందరిని నవ్వించుచుండెను. ఇంటికడనున్న వృద్ధాంగనలు ఏడ్చుచున్న పసిపిల్లల నెత్తికొని, "చెరువుకు పోయి నీళ్లు తెచ్చుట కింతయాలస్యమా?" అని కోడండ్రపై తమ కుమారులు వినునట్లుగ విసుగుకొనుచుండిరి. ఆమాటలను విననివానట్లు నటించుచు పురుషులు వారివారి పనులమీద నుండిరి.

డాక్టరు శంకరశాస్త్రిగారింకను మేలుకొనలేదు. దగ్గుచున్న బాలురతోడను, మూల్గుచున్న ముసలివారితోడను అలసియు[illegible] ంయము ప్రక్కయందు[illegible] డే కిటకిటలాడుచుండెను. ఇట్లుండ నొకవ్యక్తి చేసరిన



"వైద్యరాజా, ఇవి పదివేల రూపాయలు......మీరు మాయింటికి వచ్చి, నాభార్య పార్వతి నొక్కసారి"

తలవెండ్రుకలతో, చెదరుమోములతో, ఎఱ్ఱనినయనములతో, భయంకరరూపములతో, కాగితముల కట్టనొకదానిని చేతులబట్టుకొని, పరుపరుగున వచ్చి ఆయౌషధాలయద్వారమును సమీపించి, కవాటములను శక్తికొలఁది కొట్ట నారంభించెను. ఆవచ్చినవ్యక్తి మనకు పరిచితుఁడగు సత్యదేవపండితుఁడే. ఆతనిచేతియం దున్నది ఏబదివేల రూప్యముల నోట్ల కట్టయే! ఏదో యుపద్రవము సంభవించియుండునని ఖిన్నమతి శంకరశాస్త్రిగారు తన భృత్యుని తలుపు తెరువుమని యాజ్ఞాపించెను. భృత్యుఁడు సత్వరముగ కవాటము తెరచెను. తలవాకిలి తెరువఁబడుటయే తడవుగ, సత్యదేవుఁడు లోపల ప్రవేశించి, అప్పుడే మంచముపైనుండి లేచి కూరుచుండుటకు కష్టముపై ప్రయత్నించుచున్న శంకరశాస్త్రిగారిని ఎదుర్కొనెను. పిమ్మట తనహస్తమందున్న యానోట్లకట్టను వైద్యునకు జూపి, "వైద్యరాజా, ఇవి ఏ బ ది వే ల రూ పా యలు. వీనిని మీకు ఫీజుగా నిత్తును. మీరు మాయింటికి వచ్చి, నా భార్య పార్వతి నొక్కసారి— కేవల మొక్క— చాలును- కనుల తెరచునట్లు గావింపుఁడు. నిర్జీవములగు ఆమె నయనములకు జీవకళల నొసంగుఁడు. ఆమె ప్రేమపూరిత దృక్కిరణముల నాపై నొక్కసారి బరపుకొనవలయునను నభీష్టము జనించినది. కేవల మొక్క కిరణము! మానవజీవముకంటెను మీకు రూపాయలు ఘనముకదా! ఇవిగో రూపాయలు— ఈరూప్యముల గ్రహించి, వీనికంటె నెన్నియో రెట్లు విలువగల నా పార్వతి సజీవదృష్టులను గొనితెమ్ము!—నీవేమి చేగలవు? ఆదృష్టులు పోయినవి! మరిరావు! సుశోభితజలరుహదళములు కుంచించినవి!— శ్వేతముగ కుంచించినవి!— పోయినవి! నాయర్ధాంగి, నాసర్వస్వము, నాప్రేమనిధి, నాపార్వతి!......" అని యత్యంతదుఃఖితుఁ డయ్యెను.

శంకరశాస్త్రి తెల్లబోయెను. గతరాత్రి తాను గావించిన యుపేక్షవలన పాప మాసత్యదేవ విప్రుని భార్య పార్వతమ్మ మరణించెనను వాస్తవాంశము నాతఁడు గ్రహించెను. అతఁడు నీళ్లు నమలుచు, మాటలకు తడవుకొనుచు, "అయ్యా! నాకు చాల విచారముగా నున్నది. నేను మీయెడ నొనర్చిన యపరాధమునకు నన్ను మన్నింపుఁడు. నాబుద్ధి గడ్డితినినది—ధనమే పరమావధి యని నేనూహించితిని. ఆసనమునుజూపియే నాకు మీ రిపుడు తగినశిక్ష నొసంగితిరి. నేను పాపాత్ముఁడను. నను మన్నింపుఁడు" అని శంకరశాస్త్రి విహ్వలముగ పశ్చాత్తాపముతో, సత్యదేవునిపాదముల బట్టుకొనుటకు ప్రయత్నించుచుండ, సత్యదేవుఁడు కెవ్వున కేకవైచి, వికృతముగ నవ్వి వీథిలోనికి పరుగెత్తెను.

సత్యదేవు డున్మత్తుఁ డయ్యెను. దారావియోగదుఃఖ మాతనియెడ యున్మత్తతగా పరిణమించెను. ఆతఁడు నిద్రాహారముల త్యజించి, యుపవాసములచే శుష్కశరీరుఁడై, "పార్వతీ" నామమును జపించుచు మరియొక నెలదినములకు తిరిగి అమావాస్యనాటిరాత్రి లోకమును విడిచెను. మరునాఁడు జనులందరును లక్ష్మీనగరవీథులందు గుమిగూడి, రేయి ఆతనియింటిలోనుండి, "పార్వతీ! వచ్చుచున్నా"నను వాక్యము వినవచ్చె నని ససంభ్రమముగ బలుక నారంభించిరి.

దారిద్ర్యము

పండితారాధ్యుల నాగభూషణము గారు

౧

చింతలను ముంచు ఘనయశశ్శ్రీ నడంచు
ధైర్యముఁ గలంచుఁ గుజనులదఱికిఁ బంచు
స్థైర్య మెడలించు దైన్యంబు సంఘటించు
వలదు పగవానికిని లేమి వలదు వలదు.

౨

మరణ మొకమారె చంపును మానవులను
బ్రతిదినముఁ జంపుచుండును బ్రజల లేమి
లేమికన్నను గష్టంబు లేదు లేదు
మృత్యువె శరణ్య మింక దరిద్రులకును.

౩

స్వస్థలము వీడి యన్యదేశముల కేఁగి
సిగ్గు విడనాడి యొరులకుఁ జేయిఁ జాఁపి
దేహి దేహి యటంచును దేవురించు
జీవి జీవచ్ఛవంబని చెప్పఁదగఁడె.

౪

ఆత్మగౌరవమెల్లను నడఁగిపోవు
ధైర్యమును స్థైర్య మెచటికో తరలిపోవు
కలమనీషాలవంబు గ్రక్కదలిపోవు
ఘోరదారిద్ర్య కలితుఁడౌ పూరుషునకు.

౫

అన్నపానీయములనైన నంటనీదు
కన్నులకు నుంత నిద్దుర కదియనీదు
గ్రంథపఠనంబునకు బుద్ధి కదలనీదు
ఘోరదారిద్ర్యరోగంబు గూరెనేని.

౬.

ఆప్తులును బంధులగు వార లట్టులుండ
నగ్నిసాక్షిగఁ బెండిలియాడినట్టి
యింతియే మాటిమాటికి నీసడించి
విసరికొట్టు దరిద్రుఁడౌ విభునిఁ జూచి.

౭

తెమ్ముతెమ్మంచు నిల్లాలు తీవరించు
నిమ్ముసొమ్మంచు సావుకార్ హెచ్చరించు
నేటికీ బ్రతుకని జనం బేవగించుఁ
బుడమిదారిద్ర్యబాధ నెవ్వఁడు సహించు

౮

కుడువఁ గూడుకాని తొడుఁగ బట్టలుగాని
నిలువ నీడగాని కలుగనట్టి
పేదవాని బ్రతుకు పీడాకరముగాక
సుఖమటంచుఁ గలదె సుంతయేని.

౯

ఇంట నున్న మిగుల నిల్లాలు బాధించు
బయటి కేఁగ సెట్టి బాధవెట్టు
నిలిచియుండ నింక నెల వేడ లభియించు
ప్రేతభూమిదక్క పేద కిలను.

౧౦

వృశ్చికశతంబు మేనఁ జరించినట్లు
కాలసర్పంబు లోకవేయి కరచినట్లు
దారుణంబైన దారిద్ర్యభారమునను
జెప్పరానట్టి వేదనల్ చెందు నరుఁడు.

౧౧

హాలహాలమును నంగిట నదుమవచ్చు
నశనిపాతంబు నౌదల నాఁగవచ్చు
నుగ్రరిపుకోటి నాజిలో నోర్వవచ్చు
నుర్వి దారిద్ర్య భారంబు నోపరాదు.

౧౨

సకలజనులకు మోదంబు సంఘటించు
ప్రకృతియు దరిద్రు సంతోషపరుపలేదు
సన్నిపాతజ్వరార్తుఁడై యున్నరోగి
జిహ్వ కిక్షురసంబు రుచింపనట్లు.



గజదొంగ

పా. వి. రాఘవరావు గారు (సారస్వతమిత్రమండలి)

'ఓరి అయ్యల్లో! అన్నిబియ్యము ముష్టివారి మెదాఁబోసి నాకూటిలో మట్టిఁ గొట్టఁ దలఁచినారఁట రోయి! నాధనము రాళ్లపాలు చేయ నెంచినారఁట రోయి! నా సంసారము సారహీనసహారాయెడారి చేయ నూహించినారఁట రోయి! ఇదియేమి కర్మము. అత్తయ్యా! నీ మొగముమండ! పాలగదిలో పిల్లిలాగున నాయింటి కెట్లు దాపురించినావే! ఓ కన్యకాపరమేశ్వరీ! తల్లీ! ఈ శనిదేవతల నీ నోటవేసికొని పోయితివేని నీ కీసంవత్సరము అరణాఅరఁటిపళ్లు, కుంకుమ, అర్పించుకొనియెదను. అమ్మా! రక్షించు! ఈయింటిలోని ముండలందఱు సెనగపప్పువలె నాధనమంతయుఁ దిని వైచుచున్నారు.' అని వెంకటసెట్టి నోటికివచ్చినట్లఱచుచు, వీథిగుమ్మముపైఁ జదికిలఁబడెను.

వెంకటసెట్టి ఆయూరిలోనున్న వారందఱలో మిక్కిలి ధనవంతుఁడని పేరుఁ బడసినాఁడు. లక్షలకొలఁదిరూక లాతనికొట్లలోఁ బడి మూల్గుచుండెను. అందు దమ్మిడీయైన ఖర్చుచేయఁడు. కర్మముచాలక ఖర్చుచేసెనా తిరిగి ఆదమ్మిడీకొట్టులోఁ బడవైచువఱ కాతని హృదయమం దిసుమంతయేనియు శాంతి యుండదు. కాన ఆయూరివారందఱు ఆతనికి 'దమ్మిడీసెట్టి' యని పేరిడిరి.

ఛీ! ధనము కలవాని కెంతలోభత్వమో! తనధనము వెచ్చపెట్టుదురేమో యను దిగులుచేఁ దనయాప్తుల నెగురకేసికొని పొమ్మని కన్యకాపరమేశ్వరికి మ్రొక్కులిడుచున్నాఁడే. ధనము సంపాదించుటకై తగనిప్రయత్నము లొనర్చుచున్నాఁడే; కాళులఁ బట్టుకొనుచున్నాఁడే; కోర్టులెక్కుచున్నాఁడే; ప్రమాణములఁ జేయుచున్నాఁడే; ప్లీడర్ల కాశఁ బెట్టుచున్నాఁడే; వ్యాజ్యము గెల్చినపిదప వారికి తొంటచేయిఁజూపుచున్నాఁడే; వారియుసురుఁ దినుచున్నాఁడే. సంపాదించినధనము దాఁచు నిమిత్తమై తహతహలాడుచున్నాఁడే; నిద్రాహారము లెఱుఁగక భక్తునివలె నినుపపెట్టెకడ భజన లొనర్చుచున్నాఁడే. కాంపౌండువడ్డీల కప్పులిచ్చుచున్నాఁడే. తప్పుపత్రముల సృష్టించుచున్నాఁడే. ఋణముఁ దీసికొనినయాతఁడు 'దివాలా' తీయఁగ 'బారు'మని యెక్కయేడ్చుచున్నాఁడే. నలువురచేఁ దిట్లు తినుచున్నాఁడే. తిట్లుదీవన లగుచున్నవి. పాపిచిరాయు వగుచున్నాఁడు.

* * * *

వీథిలోనుండి పరుగెత్తుకొనివచ్చుచు వెంకట సెట్టితో నతని కుమారుఁడు, 'అయ్యా! అయ్యా! బడిలోని మా పంతులే అయ్యా! ఊఁ ఒక్కటోపీ కొనమన్నాఁ డయ్యా! అది తలపై లేనిదే బడిలోనికి రానియ్యఁడఁట అయ్యా! నా కొకటోపీ కొనవూ' అనెను. అంత సెట్టి, 'ఓరీ! వెఱ్ఱి మొగమా! మన కా కిరస్తాని' వేషా లెందుకయ్యా! కోమటికి టోపీ యెందుకయ్యా! ఆపంతులు పాపయ్యశాస్త్రియేనా! కానిమ్ము. దొంగముండకొడుకు. రేపు విఘ్నేశ్వరునిచవితికి మీచే పూజచేయించి దక్షిణ అడిగినప్పుడు వానిపని పట్టించెదను. అత్తయ్య పాలకాయలు చేసినది పోయినను; లేకపోయిన మిగులవు.' అని కొమరుని మెల్లగా లోని కంపెను.

మఱియొక నిముసమునకు సెట్టి సేవకుఁడొకఁడు ఒక ఉత్తరముఁ దీసికొనివచ్చి సెట్టి చేత నిడిపోయెను. ఆయుత్తరము సెట్టి ఇట్లు చదువుకొనెను:—

'వెంకటసెట్టిగారికి—
మీ ఇనుపపెట్టె నీరాత్రి దొంగిలింపఁదలఁచు కొంటిని. జాగ్రత్త. పాడుధనము పోయినఁ బోవునుగాని ప్రాణముఁగాచికొనుఁడు.

భవదీయమిత్రుఁడు:
"గజదొం:."

ఇక మన సెట్టిని వర్ణింప నలవి కాదు. సరస్వతీదేవి 'అలవైకుంఠపురంబులో' అను పద్యము వ్రాసి వైకుంఠవర్ణనఁ జేసెనుగాని, మన సెట్టి ప్రస్తుతపుస్థితి వర్ణింపఁ గలదో లేదో చెప్ప లేము. సెట్టి కరగడియవఱకును నోట మాట లేదు. "ఓధనదేవతా! ఇంకేమున్నది. నమస్కారము. పోయెదవా? ఎంతకాలమునుండి నిన్నుఁ బూజఁ జేయుచుంటిని. భక్తునిపైఁ గరుణ లేదా? నిన్ను నిత్యము సంస్తుతిఁ జేయుటకై దుర్గయ్యచేతిలోఁ బదివరాలు పోసి, పద్యములను, దండకములను వ్రాయించితినే. దయ లేదా? పోయెదవా? అయ్యో!" అని వెక్కి వెక్కి యేడువ మొదలిడెను.

అంత సెట్టితండ్రియగు పద్దయ్య అటకు వచ్చి, 'వెఱ్ఱిమొగమా, వెక్కి వెక్కి యేడ్చుచుంటి వేమయ్యా' అనెను. అంత సెట్టి, "అయ్యా! ఊరకే యేడ్చుటకు నేను నాటకములలో వేషములు వేయువాఁడనా? ఈ యూరివారి దృష్టిదోషము నాకు తగిలినది. సెట్టి యింటిలో నిలువెత్తు ఇనుపపెట్టెయున్నదని జనులందఱువారిపుట్టిమునిఁగి పోయిన ట్లేడ్చుచున్నారు.' అని అనెను. పద్దయ్య, ఏమిటయ్యా! వెఱ్ఱిచదువు. కారణము లేకుండ నట్లు కన్నీరు కార్చుచుంటి వేమి? 'అనెను' కారణము కాగితములో నున్నది చూడు' మని గజదొంగ వ్రాసినయుత్తరము వెంకటసెట్టి పద్దయ్య చేత నిడెను. పద్దయ్య ఉత్తరముఁ జదివిచూచుకొని, 'వెఱ్ఱి మొగమా! ఆలస్యము చేయక రఘునాథరావుగారింటికిఁ బొ'మ్మని చెప్పి, తాను లోనికిఁ బోయెను.

సెట్టి పైనుత్తరీయము వైచుకొని రఘునాథరావుగారిఇంటికిఁ బరుగెత్తెను. ప్రపంచమున జనులకందఱకును అసామాన్యమగు వస్తువులఁ జూచుటయందుఁ గాని, చేష్టలఁ దిలకించుట యందుఁగాని, సంగతుల వినుటయందుఁ గాని

కుతూహల మెక్కువ. సంతలోనికి నాల్గు చెవులగేదె వచ్చిన దనఁగానె, చేయుపనుల నన్నిటివిడిచి, గడపదాఁటియెఱుఁగని కాంతా మణులు సహితము పరుగెత్తెదరు. ఎన్నఁడును ఆంధ్రపత్రికఁ జూచినపాపమునకుఁబోని నిగర్వ చూడామణి నక్కకు కుక్కపిల్లలు పుట్టినవని సంగతి వినఁగానె క్లబ్బునకుఁ బయనమగును. స్థూలకాయులఁ జూచిన నరుల కుత్సాహము మెండు. అతఁడు నడువఁగఁ జూచిన మఱింత యుత్సాహము. అట్టియెడ వర్ణింప నలవికాని వసన్సెట్టి పరుగెత్తునసమయమందు జనుల యా నందము అపారము; అవర్ణనీయము. ఎందు లకో ఆఆనందము వారికే తెలియదు.

*   *   *   *

౨

సుప్రసిద్ధాపరాధపరిశోధకు లగు రఘు నాథరావుగారు తమ గదిలోఁ గూరుచుండి తమ కెదురుగఁ గూరుచున్న తమశిష్యు లగు జయదేవుగారితో నిట్లు మాటలాడుచుండిరి:

రఘు—జయదేవ్! నేను ముసలివాఁడ నైతిని. దేహదార్ఢ్యము తగ్గుచున్నది. ఇఁక నే నీపాట్లు పడఁజాలను. నీ పీకార్యముల నిఁక మీఁద నెఱవేర్చుచుండవలెను.

జయ—ఈ detective పనికి life మీఁది ఆశలు వదలిపెట్టవలయును. Life must be left to itself as 'unsavoury snuff'. సంసార మం దున్నయాతఁడ ట్లాచరించుట కష్టము. మా బోఁటి bachelors మాత్రమే ఈ పనికిఁ బనికి వచ్చెదరు. మఱియు enterprising spirit లేని వారీపని కక్కఱకురారు. Generally enterprisingspirit exists in bachelors. కాన మన మెటుచూచినను bachelors మాత్రమే ఈ యుద్యోగమునకుం బనికివచ్చెదరు. ప్రస్తుతము నేను bachelor నే కదా. ఇఁక వివాహముఁ జేసికొనఁదలఁచుకొనలేదు. Single blessedness, double wrechedness అని నా అభిప్రాయము. విధివశమునఁ బెండ్లి చేసికొనిన మాత్ర మీమాయతోలుబొమ్మ లెంతకాల ము బ్రదుకును. Mors omnibus communis. కాన నేను ముదముతో నాపై పడినభారము మోయ సంసిద్ధుఁడను.

రఘు—నీన్యాయవాద వృత్తియిందెంత మాత్ర మక్కఱకు రాదుసుమా!

జయ— అయ్యా! నే నెఱుఁగనా? Suggestio falsi, Suppressio veri' అనెడు motto ఎప్పుడుపయోగపడుపను. మఱియు నా intellectual capacity నేను చెప్పుకొనినయె డలఁబాలహీళనముగా నుండును. Exaggeration అని పల్గురు నన్ను దూషింతురు. ఈ కాలపుజనులలోనున్న కర్మమే యిది. They cannot discover a true hero. నిజముగ Arsene Lupin అను నాతఁ డున్నయెడల నిముసములో నాతని చేతి కరదండములఁ దగిల్చి పాదాక్రాంతునిఁగఁ జేయగల్గు మేధా వంతుఁడను. తా మెఱుఁగని దేమున్నది?

రఘు—సరియె లెమ్ము నీశక్తిఁ ద్వరలోఁ జూపింతువు గాక!

అంతఁ రోఁజుకొనుచు మన సెట్టి రఘునాథ రావుగారి యింటఁ బ్రవేశించెను.

జయ—A living specimen of Shylock.

రఘు—ఏమోయీ! సెట్టీ! అంతత్వరగా నడుదెంచుటకుఁ గారణమేమి?

సెట్టి—బాబూ! తొందరగా వచ్చినను రెండుఘంటలు తీసికొనినది.

రఘు—జట్కాబండిపై రాలేదా?

సెట్టి—(లోన) ఓరయ్యో జట్కాబండియే. (పైకి) బాబూ! నడచినగాని శరీరము గట్టిపడదని వైద్యుఁ డనుటచే నడచివచ్చితిని.

రఘు—(లోన) అమ్మ దొంగముండ కొడుకా! ఎంతయుక్తిగా మాటలాడితివి. (పైకి) నీవు వచ్చినపని యేమి?

సెట్టి—బాబూ! గొప్పవారిని జూచుటకుఁ బని యేముండును?

రఘు— అటులైనఁ జూచితివి కాన పొమ్ము.

సెట్టి—చిత్తము. బాబూ! చిన్న మనవి కలదు. చిత్తగించవలయును.

రఘు—త్వరగఁ దెలుపుము.

సెట్టి—బాబూ! ఈకాగితమును చిత్తగించండి. దాని జూచినప్పటినుండియు నాకు తిండి లోనికిఁ బోవుట లేదు.

రఘు—(ఉత్తరముఁ జూచి) జయదేవు! ఈఉత్తరమును జూడుము.

జయ—(చూచి) సెట్టీ! నే నీరాత్రి నీ యింటికి వచ్చెదను. నీకేమియు భయము లేదు. ఇనుపపెట్టెగూర్చి విచారింపఁదగదు. పొమ్ము.

సెట్టి (లోన) ఈ దొంగముండకొడుకెవఁడో? (రఘునాథరావుగారివైపుఁ జూచి చేతులు నులిమికొనుచు) చిత్తము. చిత్తము.

రఘు—సెట్టీ! నీకేమియు భయము లేదు. నేనైన నేమి, నాకన్నివిధముల మిన్నయగు నా శిష్యుఁడైన నేమి? త్వరగఁ బొమ్ము.


సెట్టి తల వంచుకొని నిష్క్రమించెను. రఘునాథరావుగారు పని యున్నదని లోనికిఁ జనిరి. జయదేవు మాత్ర మాలోచనా నిమగ్నుఁడై కూరుచుండెను. అప్రయత్నముగ, Sherlock holmes అనియు, Maurice Leblanc అనియు, ఏవియో సందర్భశూన్యములగుమాటలాడుచుండెను. ఆఁకలి యెక్కువగుటచే జయదేవు కింక ఆలోచన సాగలేదు. త్వరగక్షుద్బాధా నివారణకై ప్రక్కనున్న అయ్యరు గారి 'ఆంధ్రహోము'లోనికిఁ బరువెత్తెను. ఆహా! అయ్యరుగారి కాంధ్రులపై నెంతయభిమానము!

3


సాయంకాల మాఱు గంట లాయెను. సూర్యుఁడు పశ్చిమాంభోనిధిని సమీపించుకొలఁదిని సెట్టిభయ మధికమగుచుండెను. ఆ దినమున సెట్టి చేయుచున్న రామభజనలకంతము లేదు. ఒకొక్కమా రినుపపెట్టెను గౌఁగిలించుకొని బారున నేడ్చుచున్నాఁడు; ఒకొక్కపరి సాష్టాంగ నమస్కారము లాచరించుచున్నాఁడు; ప్రదక్షిణములఁ జేయుచున్నాఁడు; పాటలఁ బాడుచున్నాఁడు; ఇంటిలోనివారలఁ దెడఁదిట్టుచున్నాఁడు.

ప్రాచీనభారతీయలోహపరిశ్రమలు

బొంబాయిరాజధానియందలి రాగి, ఇత్తడి సామానులు.—౧౯ శతాబ్దపు టుత్తరార్థము



౫. గొలుసుల దీపములు



౭. పూనా, కచ్ఛిప్రాంతముల ఇత్తడిపళ్లెములు

ఏడుగంట లగునరికి సెట్టి వీథితలుపు నెవరో తట్టిరి. సెట్టి పరుగునఁబోయి తలుపుఁ దీసెను. జయదేవుఁ డిరువురు రక్షకభటులతో [illegible]నేఁ బ్రవేశించెను. వారిని జూచినతోడనే సెట్టి కన్నులయం దమృతము వర్షించెను. ఇనుపపెట్టెయున్న గదికి సెట్టి జయదేవుని తీసి కొనిపోయెను. రక్షకభటులు వారి ననుసరించిరి. అంత సెట్టి, 'ఈగ్రహములుకూడ నెందులకు బాబూ! మీరొక్కరు చాలరా? అల్లరియేకాని మరేమిగలదు. ఏమో! ఏ గడియ కెవరి కేబుద్ధిపుట్టునో ఇనుపపెట్టెను జూచిన తోడనే, దురూహపొడమి, వారు మిమ్ములఁ జంపి పెట్టెనెత్తుకొనిపోవుదు రేమో జాగ్రత్త!' అనెను. అంత జయదేవుమందహాసముతో సెట్టీ! [illegible]సిని వెనుక పూర్వసువాసిని ఎంతఅవసర మాడి ఇట్టీవుకన్నుపెట్టరు వెనుక రక్షకభటు లంతయావశ్యకము తెలిసెనా? వారులేని దేకార్యము నెఱవేఱు నెట్లు? ఇంత యనుమానము కల్గినవాఁడవు నన్నేల సందేహింపవు? కాన నేఁ బోయెదను' అనెను. అంత సెట్టి, 'బాబూ! క్షమించండి! రక్షించండి. బుద్ధిగడ్డితినది. డబ్బు మీఁది ప్రేమచే నోఁడలు తెలియక కారులాడితిని. రండోయి రక్షకభటులారా!' అనెను.

అంత జయదేవు 'ఏమోయీ! సెట్టీ! భోజనముచేసిరమ్ము. ఈజయదేవుఁ డుండఁగ నీకేమియు భయము లేదు. పోయి'రమ్మనెను.

రాత్రి యెనిమిదిగంటలాయెను. సెట్టిజయదేవు లిట్లు మాటలాడుకొనుచుండిరి:

జయ—రాత్రి లోని కెవ్వరిని రానీయ కూడదు సుమా!

సెట్టి—చిత్తము.

జయ—నీ తాళములిటు తెమ్ము.

సెట్టి—(భయముతో) తాళము లెందుకు?

జయ—తాళములునీదగ్గఱనుండఁతగదు.

సెట్టి—ఎందుచేత?

జయ—ఇచ్చెదవా లేదా? ఈయకున్న మొదల నేఁబోయెదను. నీకర్మము.

సెట్టి—బాబూ! అంతమాటే. కోమటి కుజ్జువానిపై నంతఆగ్రహమే. ఇదిగో బాబూ తాళము చెవులగుత్తి. (ఇచ్చును).

జయ—మంచిది. నీవు పోయి నీగదిలోఁ బరుండుము.

సెట్టి—చిత్తము. బాబూ! ప్రొద్దుట మీకు మీసములు లేవుగదా ఇప్పు డెట్లు వచ్చినవి?

జయ—సెట్టీ! ఎంత తెలివితక్కువవాఁడ వోయి నీవు! నిముసమున కొక వేసముతో నగపడుటయే అపరాధపరిశోధకుల ఘనత. అట్లుకానిమొదల నపరాధులఁ బట్టుకొనుట మాతరమగునా?

సెట్టి—చిత్తము. సెలవుతీసికొనెదను.

అని తనగదిలోనికిఁ బోయెను.

రాత్రి తొమ్మిదిఘంటలకు సెట్టి వీథితలుపు నెవరో తట్టిరి. కాని తలుపుఁదీయునంతటి తెలివితేటలు కలవా రెవ్వరు?

* * * *

తెల్లవారెను. సెట్టి బట్ట సర్దుకొనుచు నినుపపెట్టె యున్న గదిలోనికిఁ బోయెను. ఆఁ. అదిగోను!! సెట్టి నిలు వెల్లవడఁకుచున్నాఁడే!!!

వెఱ్ఱిమొగముతోఁ జూచుచున్నాఁడే. ఇనుప పెట్టెతలుపు తీసియున్నది. అందొక్కరూకయైనను లేదు. జయదేవుఁడును రక్షకభటులును గూడ కనఁబడలేదు. అంత సెట్టి, 'ఈడిటెక్టీవు ముండకొడుకు నాకొంపఁగూల్చినాఁడు. నన్ను నమ్మించి నాగొంతుకతడిగుడ్డతోఁ గోసినాఁడు. తాళము లెఱుఁగక ఆ దిక్కుమాలినవాని చేతిలోఁ బెట్టితినే. అయ్యల్లో! లోప లేమి చేయుచున్నారురోయి! నాధనము పోయినది రోయి! కంచెయే చేనుమేసిన దిది యేమికర్మ మురోయి! కానిమ్ము. ఈజయదేవు నా కగపడఁడా. అప్పుడు వానిపని పట్టించెదను. మొగముపై నిప్పులు పోసెదను!' అని అఱచుచుండెను. చేత నొకకాగిత ముడిచికొని త్వరగ, జయదేవుఁడు సెట్టియింటఁ బ్రవేశించెను. ఆతనికొడలుపై తెలియుట లేదు. అతఁడుకన్నుల నగ్నికణములఁ గ్రక్కుచు, 'సెట్టీ! బుద్ధిహీనుఁడా! రాత్రి తొమ్మిదిగంటలకుఁ దలుపుతట్టినఁ దీయక లోపలనే యేడ్చుచుంటివి. తగిన శాస్తియైనది. నీబోఁటి తెలివితక్కువ నరుల కట్టులే కావలయును. లేనియెడల నోడల మద మణఁగదు. అనెను. ఆపలుకుల వినుటతోడనే సెట్టికి కోపము హెచ్చెను. ధనముపోయినదని యేడ్చుచుండఁగా తెలివితక్కువవాఁడవనెడు పల్కు చెవులఁబడఁగానే, 'ఆఁ ఏమనుచుంటివి. రాత్రి తొమ్మిదిగంటలకు వచ్చితివా. ఎనిమిది గంటలకు ఇరువుర రక్షకభటులతో రొయ్యలిూనముల వేషముతో సిద్ధపడిన దాసరయ్య యెవఁడు? నిముసమున కొక వేసము వేయుదుననని పల్కిన డాబులరాయఁ డెవఁడు? నీవేగా? మర్యాదాహీనుఁడా, మాటలుతిన్నఁగరానిమ్ము; మాఅయ్య మంచివాఁడు కాఁడు'. అని వ్యాజ్యము గెల్చుట కాధారములేక వాగ్ధాటిచే విజయముఁ గాంచఁదలఁచిన న్యాయవాదివలె [illegible]చెను. 'సెట్టీ! శాంతినొందుము. ఈయుత్తరముఁ జూచుకొను'మని జయదేవు ఒక కాగిత మాతని మొగమునఁ బాఱవైచెను. సెట్టి ఆయుత్తరము నీక్రీతిగాఁ జదువుకొనెను.

అపరాధి పరిశోధకాగ్రగణ్యులగు జయదేవు గారికి—

అయ్యా! నమస్కారములు.

నేను నిన్న సాయంకాలము మిూవేషము వేసికొని సెట్టియింటఁ బ్రవేశించి, ఆతఁడు నాకిచ్చిన తాళములతో నాతని ఇనుపపెట్టెలోని వస్తువులన్నియు గ్రహించితిని. సెట్టి [illegible] విచారించుచుండును. ఆతని నేడ్పించుటకిష్టము లేదు కాన ఱేపు రాత్రి మిూరుభయులు రాజమహేంద్రవరములో ఇన్నీసుపేటలోని 960 నంబరు గృహమునకు వచ్చిన తిరిగిఇచ్చివేయుదును. మిూప్రాణముల కేమియు భయము లేదని నొక్కిచెప్పుచున్నాను.

ఇట్లు,
మీపు తమరాకకై వేచియుండు
భవదీయమిత్రుఁడు
"గజదొంగ."

'సెట్టీ! లెమ్ము; రాజమహేంద్రవరము పోవుదము.

౪

ఆనాఁటిసాయంకాలము నాల్గుగంటలకు కాకినాడ టౌను ప్లాట్ఫారముమిూద జయ


దేవుఁడును, వెంకటసెట్టియు కూర్చుండియుండిరి. బండివచ్చువేళ యైనది. జయదేవు వెంకటసెట్టి చేతికిఁ గొంతసొమ్మిచ్చి రెండుటిక్కెట్లు తీసికొనిరమ్మనెను. సెట్టి బుక్కింగుఆఫీసులోనికిఁ బోయి రెండుఇంటరుమీడియేటు టిక్కెట్లు రాజమహేంద్రవరమునకుఁ గొని పైకిఁ బోయెను. ఇంతవఱకు చుట్టగాల్చుకొనుచు కునికిపాట్లుపడుచున్న అసిష్టాంటుస్టేషనుమాస్టరు 'Damn Dirty Devil Probationers!' లోనుండి టిక్కెట్లనీయవలదని మీకెన్నిసారులు చెప్పితిని? చేసెడు వెధవపనులన్నియు మీరు, వచ్చెడు చీవాట్లు మాకు' అనివిసుగుకొనెను.

రైలు ప్లాటుఫారముమీఁదికి వచ్చెను. జయదేవు, సెట్టియు బండినెక్కిరి. 'ఎందులకు వచ్చెనురా భగవంతుఁడా'యని బండి యేడ్చుచు సామర్లకోటఁ జేరెను. మనకథానాయకులిరువురును బండిదిగి, అచ్చట కప్పుడే వచ్చిన మెయిలుబండినెక్కిరి.

రాత్రి యేడుఘంట లగుసరికి రాజమహేంద్రవరముఁ జేరిరి. హోటలులో భోజనముఁ జేసి ఇన్నిసుపేటలో పెద్దయంకెలతో 960 అని యున్నగృహమునఁ బ్రవేశించిరి. ఇరువురు సేవకులు వారి నెదుర్కొని మేడమీఁదికిఁ దీసికొనిపోయిరి. వారిరువురు కుర్చీలపై ఆసీనులైరి. సెట్టి నిల్వుగ్రుడ్లు వైచుకొని ఇటునటు చూచుచుండెను. సేవకులలోనొకఁడు సెట్టిగొంతుక నొక్కెను. 'బే'యని సెట్టి చెవిగోసిన మేఁకవలె నఱచుచు గిలగిలకొట్టుకొనుచుండెను. అంత జయదేవుఁ డిదియే సమయమనుకొని, 'మిమ్ములనందఱ నిదే చంపుచుంటి'నని రివాల్వరు కొఱకయి జేబులోఁ జేయి పెట్టెను. వెనుకనున్న రెండవసేవకుఁడు జయదేవుచేయిఁ బట్టుకొని, 'జయదేవ్' అని పిలిచెను.

అంత జయదేవు నిశ్చేష్టుఁడై 'రఘునాథజీ' అని పిలిచెను. అంత రఘునాథరావు, 'జయదేవ్! గజదొంగను నేనేసుమీ' అనెను. 'అటులైన మీ చేతి కరదండములఁ దగిల్చెద' ననెను. 'నాయనా! ఇదిగో నీ చేతి కరదండముల దగుల్చుచుంటి'నని జయదేవుని కరదండములు వైచెను; రఘునాథరావు '961 నెంబరు కల గృహములో నీ వకారణముగ అల్లరి చేయుచుంటివి గాన నీకీశిక్ష విధించితి' ననెను. అంత జయదేవు, 'ఆఁ' ఇది 910 వ నంబరుగల యిల్లు కాదా' అనెను. 'కాదు నీ గర్వభంగమునకై ఈయింటిపైనున్న నంబరు తుడిచివైచి 960 నంబరు వైచితిని, చూడుము. నిజముగ ఇది 961 వ నంబరు గృహమే' అని ఇంటినంబరు చూపెను. 'నీవు చిన్నవాఁడవు. అపరాధపరిశోధనయం దారితేరని వాఁడవు. అట్టి నీకు తలకు మించిన పలుకులు తగవు' అని రఘునాథరావుగారనిరి.

'అయ్యా! క్షమింపవలయు'నని జయదేవు రఘునాథుని కాళ్లపైఁ బడెను. 'ఇది నీ ఒకటిన్నర తెలివితక్కువ'యని సెట్టి తన తెలివితక్కువను వడ్డీతో జయదేవుని కప్పఁజెప్పెను.



శ్రావణాశ్రువులు

పెనుమర్తి వేంకటరత్నము గారు [యువకవిమండలి]

౧

మరల వచ్చెను శ్రావణమాసలక్ష్మి
తోఁటకె దిక్తటులందు మాధుర్యవృష్టి
నీలనీరధరాగ్రమందిరములందుఁ
దాండవించెను విద్యుల్లతామతల్లి.

భూమితలగతసౌదామినీమనోజ్ఞ
మధురమూర్తులు శ్రావణ మాసవేళ
శాంకరీపదాబ్జాతపూజాప్రసాద
ములు గ్రహించి పుణ్యాంగనల్ వెలిఁగినారు!

దివ్యమాహేశ్వరీ పదాంతికములందు
మోడ్పుఁగనుదోయితోఁడుత మోఁకరిల్లి
వినతు లొసఁగెడు మాయమ్మ కనఁబడదట
చర్మచక్షుస్సులత్యవిశ్వమున యందు!

అంతలోన మాతల్లి జన్మాంతవేళ
స్మృతిపథంబునవచ్చి వేచెను సహస్ర
కాళరాత్రి విషాదాలకములమల్లి
కజ్జలఘనాఘనమ్ములఁ గందళించి.

౨

ఆయగమ్యనిశీథరహస్యవీథి
హైమవత కందరాగ్ర గౌరీమతల్లి
పాదములకడ నున్న నీ స్వాదుమూర్తి
కన్నుఁగవపొంత నాకు సాక్షాత్కరించె.

ఆకరాళకజ్జలజలదాంతరాత్రి
భయదమైన తమస్సులో నయన యుగ్మ
చంచలమైన నీప్రభాశంప వెలిఁగి
మన్మదశ్రువర్షాంబువుల్ మల్లడించె.

బాహిరమైన యీవిశ్వభాగమందు
మామకీనాంతరాళమ్ము మధ్యమందు
ఏకరీతిగా ప్రావృడుద్రేక మెలసి
తల్లి! నాశరీరోష్ణమ్ము చల్లవడియె!

లక్ష్మీరామేశ్వరము

నరహరిసెట్టి వెంకటరత్నముగారు

౧

ఆమె "నిజముగా చెప్పండి; మరల పెళ్లి చేసుకోరు కదూ?" అనెను. రామేశ్వరుడు దీనవదనముతో, "లక్ష్మి! నీమాటలు నేను విన జాలను. ఈరోజున ఏమిటి నీవు నాహృదయ మును దహింప జేస్తున్నావు." అనెను.

లక్ష్మి రామేశ్వరుని భార్య. ఇరువురును నూతనయౌవనులు. రామేశ్వరుడు ఇరువదినా లుగువత్సరముల ప్రాయము వాడు; లక్ష్మి పదునెనిమిది వర్షముల యువతీమణి. ఒక దిన మున అపరాహ్ణసమయమున ఈసతీపతు లిరు వురు చతురంగము ఆడుకొనుచుండిరి. ఆటన డుమ లక్ష్మి సంభాషణమును మార్చి పైవిధ మున దీసికొనివచ్చినది. సహజకోమలహృద యుడు—రామేశ్వరుడు ప్రియతమ, మితభా షిణి యగు లక్ష్మి ఇట్లు మాటాడుట గని ...శ్చర్యపడుటయే కాక అంతరంగమున జాల బాధ ననుభవించుచుండెను.

లక్ష్మి లేనినవ్వు తెచ్చుకొని మిగుల మధురము, మిగుల కఠినము గాని కంఠస్వర మున "మీ మనసుకు బాధ కలిగించవలె నని నామతము కాదు. మీ రేమనుకొనినా సరే, ఈ ఒక్క విషయములో నాకు స్వేచ్ఛ ప్రసా దించి నిక్కముగా జవాబు చెప్పండి. ఇక నేనేమీ మాటాడను." అని పతివైపు పిచ్చి దాని వలె జూచుచుండెను. ఆచూపులో భావ మేమియు లేదు. అర్థ మంతకన్న లేదు.

రామేశ్వరునకు నెన్నడు లక్ష్మిపై గోప ము రాలేదు. అప్పుడప్పుడు రామేశ్వరుడు భార్యను గోపించుచుండునని లోకు లనుకొనె దరుగాని ఆమాటలో గొంచెమైనను సత్యము లేకపోలేదు. ఇంతవఱకు నాతడు జూపినది కృత్రిమకోపము. వివాహమై ఆరువత్సర ములు గడచినవి. లక్ష్మిపై నిజమైనకోప మా తనికి ఈరోజున మాత్రమే వచ్చినది. రామే శ్వరుడు చటాలున దనప్రక్కనున్న తిలకు గారి "కర్మయోగశాస్త్రము" దీసి శిరసున బెట్టుకొని కోపముతో, "లక్ష్మి! ఇదే నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను. నా లక్ష్మి జీవించి యున్నను లేకపోయినను నేను పరస్త్రీ ముఖ ము తలయెత్తి చూడను. (కొంచెము సేపూర కుండి) ఇకనైనా నన్ను వదలుదువా?" అని చతురంగపుఆట సాగించెను.

పతివ్రతాశిరోమణి యగు లక్ష్మి తల వంచుకొనినది; ఒకటి రెండు అశ్రుబిందువులు కనుకొలంకుల నుండి జారినవి. భర్త ఆవిషయము గాంచలేదని యాముద్దరా లనుకొనెను గాని రామేశ్వరుడు మాత్రము చూడక పోలేదు. అతని నవనీతకోమల హృదయము విదారిత మైపోవుచుండెను. జోస్యము చెప్పగల వారైనను ఆరంగము గాంచి రామేశ్వరు నిది "అసలైనప్రేమ" అని యనకుండ జాలరు.

౨

పదునొకండు మాసములు గడచినవి. లక్ష్మి మార్గశీర్ష బహుళ ఏకాదశినాడు అర్ధరాత్రమున ఆడశిశువును ప్రసవించినది. కాలగర్భాన లీనమగుచున్న వా రందఱు నేల అట్లగుచుండిరో ఎవరు సిద్ధాంతీకరించి చెప్పగలరు? బహుళద్వాదశి—సాయంసమయము. అంధకారము మెలమెల్లన ఆవరించుచున్నది. అనంతనీలాకాశము, పక్షులు, వృక్షములు, మందపవనుడు—సర్వముగూడ దుఃఖించుచున్న భంగి తోచుచున్నవి. లక్ష్మి—ప్రాణవాయువు ఈ పాంచభౌతిక దేహమును విడిచిపెట్టి పోయినది. పుల్లగ్రామమున—ఆ దుఃఖమయభవనమున ఎల్లరు దుఃఖితహృదయులై యుండిరి. ఒకరిద్దరు మాత్రము బిగ్గరగా నేడ్చుచున్నారు.

ఒకవిరాగి ఆత్రోవను బోవుచు "ఎందుకు దుఃఖపడతారు?" అనుకొనెను.

3

పరమేశ్వరుడు—"లక్ష్మిఅను ఈఆత్మ నరకలోకానికి పోవాలి." లక్ష్మిఆత్మ—"ప్రభూ! నరకలోకానికి పోవడానికి! నాకేమీ అభ్యంతరము లేదు. మీ ఆజ్ఞానుసారము అల్లాగ వెళ్తాను. నాభర్త, నేను చాలా అన్యోన్యంగా ఉండేవాళ్లము. నేను మానవశరీరములో ఉన్నప్పుడు ఆయనను విడిచి ఎప్పుడూ ఉండలేదు: ఆయన్ను విడవవలసివస్తుందని పుట్టింటికి కూడా వెళ్లలేదు. ఆయన కూడా నేనంటే అంతప్రేమాతిశయముతో ఉండేవారు. మీ ఆజ్ఞ అయింది; విడవలేక విడవలేక నాప్రాణేశ్వరుని విడిచివచ్చాను. ఏమిచెయ్యను; విడిచి రావలసి వచ్చింది. ఒక్కసారి నే నాయన్ను దర్శించుకు రావడానికి—ఓదార్చడానికి సెలవు దయచేయించండి ప్రభూ! ఆయన నాకోసము ఎంతదఃఖిస్తూ ఉంటారో నే నేమిమనవి చేయగలను! ఒక నిముసమైనా విడవకుండా ఉండే నాహృదయేశ్వరుని అపారదుఃఖసముద్రములో—నిబిడాంధకారమున విడిచివచ్చేశాను. నన్ను విడిచి—ప్రియతమనైన ఈదాసిని విడిచి నాప్రియతముడు ఎల్లా ఉంటున్నాడో భావించుటకు కూడా నేను సహించలేకుండా ఉన్నాను. ఆయన్ని నేను పువ్వుల్లో పెట్టి పూజించేదాన్ని. అంత కోమలంగా ఉండే ఆ సుకుమారమూర్తిని "నాకోసము దుఃఖించవద్దు; జరగవలసినట్టు జరుగుతుంది" అని ఓదార్చి కన్నీరు తుడిచి వస్తాను. సర్వము తెలిసిన ప్రభువగు నీకు నేనేమి చెప్పగలను? దేవా, సెలవు దయచేయించండి!" అని వినయవినమితయై చెప్పుకొనెను. పరమేశ్వరుడు—"వెళ్లి రమ్ము".

౪

ఆత్మ పరలోకమును విడిచి భూలోకమును ప్రవేశించెను; భర్తృగృహో[న్ముఖ]మై వెళ్లుచున్నది. ఇంతలో నౌకరయారునందు రామేశ్వరుని కంఠస్వరము వినిపించెను. ఆ యాత్మ త్వరితముగ నామందిరమును ప్రవేశించి రామేశ్వరుడు నవనవోన్మేషయగు నౌకరమణీమణి చెంత గూరుచుండి ప్రణయ సల్లాపము లాడుచుండుట గాంచినది. "ఏమీ! ఈమెయెవతె—ఔరా, అప్పుడే ద్వితీయ వివాహమా!—మోసము, మోసము, ఇంతకన్న మోసమున్నదా, ఏలోకములోనైనా?

ఇచట కూర్చున్నది నాప్రాణేశ్వరుడేనా! ఇట్లు జరుగుతుందా? ఆ ప్రేమ, ఆ ఆదరము, ఆ అభిమానము ఎక్కడికి పోయినవి. ఎంతో దుఃఖిస్తూ ఉంటాడనుకొన్న నాభర్త ఆనందమున నోలలాడుటయా?—నేను నమ్మజాలను.

ఏమీ! ఆనాడు భగవద్గీత నెత్తిపై బెట్టుకొని ప్రమాణము కూడ చేసెనే. ప్రమాణముతో లెక్కయేమి? అంతప్రేమతో ఉండే భర్త—ఇంకేలోకములోనూ ఉండడనుకున్న నాభర్తయేనా ఇట్లయిపోవుట. అయ్యో దేవా! నీవెంత విచిత్రవర్తనుడవు! నాభర్త లోపమేమియు లేదు. నీదే బాధ్యత—

అయ్యయ్యో, పరమేశ్వరుని తూలనాడుతున్నానా? 'సర్వము నీవే, నీవు లేకపోతే ఏమీ లేదు' అనుచుండే నాభర్తననవలెను కాని. నన్ను శాశ్వత ధర్మపత్నిగా స్వీకరించినట్లు అగ్నిసాక్షిగా ప్రతినకూడా చేసెనే! 'నిజమైన ప్రేమ నాభర్తది. ఇతరుల దండఱిది బూటకపుప్రేమ' అనుకొన్న నేను 'అది ప్రేమ కాదు, కామము' అని అనుకొనవలసి వచ్చిందా ప్రభూ! దేహాన్ని మాత్రమే కామించే భర్త నిజమైన భర్త యెట్లగును?—

ఈతడె దైవము; వేరే దైవము లేడనుకొన్నేదాన్ని. ఒకసారి ఒక నెచ్చెలి భర్తను దైవములాగు చూడాలి కాని భర్త దైవము కాజాలడు అని చెప్పింది. అప్పట్లో ఆమె మాట లెక్క చెయ్యలేదు. 'ఈతనికంటె ప్రేమింపదగినది ప్రపంచంలో ఇంకేమీ లేదు: ఈయనే నేను; నేనే ఈయన' అనుకొని ప్రేమించినందుకా ఇట్లు మోసగించుట! అయ్యో ప్రభూ! నిన్ను గ్రహించుట ఎల్లాగు?

ఇక ఆచంటిపాపగతి ఏమవుతుందో. ఇంత చిత్తచాంచల్యము గల మానవులను నమ్ముటెట్లాగు? 'పురుషులను నమ్మకూడ' దని దేవుడు వ్రాసిపెట్టి ఉంచాడు కాబోలు. ఆసంగతి యింతవరకు తెలిసికోలేకపోయాను. ఇంకా యెందుకిక్కడ? ఇక పోతాను." అనుకొని పరలోకమునకు ప్రయాణమయ్యెను.

౫

లక్ష్మి పరమేశ్వరుని దివ్యసన్నిధికి జని, "దేవా! నన్నిక నరకలోకానికి పంపండి" అనెను.

పరమేశ్వరుడు "నీవిక నరకలోకానికి వెళ్లవలసిన ఆవశ్యకత లేదు. నువ్వు ఇట్టి పతిని దైవముగా భావించావు. దైవ మొకడున్న సంగతే మఱచి ఆతడే దైవ మనుకున్నావు.

భర్తను భార్య దైవము లాగున నెంచి గౌరవించవచ్చును, కాని అతడే దైవ మనుకొనుట కూడనిపని. ఇప్పుడు నీవుపడిన పశ్చాత్తాపము వల్లనీదోషము పోయింది.—ఇక నీవు పవిత్రమైన దానవు. స్వర్గానికి వెళ్లి ఆనందమున ఉండు. సత్యమైన ప్రేమామృతము ఇక్కడొక్క చోటనే అనుభవించగలవు కాని ఇంకెక్కడా నీకా ప్రేమామృతము లభింపదు. పోయి శాంతి నిలయము, ఆనందనిలయము, ప్రేమనిలయము అయినస్వర్గధామంలో ఉండు" అని ఆశీర్వదించెను.

లక్ష్మి ఇప్పుడు ప్రశాంతినికేతనమగు ప్రేమానంద నిలయమున సంకల్పరహితయై యున్నది.



రాగాతిశయము

దుగ్గిరాల పల్లంరాజు, పానుగంటి చిరంజీవిరావుగార్లు

ప్రవిమలంబగు మామకభావవీథి
తెక్కగదలని నిగమాంతరీతుఁ నీవుఁ
జక్కదైననుఁ బొడువనిఁ చోటు వెదకి
కేల నీముద్దు పిల్లనగ్రోలు పట్టి
దర్శనం బిచ్చినావు సంతసమె కాని
పెదవిఁ గదుపవు మొగ్గలు విరియునయ్య!
కళలు పరువొందు నీచిన్నిగళము నెత్తి
యొక్కస్వర మూఁదు, తేనియ లూరఁ గృష్ణ!

చిలుకపలుకు, వసంతకోకిలరవంబు,
నళిరుతము మించి యొయ్యార మతిశయించు
సరససంగీతమాధురీ స్వరయుతమగు
రాగ మేదయ్య! నాదువరాలతండ్రి!
చిన్నవాఁడవె! యింత యాచింపవలెనె
తలఁపుమున్నెరుఁ బరిసెలఁ ద్రాగుదువఁట
తెలియఁగాలేవె? నావాంఛ తెలిసి యొక్క
రాగమును బాడనేమయ్య, రసికవర్య,
గానలోల! నీ వేనాఁడు వేణువొత్తి
పాడినాఁడవో చల్లని వరుసలెల్ల
వింటినో లేదో నాఁడు నీ వేణురవము
నూఁదు మఱియొక్కమాఱు మహోత్సవముగ
పథముఁ దెలిపెదు నీ కనుపాపఁబట్టి
ఊర్ధ్వనేత్రము నల్ల చేయూఁతఁ బూని
నొక్కునొక్కున నొకమెట్టు నెక్కనీదు
స్వరముతో నందుకొందును స్వర్గకలము
ముద్దుకృష్ణయ్య! చిన్నారి మురళి నెత్తి
యాలసింపవె తొల్లి నీవల్ల గొల్ల
పల్లె నూఁదిన మధురసుస్వరము దివ్య
మోహనంబైన రాగ మారోహణమున.

శ్రీమతత్రయాచార్యులు

తిరుక్కోవలూరు మహాస్వామి శ్రీకుమార ఆదివరాహాచార్యులుగారు

మన భరతఖండమునఁ గల మతములు వేదబాహ్యములు, అవైదికములు, వైదికములు నని ముత్తెఱఁగులఁ గలవన్నవి. ఇందు వైదికములు ద్వైతము, అద్వైతము, విశిష్టాద్వైతము నను పేరుల సాంప్రదాయసిద్ధములై బహుముఖముల నిర్యాస్యర్యభూమి నలంకరించియున్నవి.

ఈమతత్రయములో నాయామతముల సాంప్రదాయసిద్ధములగు గురుపరంపరా ధ్యానశ్లోకముల నను యీత్రిమతములును శ్రీనారాయణుని చేతనే యుపదేశింపఁబడి యాయామహర్షులచేతఁ బ్రచారమునకుఁ దేఁబడియున్నను, కలియుగమునఁ దటస్థించిన చార్వాకబౌద్ధాదిబాహ్యదుర్మతముల వలని విప్లవమున శ్రీశంకరులు, కల్యాది సుస్వతిరొవిమిశశతాబ్దమున శ్రీశంకరభగవత్పాదు లవతరించి యద్వైతమును, కల్యాది నలువదిరెండవశతాబ్దమున శ్రీ భగవద్రామానుజు లవతరించి విశిష్టాద్వైతమును, కల్యాది నల్వదినాల్గవశతాబ్దమున శ్రీమధ్వతీర్థు లవతరించి ద్వైతమును బునరుద్ధారపూర్వకముగ సంస్కరించి ప్రతిష్ఠించియున్నారు. ఆ యద్వైతవిశిష్టాద్వైతద్వైతములకు శంకరమతమనియు, రామానుజమతమనియు, మధ్వమతమనియు నపవాదములు లా సంస్కర్తల పేరులనే యిప్పటికిని వాడఁబడుచున్నవి.

అట్టి యీత్రిమతములవారికిని మతమును, ధర్మమును, ఆచారమును ప్రతిపాదించు శ్రుతిస్మృతులు మున్నగు ప్రమాణవ్యవహారమంతయు నేకముగనే యున్నను, ప్రమేయవ్యవహారమునమాత్రము మహావిరోధ మున్నట్లు దేనికది వేఱుపడియుండుటయేకాక యొండొరులకు వ్యతిరేకముగ నుండునట్లు శాస్త్రాధారము లేకున్నను, మతాచార్యు లంగీకరింపకున్నను,* శ్రౌతస్మార్తయాచారములఁ గల్పించుకొని వానిని సాంప్రదాయసిద్ధములగు సదాచారము లని వాదించుచున్నారు. ఇంతేకాక వాని నవలంబింపకున్నవారిని బలాత్కరించియైన నవలంబింపఁ జేయుచున్నారు.

పైపెచ్చు ఆహ్నికసమయముల నొండొరులను జూడకయు, భోజనకాలమున నొండొరులను జూచుటయు నపవిత్రముగ నెంచుచున్నారు.

ఇట్లు తమలోఁ దాము కలహించుకొనుటయేకాక కాలమాహాత్మ్యమునో, మఱి యేకారణమునో గాని యీత్రిమతాచార్యులలో నొకమతాచార్యునిఁ దక్కిన రెండుమతములవారు నగర్వశత్రువుఁగ భావించుచున్నారు. కొందఱు మాటలనేకాక గ్రంథములయందును కఠోరముగ దూషించుచున్నారు.

పురాతనుఁడును, సజాతీయుఁడును నొకమతమును బ్రతిష్ఠించినవాఁడును, బూజ్యపాదుఁడును నగు నొక మతాచార్యునియందు (ఇప్పటికి) తక్కిన రెండుమతముల వారికి నంతటివైరము కలుగుట కతము విచిత్రతరము.

---

* శ్రుతిస్మృతులు నిషేధించుచున్నను ఒక క్షేత్రమాహాత్మ్యమునందలి మాటను పాటించి (అదియు నంతగ ననుసరింపరు) యద్వైతులు భస్మోద్ధూళనపుండ్రమును పై భస్మత్రిపుండ్రమును, దానిపై చందన తిర్యక్పుండ్రమును, తిలకమును ధరించుటయు, శాస్త్రమును, మతాచార్యుల యభిప్రాయమును వీరి విశిష్టాద్వైతులు అతిథ్యమహాయజ్ఞమునకు హానికరముగఁ దమలో దాసినఁ గనియుక తెలుసు భిగించుటయు మొదలైనవి.

కావున నిమ్మతములకు పరస్పరవైర మిప్పుడే కలిగినదికాదు? లేక పూర్వమునుండియు వచ్చుచున్నది యా? అని యాలోచించిన, నీత్రిమతములు వీకలియుగము నందలి యిమ్మతాచార్యులచేతనే క్రొత్తగ స్థాపింపఁ బడినవికావు కదా యని తేటపడును. సృష్ట్యాదినే వేదముల ప్రచారము ననుసరించి యీమతములును ప్రచారమునకు వచ్చియున్నవి. వీరి గురుపరంపరలును ఇవి యాగ్నములని యు, అనాదులనియు, ప్రతిపాదించుచున్నవి. ఈమత త్రయభాష్యములఁ బరిశీలించినను నీవిషయమె స్ఫురించుచున్నది.

అట్టియెడ నీత్రిమతములు ఋషిపరంపరలయందుఁ జాలకాలము ప్రచారము నొందియుండవచ్చును కదా! శ్రీ బ్రహ్మలై ప్రతి మహర్షియుఁ దనమతమువాఁడేయని వాగాడంబరముచేత సాధింపఁ జూచుచున్నను, పూర్వపు మహర్షులలోఁ గొంద అద్వైతులుగను, గొందఱు విశిష్టాద్వైతులుగను, గొందఱు ద్వైతులుగను నుండి తీరవలయును. ఇప్పుడైనను నిష్పాక్షికముగ విమర్శకదృష్టితో శ్రుతిస్మృతీతిహాసపురాణాదులను బరిశీలించినఁ జాలవఱకు నీఋషి యీమతమువాఁడని వైనము తేలగలదు. ఇఁక గొందఱుమాత్రము గొంతకాల మొక మతమున నుండి తరువాత మఱియొక మతమును స్వీకరించి నట్లును స్పష్టపడఁగలదు.

అట్లు పూర్వయుగములయందుఁ గల మహర్షులలో నైతము నియ్యంటగానితనముఁ, జాడరానితనము కలదనుటకు నవకాశము నొసంగు ప్రమాణము మాత్రము లేదు. కావుననే అమ్మహర్షులు యజ్ఞములయందును, బరిషత్తులయందును, ఆతిథ్యములయందును ఒండొరులఁ గలియుచు గౌరవించుకొనుచునే యున్నారు. కాని యీపాపము మాత్రము లేదని స్పష్టముగఁ జెప్పవచ్చును. పలయు నేని సోదాహరణముగ నిరూపింపవచ్చును. లేకున్న శాస్త్రములయందలి పూర్వోక్తి వచనములలోఁ దమ యాచారమునకుఁ బ్రతికూలించుచు సమన్వయింప నలవికాని యాగ్న వచనములను బ్రక్షిప్తములని రొంగఁదొట్టుచు, మహర్షులందఱు దమ మతమువారేయనియుఁ, దమమతమే యాగ్న మతమనియు నిష్పటికమవారు చెప్పుకొనునట్లు పూర్వ యుగములనొక్కరి మత మేయుండెననియెంచవలసివచ్చును.

అట్లనుటకు దక్షునిక్రత్వంతము, ఋషులసత్రయాగము, జనకునిపరిషత్తు గున్నగ నాఖ్యాయికలు కల్పనా మాత్రములై యసత్యములు కావలసివచ్చును. పై పెచ్చు "ఆపూర్వయుగములయందలి వైదికమతమేది" యను విమాంసకులోనై దేనికిని నిలుకడ చిక్కక యన్నియు నసత్యములే కావలసివచ్చును.

కావున మహర్షులకాలమునం దీత్రిమతములు ప్రచారములో నున్నను ఈవిపరీతవిరోధములు మాత్రము లేవనుట స్పష్టము.

ఐన నీద్వైషమ్యము లిమ్మతాచార్యుల [illegible] నుండి కలిగియుండవచ్చు ననుకొన్నను, అద్వైషమ్య లౌకికసాధారణమా? సిద్ధాంతము ననుసరించినదియా? అవతారములనుండి కలిగినదియా? అని యాలోచింపవలయును. ఇంతకన్న వేఱొకకారణము కనుపడదు.

అందు లౌకికసాధారణ మనుటకు నయ్యాచార్యులు మువ్వురును వేర్వేరు కాలముల నున్నవారు; కావున నది యసంగతము. ఇదికాక వారు రచియించిన ప్రస్థానత్రయమునఁబను నుపనిషద్బ్రహ్మసూత్ర గీతాభాష్యములలో వారు విశేషించి బాహ్యదుర్వాదములను ఖండించుటకును, శ్రుతులను సమన్వయించుటకును బ్రయత్నించి యున్నారేకాని యొండొరులను దూషించుకొని కాని, యధిక్షేపించుకొని కాని యుండలేదు. ఎటులేని యొకదొకదూషణ మున్నను అది వాదము నుద్దేశించినదియే కాని వాది నుద్దేశించినది కాదు. * అయినను వారివారికి

* శ్రీరామానుజాచార్యుల పరమాచార్యులగు శ్రీ యామునాచార్యులు రచియించిన సిద్ధిత్రయమునందు, "తత్రాస్మిన్నాత్మనిపరస్మిఁ శ్చానేకవిధా విప్రతిపత్తయ స్తీర్థకరాణాం" (అందు ఈఆత్మపరమాత్మలవిషయము నందు పూర్వమతాచార్యులకు పలురకముల విప్రతిపత్తులుకలవు) అనియును, "ఆచార్యటంక భర్తృప్రపంచ భర్తృమిత్ర భర్తృహరి బ్రహ్మదత్తశంకర శ్రీవత్సాంక భాష్కరాదివిరచిత" అని స్వమతమతాచార్యులను "నాచార్య" పదమును చేర్చి సమష్టిగ చెప్పియున్నారు. ఇందు తక్కిన యేడుగురును అద్వైతములోని నానవిశేషముల ననుసరించి భాష్యములను వ్రాసినవారు. శ్రీవత్సాంకాచార్యులు విశిష్టాద్వైతభాష్యము వ్రాసినవారు.

వచ్చియున్న సిద్ధాంతము ననుసరించి బాహ్యకుదృష్ట్యాదుల ఖండించుచు శ్రుతులను సమన్వయించి యున్నారు.

ఇక సిద్ధాంతము ననుసరించి యనుటకు విమర్శదృష్టితో వారి వాఙ్మయమును పరిశీలించిన శంకరాచార్యులు అభేదముక్తిని, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు భేదముక్తిని ప్రతిపాదించియున్నారు. ఐనను రామానుజమధ్వాచార్యులు ప్రతిపాదించిన పరమముక్తిని సగుణముక్తి యను పేర శంకరాచార్యులు తాను సిద్ధాంతీకరించిన నిర్గుణముక్తికన్న నొకించుక క్రిందిమెట్టుగ నంగీకరించియున్నారు. శంకరాచార్యులు ప్రతిపాదించిన నిర్గుణముక్తిని కైవల్యముక్తి యను పేర రామానుజాచార్య మధ్వాచార్యులు తాము సిద్ధాంతీకరించిన భగవదనుభవరూపమగు పరమముక్తికన్న నొకించుక క్రిందిమెట్టుగ నంగీకరించియున్నారు.

అయినను శంకరమతమున నీ సగుణనిర్గుణముక్తులు రెండును, రామానుజానంద తీర్థమతముల నీ కైవల్య భగవదనుభవముక్తులు రెండును అపునరావృత్తికములే, పరమసుఖకరములే.

మఱియు నీ రామానుజ మధ్వతీర్థులు ప్రతిపాదించిన జీవేశ్వరభేదము శంకరమతమునందును అనాదియే. అనాది యగునది సాంతము కానేరదు. పరిణామప్రాయమగు నైక్యము నొందుటయే * తప్ప జీవత్వము నశించుననియు శంకరవాఙ్మయమునందు లేదు. జీవునకు జన్మనాశములు కలవనుటయును శంకరునకు సమ్మతములు కావు. శంకరుఁడు ప్రతిపాదించిన జీవేశ్వరాద్వైతము రామానుజ మధ్వమతములయందును బరమపురుషుని సర్వాత్మకత్వ సర్వవ్యాపకత్వములు మున్నగు ధర్మవిశేషములచేత శంకరుని రైక్యభావనకు సమన్వయ మగునే కాని ప్రతికూలింపదు.

శబ్దార్థవైచిత్ర్యములచేత స్ఫురించు కొంచెపు దారతమ్యములను బట్టుదలలచేత లాగిలాగి పొడగించి గోరంతలు కొండంతలు చేయుకొలఁదిని యిమ్మతములు దేనికది వేర్వేఱుగ నున్నట్లు కన్పట్టునే కాని, పట్టుదలను, పక్షపాతమును విడిచి, సమరసదృష్టితో నాలోచించిన నీయుభయుల మతములు మధ్యసమ్మతములుగనే స్పష్టపడగలవు. ప్రధానమల్లనిబర్హణన్యాయమున నీ రెండువిషయములను మాత్ర మిక్కడ నుదాహరించినాఁడను.

ఇక నవతారములనుండి కలిగినది యనుటకు శంకరభగవత్పాదులు శంకరుని యవతారమనియు, భగవద్రామానుజులు శేషుని యవతారమనియు, మధ్వతీర్థులు హనుమంతుని యవతారమనియు ఆ యా మతగ్రంథముల వలనను, వాతుకవలనను స్పష్టపడుచున్నది.

కావున వీరి యవతారములకు కారణమూర్తులగు శివుఁడు, శేషుఁడు, హనుమంతుఁడు నను వీరికి పరస్పరము సంబంధమే కాని, వైషమ్యమే కాని కలదాయని గమనించి చూచిన సమష్టిగను అవతారమునందును, అధికారమునందును పరస్పరము కలయికయే కనుపడుచున్నది. అది యైనను పరమేశ్వరుని సర్వాత్మకత్వము ననుసరించినది కాక వ్యష్టిమూర్తి యగు వ్యూహమూర్తి ననుసరించినదే.

లోకానుగ్రహార్థము తనసంకల్పముచేతఁ బూర్ణషాడ్గుణ్యమగు వాసుదేవస్వరూపమును బరిగ్రహించియున్న పరమపురుషుని దివ్యాంశములు సృష్టిస్థితిసంహారముల కొఱకు ప్రద్యుమ్నానిరుద్ధసంకర్షణులను దివ్యమూర్తులఁ బరిగ్రహించి, రజస్సత్త్వతమోగుణముల నవలంబించి, త్రిమూర్తుల నధిష్ఠించి, జగత్కార్యము నెరవేర్చుచున్నట్లు పాంచరాత్రభాగవతవిష్ణుపురాణాదులయందు స్పష్టపడుచున్నది. శంకరాచార్యులును బ్రహ్మసూత్రభాష్యము అసంభవాధికరణములో స్పష్టముగా దీని నంగీకరించియున్నారు.

---

* పరిణామప్రాయమగు నైక్యము అనఁగా సూర్యకాంతిలోఁ గలిసిన నక్షత్రకాంతివలె (ఇక్కడ కాంతియే దృష్టాంతము కాని సూర్యుఁడు నక్షత్రములు కావు) నణుమాత్ర చిద్రూపుఁడగు జీవుఁడు అనంతచిన్మయమగు బ్రహ్మములో గలియుట. ఐనను కొద్దిగొప్ప తారతమ్యములచేతను, సజాతీయత్వముచేతను వేఱువేఱుగ స్ఫురింపకున్నను, కలిసియుండియున్నను మహత్తరములో నల్పతర మిమిడియున్నదే కాని అదియే యిది కానేరదు. దేనిపాటి కదియే ప్రకాశించుచుండును.

(శైవగ్రంథములలో వాసుదేవునిస్థానమునఁ బరమశివునిఁ జెప్పినను (ప్రమాతృల యధిష్ఠానము సమానమే).

కావునఁ దమోగుణవిశిష్టమై సంహారకారణ మగు సంకర్షణమూర్తి యను భగవదంశము—

శ్లో. "రుద్రః కాలోఽన్తకాద్యాశ్చ
సమస్తాశ్చైవ జన్తవః,
చతుర్ధా ప్రళయాయైతా
జనార్దనవిభూతయః."


విష్ణుపురాణము, ప్రథమాంశము—౨౨వ అధ్యాయము.

(ఆ సంకర్షణుని దివ్యాంశములో నొకభాగము రుద్రుఁడుగను, ఒకభాగము కాలముగను, ఒకభాగము యముఁడు,మృత్యువు,ప్రళయభూతములు మొదలైనవారుగను, ఒకభాగము ఒండొరులఁ జంపుకొను సకలజంతువులుగను- ఇట్లు ప్రళయమునకొఱకు నాలుగువిధములుగ నున్నవి. అన్నట్లు శివుఁడు సంకర్షణుని యవతారమనుట స్పష్టము.

[భాగవతము షష్ఠస్కంధము చిత్రకేతూపాఖ్యానము:]. "జగామ దేవదేవస్య శేషస్య చరణాంతికం" (ఆచిత్రకేతుఁడు దేవదేవుఁ డగు శేషునిపాదసన్నిధికి వచ్చెను)అని శ్రీశుకుఁడు చెప్పుటచేతను,"అహంసమాధాయ మనో యథాహ సంకర్షణస్తచ్చరణారవిందే" (సంకర్షణమూర్తి చెప్పినట్లే నేను ఆతనిపాదములయందు మనస్సును చేర్చి) అని వృత్రాసురుఁ డింద్రునితోఁ జెప్పుట చేతను ఆసంకర్షణుఁడే శేషుఁడనియుఁగనుపడుచున్నది.

అయినను, [విష్ణుపురాణము ప్రథమాంశము ౫వ అధ్యాయము:] "పాతాళానాం మధశ్చాస్తే విష్ణోర్యా తామసీ తనుః, శేషాఖ్యా"(విష్ణువుయొక్క తమోగుణస్వరూపుఁడగు శేషుఁడుపాతాళమునకుఁ గ్రిందనుండును)అనియు, "కల్పాంతే యస్యవక్త్రేభ్యో విషానలశిఖోజ్జ్వలః, సంకర్షణాత్మకో రుద్రో నిష్క్రమ్యాత్తి జగత్త్రయం; సబిభ్రచ్ఛేఖరీభూత మశేషం క్షితిమండలం, ఆస్తే పాతాళమూలస్థః శేషః" (కల్పాంతమునందు ఏ శేషునిముఖముల నుండి వెలువడినట్టి విషాగ్నిజ్వాలలతోఁ గూడినవాఁడై సంకర్షణాత్మకుఁడగు రుద్రుఁడు బయలువెడలి ముల్లోకములను దహించునో, ఆ శేషుఁడు భూమండలమును ధరించుచుఁ బాతాళమూలమున నుండును). అన్నట్లు ఈ శేషుఁడు భగవంతుని తమోగుణవిశిష్టమగు నవతారముగను, లయకర్తగను స్పష్టమగుచున్నాఁడు. ఇట్లు అర్థము చేసిననే సర్వసామరస్యము కలుగును. ఎట్లన—

సంకర్షణాంశ ప్రణాళిక



ఆసంకర్షణుని యొక్క యంశము శేషునియందధిష్ఠించి భూభారమును భరింపఁజేయుచు, మఱియొక్క యంశము నాలుగు భాగములుగ కాలము, శివుఁడు, యముఁడు మృత్యువు మొదలైనవారు, తమలో తాము చంపుకొను [illegible]ంపులు నను నీనాలుగింటి నధిష్ఠించి నిత్యసంహారమును, ప్రళయము మున్నగు నైమిత్తికసంహారమును జరిగించుచున్నది. కావున నీ శేషుఁడు, శివుఁడు నను నుభయులును సంకర్షణుని యవతారమూర్తులే కాని భిన్నవ్యక్తులు కానేరరు.

ఇట్లు శేషుఁడు భగవంతుని యవతారము కావుననే, "శ్లో. అనంతః ప్రథమం రూపం త్రేతాయాం లక్ష్మణస్తథా, ద్వాపరే బలభద్రస్తు కలౌ కశ్చిద్భవిష్యతి" (శేషుఁడు మొదటి రూపము, త్రేతాయుగమున లక్ష్మణుఁడు, ద్వాపరమున బలరాముఁడు, కలియుగమున నొకానొకఁడుగ నవతరించును) అను పురాణోక్తియందును శేషుఁడు మొదటిరూపము, అనగా కృతయుగమునందలి యవతారమనియే స్ఫురించుచున్నది.

మఱియును చిత్రకేతుఁడు పాతాళమునకేఁగి శేషునాశ్రయించియున్నను, పార్వతి చిత్రకేతుని శపించిననుక శ్రీరుద్రుఁడు పార్వతితో, "ఆత్మత్వాత్సర్వభూతానాం సర్వభూతప్రియో హరిః, తస్యచాయం మహాభాగశ్చిత్రకేతుః ప్రియానుగః" (భగవంతుఁడగు హరి సర్వభూతములకు నంతరాత్ముఁడు కావున సర్వభూతములకు ప్రియుఁడైనవాఁడు. ఆవిష్ణువున కీచిత్రకేతుఁడు ప్రియానుచరుఁడు) అని చెప్పినదియు, నీ శేషుని యవతారములగు లక్ష్మణుని, బలరాముని భగవదవతారములని ఇతిహాసపురాణాదులు వచించుటయు నీయంశాంశిత్వరూపమగు నైక్యము ననుసరించియే. ఇట్లు కాకున్న సమన్వయమే కలుగదు.

ఇక సృష్టికర్తలగు బ్రహ్మాదులను, రక్షణకర్తలగు యజ్ఞవైకుంఠాదులను, లయకర్తలగు రుద్రయమాదులను భగవంతులనియు, భగవదవతారములనియు స్మృతీతిహాసపురాణాదులు చెప్పుటయు నీయంశాంశిత్వరూపమగు నైక్యము ననుసరించియే.

ఇట్లే కాకున్న నీస్మృతులు మున్నగు నార్షవాఙ్మయమునకు పరస్పరవ్యాహతి యట్లుండ, స్వవచనవ్యాఘాతము సైతము తటస్థించితీరును అందుకతన విపరీతలక్షణమగు మూలచ్ఛేదమే పర్యవసానము కాఁగలదు.

ఇదిగాక శ్రీభాగవతము "సిద్ధచారణసేవితః" (సిద్ధులచేతను, చారణులచేతను సేవింపఁబడువాఁడు) అనియు, విష్ణుపురాణము "యోనంతః పఠ్యతే సిద్ధైః" (ఏ శేషుఁడు సిద్ధులచేత పొగడఁబడుచున్నాఁడో) అనియు, నీ శేషుఁడు సిద్ధులు, చారణులు మున్నగు యోగసిద్ధులచేత సేవింపఁబడువాఁడు అని చెప్పియున్నందున శేషునకు విద్యాధీశ్వరత్వము స్పష్టమగుచున్నది. అట్టివాఁడేకదా జ్ఞానప్రదుఁడును! కావుననే "జ్ఞానం మహేశ్వరాదిచ్ఛేత్" (మహేశ్వరునుండి జ్ఞానమును కోరవలయును) అను స్మృతివచనము సైతము శివునకు విద్యాధీశ్వరత్వమును, జ్ఞానప్రదత్వమును వ్యక్తీకరించుచున్నది.

కావుననే విద్యలకన్నిటికిని బునాదియగు వ్యాకరణశాస్త్రమునకుఁ బ్రాతిపదికములగు "అఇఉణ్" ఇత్యాది సూత్రములు మాహేశ్వరసూత్రములని ప్రసిద్ధినందుటయు, "యేనాక్షర సమామ్నాయ మధిగమ్య మహేశ్వరాత్, కృత్స్నం వ్యాకరణం ప్రోక్తం తస్మై పాణినయే నమః" (ఎవఁడు అక్షరామ్నాయమగు చతుర్దశసూత్రములను మహేశ్వరునుండి పడసి సమగ్రముగు వ్యాకరణమును రచియించెనో ఆపాణినికి నమస్కారము) అన్నట్లు ఆచార్యపాణిని యమ్మహేశ్వరునుండి మహేశ్వరసూత్రములను గ్రహించి వ్యాకరణశాస్త్రమును రచించుటయు, పాణినీయమగు అష్టాధ్యాయికి మహాభాష్యమును, యోగశాస్త్రమును రచించిన యాచార్యపతంజలి శేషుని యవతారమగుటయు నుపపన్నములగుచున్నవి.

కావున ప్రవృత్తికాలమున యమాదులు లయకర్తలై యుండ విద్యాజ్ఞానముల నుపదేశించి ప్రచారమునకుఁ దెచ్చుటయు, ప్రళయకాలమున ప్రపంచమునంతయు సంహరించుటయు నను నీ రెండుపనులును శేషునకు, శివునకును సంకర్షణుని దివ్యాంశము ననుసరించి సముపపన్నములగుచున్నవి.

ఇట్లు విద్యాజ్ఞానముల కధీశ్వరులై యజ్ఞానమును పోఁగొట్టు జగదాచార్యులగు శేషుఁడు, శివుఁడు వేఱువేఱు స్వరూపముల నున్నను తమయవతారముల కాశ్రయమగు

భగవంతుని వ్యష్టివ్యూహాంశము ననుసరించి యేకాంశ వ్యక్తులే కాని భిన్నాంశవ్యక్తులు కారు.

ఇఁక శివునకు నాంజనేయునకుఁగల సంబంధమును గమనించిన * [ఉత్తరరామాయణము, పంచమాశ్వాసము- ౭౩-వ పద్యము]

ఉ. పదిమోముల్ కల దండిరక్కసుని నిర్
భంజింప నీలాగు నీ
వుదయం బొందిన నీపనుల్ నడప ను
ద్యోగించి రుద్రాబ్జగ
ర్భదినేంద్రాబ్జముఖామరుల్ పవనభూ
భల్లూకరాడ్భానుజాం
గదముఖ్యాగచరవ్రజముల్ గనిరిగా
కాకుత్స్థవంశాగ్రణీ!

అని చెప్పియున్నందున నాంజనేయుఁడు శివునియవతారమే కావున మూర్తిభేదమే కాని యంశవ్యక్తిభేదము లేదు.

ఇట్లు శేషుఁడు, శివుఁడు, నాంజనేయుఁడు నను నిమ్మువ్వురు దేశకాలాదిభేదముచేత వేర్వేరుగా నవతరించియున్నను వీరు ముగ్గురును సంకర్షణుని యంశమే కావున నిమ్ముగ్గురకును భేదము లేదు.

కావున విద్యలకు, సిద్ధులకు నధీశ్వరులగు శివుఁడు, శేషుఁడు, నాంజనేయుఁడు తత్త్వబోధము గలిగించి, కర్మజ్ఞానభక్తిశరణాగతులను, మోక్షమార్గములను దేశకాలపాత్రముల ననుసరించి యుపదేశించి, లోకము నుద్ధరించుటకై శ్రీశంకరరామానుజమధ్వాచార్యులను నాచార్య దివ్యస్వరూపముల నిత్యాచార్యభూమి నలంకరించియున్నారు. ఉపాసకులకు ప్రీతిగలిగింప వారివారి మనోగతుల ననుకూలించునట్లు వేదమున కభిమతము లగు వేరు వేరు ప్రస్థానములను ప్రతిష్ఠించియున్నారు. అయినను ఈముప్పురు నొకయంశమునుండి కలిగిన యొకవ్యక్తియే కాని వేఱువేఱంశములనుండి కలిగిన వేర్వేఱు వ్యక్తులు కారు.

ఇందుఁదమోగుణావిశిష్టమై లయకర్తృత్వమునందుఁ బ్రవర్తించిన వ్యష్టిరూప మగు భగవదంశము ననుసరించి చర్చించియున్నాఁడనే కాని నిరంజనమై పరబ్ర[illegible] పరమపురుషతత్త్వము ననుసరించి కాని, సర్వశరీరకమై యెల్లెడల వ్యాపించియున్న యంతర్యామితత్త్వము ననుసరించి కాని చర్చించియుండలేదు. కేవల వ్యష్టితత్త్వమై యధికారికమగు సంకర్షణవ్యూహతత్త్వము ననుసరించియే యిట్లు నిరూపించియున్నాఁడను.

ఇట్లు ఇమ్మతాచార్యులు ఏకాంశమూర్తులు కావున నీ వారిలో నొండొరులకు ద్వేషభావములు కాని మావణము కాని లేవు.

ఇదికాక వేఱుమతమువాఁడై యున్నను బ్రాహ్మణుఁ డగు ప్రతివానికిని వాదమునందు గెలిచి కాని, మంచితనమున నుపదేశించి కాని తమమతమును బోధించి మతదీక్షనొసఁగి, తమమతములోనికిఁ జేర్చుకొని యున్నారే కాని మతాంతరులని బ్రాహ్మణులను సైతము బహిష్కరించి యుండ లేదు. ఇందుకు శైవుఁడై యుండి శ్రీశంకరభగవత్పాదాచార్యుల నాశ్రయించి యద్వైతియైన నీలకంఠాచార్యులును, అద్వైతియై యుండి శ్రీ భగవద్రామానుజాచార్యుల నాశ్రయించి విశిష్టాద్వైతియైన యాదవప్రకాశుఁడును, అద్వైతియై యుండి శ్రీ ఆనందతీర్థాచార్యుల నాశ్రయించి ద్వైతియైన త్రివిక్రమాచార్యులు మొదలైన మనపూర్వాచార్యులే దృష్టాంతము. (ఇంకను మండనమిశ్రుఁడు, వేదాంతి, యజ్ఞమూర్తి మున్నగువారు పలువురు కలరు).

ఆమతత్రయాచార్యులే ఈ మతాంతరబ్రాహ్మణబహిష్కారమును పాటించియున్నచో, జైనబౌద్ధాది విప్లవములలో క్షీణించి యడఁగంటియున్న మన వైదికమత

* వాల్మీకీయరామాయణము సమయమునకు దొరకనందున కంకంటి పాపరాజుగారి యుత్తరరామాయణమునుండి యీపద్యము గ్రహించితిని

♦ రుద్రాబ్జ......గనిరి, రుద్ర=శివుఁడు, అబ్జగర్భ=బ్రహ్మ, దినేంద్ర=సూర్యుఁడు, అబ్జ=చంద్రుఁడు, ముఖ=మొదలైన, అమరుల్ = దేవతలు, పవనభూ = ఆంజనేయుఁడు, భల్లూకరాట్=జాంబవంతుఁడు, భానుజ=సుగ్రీవుఁడు, అంగద=అంగదుఁడు, ముఖ్య=మొదలైన, అగచరవ్రజముల్ =వానరవ్రజములను, కనిరి=పొందిరి.

ములు నేటికిఁ జెరుపాటము లేకుండ సంతరింపవలసినవే కాని యింతటి యభివృద్ధి నొందియుండవు.

ఇట్టి త్రిమతముల నుపదేశించినవాఁడు మోక్షప్రదుఁడగు ననిరుద్ధుఁడు. భువనోద్ధారపూర్వకముగ మన [illegible]భూమియందు సంస్కరించి ప్రతిష్ఠించినవాఁడు జ్ఞానప్రదుఁడైన సంకర్షణుఁడు. కావున నివ్వాఙ్మతములకు పరస్పరవిరోధము గల్పించుట మహాపాపమనుట స్పష్టము.

కావున నో మతత్రయ పండితాచార్యులారా! ప్రస్తుతకాలము శేషము ననుసరించి యొకయింటనే పరస్పరవిరోధములు, యసూయలు, నిందనలు మెండగుచున్నవి. కావున మనలో మనము దూషించుకొనుచున్నను, భూషించుకొనుచున్నను, మనమన మతాచార్యులగు శ్రీశంకర రామానుజ మధ్వాచార్యులయెడ నిక్కాలకాలమాహాత్మ్యము దూషణాతత్పరుల ప్రయోగింపకుఁడు. మనలో మనకుఁగల యంతర్ద్వేషములచేత సాధించు ప్రజ్ఞావాదములచేతను, స్వార్థకల్పనలచేతను, కుతర్కములచేతను, మొండియుక్తులచేతను వారిమాహాత్మ్యమును గ్రింద విరాగులఁజేసి వారికి లేనిపోనికీర్తులను దగిలింపకుఁడు. ఇప్పటికి కలిమహిమము నిప్పటివారివలనే పరిణమించుచున్నట్లు కటాక్షింపుఁడు. ఎన్నఁటికేని యిమహాత్ముల మతములలో రెంటినడుమ యొకటిమాత్రము సుప్రతిష్ఠితము కానేరదు. ఈమూఁడింటి నొకటి యసత్యమైనదియెడల నేకా శ్రేయస్త్వమర్మమును చేసి దక్కిన రెండుమతములు నసత్యములే కావలసివచ్చును! ఈమూఁడింటినివేఱు వేయుటకును మనకు వశముకాదు. అవియును విడివడనేరవు.

ఇంకను మనము పరిమత్తుల జరిగించి పరస్పరము ప్రబోధించుకొని ద్వేషాసూయాది మహాపిశాచముల దఱిమివేసికొని మనలో మనకైకమత్యము గలిగించుకొని మన కులాశ్రయమతాచారాదులను శ్రీమతాచార్యుల యభిప్రాయముల ననుసరించి సుప్రతిష్ఠితములుగఁ జేసికొనుట కరము శ్రేయోదాయకతరము; భారతాభ్యుదయ పరమసోపానము.

శ్లో. జయతు భగవాన్ వేదాచార్యః
పుమాన్ పరమ స్స్వరాట్
జయతు జగతాం దివ్యం నేత్రం
త్వదోమనశం శ్రుతిః,
జయతు కరుణా సింధు స్సాంక
ర్షణః పరమో గురుః
జయతు నితరాం ధర్మాధారా
ధరాకిల భారతీ.
స్వస్తి శివమ్.

పాంచాలీ మానసంరక్షణము

మోచర్ల రామకృష్ణయ్య గారు, బి. ఏ.

ద్యూతమునఁ దన్నుఁ దోల్తనే యోడిపోయి-యంత నన్నోటు పడియెనో కుంతికొడుకు
మొదట నన్నోడి, యోడెనో పిదప దన్ను-సందియముఁదీర్పుఁడో సభాస్తారులార!

గీ. ధర్మవేత్తలు, రాజ్యతంత్రజ్ఞవరులు,-మునులు, వృద్ధులు, గురులు, భూభుజులు, బంధులు,
బాలిశులపోల్కి నిట్లు పేరోలగమునఁ-బలుకకున్నార లిదియేమి పాపమయ్య!

గీ. ఏకవస్త్ర—రజస్వల—ఈపడంతి-అంటఁగాఁ గూడ దనిమైన నరయ కిటులు
బల్మిమై రచ్చ కీడ్చిన పాపఫలము-కట్టికుడుపక విడుచునే కౌరవులను?

ఉ. అక్కట! రాజసూయసవనావభృథాతిపవిత్ర కేశముల్
ముక్కడి దుస్ససేనుఁ డిటు క్రూరతఁ జేకొని యీడ్చితెచ్చె న
న్నిక్కడి కిప్పిరో! యుచితమే, యిది క్షత్త్రియ వీరధర్మమే?
యిక్కరణిన్ జగంబున మహీశులొనర్చిరె యెన్నఁడేనియున్.

సీ. కులవృద్ధుఁడై, యుభయులపట్ల సమబుద్ధి వెలయింపఁదగినట్టి భీష్ముఁడైన,
తండ్రియై, బిడ్డలదౌష్ట్యంబు వారించి రక్షింపఁదగు ధృతరాష్ట్రుఁడైన,
ఆచార్యుఁడై, శిష్యులాచరించెడి యొగ్గుఁ దొలఁగింపఁ దగినట్టి ద్రోణుఁడైన,
ఒజ్జయై, తనభ్రాతృ లొనరించు నీతప్పు సవరింపఁగల కృపాచార్యుఁడైన,
సకలధర్మరహస్య విశారదుండు-విదురుఁడైనను, మానంబు వదలి, ధార్త
రాష్ట్రులకు బుద్ధి సెప్పి, యార్తనగు నన్నుఁ-గావ రారేమి? యెట్టి దుష్కాల మకట!

మ. నను రక్షింపఁగఁ జాలుధీరుఁ డొకఁడైనన్ గానరాఁ డీసభన్
వనజాతాక్షా! భువి దిక్కులేనిజనులన్ బాలింపఁగా నేర్తు వీ
వని, యుష్మత్పద పంకజాతయుగమున్ ధ్యానింతు, నన్నీవిప
ద్వనరాశిన్ దరియింపఁ జేయుము, జగద్బంధూ! రమావల్లభా!

మ. నతసంత్రాణపరాయణా! సుజనచింతాధ్వంస! పాపక్రియా
రతులౌ కౌరవముఖ్యు లిత్తఱి మహాక్రౌర్యంబునన్ గర్వదు
ర్మతులై నా కిట మానభంగ మొనరింపన్ జూచుచున్నారు, నా
గతి నీవే! యభయం బొసంగుము రమాకాంతా మనోనాయకా!

ఉ. దీనజనావనుండవు, పతివ్రత నేను, పతుల్ స్వతంత్రతా
హీనులు, శాత్రవుల్ కరము హేయగుణుల్, సమయం బిదయ్యె, నా
మానధనంబు గావ, ననుమానముఁ బూనఁగ పాడియౌనొకో?
మానవతీలలామ లవమానము నోర్తురె మామనోహరా!


ఉ. పుట్టితి నగ్నికుండమునఁ, బూజితపాండవ పంచకంబుఁ జే
పట్టితి; రాజసూయవిభవంబున దివ్యమణీవితాన సం
ఘట్టితరాట్కిరీట సువికాసితపాదసరోజనైతి, ని
ప్పట్టున నిట్టి ఘోరదురవస్థ ఘటిల్లెను గావు మాధవా!

చ. అనవరతంబు నీచెలియలైన సుభద్రనుబోలెఁ బ్రేముడిన్
ననుఁ గనుగారవించు కరుణామతి వీవు, మదాంధులైన దు
ర్జనములచేతఁ జిక్కితిని రక్షణసేయ కుపేక్ష సేయఁగాఁ
జను నొకొ, వాసుదేవ! యనుజాతల కష్టము లన్న లోఁగనే?


మ. అని పాంచాలి ముకుందపాదకమలధ్యానైకవృత్తిన్ మనం
బును లీనం బొనరింప మాధవకృపాపూర్ణప్రభావంబునన్
జనులాశ్చర్య నిమగ్నులై నిలువ, నక్షయ్యాంశుక వ్రాతముల్
గనుపట్టెన్ గురురాట్సుతోద్యమము భంగంబొందఁగా నయ్యెడన్.

క. కలదే ముజ్జగములలోఁ-దుల పాతివ్రత్యమునకు; దోషము లెల్లన్
దొలఁగవె పతిదేవతలను-దలఁచిన, రవిదీప్తి ప్రీలు తమములభంగిన్.

బొంబాయిరాజధానియందలి రాగి, ఇత్తడి సామానులు—౧౮ శతాబ్దపు టుత్తరార్థము



౭. బూలేశ్వరమునందలి కాశీ విశ్వేశ్వర దేవాలయద్వారమున గల ఇత్తడిగంటలు



౮. పూనాలో చేసిన ఇత్తడి నగలు

బుద్ధభగవానుఁడు - శిష్యమండలి

శరణు రామస్వామిచౌదరి గారు

బుద్ధభగవానుని కాలమున నేటివలె పరిశ్రమ చేత అధర్మములు, అత్యాచారములు ప్రబలి యుండలేదు. కాని రాజులలో రాజులు తగవులాడు కొని యుద్ధములు చేయుట, యొకరిరాజ్యము మఱి యొకరు లాగుకొనుట జరుగుచుండెను. యాగములయందు పశువుల బలియిచ్చుట ధర్మముగఁ దలఁచుచుండిరి. ఇట్టి యక్రమములు చూచి సహింపలేకయే బుద్ధుఁడు ధర్మ ప్రచారమునకుఁ గడంగెను.

బుద్ధభగవానుని ధర్మములు వేదమునందుఁ జెప్పఁ యార్యధర్మములే కాని యన్యములు కావు. మోక్షమునకై ప్రాణము లర్పింపకయే సదాచారముల వలననే మానవుఁ డున్నతపదవి పొందునని యామహా త్ముని నమ్మిక. పూర్వాశ్రమమున మిత్రులగు కౌండిన్య భద్రజిత్ బావను మహానామ అశ్వజిద్యోగీశ్వరుల వెం తను వారణాసీనగరమునకు బుద్ధుఁడు వెడలుచుండ, మార్గమధ్యమున నుపాకుఁ డనుసన్యాసి కనఁబడి, తమ రేసాంప్రదాయమునకు చెందినవా రని ప్రశ్నించెను. అందుకు భగవానుఁడు చిరునగవుతో, నేసాంప్రదాయ మునవలన మానవుఁడు జాతి మత భేదములు లేక జ్ఞానియై సర్వదుఃఖములనుండి విముక్తుఁ డగునో యాసాంప్రదా యమే నాది యని ప్రత్యుత్తర మొసంగెను. పైఁజెప్పిన మిత్రులను వారణాసికి సమీపమున మృగదావకతపోవన మునఁ గాంచెను. వారతనిని తమతో తపముచేయుట మానివైచిన సన్యాసియని నిర్లక్ష్యముగాఁ జూచిరి. కాని వారు జాగరూకతతోఁ బరిశీలించి యామహానీ యుని తేజస్సు చూచి వినమ్రులై ప్రణమిల్లిరి. అప్పు డాయన యీక్రింది యెనిమిదినిబంధనలను జెప్పెను.—

౧. యథార్థజ్ఞానము; ౨. మంచికార్యమునందు దృఢనిశ్చయము; ౩. ఉచితముగా మాటాడుట; ౪. మంచి పనిచేయుట; ౫. ఉచితసాధనము చేయుట; ౬. ఉచిత పరిశ్రమ; ౭. ఉచితవిషయవిచారము; ౮. చిత్తశాంతి కలిగి యుండవలయును. వీనినే యార్యఅష్టాంకితమార్గ మని చెప్పుదురు.

తరువాత బుద్ధభగవానుఁడు జన్మ జరా వ్యాధి మరణములు, అప్రియసంయోగము, ప్రియవియోగము నను నాలును దుఃఖకారణములనియు, నాదుఃఖమునుండి విముక్తిపడయుట కార్యఅష్టాంకిత మాచరింపవలయు ననియు చెప్పెను.

మఱియు భగవానుఁడు 'ఆర్యప్రమేయము' లను నీక్రిందివిషయముల బోధించెను: ౧. దుఃఖము హేయము; ౨. అజ్ఞానము హేయకారణము; ౩. దుఃఖనిరోధము; ౪. దుఃఖనిరోధకారిణి.

ఈయుపదేశరత్నములు విని సంతుష్టులై పైయైదు గురు సాధువులు భగవానుని శిష్యులైరి. ఈయుపదేశ ములను "ధర్మచక్రవర్తన్" అని యందురు.

భగవానుఁడు వారణాసినుండి గయకు వెడలి బ్రాహ్మణోత్తములగు నురువేలాకాశ్యప, నదీకాశ్యప, గయాకాశ్యపు లనుమువ్వురికి దీక్ష నొసంగెను. వీరిని దీక్ష నీకొనకుండ చేయవలయు నని బ్రాహ్మణులు యత్నించి, విఫలులైరి. అక్కడనుండి ఆయన గయా శీర్ష పర్వతమునకుఁ జనెను. అక్కడ తపోనిష్ఠాగరిష్ఠు లగు వేయిమందికి ధర్మోపదేశము కావించి, శిష్యమండ లిలోఁ జేర్చుకొనెను. అక్కడనుండి యుత్తరభారతవర్ష మున ప్రఖ్యాతిగాంచిన బింబిసారునిచెంతకు రాజగృహ నగరము వెడలెను. ధర్మోపదేశము గావించెను. బుద్ధ భగవానుఁడు సర్వత్యాగియై పోవునప్పుడు బింబిసారుఁడు నగల రాజ్యసుఖములఁ బడయఁజేయుటకై ప్రయత్నిం చి, విఫలుఁడైనందున తానే భగవానుని భక్తుఁడాయెను.

రాజగృహనగరసమీపమున సంజయుఁడనుపరివ్రాజకుఁడు గలఁడు. వానికి 250 మంది శిష్యులు గలరు. అందు సారీపుత్ర, మౌద్గలాయన్ అను నిద్దరు బ్రాహ్మణులు గలరు. వీరిద్దరు మోక్షమార్గము మం దెవరికిఁ దెలిసినను, రెండవవారికిఁ దెలుపుటకు నిశ్చయించుకొనిరి. భగవానుని శిష్యుఁడు అశ్వజిత్ భిక్షాటనకై రాఁగా, సారీపుత్రుఁ డీక్రిందివిధమునఁ బ్రశ్నించెను:—

సా. పు.—అయ్యా! తమ దివ్యతేజోవదనముఁ జూచి నా కానందము గల్గుచున్నది. తమగురువు లెవరు? ధర్మము లెట్టివి?

అ.—శాక్యవంశజగౌతమబుద్ధుఁడు మా గురువు. ఆయన ధర్మములే మాధర్మములు.

సా. పు.—తమ ధర్మసిద్ధాంతము లేవి?
అప్పుడశ్వజి త్తీక్రిందిశ్లోకమును పఠించెను:

"శ్లో. యే ధర్మా హేతుప్రభవా
హేతుం తే షాంతథాగతో,
తేషాంచ యో నిరోధో ఏవం
వాదీ మహాశ్రమణో."

భావము:—సమస్తవస్తువులు నేకారణముచే నుత్పన్నమైనవో, సకల నేకారణముచే నాశమగుచున్నవో, యాకారణములను భగవానుఁడు మాకుఁ జెప్పెను.

ఈశ్లోకమును వినినతరువాత సారీపుత్రుఁడు తన మిత్రుఁడగు మౌద్గలాయనునితోను, మఱికొందఱు మిత్రులతోను గలసి, భగవానుని దర్శనమునకై వెడలి తమ మనోభీష్టమును దెలియఁజేసిరి. భగవానుఁ డీక్రిందిశ్లోకము నుపదేశించి వారిని శిష్యులనుగాఁ జేసికొనెను:

"శ్లో. సర్వపాపస్స అకరణం
కుసలస్స ఉపసంపదా,
సచిత్త పరియో దపనం
ఏతం బుద్ధానసాసనం."

భావము:—చిత్తశుద్ధి కలిగి, యేవిధమైన పాపకార్యములు చేయక, కల్యాణకరమైన కార్యములు చేయుటయే బుద్ధుని ధర్మము.

సారీపుత్రుఁడు, మౌద్గలాయన్ బుద్ధుని శిష్యబృందములో ముఖ్యులైరి. భగవానుని శిష్యుఁడగు దేవదత్తుఁడు గురుద్రోహి యాయెను. వీనిని పరిశీలించుటకు పైయిరువురిని భగవానుఁడు నియోగించెను. ఇది తెలిసి దేవదత్తుని మిత్రులు వీరిని చంపుటకు ప్రయత్ని[illegible]చుండఁగను, అజాతశత్రుఁడు వారించి ద్రోహులను శిక్షించెను. ఆరాజు వారి నాసమయమున, 'మీరు ప్రతిభావంతులగు యోగులుగదా! ఈవధను తప్పించుకొనలేరా?' యని ప్రశ్నించెను. దానికి మౌద్గలాయన్ 'రాజా! యిది లెక్కగాదు. తప్పించుకొనఁగలను. కాని దానికై శ్రమ తీసికొనఁ దలఁప లేదు. ఎందువల్ల నన, నా పూర్వకర్మానుసారము ఇంకొక వారములోపలలో నే నీదేహమును వదలవలసియున్నది' అనెను. అవిధముగనే యతఁడు వారముదినములలో దేహమును బాసెను. సారీపుత్రుఁడు మిత్రుఁడు పోయెనుగదా యని తాను గూడ దేహమును వదలెను. ఇతఁడు నలందయందుండె[illegible] వాఁడు. వీరిని భగవానుఁ డగ్రశ్రావకులని పిలు[illegible]డెడివాఁడు.

ఒకమారు ధర్మప్రచారము చేయుటకై భగవానుఁడు తన జన్మభూమి యగు కపిలవస్తునగర మరుదెంచెను. పుత్రునకు స్వాగత మొసంగుటకై శుద్ధోదనచక్రవర్తి యుత్సాహవంతుఁడై వెడలెను. భిక్షాపాత్ర గైకొని వచ్చు కుమారునిఁ జూచి లజ్జితుఁడై సక్రోధముగ, "వత్సా! మన రాజకులమునకు కళంకము తెచ్చితివే! నీవు నీశిష్యుల కన్న మిడలేకగా, భిక్షాపాత్రను గైకొంటివి!" అనెను.

బుద్ధుఁడు, "మహారాజా! మా కులధర్మ మిది" యనెను. ఇది విని రాజు మిక్కిలి విచారపడెను. బుద్ధభగవానుఁ డప్పుడు, తండ్రితో, 'పుత్రులు సంపాదించిన ధనములో విలువగల రత్నములు తండ్రికి కర్పించు[illegible] మర్యాద కావున దయతో నీకిం గురత్నములు గ్రహింప వేఁడెద' నని యీక్రిందిశ్లోకములను జదివెను:

శ్లో. ఉత్తిష్టేన పమజ్జేయ్య
ధమ్మం సుచరితం చరే,

ధమ్మచారీ సుఖం సేతి
అస్మిం లోకే పరంహి చ.

శ్లో. ధమ్మం చరే సుచరితం
న తం దుచ్చరితం చరే,
ధమ్మచారీ సుఖం సేతి
అస్మిం లోకే పరంహి చ.

భావము:—జాగ్రత్తగా నుండుము. సోమరిగా నుండకుము. సద్ధర్మము నాచరింపుము. ధర్మాచరణులు ఇహపరలోకముల సుఖించెదరు.

శుద్ధోదనచక్రవర్తి యాశ్లోకములు విని సంతసించి, పుత్రుని రాజభవనమునకు తీసికొనిపోయెను. భగవానుని దర్శనార్థమై యందఱును వచ్చిరి. కాని తన ప్రియభార్య యగు యశోధరాదేవిమాత్రము రాలేదు. తానే యామెను జూచి నిశ్చయించుకొని, తండ్రియాజ్ఞ గైకొని, తనశయనమందిరమునకుఁ జనెను. ఆదేవి యచ్చట మలినవసనములతో కృశించి పడియుండెను. విరాగము దుస్సహము గదా! బుద్ధుఁడామెకు ధర్మోపదేశము గావించి, శాంతింపఁజేసి, నగరమువెలుపలకు తనశిష్యబృందముతో వెడలిపోయెను. యశోధరాదేవి తనపుత్రుఁడగు రాహులునిఁ బిలిచి, 'మనపట్టణబహిర్భాగమున నొకసన్న్యాసి గలఁడు. ఆయన నీజనకుఁడు. ఆతనికడకు వెడలి పూర్వోపార్జితధనమునుండి నీవగు భాగమును గైకొను' మని చెప్పెను. మాతృదేవి యాజ్ఞానువర్తియై యని, రాహులుఁడు జనకుని తనభాగ మడిగెను. బుద్ధభగవానుఁడు తనశిష్యుఁడగు సారీపుత్రునితో 'వీనికి సన్న్యాస మిమ్ము' అని చెప్పెను. ఆతఁడు గురువునాజ్ఞను నెరవేర్చెను. రాహులుఁడు పైదప ప్రసిద్ధిగాంచిన శిష్యులలో నొకఁడాయెను.

ఇదియంతయు తెలిసి శుద్ధోదనుఁడు మిక్కిలి విచారపడి, పుత్రుని చెంత కరిగి, యిఁకముం దెన్నఁడు తల్లిదండ్రుల యాజ్ఞ లేనిది బాలురకు సన్న్యాస మిప్పింపవని వాగ్దానము తీసికొనెను.

కోసలదేశమునకు రాజును, బింబిసారునకు బావమఱఁదియు నగు ప్రసేనజిత్ తక్షశిలావిశ్వవిద్యాలయమున విద్య నభ్యసించెను. బుద్ధభగవానుని యుపదేశము లతిభక్తిశ్రద్ధలతో నాలకించుచుండెడివాఁడు. మహోపదేశ ఫలితముగ తానును, తనసోదరియు దీక్షను గైకొనిరి. ప్రతిదినము నైదువందల బౌద్ధసన్న్యాసులకు భోజన మిడుచుండెను. కాని వారు సంతృప్తులు గాకైరి. ఇది తెలిసికొని రాజొకనాఁడు, 'ఓసన్న్యాసులారా! దరిద్రు లొసఁగు సామాన్యభోజనమునకే సంతుష్టులగు మీరు నే నొసఁగు విలువగల భోజనమునకు తుష్టులు గారేల?' అని ప్రశ్నింప, వారు, 'అతిభక్తితో నొసఁగు భోజనము గాన నతిస్వాదిష్టముగా నుండును.' అని ప్రత్యుత్తర మొసఁగిరి. ప్రసేనజిత్తు నాఁటినుండియు భక్తిశ్రద్ధలతో భోజన మొసఁగుచుండెను. రాజకుటుంబమున జన్మించిన మల్లిక యను సుందరబాలిక నారాజు వివాహమాడెను. ఈమెయు బౌద్ధధర్మముల నతిశ్రద్ధతో పాలించెను. బింబిసారుని బంధువగు జీవకుఁడనురాజు కూడ తక్షశిలావిశ్వవిద్యాలయమున నాత్రేయాచార్యుని దగ్గర ఆయుర్వేదము నభ్యసించెను. విద్యాపరిపూర్తి యైనతరువాత యాత్రేయుఁడు, 'మనవిద్యాలయపరిసరముల పదునారు (౧౬) మైళ్లలో నిరుపయోగమైన మూలిక నొకదానిని తీసికొని రమ్మ'ని శిష్యున కాజ్ఞాపించెను. జీవకుఁడు తిరిగితిరిగి యేసారి యనుపయోగమైన మూలిక దొరకలేదని రిక్తహస్తములతో తిరిగి వచ్చెను. ఇది చూచి గురువు సంతసించి విద్యాపరిపూర్తి యైనదని చెప్పెను. ఆతఁడును బౌద్ధధర్మముల స్వీకరించి ప్రసిద్ధివడసెను. భగవానుఁ డీయనను ప్రేమించుచుండెడి వాఁడు. ఈయన వైద్యమున నసాధారణప్రజ్ఞ గాంచెను. ఈతని యనుపమకీర్తి విని బింబిసారుఁడు తన దర్బారునం దితనిని రాజవైద్యునిఁగాఁ జేసికొనెను.

అజాతశత్రుఁ డనురాజు ఒకనాఁడు రాచకార్యముల నిర్వర్తించి, విసివి, సాయంకాలమున విశ్రామమునకై యుద్యానవనమునకు వెళ్లెను. ఇతఁడు వెళ్లిన కతిపయనిమేషములకే భానుఁ డస్తమించెను. నాఁడు పూర్ణిమయగుట రాకానిశాకరుఁ డుదయగిరి నధిరోహించి తన యమృతకిరణముల ప్రకృతి నలంకరింపఁజేయుచుండెను. కుముదములు వికాసభాసురము లయ్యెను. పుష్పపరిమళమును వహించి గంధవహుఁడు మందమందముగ వీచుచు, సుఖస్పర్శనము గావించుచుండెను. కాని దుష్కృత్యములకు రాచకార్యములచే మనము కుందుటచే నజాతశత్రుఁ డానందింప లేకపోయెను. ఆనాఁ

ఉన్నట్టు జీవము యుండుట తటస్థించెను. అతఁ డాతనిబాధ చూచి బుద్ధునిమహిమ వర్ణించి, వెంటనే భగవానుని దర్శనము చేసికొనిన, శాంతి నొందఁగల వని చెప్పెను. ఆరాజు వెంటనే భగవానుని దర్శించి, కృతార్థుఁడై, యుపదేశవాక్యరత్నముల విని, శిష్యుఁ డాయెను. రాజవైద్యుఁడైన జీవకుఁడు కూడ, కుష్ఠరోగములకుసైతము చికిత్స చేయుచుండెను. ధనవంతులు వైద్యలాభమును పొంది ధన మపారముగ నొసంగుచుండెడివారు. ఆధనమంతయు నాతఁడు బౌద్ధసంఘములకే యొసంగుచుండెను. బౌద్ధసన్న్యాసుల కతిజాగరూకతతో చికిత్స చేయుచుండెడివాఁడు.

బుద్ధభగవానుని యుపదేశముల విని శ్రావస్తీనగరవాసియు, లక్ష్మీపుత్రుఁడును, వైశ్యకులసంజాతుఁడు నగు అనాథపిండకశ్రేష్ఠికూడ శిష్యమండలిలోఁ జేరెను. నగరసమీపమున ౧౮ కోట్లరూప్యముల విలువగల సుందరోద్యానవనమును కొని భగవానుని కొసంగెను. అందు సుందరమగు విహారమును భగవానునికొఱకు నిర్మింపఁజేసెను. సన్న్యాసులకొఱకుకూడ పెక్కు నిర్మింపఁజేసెను. ఇచ్చట భగవానుఁడు పలుమారులు శిష్యుల కుపదేశించెను. అనాథపిండకశ్రేష్ఠి కొమారితలు మహాసుభద్ర, చులసుభద్ర యనువారుకూడ బౌద్ధసన్న్యాసినులై మతప్రచారము గావించిరి.

పూర్ణుఁడను మఱియొక వ్యాపారి సునాపరాంతదేశమునుండి శ్రావస్తీనగరమునకు వ్యాపారమునిమిత్తము వచ్చి, భగవానుని యుపదేశములను విని ధర్మదీక్షగైకొనెను. కొన్ని దినముల యనంతరము అతఁడు తనదేశమునకు మతప్రచారమునకై వెడల నుత్సహింపఁగా భగవానుఁ డీవిధమున ప్రశ్నించెను:

బు.—వత్సా! నీవు మతప్రచారమునకై వెడలినపుడు నీదేశజులు నిన్ను, నీమతమును నిందించి బాధింతురు. అప్పు డేమి చేయుదువు?

పూర్ణుఁడు—నే నేమియు వారిని నిందింపను.

బు.—నిన్ను వారు వధించుటకు వచ్చిన?

పూర్ణుఁడు—నే నేమియు వారి ననక, యీ ప్రపంచమునఁ గల త్రివిధతాపములనుండి విముక్తిఁ జెంది దేహము నానందముతో విడిచెదను.

వానిప్రత్యుత్తరములకు భగవానుఁడు సంతసించి ధర్మమతప్రచారమున కిట్టిదృఢసంకల్పులే యర్హులని వాని నాశీర్వదించి ప్రచారమునకై పంపెను.

శాక్యవంశజుఁడగు నానందుఁడుకూడ శిష్యమండలిలోఁ గలఁడు. భగవానుఁ డీతనిని మిక్కిలి ప్రేమించుచుండెడివాఁడు. అతఁ డెల్లపుడును భగవానుని చెంతనే యుండెడివాఁడు. భగవానుఁడు, బౌద్ధసంఘవిషయము లెల్ల నీతనితో నాలోచించియే చేయుచుండెడివాఁడు. ఎట్టిరహస్యము లైనను నీతనికి తెలియవలసినదే. బుద్ధనిర్వాణానంతరము ఎట్టి కఠినధర్మశాస్త్రచర్చలు వచ్చినను ఈతఁడే సమర్థించుచుండెడివాఁడు.

వీరేకాక యింకను పెక్కురు భగవానుని శిష్యమండలిలో ముఖ్యులు గలరు. శిష్యమండలిలో సకలజాతులవారుఁ గలరు. శారీపుత్ర, మౌద్గలాయన్, కాత్యాయన మొదలుగాఁగల బ్రాహ్మణోత్తములును, ఆనందుఁడు, రాహులుఁడు, అనిరుద్ధుఁడు మున్నగు క్షత్రియవంశజాతులును, అనాథపిండకశ్రేష్ఠి, పూర్ణుఁడు మున్నగు వైశ్యులును గలరు. వీరుగాక క్రిందిజాతులవారును గలరు, సునీథుఁ డనుమాలవాఁడు, అంగులీమాలుఁ డనునొంగజాతివాఁడు, స్వాతి యను పల్లెవాఁడును, నందుఁడను గొల్లవాఁడును, ఉపలుఁడను మంగలియు వీరిశిష్యమండలిలోఁ గలరు.

బుద్ధునిశిష్యులలో రెండు తెగలవారు గలరు. అందొక తెగవారు గృహస్థాశ్రమమును వీడి సన్న్యాసులై దేశాటనము గావించి మతప్రచారము గావించువారు. మఱియొక తెగవారు గృహస్థాశ్రమమును వీడక మతధర్మముల పాలించువారు.

సోదరులారా! దీని ననుసరించి బౌద్ధమత మెంత చక్కని నిబంధనలతో వ్యాపించినదియు తెలియుచున్నది. ఇట్టి మంచినిబంధనలతో పలుసంఘములు బయలువెడలి, దేశమున కావశ్యకమగు పెక్కుసమస్యలలో పాల్గొనిన స్వాతంత్ర్యము బుట్టుటయెంతయుసులభముగదా!

బువ్వపెట్టు పుట్టింటిసాధ్వి

విద్వాన్ వారణాశి సూర్యనారాయణశాస్త్రిగారు

ఆవు లింటికి వచ్చెడి నవిగో! చూడు!
బల్లిత్రువ్వాయి తనతల్లి పొదుఁగువంక
నఱ్ఱు సాఁచుచున్నది కట్టుకఱ్ఱనుండి
బువ్వ తిను! చిట్టితండ్రి! రా! ప్రొద్దుపోయె.

పాలు మీఁగడ వెన్నయుఁ బండు లింక
నన్ని తెచ్చితి నీ వెండిగిన్నెఁ బెట్టి;
వేగఁ దినివెళ్లి దోఁబూచి పెట్టుచుంటి;
నాడుకొనవచ్చుఁ బాపాయితోడఁ బిదప.

నీవు తినుచుండునందాఁక నీకుఁ దోడు
కూరుచుండును మనపాపకూడ లెమ్ము!
తండ్రి! కడుపేప్పుచున్నది తడయఁబోకు;
పెదవి సడలింపు గోరుండఁ బెట్టుదాన.

"రాను నే నప్పుడే రాను రా"నటంచుఁ
గ్రిందఁబడనమునఁ బొట్ట యుబ్బించె దేల?
బూచి వచ్చెడివేళ కాఁబోవుచున్న
దేది నీజాగిలము? దానిమీఁదఁ బడున-?

అదిగదిగో! చూడు! ఖగపంక్తి యాకసమునఁ
[illegible]చుఁ బసిమేలిముక్కులఁ గఱచిపట్టి;
ఇదిగిటగో! విను! బడిపిల్ల లెక్కములను
జెప్పుచున్నారు గొంతులు చించుకొనుచు.

నెమ్మదిగ వచ్చి యదె సందెగుమ్మ మూఁడ్చి
పాపి వెలిఁగించుచున్నది దీప మపుడె
చేతులారంగ నాతండ్రి! జేజెపెట్టి
పాడుమేది! "దీపంజ్యోతి" వచ్చు?—నీకు.

అగ్నిహోత్రాలకై సోమయాజిగారి
కవ్వ యందిచ్చుచున్న దాజ్యాదికంబు;
సంధ్య వారిచి దేవదర్శనము చేయ
నరుగుచున్నాఁడు, చూడు! విద్యార్థి గుడికి.

అయిన దీకొంచెమే! తిను! మల్లు చూడు!
కోటు తొడిగెను నీతాయికొడుకు; నీవు-
తొడిగికొందువా? పాపాయి నడుగు! దాని
కున్నదా? పాప మెఱవు నీ వొక్కటీవు?—

కోటు టోపియు రంగులగొడుగు నీకుఁ
గావలయునయ్య! తిను మిది క్షణములోన
అన్ని తెత్తురు రేపు సాయంత్రమునకు;
కొన్నవే యున్న వింట మీనాన్నగారు.

* * * *

అప్పు డాసాధ్వి విశదగండాంతరాళ
ఫుల్లపులకాంకురము చెల్లసందునుండి (?)
తొంగిచూచి కృతార్థుఁడై తోవలఁ జేఁడు
నిర్భరానందచంద్రికల్ నెఱపఁదొడఁగె.

కుశద్వీపము (ఆఫ్రికా)

రాజా వాసిరెడ్డి శ్రీదుర్గా సదాశివేశ్వర ప్రసాద్ బహాదూర్ గారు

శ్రీయుత చౌదరీ ధనరాజసింహా బి. ఏ. గారు మనోరమ యను హిందీమాసపత్రికలో ఈవ్యాసము వ్రాసినారు. భారతీయు లానా డుపార్జించిన భూగోళ చారిత్రిక పరిజ్ఞానముల నిది తెలుపుచున్నది. ఐతే ఆఫ్రికాలో ప్రాచీన భారతీయు లడుగుపెట్టిరా అని సందేహించు వారును గలరు. సందేహ మేలనో తెలియదు. అమెరికా, జావా, బోర్నియో, సుమత్ర, సింహళము మొదలగు దేశములలో యీనడుమ దొరికిన గుళ్లు, గోపురములు, చిత్రములు ప్రాచీన మతసాంప్రదాయములు భారతీయు లాప్రదేశములలో సంచరించి రనుటకు నిదర్శనములుగా నున్నవి. ఆఫ్రికాలోని ఈజిప్టు మనవారికి పరిచితమైనదే అనుట కక్కడ లభించిన బుద్ధవిగ్రహములే నిదర్శనములు. బౌద్ధజాతకకథలలో సదరద్వీపయాత్రా వదానమందు వర్ణింపబడిన "ఎర్రసముద్రము, నల్లసముద్రమును" ఈఆఫ్రికా ఖండమందలివే. వాస్కోడిగామాను భారతీయనావికులు మాల్దీవియా దీవులయొద్ద కలిసికొనినారు. ఆఫ్రికాకు చేరువనున్న యీదీవుల నెరిగిన వారు ఆఫ్రికా నెరుగరనజాలము. ఇంతేకాక ఆఫ్రికాకు మొదట వలసవచ్చినవారు భారతీయులే యనుట సునిశ్చితమైన మాటయేకదా. కాని అంతకుముందు మరికొంతకాలమునుండియు భారతీయుల కది పరిచితమైనదనుటలో విపరీతమేమియు లేదు. ఈ వ్యాసరచయిత చూపించినవేకాక జంబుముకళాగునామములు మరికొన్ని భారతీయ సాంప్రదాయములు సూచించునవి ఆఫ్రికాలో నున్నవి.

కుశద్వీపము ఆఫ్రికాయని టాండను గారుతలంచుచున్నారు. ఈ దేశపు ప్రాచీనసభ్యతయందలి భారతీయ సాంప్రదాయములను, పూర్వమీ దేశము[1] నేలిన భారతీయ రాజులను ఈతడు చూపినాడు.[2] "యిథియోపియన్సు" (Etheopians) లేక కెప్యోట్సు (Capyots) లోకూడా భారతీయ చిహ్నము లున్నవని తలచుచున్నారు[3]. కపిమహారాజు ప్రఖ్యాత

---

1. కుశద్వీప or Etheopia (Eritrea.) Todd's Rajasthan, 472.

2. .... assigns the reason of amenophis as the epoch of the colonisation of Ethopia from India. Discoveries, P. 180 and Todd's Rajastan, P. 522.

3. Etheopians were of Indian origin. Todd's Rajastan, 52.

డయిన భారతీయప్రభువు[1]. కపోతుడను బ్రాహ్మణుడు ఈతనివంశజుడే[2]. ఎరిట్రియా అనునది మిశ్రదేశమందొక ప్రదేశము. ఎరిట్రియా (Eritrea) అనగా సూర్యుడు. సూర్యునకు ఆదిత్యుడనుపదము ప్రసిద్ధమేకదా; సూర్యుని పేర బరగిన పట్టణమే ఎరిట్రియా అనబడెను. అసురపతియైన ప్రహ్లాదునిపట్టణముపేరుకూడ ఆదిత్యపురమే. కాన ప్రహ్లాదుని పట్టణము ఈఎరిట్రియాయే కావచ్చును[3]. ఎరిట్రియాకు పైన ఖరతూం (అసురుల)స్థానము కలదు[4].

ఎరిట్రియాకు దిగువ అబిసినియా (Abyssinia)అను ప్రదేశము కలదు. Abyssinia అబిసినియా అనగా పాతాళము. టాండ్ గారు ఇదియే మైరావణునిలంకయని చెప్పుచున్నారు[5].

అబిసినియాలోనళినీ(Blue Nile)నది యున్నది.

బ్రహ్మరాక్షసుల నివాసస్థానము[6] నళినీనదీతీరమని మత్స్యపురాణములో చెప్పబడియున్నది.

మైరావణుడు బ్రహ్మరాక్షసుడే కదా. కాన యితడు అబిసినియాలోని[7] నళినీనదిప్రాంతముల నున్నవాడనుట పొసగియుండును. అబిసినియా మధ్యప్రదేశమున "తక్" అను దుర్గమొకటి కలదు. దీనిపూర్వతీరమున మూడుదుర్గము లున్నవి. వానిలో నొకదానిపేరు "రాజ్ దశాన్", (Raj Dasan) దశాననము.[8]

ఈ మూడుగిరులు కలసి త్రికూటము లనబడుచున్నవి. అబిసినియా మధ్యప్రదేశమునకు మూడుప్రక్కల నీగిరులును, నాల్గవ వైపున నళినీనదియు వ్యాపించియున్నవి. అబిసీనియాకు తూర్పున సుమాలిల్యాండు (Somaliland) అనుప్రదేశ మున్నది. మైరావణుని పితామహుడైన సుమాలిపేర ఇది వెలసినది. సుమాలిదేశమునకు నెత్తిన బర్బరమను (Barber) వానరుల దేశ మున్నది. [9] ఖరునిసోదరుడైన వానరుడు (బర్బరుడు) దీనికి నేత. బర్బర సమీపమున బాబుల్ మండల మున్నది. లంకకు సమీపమున మైనాక మున్నది. [10]

---

1. పుష్కరుడను లేక త్ర్యాపుణుడు అనువాడు మహావీర మహారాజు కుమారుడు.
2. Capyot, కపోత (విష్ణుపురాణములో చంద్రవంశవర్ణన చూడుడు.) శిబికి ప్రసూతించిన కపోతుడు వీరడే.
3. Erit (ఎరిట్ and Eraj ఎరిజ్ =Sura)Todd'sRajastan.H.P.Vol.I)Erie సూర్యవంశుడు).
4. Cunnigham, Vol· V-see Multana or Adityanagar.
5. జైన ఇతిహాసములలో చెప్పబడిన పాతాళపులంక రామాయణములోని రావణుని లంకకంటె పెద్దదిగా వర్ణింపబడుచున్నది. దీనివలన లంకలు రెండున్నవని తెలియుచున్నది.
6. మత్స్యపురాణము అ. 1 "శ్లో. 20 తతస్తు నళినీచాపి ప్రాచీమేవ దిశాం యయౌ."
తత్రాగస్త్యైకః పరివృతా విన్ధ్యద్రి బ్రహ్మరాక్షసైః.
7. Atlas "Bartholomeao", P. 26.
8. జైనఇతిహాసము చూడుడు.
9. ఖరునిసోదరుడు వానరు డనువా డున్నాడనుటకు కాని, వానరుడనగా బర్బరుడనుటకుగాని ఆధారము లేవియో నాకు తెలియకున్నవి.
10. సముద్రవచనము విని మైనాకము లేచెను.


మైనాకము శాకద్వీపమునకు సంబంధించిన నగరరాజము. శాకద్వీప (Arabia), కుశద్వీప (Africa) ములు [1]బాబల్ ద్వీపము వరకు వ్యాపించి యున్నవి. సుమాలిదేశము (Somaliland) నకు ఆగ్నేయ దిక్కున మాల్డేవియా అయిలాండు (Maldavia Ielands), అను మాలద్వీపములు గలవు. మాలి సుమాలి సోదరుడు. ఈమాల ద్వీపమతనిపేర వెలసినది. వీరి సోదరుడు విద్యున్మాలి యింకొకడున్నాడు.[2] వీనిపేర విద్యుత్ అను ప్రదేశమొకటి వెలసినది.[2] అది యిప్పుడు బదూన్ అని పిలువబడుచున్నది. సుమాలిదేశమున కడుగున మలిందమను ప్రదేశము కలదు. వాస్కోడిగామా (Vascodigama)కు నాలుగుభారతీయనావలు చిక్కినప్రదేశ మిదియే. నావికులలో నొకడు వాస్కోడిగామానుభారతీయవర్ష మండలిమల బారుతీరమునకు తీసుకొనివచ్చెను[4]. ఈమలిందమునకు దిగువ మాండేటు అను ప్రదేశములు మూడున్నవి. అవి ఆఫ్రికాలో ఆగ్నేయము నుండి నైరృతీదిశవరకు ఇప్పటికిని వ్యాపించి యున్నవి.

మూడవ మాండేటునకు సమీపములో Ambrez అను ప్రదేశమున్నది. మాంధాత మహీపాలుడు సప్తద్వీపములను ఏకచ్ఛత్రాధిపత్యముతో పాలించినాడని పురాణములు చెప్పుచున్నవి. బౌద్ధజాతకకథలుకూడ ఇట్లు చెప్పుచున్నవి. ఇట్టి దిగ్విజేతయొక్క రాజ్యము ఈ Mandate వరకు వ్యాపించెననుట యందాశ్చర్యమేమున్నది. ఇతనిపేరనే మాండేటు వెలసియుండును.

ఈమాంధాత కుమారుడైన అంబరీషుని పేరుతో (Ambrez) అంబ్రజ్ అను ప్రదేశము నెలకొలుపబడియుండును. అంబరీషుడు క్షత్రియులలోనుండి బ్రాహ్మణుడుగా మారినాడు.[5] కుశద్వీపములో అంబరీషుని సంతతివారయిన బ్రాహ్మణు లానాడు దర్మ్మలు, ద్రుమములు అన బడుచుండిరి.[6]

(Ambrez) అంబ్రజ్ సమీపమున ఇప్పుడు (Dome) డోమ్ అనబడుచున్న ప్రదేశము ఆనాడు ఈ దర్మబ్రాహ్మణుల దేశమై యుండును. శతపథబ్రాహ్మణములో అత్యరాతి చక్రవర్తులలో నొకడుగా చెప్పబడినాడు. ఇంతే కాక యితడు జానంతపతి యని అందే వర్ణింపబడినాడు. జానంతపతి యనగా ప్రజ లెంతవరకుందురో అంతమేరను తనసామ్రాజ్యమును స్థాపించినవాడని అర్థమట. అత్యరాతిసోద

1. మత్స్యపురాణం, 121 అ. 25 శ్లో. "అంబికే యస్య మైనాకం తేనుకం చైవ తత్ స్మృతమ్, తదేష మిత్యుక్తం సర్వం విభ్రాజసంజ్ఞకం."
2 శైవపురాణములలో మాలి, సుమాలి, విద్యున్మాలి-విద్యున్మాల్యవాక్-అనిముగ్గురన్నదమ్ములు చెప్పబడినారు.
3. Bedouins, H. P, Vol. II.
4. Index, High Ways of the World.
5. వాయుపురాణము, రెండవ ఖండము, 20-అ.6.
6. విష్ణుపురాణము, అ. 2. అ. 4.


AFRICA
కుశద్వీపము (ఆఫ్రికా)
(Sudan)
ANGOLA
అట్లాంటిక మహా సముద్రము
AFRICA
Scale of Miles
Caspian Sea

రుడు ఉరుడు. ఉరునికొడుకు అంగిరస్సు[1]. ఇబ్రహీమును బాబిలోనియాలోనుండి వెడలగొట్టి ఆదేశమును స్వాధీనపరచుకొన్నవాడు (Mr. Enger)[2] ఉరునికొడుకైన అంగిరసుడే. ఆఫ్రికాలోని (Angra Pequenna) అంగ్రా పెక్విన్నా ప్రదేశమును, ఏంగోలు (Angolu) ప్రదేశమును అంగిరసుని విజయస్మారకచిహ్నములు.

ఆఫ్రికాలోని రివోడివోరో (Reodeoro) లేక (Oren) ఓరన్ అను ప్రదేశము అంగిరసుని తండ్రి అయిన ఉరునిపేరిటిది.

Ambrez, Mandate ల యొద్ద నున్న గొంచియా, సెనేగల్ నదులయందు గల తాంబకుడం మొదలైన పేర్లుగల స్థలములు భారతీయుల క్షేత్రములపేర్లను తలపునకు తెచ్చుట లేదా?[3]

ఆఫ్రికాలో ఇప్పుడు (Sudan) సూడాన్ అనబడు ప్రదేశము పూర్వము శివదానము అనబడునది. ఇది హిరణ్యాక్షుని పుత్రుడును, ఖరవంశీయుడు నైన శివునిపేరుతో నెలకొన్నది[2].

ఇది ఖరదేశమునకు సమీపమందే యున్నది.

ఈశివదాన దేశముకూడ తొలుత రాక్షస దేశమే. కొంతకాలమున కిది మిశ్రదేశముగా మారినది. దీనికీపేరు మిశ్రబ్రాహ్మణుల వలన వచ్చినది.[5] Capyots, Ethiopians అనువారు మిశ్రబ్రాహ్మణులు[6]. వారలీదేశమున మహీదేవ (Priest Kings) అనగా మతాధికారమును, గవర్నరును బోలిన రాజాధికారమును కలిగియుండిరి. వీరి తరువాత ఈ దేశమునకు జాంటు (Gypsies) లు అనువారివలన ఇజిప్టు (Egypt) అను పేరు వచ్చెను. ఇరాణాలోని జాటా (Jatah) ప్రదేశమువలన వారు జాంటు లనబడిరి[7].

మిశ్రదేశమునకుపైన డమ (Damitter) 'దమిత్ర'="విష్ణు" పుర మున్నది[8]. మిశ్రదేశమునకు పశ్చిమమున ట్రిపోలి దేశముగలదు. ఇదియే పూర్వము త్రిపురదేశ మనబరగినది. ఇదియే శివుని త్రిపురవిజయమునకు సంబంధించినది.[9] త్రిపురదేశమందలి కొంతభాగము ప్రసిద్ధమయిన సర్టియన్ (Syrtian sea) సముద్ర

1. విష్ణుపురాణములో చాక్షుషమన్వంతరము చూడుడు.
2. History of Babylonia.
3. Whence the Hindu Names of towns at the estuaries of the Gonchia and Senagal rivers, the Tambakenda and other Kundas—Todd's Rajastan, P. 521.
4 మత్స్యపురాణము చూడుడు.
5. See Atlas, page 26.
6. Misra under Misraien B. C. 2188—Todd's Rajastan, P.30.
7. Jatah-H. P. Vol. 2nd. Index.
8. Demiter విష్ణువుయొక్క పేరు (Greek Legends).
9. మత్స్యపురాణములో త్రిపురాసుర యుద్ధము చూడుడు.

ములో మునిగియున్నది.[1] త్రిపురములను జలములో శివుడు ముంచినాడని మన పురాణములు చెప్పుచునే యున్నవిగదా.[2] శుక్రనగరము (City of Venus) సరిటియన్ సముద్రములో మునుగుటను గురించి 1925 వ సం. ఏప్రియల్ 20 వ తేదీ ఇంగ్లీషు మెయిల్ పత్రికలో కూడ నొకవ్యాసము ప్రచురింపబడినది.

ఇప్పు డీసముద్రపు టొడ్డున క్వాబెసు (Quabes) అను ప్రదేశ మున్నది. నాడు సముద్రములో మునుగగా శేషించిన కావ్యుని (శుక్రుని) స్థలము ఇది కావచ్చును.

క్వాబెసునకు పైన సుసా (Susa) నగర మున్నది. వరుణుని రాజధానియైన సుషా నగరమే యిది.[3] మిశ్రదేశ మధ్యభాగమున సముద్రతీర మున్నది. ఆ సముద్రము పేరు Adriatic Sea, అనగా ఆద్రిసాగరము. దీనికి దిగువ సోనియన్ సముద్రము (Sonian Sea), యవనసాగరము, అనగా టికాతిక్ సముద్రమున్నది. అద్రుడు అయోధ్యాధిపతి, ఇక్ష్వాకు వంశీకుడు. వీనిపుత్రుడు యావనాశ్వుడు. గ్రీకులుకూడ వీనిని టిటిసు, అనగా సూర్యవంశజుడని చెప్పుచున్నారు. యవన సాగరముచెంత (Aegian Island and Aegia Sea) అనగా అగ్ని ద్వీపము, బడబానలము గలవు. అగ్ని అనువాడొక మహర్షి. మునినది అశాంతి (Reodomuni, Ashanti) అను పేర్లు ఆఫ్రికాలో భారతీయ సాంప్రదాయములను స్ఫురింపచేయవా? వీని నామములిప్పుడు కొంత పరివర్తితము లయి యున్నను విచ్ఛిన్నమైన భారతీయసభ్యత యొక్క శకలము లక్కడ నింకను కనుపడుచునే యున్నవి.

స్వర్భంగము*

మొసలికంటి హనుమంతరావుగారు

[వెనుకటిసంచికి తరువాయి]

ఓ శివరక్షిగర్భమున ఘో
రానలమునఁ బొటుపడఁగ నంధువునఁ బనుల్
పూనఁగననిలోఁ జిక్కిన
బానిసలము—ంబలితమైన పరవుడమునకో.

కాదగునిఁక నతీఃణబ
లాద్భుతిచే, శాశ్వతవ్యథాధీన్యశరీ
రాదినవత్వముచే, మఱి
లేదు ప్రయోజనము వేఱు లేశంబయినన్.

అనుటయుఁ బూర్వసుపర్వా!
యనిపిలుచుచు వాని మిగుల నాత్రముతో ని
ట్లనువుగ భాషించెను ద్రిభు
వనకంటక దుశ్చరిత్రవర్యం డంతేన్.

ఆపదలం బనులను ని
ల్పోపమి దురవస్థ గూర్చ నొగి నిటు వినుమీ
తేపకు నరి క్రియమగు
పాపమె వేడ్కగుత, సుకృతి పాయుత మనలన్.

---

1. Map of Mediterranean Sea.
2. మత్స్యపురాణములో త్రిపురాసుర యుద్ధముచూడుడు.
3. మత్స్యపురాణము—'సుషానామ పురీ రమ్యా వరుణాస్యాపి ధీమతః.' [భాగమున కనువాదము.
* ఇది ఆంగ్లకవి 'మిల్టను' రచియించిన 'పేరడైజులాస్టు' (Faradise Last) అను పద్యగ్రంథ ప్రథమ

మనదుండగములు మేలగు
నను పెంచిన విఫలముగను నడ్డుదు, మేలౌ
పను లతఁడు చేయఁ గీడగు
నను పెంచుటె మనదు ధర్మమై యొప్పవలెన్.

మనధర్మము ఫలవంతము
గను సాగినకొలఁదిఁ దనదు కడుగూఢాలో
చనములు లక్ష్యవిశుద్ధినిఁ
గననేరవు దాన నతఁడు గాసిలు మిగులన్.

చూడుమ! యిదె మగిడించెను
వేడివిజయి వాడిభటుల వెన్దవులు నెడన్
పోడిమిచెడె గాంధకవ
గ్షాడంబర మగుఁ బ్రశాంత మనలజలధియున్.

రుధిరారుణశంపా దు
ర్మథనాగ్రహా పక్షియుగ్మ మహిత స్తనితం
బధికార్భటి సేయుదు నిర
వధికాంధుపు నందు పశనివారళ్లభయా.

కావున నిదె తరుణమురిపుఁ
డేవిధిఁ దృష్టాగ్రహాగ్ని నేనియు నిన్నా
రావిష్కృతి నేనియు మది
భావించిన, మించఁబెట్టవల దించుకయున్.

అటుగనుమ, బహిష్కృతమై,
కటువై, దుస్సహమునైన కటకము దోఁచున్
పటుశూన్యత, భ్రష్టాంశుత
(?)దృటిభయదైతత్ప్రికాశమే దిక్కగుచున్.

అమ్యోడకు నడువుఁడీ సెగ
యుమ్యొలలకుఁ దవ్వు గాఁగ నూఱట లభ్యం
బమ్యోడువో నట విరతిం
దియ్యముగాఁ గాంతు మార్తి దీరఁగ నంతన్.

విఱిగినబలములు గూరిచి
తఱుగులఁ దీర్చుట,విరోధిఁ దాఁకుట, సిలుగుం
బఱచుట, నాశ నిరాశను
దఱిగొనుటో, తెంపు గనుటొ తలపోయవలెన్.

అని బోరగిలఁగ నర్ణవ
మున బంధురదీర్ఘకాయమును జాఁపి కనుల్
గణగణమండఁగ నలపైఁ
జొనిపి తలన్ నఖునిఁ బలుకుచో నిట్లొప్పెన్.

జవు గవిసిన యవనీతను
భవు లగు సైటనుల లోనివాఁడో టరసున్
వివరములోఁ దవిలిన బ్రయ
రివసుండో బైఘనుఁడో మఱియు నూహింపన్.

ఉత్తరజలనిధి నిశఁబడి
తత్తరమున రేపుదాఁక దలఁదాఁచుకొనన్
ఎత్తో యచరము నిద్దుర
మత్తునఁ దేలంగ ద్వీపమతిమూఁపుపయిన్.

నావికుఁ డరిత్ర మేయునో
యావారి చరమ్ము నాఁగ నాయామముగా
నావహ్నిసరసి పై దు
ర్భావుఁడు సైతానుదోఁచె బహు నిగళితుఁడై.

దైవేచ్ఛ గాకయుండిన
నావంతయు లేవఁగలఁడె, యూనన మెత్తం
జేవ దలిర్చునె, బంధితుఁ
డై వహ్నిన యట్టులుండ కశ్రాంతముగన్.

స్వైరిత పొసఁగుట దుర్వ్యా
పార పరత్వంబుఁ బూని పరుల నిరతముం
గారించుచు నిజదుష్కృతి
వారావృత్తముల దండ్యవరుఁడై కినుకన్.

తన కార్పణ్యము తాఁ గలఁ
చినమనుజు దయాసమగ్ర చిరసౌఖ్యములం
బెనచి, తన కతులహ్లాద్వే
దనమును,బగ,గలఁతఁ బెనుపఁ దగ నీక్షించున్.

అట్టి దురాత్ముఁడు కొలఁకున
నిట్టనిలువుగాఁగఁ దనువు నిగిడిచి లేచెన్
జెట్టలమంటలు శూలము
లట్టుల దిగు వాఁకెఁ దెరల యందము చిందన్.

మనోనాశనము

భాగవతుల దక్షిణామూర్తి శాస్త్రి గారు

దుర్లభో మానుషో దేహః బ్రాహ్మో దేహ స్సుదుర్లభః,
బ్రాహ్మం దేహం సమాసాద్య యేన ముక్త్యై న యత్నతే.
స మేరో రగ్ర మాసాద్య స్వదేహం పాతయ త్యధః,
తమేవ పతితం విదు ర్జాతిభ్రష్టం మహర్షయః.

'సర్వసంకల్పక్షయో మోక్షః' యనునట్లు సంకల్పములే సంసారవృక్షమునకు తల్లివేరు. అట్టిసంకల్పము లెంతవఱకు నశింపవో యంతపర్యంతము జీవుఁడవిద్యావశమున సంసారసాగరము నీదలేఁడు. సకలవాసనాక్షయము కాఁగనే మనస్సు నశించును జనకుఁడిట్లు చెప్పుచున్నాఁడు:

'ప్రబుద్ధోఽస్మి ప్రబుద్ధోఽస్మి
దుష్ట శ్చోరో మయాత్మనః,
మనో నామ నిహన్మ్యేనం
మనసాఽస్మి చిరంహృతః.'

అనఁగా 'మేల్కొంటిని మేల్కొంటిని. ఆత్మచోరుఁడు వ్యక్తమాయెను. అట్టిచోరుఁడు మనస్సు. పెద్దకాలము మనస్సుచే నేను మోసగింపఁబడితి' నని.

వసిష్ఠభగవానుఁ డిట్లు చెప్పియున్నాఁడు:

'అస్య సంసారవృక్షస్య
సర్వోపద్రవదాయినః,
ఉపాయ ఏక ఏవాస్తి
మనస స్తస్య నిగ్రహః' అని.

శ్రీగౌడపాదాచార్యులవారును:

'మనోనిగ్రహాయత్తమభయం సర్వయోగినా'

మని సెలవిచ్చిరి. ఇట్లు సర్వయోగులు నభయరూపమగు ముక్తి మనోనాశనమువలనఁ గల్గునని చెప్పిరి. కావున మనోనిగ్రహ మావశ్యకము.

'హఠనిగ్రహ' మనియు, 'క్రమనిగ్రహ' మనియు నిగ్రహము ద్వివిధ వర్తించును. చక్షుశ్శ్రోత్రాదిజ్ఞానేంద్రియములను, వాక్పాణిపాదాదికర్మేంద్రియములను వానివాని గోళములను మూసినమాత్రమున హఠాత్తుగా నొకానొకప్పుడు నిగ్రహింపఁబడును. అటులనే మనస్సును గూడ నిగ్రహింపఁ గలనని భ్రాంతి మూఢునకుఁ గల్గును. కాని హృదయకమలము మూయరాని దగుటం జేసి యట్టి హఠనిగ్రహము శక్యముగాదు. కావునఁ గ్రమనిగ్రహమే యస్మదాదులకు స్వీకారయోగ్యము. అందుల కుపాయములు: ౧. అధ్యాత్మవిద్యాప్రాప్తి, ౨. సాధుసాంగత్యము, ౩. వాసనాపరిత్యాగము, ౪. ప్రాణస్పందనిరోధము. ఈసాధనముల ననుకూలముగా బలపఱచుకొనినపక్షమునఁ జిత్తజయము సుకరము. వీనిని మాని హఠనిగ్రహముచే మనోనిగ్రహముఁ జేయువాఁడు బిసతంతువుచే మదపుటేనుఁగు బద్ధముఁ జేయఁ నిశ్చయించిన మూఢుఁడే యగు. అధ్యాత్మవిద్య దృశ్యము లన్నియు మిథ్య లనియు, దృగ్వస్తువు స్వతః ప్రకాశ మనియు బోధించును.

౧. అంత ననిత్యమగు దృశ్యమునం దపేక్ష లేని కారణమున దృగ్వస్తువు తనకు గోచరింపమిచే మనోవృత్తులు క్రమముగా క్షయమునొంది యింధనములు లేని యగ్నివలె తమంతటఁ దా నుపశమించును. ఈయర్థము

"యథా నిరింధనో వహ్ని స్స్వయోనా వుపశామ్యతి,
తథా వృత్తిక్షయాచ్చిత్తం స్వయోనా వుపశామ్యతి"

యను శ్రుతి తెలుపుచున్నది. ఈమనోనిగ్రహోపాయ మధికారేతరాప్రాప్యమైనది.

౨. బోధింపఁబడిన తత్త్వమును జక్కఁగఁ దెలియలేని వానికిని, తెలిసి విస్మరించినవానికిని సాధుసంగమ మత్యంతశ్రేయోవిధానము. సజ్జనులు వేమాఱు జ్ఞానమును స్మృతికి వచ్చునట్లనుగ్రహింతురు. ఇది మధ్యమాధికారికిం దగినది.

3. దర్పము మొదలగు దుర్వాసనలచే సాధువుల సేవింప నిచ్చలేని మందాధికారులు పైనుదాహరింపఁబడిన వాసనాపరిత్యాగోపాయమును స్వీకరించుటుచితము;

౪. వాసనాప్రాబల్యముచే మనోనిరోధము నవిఁ బొందని యవసరమున ప్రాకృతాధికారులు ప్రాణస్పందనిరోధనమె యవలంబింపవలెను. ప్రాణస్పందములు, వాసనలు చిత్తప్రేరకములు గావున వాని నిరోధమునఁ జిత్తశాంతి సంఘటిల్లును.

"ద్వేబీజే చిత్తవృక్షస్య వృత్తిప్రతతిధారిణః,
ఏకం ప్రాణపరిస్పందో ద్వితీయం దృఢవాసనా"

యని వసిష్ఠభగవానుఁ డీయర్థమునే నుడివెను: ప్రాణస్పందములు, వాసనలును చిత్తప్రేరకము లగుట గాక పరస్పరప్రేరకము లగునని తెలియునది.

"వాసనావశతః ప్రాణస్పందస్తేన చ వాసనా,
క్రియతే చిత్తబీజస్య తేనబీజాంకురక్రమః'

అని వసిష్ఠవచనము.

అద్వితయమం దేకనాశన మన్యనాశనహేతు వగును.

'ఏకస్మింశ్చ వినాశితే క్షిప్రం ద్వే అపి నశ్యతః'

అను వాక్యమీయెడ స్మరించుటుచితము. వాసనా సంపరిత్యాగమువలన చిత్త మచిత్త్వమునఁ జెందును.

"ప్రాణాయామదృఢాభ్యాసైర్యుక్త్యా చ గురుదత్తయా,
ఆసనాశనయోగేన ప్రాణస్పందో నిరుధ్యతే."

అని ప్రాణస్పందనియమోపాయములు—

౧. ఆసననియమము, 2. ఆహారనియమము, 3. ప్రాణాయామదృఢాభ్యాసము, 4. గురుదత్తయుక్తి.

౧. ఆసనము:—ఎట్లు దేహ ముండుటచే నవయవవ్యథ కలుగక, దేహము చలింపక స్థిరముగ నుండునో యది యాసనము. 'స్థిరసుఖమాసన'మను పాతంజల యోగసూత్ర మీయర్థమునే వ్యక్తీకరించుచున్నది.

క్షుత్తృష్ణాదులు బలముగ నున్నయెడ సాధనము నాయాససాధ్యము గాదు. ప్రాణులు రేచించువాయువు విషమిశ్రితమైనది. ఆ విషమునే యాధునికులు 'బొగ్గుపులు'సని వ్యవహరింతురు (carbonic acid). ఆవిష మెంతయెక్కుడుగ రేచింపఁబడిన నంత క్షుత్తృష్ణలు, దాహతాపములు, బలహీనత యతిశయించును. కావున యోగయుక్తుఁ డీవిషము తక్కువగాఁగల వాయువులఁ బీల్చుచుండవలయును. ఉష్ణమండలమున నుండువారికంటె శీతమండలమున నుండువా రెక్కువవిషమును రేచించెదరు. కావుననే యుష్ణమండలవాసులకంటె వారికి క్షుత్తృష్ణాను లధికములై తీవ్రముగ నుండును. తన మేనికాఁకకుం దుల్యమగు కాఁకగల తావులయం దట్టి విషము మిక్కిలి తక్కువగ రేచింపఁబడును. భూమధ్యరేఖకు సమీపముననున్న తామ్రపర్ణీ కావేరీనదీప్రముఖంబు లగు తీరములు యోగయుక్తున కనుకూలంబులై యుండును. ప్రాచీనులు ప్రాయికముగా నట్టిస్థలములయందే యోగపరిశ్రమము చేసి యారితేఱినపిమ్మటనే హిమాలయాశ్రమముల కేఁగినట్లు కన్పట్టుచున్నది. పర్వతాద్యున్నతప్రదేశములం దున్నప్పటికంటె సముద్రమునకుఁ దుల్యమగు నెత్తుగల తావులను, నంతకంటెం బల్లంబులగు తావులను నున్నపుడు విష మెక్కువ రేచింపఁబడును. కావునఁ గొండలు, గోపురములు మొదలగు నెత్తైనప్రదేశములు స్వీకారయోగ్యములు. విషరేచన మారుబైట బహుళంబగు. వాయుసంచారము బాగుగ నున్న ప్రదేశములందుఁ గలుగునంత విషరేచనము గాలి నిలువయుండు పట్టణములం దుండదు. కావున యోగయుక్తునకు గుహలు మొదలగు నిర్జనప్రదేశము లనుకూలములై యుండవు. మఱియు, మేఘాగ్నివాహులగు (conductors of electricity) పదార్థముల సంపర్కమున్నపు డెక్కుడు విషము రేచింపఁబడును. శీతల వాయుసంచారదేశములం దది యధికముగ నుండును.

కావున లోహములు, బొగ్గులు, పులుపుగల క్షారములు, లోహకిట్టములు (metallic ores), జంతువుల జలమయమగు ధాతువులు, తేమగల వస్తువులు, మంచు, ప్రాణివర్గము, శాకపదార్థములు, చూర్ణమైన గాజు, గంధకపు పొడి మొదలగువాని సంపర్కము కీడైనంత నిరాకరించిన క్షేమము. తచ్ఛక్తివాహులు కాని (non-conductors) పట్టు, రోమములు, కర్జములు, ప్రతిఫలనముగల రత్నములు, తడిలేని కాగితములు, ఆసనములు, హారతికర్పూరము, భస్మము, సున్నము, భాస్వరము (phosphorus), మంచుగడ్డ, స్ఫటికములు, తైలములు మొదలైనవాని సంపర్కమున విద్యుద్రేచన మంత యుండదు. వీఁడు మిక్కిలి లాభకరములు. వ్యాయామాదులచే విద్యుద్రేచన మెక్కువగును. ఈ పైవిషయముల విమర్శించి విద్యుద్రేచనానిముఖులై యాసనమును యోగులు సాధింతురు. మఱియు గమన, గృహకృత్య, తీర్థయాత్రా, స్నాన, హోమాది విషయములు మానసోత్సాహమును సైతము మానవలెను. అట్టి యుత్సాహము దేహమును బలాత్కారముగ లేవఁదీసి యెచ్చటికేని ప్రేరేపించును. దానిచే వ్యాయామాదులు సంభవించుటయు, విద్యుద్రేచన మెక్కువగుటయు వాసనభంగము మొదలగు వనర్థంబులు వాటిల్లును. అట్టి మానసోత్సాహమును మానుటకై ప్రణవము మొదలగు బీజాక్షరముల జపమాచరింపఁదగు. ఆబీజాక్షరములనే యాశ్రమవాసులు వారికిఁ దగినవానిని సద్గురువులవలనఁ దెలియవలెను. అట్టి జపముచే విద్యుద్రేచన మీడును. అట్లే చిత్తము ధ్యానమగ్నంబై యుండదేని వ్యాపారరహితమగుటచే విద్యుద్రేచనము యెక్కుసాం గడఁగును. నాసాగ్రమున భ్రూమధ్యమున నుండు దృష్టిని స్థిరీకృతముఁ గావించినయెడ స్వవ్యాపారములను మనస్సు మూరకుండును. వాగ్వ్యాపారమున్నను సైతము విద్యుద్రేచన మెక్కువయగు. వాగ్వ్యాపారము రెండువిధములు: ౧. లౌకికము, ౨. వైదికము. సంభాషణాదిరూపమైనది ప్రథమము; జపాదిరూపకము ద్వితీయము. అనేకవిక్షేపములకుఁ గారణమగుటఁ జేసి ప్రథమవ్యాపారము పరిత్యజింపఁదగినది. జపాదికమును నిరోధసమాధియందు మాత్రము విడువవలయును. కావున మౌనము సైతము ముఖ్యమని తేలుచున్నది. ఇట్టివెల్ల వాసనాక్షయమున కనువగు సహాయములు. ఇందుఁ గొన్ని లౌకికములు. అలౌకికోపాయములను పెద్దలు కొందఱు చెప్పుచున్నారు. ఘనసహస్రముచే భూమిని ధరించి స్థిరముగ నుండు నాదిశేషుని ధ్యానించిన నాసనము స్థిరముగనుండును. ఈయుపాయము కాక యమనియమాదులుగూడ వాసనస్థైర్యదాయకములు. జగమంతయుఁ జిత్తవికారము. చిత్తవాసనలచే జగద్వ్యాపారము సంభవించుచున్నది.

'స్వచిత్తమేవ కచతి తయోస్తాదృఙ్మనోహరం,
వాసనామాత్రసోల్లేఖం క్వ బ్రహ్మాండం క్వ సంసృతిః.'

యని లీలోపాఖ్యానమున వసిష్ఠభగవానుఁడు చెప్పియున్నాఁడు. కావునఁ జిత్తము క్రోధావేశాన్వితమైనవాఁడు లోకంబంతయుఁ గ్రోధవర్జితమై కన్పట్టును. దర్పణమున మనముఖవికారము లన్నియుఁ గన్పట్టునటులనే మనక్రోధాదులన్నియు లోకమునఁ గన్పట్టును. హింసారతిగల పురుషునకు విశ్వమంతయు హింసారతిగల్గినట్లు దోఁచును. "తత్సన్నిధౌ వైరత్యాగః" యను పాతంజలయోగసూత్ర మహింసా ప్రతిష్ఠితమైనవాని సమీపమున హింసారతములైన భూతములు హింసాత్వమును మానియుండునని చెప్పుచున్నది. భూతములు తన్ను హింసించునను వెఱపు గలవానికి వాసనస్థైర్యము కుదురనేరదు. కావున నహింస దృఢముగ నభ్యసించువాఁడు నిర్భయముగ నుండును. అహింస యనఁగా మనోవాక్కాయకర్మములందు భూతములకుఁ గ్లేశముఁ గావింపకుండుట. "అక్షయ్యం హవై చాతుర్మాస్యయాజిన స్సుకృతం భవతి" యనఁగాఁ జాతుర్మాస్యయాగముఁ జేయువాని పుణ్య మనంతమై యుండునని. కాని 'హిరణ్యదా అమృతత్వం భజన్తే' యనఁగా హిరణ్యదానముఁ జేయువా రమృతత్వముఁ బొందుదురు. ఇట్టి శ్రుతులవలన నాముష్మికఫలాసక్తుఁడైనవానికి యాగాదులఁ జేయ నుత్సాహ ముద్భవించును. దానిచేతఁ దదాచరణమునకై యత్నించునుగావున వాసనస్థైర్యము సంభవింపదు. అట్టి సకల సత్కర్మఫలము నొసంగఁజాలు మేటిధర్మమును వదలుచుకొనునెడ నట్టి యుత్సాహముగాని, యత్నముగాని సంభవింపవు. అట్టి మేటిధర్మము సత్యము. "సత్యప్రతిష్ఠాయాం క్రియాఫలాశ్రయత్వ"మను పాతంజలసూత్రము సత్యత్వమునఁ బ్రతిష్ఠితుఁడైనవాఁడు యాగాదిసత్కర్మలను జేయలేకపోయి

నను తత్ఫలభాక్కువున్నాఁ డని చెప్పుచున్నది. ఇఁక రెండవది 'యస్తేయము.' 'అస్తేయప్రతిష్ఠాయాం సర్వరత్నోపస్థాన'మ్మను యోగసూత్రమస్తేయమెంత యుత్కృష్టమైనదియో చెప్పుచున్నది.

అహింసాదికర్మము లెంత బలవంతము లైనను స్త్రీపిశాచము సోఁకినంతమాత్రమున సర్వానర్థప్రాప్తి కావున వాసనము భంగము నొందునని చెప్పుట చోద్యము కానేరదు. సర్వజ్ఞుండగు పరమేశ్వరుఁడు కామిని సోఁకిన మాత్రమున సగమైపోయెనుగదా! పెద్దకాలం బెంతేని కష్టముల కోర్చి సుజనశ్లాఘాస్పదంబగు తపంబు చేసిపెంపెక్కిన విశ్వామిత్రాదిఋషులు పూర్వకృతతపంబులు నీరైపోవ కామినీకృతనికారంబుల పాలై చెడిరి. సర్వానర్థమూలంబగు కామినులం జేరినవానికి వాయుస్తేజోద్యుతిబలంబులు క్షీణించును. మతిని హరించి మత్తుచేయునది మద్యముగదా! అది గౌడి, మాధ్వి, పైష్టి యని ముత్తెరు. స్త్రీని నాల్గవతెఱఁగానిగ నెంచవలయును. అది సర్వహానికరము. అట్టియెడ నెట్టికార్యమునందు బుద్ధి చొరనేరదు. ఆసనస్థైర్యము మాట చెప్పనేల? విషసేవనం బత్యధికం బగును. నితంబిని నిప్పులకుండము. పురుషుండు ఘృతకుంభమువంటివాఁడు. దాని చెంతఁ బోయినయెడఁ గ్రాఁగి కాఁగి రూపు మాపుకొనును.

"స్మరణం కీర్తనం కేళిః వీక్షణం గుహ్యభాషణమ్,
సంకల్పోఽధ్యవసాయశ్చ క్రియానిర్వృతిరేవచ;
ఏతన్మైథునమష్టాంగం ప్రవదన్తి మనీషిణః,
విపరీతం బ్రహ్మచర్యం ఏత దేవాష్టలక్షణం"

అను స్మృతివచనము వలన, ౧. సుందరులను స్మరించుట, ౨. వనితల రూపలావణ్యాదుల కీర్తించుట, ౩. బోటులతోడి యాటపాటలు, ౪. సీమంతినులను గన్నారఁ జూచుట, ౫. నారీమణులతో రతిసల్ప సంకల్పించుట, ౬. మహిళలను రమింప నిశ్చయించుట, ౭. వామలోచనలతో రహస్యసంభాషణము, ౮. ఇందీవరాక్షులఁ గూడుట—ఈయెనిమిది మైథునరూపములు; వీనికి విపరీతమైనది బ్రహ్మచర్యమని తెలియునది. శరీర మతినింద్యము. అట్టి నారీశరీరమునకు దాసుఁడై యానర్మకుండమ్మున బలాయురారోగ్యధనాదుల వేల్చుట యెంత దురవస్థయో యూహింపఁదగినది. ఇట్టి వివేకమునే స్త్రీలను పురుషులయెడ పూనందగు. కావున యోగయుక్తు సర్వవిధముల బ్రహ్మచర్యమును బూనవలయును. యోగయుక్తు ప్రారబ్ధబలంబున గృహస్థుండగుట సంభవించెనేని ఋతుకాలములందు ౫, ౬, ౭, ౮, ౯, ౧౦, ౧౨, ౧౪, ౧౫, ౧౬ రాత్రులయందు, వ్రతాదిదినములు కాకున్నయెడల, దంపతుల కనుకూలారోగ్యమున్నచో, స్వభార్యతో రమించుటవలన బ్రహ్మచర్యహాని లేదు. "బ్రహ్మచర్యప్రతిష్ఠాయాం వీర్యలాభః" యను పాతంజలయోగసూత్రము బ్రహ్మచర్యము సుప్రతిష్ఠితమైనవానికి వీర్యలాభమని చెప్పుచున్నది. బ్రహ్మచర్య మనఁగా వీర్యనిరోధముగదా! దాని యతిశయముచే శరీరేంద్రియమనంబుల వీర్యాతిశయ ముప్పతిల్లును. దాన వాసనస్థైర్యము సిద్ధించును. మఱియు భోగము లుపస్థితము లైనను యోగయుక్తు వాని నపేక్షింపఁ గూడదు. ఇట్టిదానికే 'యపరిగ్రహ' మని పేరు.

పరిగ్రహము కలవాఁడు రాగానుబంధము బ[illegible]క మానడు. దానివలనఁ బ్రవృత్తి బహిర్ముఖమై యుండును. బహిర్ముఖప్రవృత్తివలన ఆధ్యాత్మికజ్ఞానము నశించును; మోక్షముఁ గలుగదు. కావున భోగసాధనములగు శరీరాదుల యెడ నిరపేక్షుండై యుండెనేని మాధ్యస్థ్యము సంభవించును. మధ్యస్థునకు రాగాదిపరిత్యాగము సంఘటిల్లును. దానంజేసి జ్ఞానకారణము పొడమును. దానంజేసి యపరిగ్రహము దృఢప్రతిష్ఠితమైనవానికిం బూర్వాపరజన్మజ్ఞాన ముప్పతిల్లును.' "అపరిగ్రహస్థైర్యే జన్మకథన సంబోధః" అను పాతంజలయోగసూత్ర మీయెడ స్మరణీయము. పూర్వాపరజన్మజ్ఞానమువలన జన్మాంతరీయమైన యనర్థావహములగు కర్మలపరిపాకము కరతలామలకమువలెఁ గనుఁగొనుటంజేసి యట్టికర్మలచెంతం బోక యుండును గావున వాసనస్థైర్యము సిద్ధించును. అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము, వీనికి యమములని నామధేయము. హింసాదులగు నిషిద్ధధర్మములవలన యోగులను యమించునవి గావున యమములనంబడును. కావున హింసాదులు (యమవిరోధులు) యోగవిఘ్నకరములు. హింసాదులు (౧) కృతములు, (౨) కారితములు, (౩) అనుమోదితములు అని ముత్తెరు.

(౧) తానే చేయునవి 'కృతములు', (౨) 'చేయుము, చేయుము' అని పరులచేతం జేయించునవి 'కారితములు', (౩) పరులు చేయఁగా 'మేలు మేలు' అని యంగీకరింపఁబడునవి 'యనుమోదితములు.'

కావున హింసాదులను దాను చేయకున్నను బరులచేఁ జేయించుట, చేయ ననుమోదించుట యమములకు భంజకములే యగు. హింసకుఁ గ్రోధమే కారణము. అస్తేయమునకు, నపరిగ్రహమునకు లోభమును, మోహమును దూరము చేయవలయు. ఉపస్థావ్యాపారమునకుఁ గామము, మోహము కారణములు. కారణనిర్మూలనంబునఁ గాని కార్యము తుదముట్టఁ దొలఁగదు. అందనాత్మయం దాత్మాభిమానము మోహము. అదియే సర్వానర్థమూలం బండ్రు. మఱియు హింసాదులు కారణభేదముచే మృదువులనియు, మధ్యములనియుఁ, దీవ్రములనియు ముత్తీరు. హింసాదుల ఫల మనంత దుఃఖకరమును; అనంతమగు నజ్ఞానకారణము. యమములను సకలజాతులయెడ, సకలకాలములందును, సకల దేశములందును నడుపవలయును. కావున 'బ్రాహ్మణులనే హింసింపఁగూడదు. మనుష్యులనే చంపరా' దనుమాట వలదు: సకలభూతములను హింసింపరాదు. 'ఏకాదశినాఁడే బ్రహ్మచర్యమును బూనవలె' ననుమాట కాదు: సర్వదా పూనఁజనును. 'కాశీక్షేత్రమునందే స్తేయము చేయఁగూడ' దనికాదు: సర్వప్రదేశములందును నిగ్రహింపవలయును. 'బ్రాహ్మణప్రయోజనాదిసమయములందు సత్యము నడుపవలయు'నని కాదు: అఖిలసమయముల జరుపవలయు. మఱియు సకలయోగభూమికలందును, జ్ఞానభూమికలందును యమములు నిలుపవలెను.

ఇంక నియమములు:

సంసారహేతువులగు కామ్యకర్మలవలనఁ దొలంగించి మోక్షహేతువులగు నిష్కామకర్మల యాచరణమునందు నియమించునవి గనుక 'నియమములు': (౧) శౌచము, (౨) సంతోషము, (౩) తపస్సు, (౪) స్వాధ్యాయము, (౫) ఈశ్వరప్రణిధానము.

(౧) శౌచము: అనఁగా మలప్రక్షాళనము. అది బాహ్యమనియు, నాభ్యంతరమనియు రెండుతెఱంగులు. మృత్తు, జలము మొదలగువానిచే దేహప్రక్షాళనము చేసికొనుట బాహ్యము. మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష మొదలగువానిచేతఁ జిత్తమలినమును బోఁగొట్టుకొనుట యాభ్యంతరము. శౌచము దృఢముగ నభ్యసించువానికిఁ దన దేహావయవాదులందు సైతము వానిస్వరూపముఁ జక్కఁగ నాలోచన సేయుటచే జుగుప్స గల్గును. 'ఈదేహ మశుచి యైనది. దీనియెడ నభిమానముఁ జేయరా' దనుటఁ బట్టియే శరీరధారులగు నితరులతో సైతము సంసర్గము పోవును. దానంజేసి శుద్ధసత్త్వజ్యోతి వృద్ధినొంది రజస్తమస్సుల నాశన మొనర్చును. సత్త్వశుద్ధిచే ఖేదములేని మనశ్శుద్ధి కల్గును. ఆసౌమనస్యముచే నియతమగు చిత్తంబు స్థైర్యముఁ బొందును. శౌచాభ్యాసబలమువలన నిట్టిలాభములు సంపన్నంబగుఁ గావున యమములు సురక్షితము లగును.

(౨) సంతోషము: అనఁగా సంతుష్టి:

'సంతోషైశ్వర్యసుఖినాం చిరవిశ్రాంతిచేతసాం,
సామ్రాజ్యమపి శాంతానాం జరత్తృణలవాయతే.'

యని వసిష్ఠులవారు సంతోషైశ్వర్యములు గలవానికి సామ్రాజ్యమైనను దృణప్రాయముగఁ దోఁచునని సెలవిచ్చిరి. నిత్యసంతోషి యగువాఁడు దారిద్ర్యవియోగాది విషమసంసారస్థితులయందు సైతము సుఖమును విడువఁడు.

"అప్రాప్తవాంఛా ముత్సృజ్య సంప్రాప్తే సమతాంగతః,
అదృష్టఖేదాఽఖేదో యః స సంతుష్ట ఇహోచ్యతే."

యని నిత్యసంతోషిలక్షణమును పెద్దలు చెప్పుచున్నారు. సంతోషసిద్ధికి నాశావిసర్జనము ముఖ్యము. ఇదికూడ నాసనసిద్ధి కత్యంతోపయుక్తము.

(౩) తపస్సు: అనఁగా శాస్త్రాంతరమున నుపదేశింపఁబడిన కృచ్ఛ్రచాంద్రాయణాదులు. వానిచేఁ జిత్తముయొక్క క్లేశాదిరూపమగు నశుచిత్వము పాయును. అందుచే నింద్రియము లుత్కృష్టతఁ జెందును. సూక్ష్మమగునట్టియు, దేశకాలములచే దవ్వగునట్టియు వానిని గనఁజాలును. దీనివలన బ్రహ్మచర్యాదులు స్థిరపడుటకు సందియము లేదు.

(౪) స్వాధ్యాయము: అనఁగా ప్రణవాదిమంత్రజపము. ఆమంత్రములను యోగ్యతానుసారముగ సద్గు

రూపదేశమునఁ బొందవలయు. శిష్యుండు గురువును, గురువు శిష్యునిని బరీక్షింపక మంత్రోపదేశముఁ గొనుటయుఁ, జేయుటయు ననర్థావహములు.

"గురుశిష్యావుభౌ మోహా దపరీక్ష్య పరస్పరం,[తాం."

ఉపదేశం దదద్ గృహ్ణన్ ప్రాప్నుయాతాం పిశాచ

అనువచన మీయర్థమునే చెప్పుచున్నది. పుస్తకములలో వ్రాసిన మంత్రానుష్ఠానమును జేయరాదు. సద్గురువువలనే తెలియవగును.

"ఆచార్యాదనభిప్రాప్త మంత్ర శ్చాదత్త దక్షిణః,
అభ్యస్తో౽పి సదా మంత్రః శ్రేయసే నావకల్పతే."

యని నారదీయము.

"పుస్తకే లిఖితాన్మంత్రా నాలోక్య ప్రజపంతి యే,
బ్రహ్మహత్యాసమం తేషాం పాతకం పరికీర్తితమ్."

అని పురశ్చరణదీపిక ఘోషించుచున్నది.

"యదృచ్ఛయా శ్రుతం మంత్రం ఛద్మనా౽పి బలేన వా,
ప్రేషితం వాథగాథాదా యజ్జపే త్తదనర్థకృత్."

యని మూలార్ణవవచనము.

అట్టి మంత్రానుష్ఠానమువలన నిష్టదేవతా సాక్షాత్కారము గల్గును. మంత్రానుష్ఠానవర్తనమున యమాదులు గుప్తంబులు కాకమానవు. వేదపురాణేతిహాసధర్మశాస్త్రకల్పసూత్రముల పారాయణములును జపమే యనఁదగు.

(౫) ఈశ్వరప్రణిధానము : అనఁగా లౌకిక వైదిక రూపమగు సర్వకర్మను ఫలాభిసంధి లేకుండ నిరహంకారముగ నీశ్వరార్పణఁ జేసి తజ్జన్యసుఖదుఃఖముల హర్షోద్వేగమున నొందకుండుట. ఈశ్వరప్రణిధానమువలన యోగయుక్తుఁ పరమేశ్వరకృపకుఁ బాత్రుఁడై సత్యకామ సత్యసంకల్పాదిగుణసహితుండగును. నియమానుష్ఠానమునకు నియమానుష్ఠానమునకు విలక్షణత్వము గలదు.

"యమాన్ సేవేత సతతం న నిత్యం నియమాన్ బుధః,
యమాన్ పతత్యకుర్వాణో నియమాన్ కేవలాన్ భజన్."

అను స్మృతిసైతము సర్వదా యమములను సేవింపవలయునుగాని నియమములను సర్వదా యాచరింపఁ బనిలేదని చెప్పుచున్నది. [సశేషము]

చంద్రుఁడు

సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి గారు

అల్లమిన్నేటి తీరంబునందుఁ దెలుపు
గులుకు మొగిలుగొండల నున్న కోనలోనఁ
బొలుచుచున్నది యొక్క తపోవనంబు
చెలఁగుఁజందురుఁడను బుషిశ్రేష్ఠుఁ డందు.

క. పరిశుద్ధుఁడు సర్వకళా
పరిపూర్ణుఁడు పూతవృత్తి పరిభోగ్య వయ
స్స్ఫురితుండు ప్రపంచతమో
హరణసమర్థుండు వెలుఁగునతఁడున్నతుఁడై.

గీ. కనులఁ గప్పంగ నిండుజవ్వనపుఁ బొగరు
పైపడఁగఁ బాలు రోహిణీపంకజాస్యఁ
గరములం ద్రోయుచాలకుఁ గాని యాతఁ
డెట్టి ధృతిమంతుఁడో! కౌఁగిలింపఁబోఁడు.

గీ. అలరుసాయాహ్నములయందు నాశ్రమంబు
నారుబయలునఁ గూర్చుండి యద్భుతముగఁ
దారకాశిష్యులకు నాత్మ దర్శనములఁ
బండువెన్నెలపేర నుపన్యసించు.

గీ. ఆయుపన్యాసమందలి యంశములకు
సంశయములెల్లఁ దీఱఁగా సంతసించి
నిర్మలతుషారమిషమున నింగినుండి
బాష్పములు రాల్చుచుందురు వారు గనుల.

దేవేంద్రవర్మ కంబకాయశాసనము

మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు

కొంతకాలము క్రితము 'మూడవ వజ్రహస్తుని చిక్కాలవలస శాసన'మను పేరుతో భారతిలో ప్రకటింపబడ్డ శాసనముతోపాటే ఈతామ్రశాసనమును కంబకాయ ప్రాంతమున ఒకరైతు తన చేను దున్నుకొను చుండగా [illegible]బడినది. ఈవిషయము తెలిసిన పిదప ఆంధ్రదేశ చరిత్రాభిమానులును, పరిశోధనాభిలాషులును, కంబకాయ గ్రామోద్యోగస్థులును అగు శ్రీఖైరి అప్పలస్వామినాయుడు గారు ఆరైతునొద్దకువెళ్లి అతనితో 'పరిశోధన చేసినపిదప ఈశాసనము తిరిగి నీ కిచ్చివేసెద'నని తెలిపి దాని నతనినుండి తీసికొని పరిశోధనార్థము దయతో నాకు బంపిరి. దీనిని నేనింతకుపూర్వము చాలకాలముక్రితమే ప్రకటించియుండవలసినది కాని కారణాంతరముల చేతనైన కాలవిలంబనమునకు చాల విచారించుచున్నాను.

ఆకారాదికములు

ఈ శాసనమున మూడు రాగిరేకులు కలవు. మొదటిరేకు మొదటిప్రక్కను, మూడవరేకు రెండవప్రక్కను వ్రాతయేదియు లేక ఈ రెండుప్రక్కలును శాసనమునకు రెండు అట్టలవలెనుండి దానిని సంరక్షించుచున్నవి. ఒక్కొక్కరాగిరేకుయొక్క పొడవు ౮ అంగుళములు: వెడల్పు 3. 3 అంగుళములు. రేకులుపైభాగమునను దిగువభాగమునను కొనల దగ్గర వెడల్పుగను నడుమ సన్నముగను, కుడియెడమప్రక్కల కొనల దగ్గరకంటె నడుమ రవంత ఉబ్బెత్తుగ విలువంపుగను ఉన్నవి. ఒక్కొక్క రేకునకు అంచునుండి ౦.౫ అంగుళముదూరమున రంధ్రము కలదు. ఈరంధ్రముగుండ పోనిచ్చిన యొక కడియము మూలమున ఈ రేకులు బంధింపబడియున్నవి. కడియముయొక్క వ్యాసము ౧.౫ అంగుళములు. ఈకడియ మొక రాజముద్రికలో నతికింపబడి యున్నది. ముద్రికమీద స్ఫుటముగ ఎగువభాగమున చంద్రుడును, దిగువభాగమున అంకుశమును, ఈ రెంటికినడుమ అడ్డముగ మత్స్యమును చెక్కబడియున్నవి. దీనిననుసరించి ఈశాసనమునందు చెప్పబడ్డ దాతవంశమువారిది మత్స్యలాంఛనమని తెలియనగును. ముద్రికలో కడియము నతికినభాగమున ముద్రికకిరుప్రక్కల చెక్కడపుపనికలదుకాని యది చాల కాలపు దగుటచేత త్రుప్పుపట్టి దాని యంద

చందములు వివరముగ దెలియవచ్చుట లేదు. నాదగ్గర కీశాసనము వచ్చునప్పటికి కడియము నెవ్వరును గోసియుండలేదు. రేకులను విడదీసి చదువునిమిత్తము నేనే దానిని కోయించితిని.

లిపి: భాష.

ఈ శాసనమునందలి లిపి నాగరి; కాని యిది 'మూడవ వజ్రహస్తుని చిక్కాలవలస', 'బొడ్డపాడు, అనంతవర్మ చోడగంగదేవుని కోర్ని శాసనములలోని లిపివలె తీర్చి దిద్ది వ్రాసినదికాదు. ఇది మూడవ వజ్రహస్తుని నడగాం[1], నరసీపట్నం[2], 'మెడ్రాస్ మ్యూజియమ్'[3] తామ్రశాసనములందలి లిపివంటిది: విచిత్రమైనది: విలక్షణమైనది. అక్షరములు పొంకముగ నుండక కొంకిరిగీతలవలె నుండును.

ఈ శాసనములో అచ్చులలో ఋ, ౠ, ఏ, ఐ, ఓ, ఔలును, హల్లులలో ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ఫ, బ, శ లును రాలేదు.

అచ్చులలో అ, ఆ, ఇ, ఈ, ఉ లు గను నింపడగినవి. 'అ' వర్ణమును ౯, ౨౭, ౨౪, ౨౯ పంక్తులలోను, 'ఆ' వర్ణమును ౨౧-వ పంక్తిలోను, 'ఇ' వర్ణమును ౨౬, ౨౯ పంక్తులలోను, 'ఈ' వర్ణమును ౨౨, ౨౩ పంక్తులలోను, 'ఉ' వర్ణమును ౪, ౧౮, ౧౬, ౨౮ పంక్తులలోను గాంచనగును. 'ఉ' వర్ణము తక్క మిగిలిన అ, ఆ, ఇ, ఈ లు నేటి నాగరి వర్ణములకు భిన్నముగా నున్నవి.

క, జ, డ, ద, మ, య, వలు నేటి నాగరివర్ణములకు — స్వల్పభేదమున్నను — చాల చేరికగా నున్నవి.

ఖ, గ, శ, క్ష వర్ణములు భిన్నరూపములతో కాన్పించుచున్నను వీటికి ప్రాతిపదిక మాత్రము ఒక్కటిగనే కన్పట్టును.

చ, ట, ణ, త, ద, న, ప, భ, ర, ల, ష, స, హ లు నేటి నాగరివర్ణములకు భిన్నముగా నున్నవి. 'ట' వర్ణము తలకట్టు లేని నేటి నాగరి 'ట్ట' వర్ణమును బోలియున్నది. 'చ', 'ధ' లు రెండును ఆకృతిలో కొంచెమించుమించు సమానముగనే కన్పట్టును. భేదమేమన 'ధ' వర్ణమునకు తలకట్టు లేదు; 'చ' వర్ణమునకు ఉన్నది. 'ణ', 'ల' లు రెండును ఆకృతిలో ఒకటే కాని 'ల' వర్ణమునకు తలకట్టు కలదు; 'ణ' వర్ణమునకు లేదు. 'ణు', 'ణ్ణ' లకు భేదము కనబడదు. ఇట్లే 'తు,' 'త్త' లకును భేదము కాన్పింపదు. 'ప', 'ష' లు నేటి నాగరివర్ణముల కించుకభేదముగ నున్నవి. శాసనములోని వర్ణములు ప్రక్కకు తిరిగియున్నవి. నేటివి దిగువకు తిరిగియున్నవి. 'భ', 'స' లకు ప్రాతిపదిక యొక్కటిగ కనబడును. 'ఛ', 'థ' లు శాసనమున విడిగా రాలేదు కాని సంయుక్త వర్ణములలో దిగువను వచ్చినవి.

శాసనమున చాలచోట్ల 'శ' వర్ణమునకు 'స' వర్ణమును, అన్నిచోట్లను 'బ' వర్ణమునకు 'వ' వర్ణమును వ్రాయబడినది.

1. Ep. Ind. Vol IV. p 183.
2. Ibid Vol XI. p 147.
3. Ibid Vol IX. p 94.

వెలుపలి గిలకతో ఉన్న హల్వర్ణములకు ఇందు ఒకటి రెండుచోట్ల తక్క_ ఎచ్చటను ద్విత్వము రాలేదు. వెలుపలగిలకతో ఉన్న '_' వర్ణమునకు మాత్రము ద్విత్వము వచ్చినది. ఇదికూడ ఒకచోట జారిపోయినది (పం. ౧౭).

సంయుక్త వర్ణములలో ప్రాచీన వర్ణక్రమము ప్రకారము వర్గానునాసికములతో కలిసి ఉండవలసిన వర్గాక్షరములు శాసనమునందు దాదాపుగ అంతటను అనుస్వారముతోనే కలిసియున్నవి. 'ఙ', 'ఞ' వర్ణములు మాత్రమే ఇందులకు భిన్నములు. (చూడుడు: ఙ్గ—పం. 3, ౧౭, ౧౮ లు; ఞ్చ—పం. ౧౯, ౧౯ లు: ఇందు 'ఞ్చ' అను వర్ణము రెండుచోట్ల రెండురీతుల—ఒకమారు అనునాసికము పిదప 'చ' వర్ణము చేర్చియు, మరియొకమారు 'చ' వర్ణము పిదప అనునాసికమును చేర్చియు—వ్రాయబడి యున్నది)

గుణింతములలో అ, ఈ లకు ఈషద్భేదము కలదు. తరచు ఈకారమునకు ఆకారమే వ్రాయబడినది. ఇట్లే ఉ, ఊలకుగల భేదమును స్వల్పమే; కాని శాసనమున తరచు ఊకారమునకు ఉకారమే వ్రాయబడినది; ఇ, ఏ ల విషయమున మూడవ వజ్రహస్తుని చిక్కా_లవలస శాసనమున నెట్లో ఇందును అట్లే. ఋకారము నేటి నాగరిగుణింతమున నెట్లున్నదో అట్లే యున్నది.

శాసనమున చాలచోట్ల అనుస్వారములు విడిచి పెట్టబడినవి; కొన్నిచోట్ల—రేకులు పాడగుటచే—అవి ఉన్నవో లేదో తెలియవచ్చుట లేదు.

భాష సంస్కృతము. భాషయు, వ్రాతయు కూడ చాల పాడుగా నున్నది. లేఖకుడు అధీతుడు కాని కారణముననో, లేక వ్రాత బాగుగ వ్రాయనేర్చినవాడు కాని హేతువు చేతనో భాషలోను, వ్రాతలోను గూడ చాల తప్పులు కలవు. లేఖక లక్షణమిది:

> సర్వదేశ లిపిజ్ఞాతా,
> లేఖనే కుశలః పటుః
> అధీతో వాచకో ధీమా
> న్యోజ్యో రాజ్ఞా సలేఖకః.

ఈశాసన లేఖకుడు పైని చెప్పినయట్టివాడుగా కనబడడు. ఏలయన: వ్రాతయు, భాషయుగూడ చాల తప్పులతడికగ నున్నది.

శాసనభాషలో ప్రాకృతఛాయ మెండు. దీనిననుసరించి ప్రాయికముగ లేఖకుడు ఉత్క_లదేశనివాసుడై యుండునని యూహింపదగును. శాసనమున ఉత్కీ_ర్ణకుని పేరుకాని, లేఖకుని పేరు కాని తెలుపబడియుండ లేదు.

శాసన విషయము

శాసనభాషయు వ్రాతయు తప్పుల తడికగ నుండుటచేత శాసనమునందు చెప్పబడ్డ విషయములకు అన్వయక్రమము కొన్నికొన్ని సందర్భముల గనబడుట లేదు. అయినను నే నర్థముచేసికొన్న ప్రకారము శాసన విషయ మిది:

కళింగనగరము రాజధానిగా పరిపాలించుచుండిన గంగామలకులతిలకు డగు శ్రీ

దేవేంద్రవర్మ 'దంతిపురము'న నుండగా ఆ రాజుయొక్క విజయరాజ్యము 'సకాబ్ద సహస్ర మేకసతత్రయాధిక'మని చెప్పబడ్డకాలమున ఆ రాజుయొక్క మహామండలికుడును, కదంబ కులతిలకుడును అగు శ్రీధర్మఖేడి పుత్రుడు మహామండలికుడైన ఉదయాదిత్యుడు 'రేవనిజి' గ్రామమును 'అచాటభట' ప్రవేశ్యముగను, 'ఆచంద్రార్కస్థాయిగాను ఉదక పూర్వకముగ దానముచేసి అందొకభాగమును వృద్ధపుత్రుడైన రేవననాయకుని కుమారుడు నారాయణ నాయకునికిని, ఇంకొక భాగమును 'అయితయ సోమనూదు(?)" ఈజణ'కునికి నొసంగెను. ఇదియే శాసనభాషనుబట్టి నేనర్థము చేసికో గలిగినవిషయము.

దానమును గురించి చెప్పబడిన పిదప దానమొసంగిన గ్రామమునకు సరిహద్దులు చెప్పబడెను. ఈ సరిహద్దులలో అన్నియు రాళ్లు రప్పలునేగాని ఒక్కటియు ఊరిపేరు కనబడదు.

సరిహద్దులనుగురించి తెలిపినపిదప శాసనమున ఈ క్రిందిపంక్తులు కలవు.

'శేషగ్రామస్య, దాత్త మాడ దుఇ
అపర దోలీ "వడవేటు" వడత్తర
ప్రదతోక్మి.'

విమయవిమర్శనము

రాజు :

ఈశాసనము పుట్టునాటికి కళింగనగరము రాజధానిగ దేవేంద్రవర్మ పరిపాలించుచుండెను. ఇతడు 'గంగామల కులతిలకు' డని మాత్రము చెప్పబడినది. ఇతని తండ్రిపేరుగాని, తాతపేరు కాని శాసనమున చెప్పబడలేదు. అయితే గంగవంశజులలో ఈరాజు ఎవ్వడు?

గంగవంశజుల శాసనములు అనేకములు దొరకినవి. వాటిలో శిలాశాసనములును, తామ్రశాసనములునుగూడ గలవు. శ్రీకూర్మము, ముఖలింగము మొదలగు పుణ్యక్షేత్రములలో వీరి శిలాశాసనములు అపరిమితముగ నున్నవి. ఈగంగవంశములోనివారే యగు వజ్రహస్తదేవునియొక్కయు, అతనిమనుమడను రాజరాజదేవుని కుమారుడు నగు అనంతవర్మ చోడగంగదేవునియొక్కయు తామ్రశాసనములు కొన్ని ఈపత్రికలోనే ప్రకటింపబడినవి. వాటినిబట్టియు, ఇంక నితరశాసనములను బట్టియు

(౧) వజ్రహస్తదేవుడు శక వర్షములు ౯౬౦ వ సంవత్సరమున సూర్యుడు వృషభ లగ్నమునను, (చంద్రుడు) రోహిణిలోను ఉండగా శుక్లపక్ష తృతీయా ఆదివారము ధను ర్లగ్నమునను

(౨) వజ్రహస్తదేవునికుమారుడగు రాజరాజదేవుడు ౯౯౨ వ శకవర్షమున జ్యేష్ఠ శుద్ధ అష్టమీసింహాలగ్నమున ఉత్తరఫల్గునీ నక్షత్రమున గురువారమునాడును

(3) రాజరాజదేవుని కుమారుడైన అనంతవర్మచోడ గంగదేవుడు ౯౯౯ వ శక వర్షమున సూర్యుడు కుంభలగ్నమున నుండగా శుక్లపక్షతృతీయా శనివారము రేవతీ నక్షత్రము మిథునలగ్నమునను

పట్టాభిషిక్తు లైనట్లు తెలియవచ్చుచున్నది. అందువలన శాసనములందు శకవర్షపరిగణనము నొసంగిన గంగవంశజులలో మొదటి రాజగు వజ్రహస్తుడు శకవర్షములు ౯౬౦ మొదలు ౯౯౨ వరకును, అతనికొడుకు రాజరాజదేవుడు శకవర్షములు ౯౯౨ మొదలు ౯౯౯ వరకును, అతనికొడుకగు అనంతవర్మ చోడగంగదేవుడు ౯౯౯ నుండియు పరిపాలించినట్లు మనకు శాసనముల మూలమున విస్పష్టమగుచున్నది. ఈపై నుడివిన మూవురు రాజులలో వజ్రహస్తదేవునికి అనంతవర్మయనియు, అతనికొడుకు రాజరాజదేవునికి దేవేంద్రవర్మయనియు, అతనికొడుకు చోడగంగదేవునికి అనంతవర్మయనియు నామాంతరము లున్నట్లు శాసనములవల్లనే తెలియుచున్నది. అనంతవర్మచోడగంగదేవుని పిదప రాజ్యమేలిన గంగవంశపురాజుల శిలాశాసనము లనేకములు కాన్పించుచున్నను వాటిని బట్టి వారికి నామాంతరము లున్నవో లేవో తెలిసికొనుటకుకష్టమగుచున్నది: ఏలయన, శకవర్షము ౯౯౯ మొదలు శకవర్షములు ౧౨౩౦ వరకు అనగా రమారమి రెండువందల సలభై సంవత్సరముల కాలమున కనిపించు గంగవంశ శాసనములన్నిటిలో రాజుపేరు సాధారణముగ అనంతవర్మయనియే కలదు: శకవర్షములు ౯౯౯ మొదలు శకవర్షము ౧౦౬౦ వరకు గల శాసనములలో రాజుపేరు అనంతవర్మ దేవర అనియు, గంగేశ్వరదేవర అనియు, చోడగంగదేవర అనియు కలదు. అటుపిదప

	వి. రా. (విజయరాజ్యసంవత్సరములు)	
శ. ౧౦౬౧	౪	అనంతవర్మ మధు కామార్ణవదేవ
౧౦౭౧		అనియంకభీమ రావుతు దేవర
౧౦౯౧	౧౭	అనంతవర్మ దేవిదాస రణరంగరాఘవ చక్రవర్తి
౧౧౨౯	౨౪	వీరనరనారసింహ దేవ
౧౧౩౪	౧౭	వీరనరనారసింహదేవ
౧౧౫౨		అనియంకభీమ దేవర
౧౧౫౫		అనింకభీమ రావుతాఖ్య
౧౧౬౩	౪	అనంతవర్మ వీరనరనారసింహ దేవర
౧౧౬౭	౧౦	వీరనరసింహ రావుతు దేవ
౧౧౬౭	౧౦	అనంతవర్మ వీరనరసింహదేవర
౧౧౬౮	౧౧	అనంతవర్మ వీరనరసింహ రావుతు దేవర
౧౧౬౮		వీరసీమన్నృసింహ దేవర
౧౧౭౨		ప్రతాప వీరనరసింహదేవర
౧౧౭౨	౧౫	వీరనరసింగ దేవర
౧౧౭౮	౨౩	వీరనరసింహ రావుతు దేవ
౧౧౭[౯]	౧౯	వీరనరసింహదేవర
౧౧౮౪	౩[౧]	వీరనరసింహ రాతు దేవ
౧౧౮౪		నరసింహ దేవర
౧౧౯౦		నరసింహ దేవర
౧౧౯౩		భాను దేవ
౧౧౯౩		భాను దేవ
౧౧౯౩		భాను దేవ
౧౧౯౪		వీరభాను దేవ
౧౨౦౦	౧౫	అనంతవర్మ ప్రతాపవీర శ్రీ భాను దేవ
౧౨౦౧	౩	ప్రతాప వీరనరసింహ దేవ
౧౨౦౩	౩	అనంతవర్మ నరనారసింహ రావుతు దేవ
౧౨౦౪	౭	వీరనరసింహ దేవ
౧౨౦౫	౭	అనంతవర్మ శ్రీ వీరనారసింహ రావుతు దేవర
౧౨౧౧	౧౪	వీరనరసింహ దేవ
౧౨౧౨	౧౪	వీరనరసింహ దేవ

౧౨౧౨	౧౫	వీరనరసింహదేవ
౧౨౧౨		నరహరనృపతి
౧౨౧౩	౧౫	అనంతవర్మప్రతాపవీర నరసింహదేవ
౧౨౧౩	౧౫	అనంతవర్మప్రతాపవీర నరసింహదేవ
౧౨౧౪	౧౭	అనంతవర్మప్రతాపవీర నరసింహదేవ
౧౨౧౫	౧౮	వీరనరనారసింహదేవ
౧౨౧౫	౧౮	వీరనారసింహరావుతుదేవ
౧౨౧౮	౨౧	అనంతవర్మప్రతాపవీరనరసింహదేవ
౧౨౧౯	౨౩	,, ,,
౧౨౧౯	౨౩	,, ,,
౧౨౧౯	౨౩	,, ,,
౧౨౨౧	౨౫	,, ,,
౧౨౨౭	౩౩	,, ,,
౧౨౨౯	౩	అనంతవర్మప్రతాప వీరభానుదేవ
౧౨౨౯	౩	,, ,,

ఈ పైశాసనములలో అనంతవర్మ అను గంగవంశబిరుదము మాత్రమే కాక గంగవంశ భూపతి పేరుకూడ కలదు. కేవలము అనంతవర్మ బిరుదముతో నున్న గాంగవంశజులశాసనములు ఈ క్రింద పొందుపరుపబడినవి.

శ. ౧౦౪౧	ది. రా.		ది. రా.
౧౦౪౩	౫	శ. ౧౦౮౨	౫
౧౦౪౪	౭	౧౦౮౪	౮
౧౦౪౪	౭	౧౦౮౪	౯
౧౦౪౪	౭	౧౦౮౬	౧౦
౧౦౪౫	౮	౧౦౯౩	౩
౧౦౪౫	౮	౧౦౯౬	౪
౧౦౪౬	౬౨	౧౦౯౭	౪౮
౧౦౪౭	౧౦	౧౧౦౦	౧౧
౧౦౪౮	౯	౧౧౦౪	౧౪
౧౦౪౯	౧౯	౧౧౦౯	౨౨
౧౧౧౪	౨౭	౧౧౨౮	౧౧
౧౧౨౭	౧౦	౧౧౩౮	౭

శ. ౧౨౨౯-వ శకవర్షము పిదప గాంగవంశపు రాజుల శాసనములలో నేను చూచినంతవరకు అనంతవర్మ నామము కనబడ లేదు. వజ్రహస్త, రాజరాజదేవ, చోడగంగ దేవులకు గల నామాంతరముల ననుసరించి అనంతవర్మ, దేవేంద్రవర్మనామములు ఈగంగ వంశపురాజులకు వంశక్రమమున ఒకరితరువాత నొకరికి వచ్చుచుండెనని యనుటకు ఈ పైవిషయముల ననుసరించి వీలు లేదు. శకవర్షము ౧౨౨౯ తరువాత ఈ క్రింది గాంగవంశ భూపతుల శాసనములు కాన్పించును :

(౧) భానుదేవ
(౨) వీరనరసింహదేవ
(౩) వీరభానుదేవ
(౪) వీరనరసింహదేవ
(౫) ప్రతాపవీరనిశ్శంక భానుదేవ.

శకవర్షము ౧౧౦౦ ల ప్రాంతమున గాంగవంశపు రాజు లందరు అనంతవర్మ నామాంచితులే కాని వారిలో నొక్కరును దేవేంద్రవర్మాభిధానులు గనబడరు. అందువలన కాలమొక్కటియేయైనను అనంతవర్మ దేవేంద్రవర్మ నామాంకితు లగు నీ రాజులు ఒక్కరుకారనియు, ప్రాయికముగ వీ రిరువురు వేర్వేరురాజులై యుందురనియు ననుమానించుట కవకాశమున్నది. ఇట్టి యనుమానమునకు మరికొన్ని వ్యత్యస్తవిషయములు బలమొసంగుచున్నవి. ఎట్లన గంగవంశజుల తామ్రశాసనముల వలన దెలియవచ్చు సంపూర్ణ

గంగవంశానుక్రమణిక (చూ: పుట ౧౨౫.) ప్రకారము అనంతవర్మ చోడగంగదేవుని కుమారుడైన మధుకామార్ణవునిపిదప అతని సోదరుడైన రాఘవభూపతి రాజ్యమునకు రావలసియుండెను; పైనిచ్చిన శాసనములపట్టికలో గానవచ్చు 'అనంతవర్మదేవిదాస రణరంగరాఘవచక్రవర్తి'యే యీరాఘవభూపతి యని నేను తలంతును. పైనుడివిన యీశాసనముల పట్టికను జూచినచో మధుకామార్ణవునికిని రాఘవనామాంతరముగల 'అనంతవర్మదేవిదాస రణరంగరాఘవచక్రవర్తి'కి నడుమ 'అనియంక భీమ రావుతుదేవర' అనుపేరుగల మరియొకరాజు కనబడును. వంశానుక్రమణిక ననుసరించి అనియంకభీముడు రాఘవభూపతికి సోదరుడైన రాజరాజుకు పరమున నేకాని పూర్వము పరిపాలించినట్లు కనబడదు. కాని యీ రాజును పేర్కొనుశాసనము చాలవరకుశిథిలమైయుండుటచేత దీని నాధారముచేసికొని ఏ విషయము తేల్చుటయు యుక్తముకాకపోయినను ౧౦౭౧వ శకవర్షపుశాసనమున అనియంకభీమనామముకాన్పించుటజేసి దీనినిగూర్చి యింత చెప్పవలసివచ్చినది. అదియునుగాక దాక్షారామశాసనములలో నొకటియైన రాజకేసరివర్మ త్రిభువనచక్రవర్తి బిరుదాంచితుడగు (శ్రీ) కులోత్తుంగచోడదేవుని ముప్పదిమూడవ (33) సంవత్సరపు శాసనమున, అతని సామంతుడగు నొక పల్లవరాజిట్లు కీర్తింపఁబడి యున్నాడు.

> భస్మీకృత్య కలింగదేశ మఖిలం
> నిర్జిత్య గంగం రణే
> భఙ్క్త్వా కోశలఖండవాల నివహా
> దేవేంద్ర వర్మాదికాన్
> వీరః పల్లవరాజ ఇత్యభిహితో
> రాజేంద్ర చోడప్రభోః
> కీర్త్యుత్తంభమి వోగ్ర సంధిషు జయ
> స్తంభం శుభం న్యక్షిపత్.

ఈ కులోత్తుంగచోడుడు మొదటివాడే అయియుండవలెను. రెండవ కులోత్తుంగుడు 33 సంవత్సరములు రాజ్యము చేయలేదు గనుకను, మూడవ కులోత్తుంగచోడుని నాటికి వేంగిమండలమున రాజాధిరాజదేవర వర్షమే వాడుకలో నుండినందునను పైన పేర్కొనబడిన కులోత్తుంగచోడుడు తప్పక మొదటివాడే యనుటకు సందేహము లేదు. అందువలన నాశాసనము క్రీ. శ. ౧౧౦3 నాటిది (శ. ౧౦౨౫) కావలెను. అప్పటికి అనంతవర్మ నామమును ధరించిన రాజరాజ తనయుడగు చోడగంగదేవుడు పరిపాలించుచుండెనే కాని దేవేంద్రవర్మ నామాంచితుడగు రాజెవ్వడును పాలించుచుండినట్లు కానరాదు. "నిర్జిత్యగంగం" అను పైశ్లోకములోని మాటవలన చోడగంగదేవుడు పేర్కొనబడెననుట స్పష్టము. "దేంద్రవర్మాదికాన్" అనికూడ నాశ్లోకమునందే యుండుటవలన దేవేంద్రవర్మ నామాంచితులైన మరికొందరు రాజులుకూడ అప్పటికి కళింగమును పాలించుచుండిరని యూహించుటకవకాశము కలదు. ఈ పైకారణములనుబట్టియే ఏకకాలమున కళింగమునందలి వేరువేరుభాగములను గంగవంశమునకు సంబంధించినవే రెండు వేరువేరుకోవలు పరిపాలించుచుండెనని శంకింపవలసి వచ్చుచున్నది. ఇటువంటి శంకలకుతావిచ్చు మరికొన్ని విషయములు

కూడ కనబడును. వాటినన్నిటిని ఇచ్చట పేర్కొనుట అనవసరము.

ఇట్లు అనంతవర్మ దేవేంద్రవర్మాదులు వేరువేరుకోవలకు సంబంధించినవారు కానిచో దేవేంద్రవర్మయనునది అనంతవర్మనామాంచితునికి నామాంతరమైన కావలసివచ్చును. వజ్రహస్తతనయుడగు మొదటి రాజరాజదేవునకు దేవేంద్రవర్మ నామమున్నట్లే, అనంతవర్మ చోడగంగదేవుని తనూజుడైన రెండవ రాజరాజదేవునకును దేవేంద్రవర్మ నామము కలదేమో! ఎట్లయినను ఒకేరాజునకు అనంతవర్మ, దేవేంద్రవర్మనామములు రెండు నుండెననుట అంతసమంచితముగ కన్పట్టదు. దీనంజేసి మనశాసనమునందలి శకవర్షసంఖ్య సరియైనదేయని నమ్మినచో దేవేంద్రవర్మ అనంతవర్మ చోడగంగదేవుని కోవలోనివాడు కాడేమోయని సంశయము పొడముచున్నది.

దాత:—

మనశాసనమునందలి దాత మహామండలికుడును, కదంబకులతిలకుడును అయిన శ్రీ ధర్మఖేడియొక్క పుత్రుడగు ఉదయాదిత్యుడు. గంగవంశపురాజుల కాలమున కదంబవంశజు లనేకులు గ్రామాధిపతులుగను, మండలికులుగను ఉండి ప్రముఖులైనట్లు గంగవంశజుల శాసనముల ననుసరించి తెలియవచ్చుచున్నది. మొదటి రాజరాజ దేవుని తండ్రి యగు అయిదవవజ్రహస్తుని (ఇతడు చిక్కాలవలసశాసనమున మూడవవజ్రహస్తుడుగ పేర్కొనబడియున్నాడు) ౧౫-వ విజయ రాజ్యసంవత్సరమగు ౯౭౬-వ శకవర్షమున కదంబకులతిలకుడును, పరమమాహేశ్వర పంచవిషయాధిపతియు నైన మహామండలేశ్వర రాణక శ్రీభామఖేడి కుమారుడైన రాణక శ్రీధర్మఖేడి 'ఉజణకునికి' (?) మహేంద్రభోగములోని మధిపథరఖండగ్రామమును దానముచేసిన శ్లోకశాసనము కలదు. ఈ తామ్రశాసనపు రాజముద్రికమీద గూడ గాంగవంశజ తామ్రశాసనరాజముద్రికాలాంఛనమగు నందిగాక మనశాసనముద్రికమీద వలెనే మధ్య అడ్డముగ మత్స్యమును, దాని దిగువ నంకుశమును గలవు. మరియొక వజ్రహస్తుని— (ఈ వజ్రహస్తుడు గాంగవంశజులలో ఎన్నవవాడో, వీనికిని గాంగవంశమునకు నెట్టిసంబంధము కలదో నిర్ణయించుట కింతవరకు ఏయాధారములును గానరావు)–పర్లాకిమిడి తామ్రశాసనమున మరియొక కదంబవంశజుడు కన్పట్టుచున్నాడు. అం దాతడు కదంబామలకులతిలకు డనియు, 'నిడుసంతి' వంశములోని వాడనియు జెప్పబడినది. అతని పేరు శ్రీ ఉగ్రఖేదిరాజు - హొస్సండిగ్రామపాలకుడు. మహారాజ శ్రీమదనంతవర్మ కుమారుడగు శ్రీదేవేంద్రవర్మయొక్క విశాఖపట్టణ తామ్రశాసనమున ఆరాజు తనమేనమామ యగు ధర్మఖేదిచే నుపదిష్టుడై యొక గ్రామమును దానము చేసినట్లు చెప్పబడియున్నది. అది గాంగశకము ౨౫౮ వ సంవత్సరమునాటిది. ధర్మఖేది కదంబ వంశజుడని యీ శాసనమున ప్రత్యేకము ఎచ్చటను దెలుపబడియుండలేదు. గాంగవంశజుల శాసనములలో పేర్కొనబడుచుండు

కదంబవంశజుల నామములకు సూచకముగ నున్న ఖేడి, ఖేది పదము నామాంతమున నుండుటచేత ఈధర్మఖేదియు కదంబవంశజుడై యుండునని యూహించు చున్నాను. ఇంద్ర వర్మయొక్క విషమగిరి తామ్రశాసనమున దూతకుడుగ నాగఖేడి యనునతడు ఇంకొ కడు తెలియవచ్చుచున్నాడు. ఖేడి పదము నామాంతమున నుండుటచేత ఇతడుకూడ కదంబవంశజు డగునని తలంచెదను. ఈ విధ మున 'ఖేడి' పదాంచితులైన కదంబవంశజులు గంగవంశపురాజుల కాలమున ప్రముఖులై ప్రసిద్ధులుగనుండినట్లును,ఉభయులకునుసంబం ధబాంధవ్యము లుండినట్లును తెలియనగును.

రాణక శ్రీధర్మఖేడి పంచ విషయాధిపతి యగు రాణక శ్రీభామఖేడి కుమారు డని అనంతవర్మ బిరుదాంచితు డగు వజ్రహస్త దేవునిశాసనమువలన దెలియుచుండుటచేతను, గాంగశకము ౨౫౮నాటి అనంతవర్మ కుమా రుడైన దేవేంద్రవర్మ శాసనమున అతనికి మాతులుడగు ధర్మఖేడియొకడు కన్పట్టుచుం డుటచేతను,మనశాసనమునందలి దాత మహా మండలికుడైన ధర్మఖేడియొక్క కుమారుడు ఉదయాదిత్యు డగుటచేతను వీరికి ఈక్రింది రీతిని బంధుత్వము కూర్ప బుద్ధిపుట్టును.

పంచవిషయాధిపతి
రాణక శ్రీ భామఖేడి
|
రాణక శ్రీ ధర్మఖేడి
|
మహామండలిక ఉదయాదిత్యుడు

కాని యిది సాధ్యమగునట్లు కనబడదు. అనంతవర్మ నామాంకితుడైన వజ్రహస్తుని శాసనము వలన దెలియవచ్చు రాణక శ్రీ భామఖేడి కొడుకైన రాణక శ్రీ ధర్మఖేడియు, అనంతవర్మ కుమారుడైన దేవేంద్రవర్మ శాస నమున అతనికి మాతులుడుగ జెప్పబడిన ధర్మ ఖేడియుగూడ నొక్క రనుటకు సాహసింప జాలను. ఏలయన మాతులు డని చెప్పబడిన ధర్మఖేడి గంగశకము ౨౫౮ నాటివాడు. ఈ శకము ౨౫౮ నాటిశాసనమునందలి అనంత వర్మ కుమారుడైన దేవేంద్రవర్మ అనంతవర్మ నామాంతరముగల వజ్రహస్తుని కుమారుడగు దేవేంద్రవర్మయను రాజరాజే అగుననుటకు కొంత ప్రతిబంధకము కలదు. ఇంతవరకు మనకు దెలియవచ్చిన కట్టకడపటి గాంగశక సంవత్సరము ౫౨౬. ఇది అనంతవర్మ కుమారు డైన మధుకామార్ణవ దేవుని శాసనమున నొసంగబడినది. గాంగశకము ౨౫౮ నాటి దేవేంద్రవర్మ వజ్రహస్తతనూజుడైన మొదటి రాజరాజే అయినయెడల మరి ౨౭౨ సంవ త్సరములకు గాంగవంశపు రాజులలో మధు కామార్ణవ నామముగల రాజు ఉండవలెను. కాని గాంగవంశానుక్రమణికను జూచినయె డల మొదటి రాజరాజు పిదప ౨౭౨ సంవ త్సరములకు నరసింహదేవ, భానుదేవాదులు పాలించుచుండినట్లు తెలియును గాని మధు కామార్ణవ నామధేయు డుండినట్లు తెలియ రాదు. కావున గాంగశకము ౨౫౮ నాటి దేవేంద్రవర్మ మొదటి రాజరాజు కానేరడను టకు ఇదియొక కారణము. ఒకవేళ ఈ దేవేం

ద్రవర్మ మొదటి రాజరాజే అని సంశయించి నప్పటికి మన శాసనమున ఉదయాదిత్యుని తండ్రిగ చెప్పబడిన ధర్మఖేడియు వజ్రహస్త, దేవేంద్రవర్మల శాసనములందు వచ్చు ధర్మఖేడియు నొక్కఁడు కానేరరు; ఏలయన వజ్రహస్తుడు శ. ౯౬౦-౯౯౨ నాటివాడు: ఆతని కొడుకు దేవేంద్రవర్మ నామాంతరముగల రాజరాజు శ. ౯౯౨-౧౦౦౦ ప్రాంతములవాడు. మన శాసనమునందలి దేవేంద్రవర్మ-మన శాసనమునందలి శకవర్ష సంఖ్యనే నమ్మినచో-మొదటి రాజరాజునకు నూరుసంవత్సరములు తరువాతివాడు. అట్లయినచో నూరుసంవత్సరములు వెనుకనున్న ధర్మఖేడి నూరుసంవత్సరములు తరువాతనున్న ఉదయాదిత్యునికి తండ్రియెట్లగును? ఇది యసాధ్యము. శాసనమునందలి శకవర్షసంఖ్య తప్పైనను గావలెను లేదా ఉదయాదిత్యజనకుడగు ధర్మఖేడియు వజ్రహస్త దేవేంద్రవర్మల శాసనములందువచ్చు ధర్మఖేడియు వేఱువేఱు ప్రభువులైనను గావలెను.

స్థలవిషయము:—

రాజునుగూర్చియు, దాతనుగూర్చియు మనకింతవర కెంత తెలిసినదో స్థలవిషయమునను అంతే తెలియుచున్నది. 'పంచపాత్ర వీధీతమస్తు భవతా పఞ్చవీసరే వెనిజిగ్రామ'అనునది 'పంచపాత్రవిషయ నివాసినః సర్వాఞ్జనపదా న్సమాహూయేత్థ మాజ్ఞాపయతి విదితమస్తుభవతాంపంచవిషయే రే వెనిజిగ్రామ'మని యుండవలెనేమో. ఇచ్చినది వెనిజిగ్రామమో రేవెనిజిగ్రామమో. విషయే అనుటకు విస(ష)రే అని పడినదన్న అది వెనిజిగ్రామమే కాదగును. కాని శాసనాంత్యభాగమున 'రేభిగ్రామస్య దాత్త మాడ దుఇ' అని యుండుటచేత రేభిగ్రామమే రేవెనిజి యేమో యని అది రేవెనిజియే కావచ్చునని సంశ[illegible]చుచున్నాను. ఈగ్రామమునకు సరిహద్దులన్నియు రాళ్లలోను, రప్పలలోను చెప్పుటవలన గ్రామ మెచ్చటిదైనదియు చెప్పలేము. ప్రతి గ్రామమునకు ధాన్యాదాయమును, నిష్కాదాయమునుకూడ నుండును. 'రేభిగ్రామస్య దాత్త మాడ దుఇ'అను దానికి 'రేభిగ్రామమునకు వచ్చు నిష్కాదాయము రెండుమాడలు (మాడ దుఇ-ద్వయీ)ను గూడ ఇయ్యబడిన' వనియర్థమని నే నూహించుచున్నాను. 'అపర దోలీ' "వడ వేట" 'వడ త్తరప్రదత్తోఽస్మి' వీటికి అర్థమేమో నాకు తెలియరాలేదు. 'ఇచ్చుచున్నాను' అని యర్థమగుచున్నది కాని ఏమిటి ఇచ్చుట? అపరదోలి-వడవేట-వడత్తర-అనగానేమో!

ప్రతిగ్రహీతలు:—


వృద్ధపుత్రుడు రేవననాయకుని కొడుకు నారాయణనాయకు డొకడు: 'ఆయితయా సోమయాదు (?) ఈజణకు' డొకడు!

కాలము:

శాసనకాలము 'విజయరాజ్యస్యసకాబ్ద సహస్రమేక సతత్రయాధిక'మని శాసనమున తెలుపబడినది. దీని కర్థము పదకొండువం[illegible]ల మూడా లేక పదమూడువందలా యని శంక కలుగుచున్నది. గంగవంశపు శాసనములు పరిశీలించిన పదమూడువందలనాటికి నాలుగవ నరసింహదేవుడు రాజ్యముచేయు చుండినట్లు

తెలియవగును. ఇతనికి దేవేంద్రవర్మ యను నామాంతర మున్నట్లు తెలియరాదు. అది యునుగాక లిపి అంతటి అర్వాచీనమైనదిగ [illegible]నబడదు. అంతటి అర్వాచీనశాసనములలో దేనిలోను గూడ గంగవంశానుక్రమణిక యియ్యనట్టిది కాని, ఆవిధమైన గంగవంశ ప్రశస్తి యిచ్చినట్టిది కాని కానరాదు. అందు వలన అది 'విజయరాజ్యస్య శకాబ్దసహస్రే ఏకశతత్ర్యధికే' అని యుండదగునని నాయూహ. అట్లయినచో ఈ శాసనము ౧౧౦౩-వ శక వర్షమునాటిది అనగా క్రీ. శ. ౧౧౮౧ నాటి దగును. ఇంతకన్న శాసనకాలమును గురించి ఎక్కువ నిర్ణయింపలేము. శాసనము ౧౧౦౩ నాటి దగునను భావముతోనే పై చర్చ అంతయు జరుపబడినది.

కళింగగంగ వంశానుక్రమణిక



(౧౨౫ పేజీ తరువాయి)

(నాల్గవ) వజ్రహస్తుడు (౩౫ సం.లు)

- (ఐదవ) కామార్ణవుడు (౬ నెలలు)
- (రెండవ) గుండము (౩. సం.లు)
- (ఆరవ) మధుకామార్ణవుడు=వినయమహాదేవి (౧౯ సం.లు)

* 1. (ఐదవ) వజ్రహస్తుడు=నంగమ(?) (౩౩ సం.లు)

2. (మొదటి) రాజరాజు=రాజసుందరి (౮ సం.లు)

3. అనంతవర్మ అను చోడగంగదేవుడు (౭౨ సం.లు)

- కస్తూరికామోదినివలన 4. (ఏడవ) కామార్ణవుడు (౧౦ సం.లు)
- ఇందిరవలన 5. రాఘవుడు (౧౫ సం.లు)
- చంద్రలేఖవలన
  - 6. (రెండవ) రాజరాజు (౨౫ సం.లు)
  - 7. అనియంకభీముడు=బాఘల్లదేవి (౧౦ సం.లు)

8. (మూడవ) రాజరాజు=మంకుణదేవి (౧౭ సం.లు)

9. (రెండవ) అనంగభీముడు=కస్తూరాదేవి (౩౪ సం.లు)

10. (మొదటి) నరసింహదేవుడు=సీతాదేవి (౩౩ సం.లు)

11. (మొదటి) భానుదేవుడు=జాకల్లదేవి (౧౮ సం.లు)

12. (రెండవ) నరసింహదేవుడు=చోడదేవి (౩౪ సం.లు)

13. (రెండవ) వీరభానుదేవుడు=లక్ష్మీదేవి (౨౪ సం.లు)

14. (మూడవ) నరసింహదేవుడు=కామలదేవి (౨౪ సం.లు)

15. (మూడవ) భానుదేవుడు=హీరాదేవి (౨౬ సం.లు)

16. (నాలుగవ) నరసింహదేవుడు

17. (నాలుగవ) భానుదేవుడు

* ఈ సంఖ్యలు పరిపాలక క్రమమును దెలుపును.

408

మూ ల ము *

మొదటిరేకు : రెండవపెడ



౧. స్వస్తి అమరపురానుకారిణ సర్వఋత్యసీఖరమణీయ॰

౨. త సుధాధవల ప్రాసాదమాలా వీరతల్లలీతల్లాస్యా [త]

3. దోర్దణ్డాఖణ్డితసకలాల[ం*]క్రీత శ్రీకలా [ం*] గనగరా

౪. ధివాసకా మహే[ం*]ద్రా చలామలకనకసిఖర ప్ర[తి]ష్ట

౫. తస్య సచరాచరగురో సకలభువన సీమ్మార్ణాై

౬. కసూత్రధార   ససా[ం*]కచుడామణే భగవతో గోకర్ణస్వా

౭. మిన   చరణకమలజుగలప్రణామోదిగత కలీరలంకో నే

౮. కాహాయన[ం*]థ్కో భ (॥) జనాతజయసవదప్రతాపావనాతస

---

* వాదగ్గరనున్న రేకుల వమాసరించి.

సవరించినచో మూల మిట్లుండదగునేమో:

౧. స్వస్తి. అమరపురానుకారిణః సర్వర్తుసుఖ రమణీయా

౨. త్ సుధాధవలప్రాసాద మాలావిరతిలాలితలోకాత్

౩. దోర్దణ్డ పణ్డిత సుబలాలంకృత శ్రీకలింగనగరా

౪. ధివాసకాత్. మహేంద్రాచలామల కనకశిఖర ప్రతిష్ఠి

౫. తస్య సచరాచరగురోః సకలభువన నిర్మాణై

౬. క సూత్రధారస్య శశాంకచూడామణే భగవతో గోకర్ణస్వా

౭. మిన శ్చరణ కమలయుగళ ప్రణామా ద్విగతకలికలంకో ఒనే

౮. కాహవ సంక్షోభ జనిత జయశబ్దః ప్రతాపావనత స

రెండవ రేకు : మొదటిపెడ



౯. మ స్త సామ[ం*]తచక్ర చూడామణీప్ర భవ మ[ం*]జరీపు[ం*]జర [ం*]

౧౧. జీతనీజనీత్ర[ం*]సధారో పకలీ[ం*]గాధిరాజ దువా౯ర వైరీవా

౧౧. రణకు[ం*]భస్థలదలదలీతము క్తీకాప్రకరధ్వస్తారాతీకు

౧౨. లాచలో నయవీనయ దయాదానదాఖిన్యసఉ యో౯ధాయ౯

౧౩. సత్యత్యాగిప్రకరగుణస[ం*]పదాధారభుతో పరమమా

౧౪. హేస్వర పరమభటారక గ[ం*]గామ[ల]కులతీలక శ్రీదే

౧౫. వే[ం*]ద్రవమ్మ౯స్య వీజయరాజ్యన కావ్దస[హ]స్రమేకసత్రయా

౧౬. ధిక ద[ం*]తిపురే స్థీతో । తస్య మాణ్డలీకకద[ం*]వకులతీ

---

౯. మ స్త సామంతచక్ర చూడామణి ప్రభా మంజరీ పుంజ రం

౧౦. జిత నిజ నిస్త్రింశ ధారోపార్జిత సకల కలింగాధిరాజ్యః దువా౯ర వైరివా

౧౧. రణ కుంభస్థల దలనశిత మా క్తిక ప్రకరః ధ్వస్తారాతిప

౧౨. లాచలో నయ వినయ దయా దాన దాక్షిణ్య శౌ య౯ దాయ౯

౧౩. సత్య త్యాగ ప్రకర గుణ సంపదాధారభూతః పరమ మా

౧౪. హేశ్వరః పరమ భట్టారకః గంగామలకులతిలకః శ్రీదే

౧౫. వేంద్రవమా౯. విజయరాజ్యస్య శకాబ్ద సహస్రే ఏకశతత్ర్య


౧౬. ధికే దంతిపురే స్థితః తస్య మణ్డలికః కదంబకులతి



కీ. శే. కజ్జా పాపయ్యశాస్త్రిగారు
విజయనగరము



కీ. శే. మాగంటి అన్నపూర్ణాదేవిగారు



'పవ్‌లావా' అను నర్తకి
హంసనర్తనము చేయుచున్నది.
ప్రపంచములో నుత్తమనర్తకి యని యీమె పేరుగాంచినది


౧౯౨౭-వ సంవత్సరమున పాశ్చాత్యస్త్రీలు సిగరెట్టుత్రాగునపు డిట్టి యుడుపులను ధరింతురట



౧౯౨౮-వ సంవత్సరపు పాశ్చాత్య కన్య
భవిష్యన్నాగరకత

410

రెండవ రేకు : రెండవ పెడ




౧౭. లకమాహామాణ్డలీక శ్రీధమఃఖేడీ॥తస్యపుత్రో మహా
౧౮. మాణ్డలీక శ్రీఉదయాదిత కుసలీ సవఞ్చపాత్ర వీదీ
౧౯. తమస్తు భవతా పఞ్చవీస రేవనిజగ్రామ ఉదకపుర్వ కి
౨౦. తా వ్రసీసనీకృత్య వ్రద్ధపుత్ర రేవన నాయకస్య పుత్ర
౨౧. నారాయణనాయకస్యమేకభాగ ఆఇతయా(?) సోమయాదు
౨౨. ఈజణకమేకభాగకృత ప్రదత్తోరస్మాభీ అచటభట
౨౩. చద్రార్కవచరే॥సీమాలి [ం*]గాని లిఖ్య[ం*]తే॥ ఈసానే త్రికుట
౨౪. రోపితే సీలా॥పుర్వేణ రోపితసీలా॥ అగ్నేయా


---

౧౭. లకః మహామణ్డలికః శ్రీధమఃఖేడీ. తస్య పుత్రః మహా
౧౮. మణ్డలికః శ్రీఉదయాదిత్యః కుశలీ. పంచపాత్రవిషయ నివాసినో జనపదా న్సమాహూయ రేత్థ మాజ్ఞ
పయతి. విది
౧౯. తమస్తు భవతాం. పంచవిషయే రేవనిజ గ్రామ ఉదకపూర్వకం కృ
౨౦. త్వా తామ్రశాసనీకృత్య వృద్ధపుత్ర రేవననాయకస్య పుత్రాయ
౨౧. నారాయణా యైకభాగమ్ ఆయితయా సోమయాదు (?)
౨౨. ఈజణకా యైకభాగం కృత్వా ప్రదత్తో స్మాభి రచాట భట ప్రవేశ్య మా
౨౩. చంద్రార్క క్షితిసమకాలమ్. అస్యగ్రామస్య సీమాలింగాని లిఖ్యంతే. ఈశాన్యతః త్రికూటే
౨౪. రోపిత శిలా. పూర్వతః రోపిత శిలా. ఆగ్నేయతః

మూడవ రేకు: మొదటి పెడ



౨౫. చ తుకుటరోపితసీలా॥మధుపవృఖతలే రోపితసీ
౨౬. లా దఖణే భుమి పవతతితలే రోపి[తసీలా]॥నఇ
౨౭. రితే వేపురు ప్రిఖతలే రోపితసీలా [॥*][పచ్ఛి(?)]మే జయతి
౨౮. గదా॥వాయవే రోపితసీలా॥ఉతరో రాపిత
౨౯. సిల॥ రేఖిగ్రామస్య దా త్త మాడ దుఇ ౨ అపర
౩౦. దోలీ వడవేట వడత్తర ప్రదతోస్మి[॥*]



రాజముద్రిక

---

౨౫. చ త్రికూటే రోపిత శిలా॥ మధువృక్షతలే రోపిత శి
౨౬. లా॥ దక్షిణతః పర్వతభూమితలే రోపిత శిలా॥ నై
౨౭. ఋత్యతః వేపుర (?) వృక్షతలే రోపిత శిలా॥ పశ్చిమతః 'జయతీ'
౨౮. గర్తః॥ వాయవ్యతః రోపితశిలా॥ఉత్తరతః రోపిత
౨౯. శిలా॥ రేఖి (?) గ్రామస్య మాడ ద్వయీ ౨ దత్తా॥ అపరే
౩౦. దోలీ॥ వడవేట॥ వడత్తర ప్రదత్తోస్మి 1॥

1. (దిగువగీటు గీసిన భాగమునకు అర్థము తెలియ వచ్చుటలేదు.)

శ్రీ దేవీ అన్నపూర్ణాస్మృతి

శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ గారు

"అన్నపూర్ణాస్మృతి" యటంచు నకట! హృద్వి-దారకంబగు నీ పెనుఘోరవార్త
పాడుచేతులతోడ నీనాఁడె వ్రాయ-వలసివచ్చుటఁ దెలియ స్వప్నమున నైన.

ఉ. హా! విదుషీమణీ! ప్రముఖ! హా! సుగుణాశ్రయ! హా శుభాంగి! హా!
పావని! లోకయాత్ర గడుపందగు మేల్విధి నీ స్వజాతికిన్
గైవసమిచ్చి నీకు ధరఁ గల్గిన కార్యముఁ దీర్చి మా కిటన్
నీవిమలాత్మజీవితము నేర్చి మనుండని చెప్పిపోయితే!

ఉ. హా! నవపద్మకోరకమ! హా! మణిహారమ! హా! సతీమణీ!
హా! నవనీతపేశలమ! హా! వినయాన్విత! భారతాంగనా
నూన మహానిధానమ! వినూత్న కళాకలితా! దయానిధీ!
హా! ననుఁ బాసి పోవఁదగునా! సఖ! పెన్వగ ముంచి నేఁడిటన్.

చ. చదివితి పెక్కుగ్రంథములు సాధ్వి తెలుంగిడియంచు నట్టి నీ
చదివినగ్రంథసారముఁ బ్రశస్తి నొనర్చితివమ్మ, నీకు నీ
సదమలబుద్ధివైభవము చక్కఁగ నెక్కడఁ దక్క! భారతీ
సదనము వన్నెకెక్కు నని చాలగ నమ్మితిమమ్మ! సోదరీ!

గీ. "దేశమునకె పుట్టి దేశమ్మునకె నిల్చి దేశమునకె చచ్చితీరవలయు"
నను మదగ్రజునుడిఁ గని చాలఁ బఠియించి - నావు సార్థకం బొనర్చినావు.

చ. వరగుణయుక్తవైన సినువంటి సతీమణి మాకు దుర్దశా
పరులకుఁ దక్కునే? కులము వన్నియ కెక్కఁగఁ బుట్టినింటికిన్
బరువముఁ జొచ్చునింటికి నవారితకీర్తియుఁ దెచ్చునట్టి స
చ్చరితమునన్ మెలంగవె? నిజంబుగ నేమన నేర్తు సోదరీ!

సీ. ప్రథితమా కలగరాన్వయసుధావారాశి - గణనీయ కౌస్తుభమణిగఁ బుట్టి
ప్రఖ్యాత మాగంటివంశపయోధిఁ బూ - తమ్మునరింపఁ బాదమ్ము పెట్టి

విమల గుణాకరు విజ్ఞాననిలయుని - శ్రీబాపినీడ్వీథుఁ జెట్టవట్టి
లలితకావ్య కళావిలాస పాండిత్య ధీ - విభవ చాతురి వినువీథి మెట్టి
మహిత గుణముల నెల్లరి మనసుఁ బట్టి - అతుల నిస్స్వార్థపరత మహాత్ముఁ దట్టి
తలఁపులో నెల్లవారి కుత్తలము సుట్టి - అట్టె! మటుమాయమైతె దవాగ్ని నెట్టి?

సీ. పెన్నిధివని నమ్మి ప్రేమఁ బెంచిన తల్లిఁ - దండ్రుల కేమని తరలితమ్మ!
పంచప్రాణములఁ బ్రేమించి యుప్పొంగు నా - త్మేశున కేమని యేఁగితమ్మ!
పాలుపీడని ముక్కుపచ్చలారని ముద్దు - బిడ్డ కేమని చెప్పి విడలితమ్మ!
నిను నమ్మి నీవె దిక్కనియున్న బీదసా - దల కేమిగతిచెప్పి తొలఁగితమ్మ!
దేశభక్తుల కేమని తెల్పితమ్మ! - సంఘసంస్కర్తలకు నే మొసంగితమ్మ!
అస్మదాదుల కేమని యంటివమ్మ! అన్నపూర్ణమ్మ! మాయమ్మ!! యరిగితమ్మ!!!

మ. కలుపుంగోలుతనంబు సౌమ్యతయు నిష్కాపట్యముల్ తాల్మి ని
మ్ముల నైదుష్యవివేచనాపటిమ సంపూర్ణంబుగా నీవి; వ
త్సలతాత్వంబు నితాంత ప్రేమమును సౌజన్యంబు కారుణ్యముల్
చెలియా! నిక్కము నీదుసొమ్ములుగదే! చింతింప నింకేటికిల్?

గీ. మఱతుమన్న నీరూపంబు మఱపురాదు - మఱతుమన్న నీగుణములు మఱపురావు
మఱతుమన్న వైదుష్యంబు మఱపురాదు-మఱవఁగల దేది యింక? నో మాన్యచరిత!

గీ. ప్రాజ్ఞవగు నీవె మున్ను ముప్పదిదినముల - నీసుతునికిఁ గన్నీరు మున్నీరుగాఁగ
నేడ్చి తిపు డెట్లు పితరు లీ క్రూరమైన - గర్భశోకాగ్నిఁ దరియింపఁగలరు తల్లి!!

చ. నినుఁ గన నెన్నఁడేనియును నేఁ జనుదేరఁగ "నేదియేది నూ
తనముగ నేమి వ్రాసితివి? దాఁచితె? చూపక"యంచుఁ డీయుచుల్
ఘనమగుప్రేమ నిండుకొనఁగాఁ గొని చూచి పఠించి యెంతయో
మనమున సంతసించెదవు మన్ననఁ జేసెడువార లేరిఁకల్.

సీ. నవ్యరీతి ద్విజేంద్రు నాటకంబులఁ దెల్గు - నొనరింతునంటి వెం దునిచితమ్మ!
విజ్ఞానధారల వెదఁజల్లు రామకృష్ణ - నిబోధ కెటు దారిఁ జూపితమ్మ!
ఘనమైన గీర్వాణ గ్రంథరత్నముల భా - షాంతరీకృత మెట కనిపితమ్మ!
అనుపమరీతి నాంధ్రాంగన నలరింతు - నని పల్కితివి యెందుఁ జొనిపితమ్మ!
అకట! ఇరువదియై దేఁడులైన రాక - మున్నె భవదాఖ్యను సువర్ణములను బూర్వ
పుణ్యవతుల నామావళిఁ బొందుపఱిచి - చదువుకొనుఁడని వైకుంఠపదవిఁ గంటె.

ఉ. భావము లుద్భవిల్లను బ్రవాహముగా లిఖియింప శక్తి నీ
డావిధి వంగభాషఁ గలయట్టి యమూల్యపు గ్రంథరాజముల్
నే వచియించెదర్ జదివి నీవు లిఖింపఁగదమ్మ! యంటి వో
దేవి! నిరాశఁ జేసి యది దివ్యపథంబును జూరఁగొంటివే.

ఉ. ఎన్నఁడొ నీవు నేనుఁ బ్రకృతేచ్ఛల వీడి మహాత్ము చెంత నా
త్మోన్నతి నంద నే గుద మింతోధికసౌఖ్యము లేదు; పలయు
న్నన్నిదినాలు బంధములె? యంటివి తద్విధి మిథ్యఁ జేసి హా!
క్రన్నన స్వర్గధామమును గాంచితె? న న్విడనాడి పోయితే?

ఉ. గారవ మొప్ప నాసుతునిఁ గన్గొని లాలనఁ జేసి ప్రేమ నిం
డారఁగ నెత్తి ముద్దిడి యుక్కునఁ జేర్చి ముదాప్తి మా జనిాం
దారని పల్కుచుందువుగదా! సతతం బమృతోపమానమా
కూరిమి మీరు నీదు పలుకుల్ మఱవన్ వశమే సహోదరీ!

చ. కనుఁగొన దేశసేవకయి గాంధిమహాత్ముఁడు ఖాదిదీక్షఁ గై
కొని వడిఁ గార్యరంగమునకున్ దిగ నెన్నఁడొ, నాఁడె భర్తతో
డ నమెరికాకుఁ బోవుట చటాలున మాని మహాత్మునాజ్ఞఁ గై
కొని డిగి కార్యభూమికి నకుంఠిత సేవ యొనర్చి మించితో.

మ. మనమం దద్భుతమంద నెల్లరును సన్మాన్యంబుగా దేశసే
వనుగావింపుచు నొక్కవర్షమున నే బ్రహ్మాండమైనట్టి "మో
హనదాస్ ఖాదిపరిశ్రమాలయము" నాహా! స్థాపనన్ జేసి తా
పసి నీకే తగు సాధ్య మేరి కిఁక నంబా! యన్నపూర్ణాసతీ!!

సీ. ద్విజ ద్విజేతరుల వర్థిలు నతిబాల్య వి-వాహంబులకు నెంత వగచితమ్మ!
అనదల శరణాలయస్థాపన మొనర్పఁ-గొనకొని యెంతగాఁ గుందితమ్మ!
స్త్రీవిద్య, శిశువిద్యఁ బృథుగతి బునరుద్ధ-రింపఁగా నెంత చింతించితమ్మ!
అస్పృశ్యదోషంబు హరియింప నిమ్నజా-తులఁ బ్రోవఁగా నెంత దలఁకితమ్మ!
ఖద్దరు మహోద్యమమున కేగతిని స్వీయ-రక్తపుం బొట్లు ధర సదా రాల్చితమ్మ!
అన్నిటిఁ దలంచుకొనుచు జన్మాంతమును వి-చారపడుఁడని స్వర్గంబుఁ జేరితమ్మ

సీ. స్త్రీలకు విశ్వవిద్యాలయం బత్యంత-మావశ్యకంబని యనయ మందు
ఆరోగ్య మొక్కింత యనుకూలమైన సం-స్థాపింప మది సదా తలఁచుచుందు

కలరు ఉన్నతవిద్యఁ గాంచిన సతులువా-రలె యొజ్జలుగఁ జేరవలయు నందు
మనమెల్ల నిర్మలాత్మల ఘనకృషి చేయ-కున్న ప్రయోజనం బుండ దందు
ఎపుడొ శుభదినములు సమీపించు టంచు-దీర్ఘనిశ్శ్వాస మొక్కటి దీయుచుందు
కటకటా! విస్మరింపుమఁ గలఁతపడక-ధైర్యము వహించి చరియింపఁ దరమె తల్లి!

గీ. హృదయశోకంబు నిలఁ బ్రవహింపఁ జేసి-యాత్మభారంబు వీడుట యంతె కాని
కనులు వోవంగఁ గాయలు కాయునట్టు-లెంత యేడ్చిన లాభ మింతేనిఁ గలదె?

చ. వరచిరవాంఛితంబులు నవశ్యకృతంబులునై వెలార్చు నీ
గురుతరకార్యసంతతులకున్ ననుఁబోఁటులు చాలరైన (శ్రీ)
హరికృప యున్న సర్వము జయప్రదమౌ నటులౌట నాపరా
త్పరుని మదిం దలంచుచు నితాంతకృపం బొనరింతు సోదరీ!

ఉ. పరమ పతివ్రతామణివి పావనమూర్తివి నిష్కళంకస
చ్చరితవు శారదాకృతివి సాధ్వివి సర్వసమానవృత్ యశో
భరితవు సత్యశీలవు నపారకృపాబ్ధివి ప్రేమమూర్తి నీ
శ్వరగుణపానమత్తవు ధ్రువంబుగ నీ కెనవేరు నెచ్చెలీ!

సీ. పెద్దలకడఁ బేర్మిఁ బితరులయెడఁ గూర్మి-గన నీకు నీవె నిక్కముగ సాటి
పతియందు భక్తి సంతతిఁ గడు ననురక్తి - తలపోయ నీవె సత్యముగ సాటి
చెలులందుఁ బ్రేమ బీదలయందు దాక్షిణ్య - భావంబునకు నిజ మీవె సాటి
దేశీయులం బ్రీతి దివిరి యాత్మీయుల - యెడ సానుభూతికి నీవె సాటి
అస్మదాదులపౌ భవదాత్మబంధు - జనులఁ బ్రేమానురాగవాత్సల్యగరిమఁ
గన నినువినాగ నేరు నెందునను లేరు - నీకు నీవొక్కతెవె సాటి నిశ్చయముగ.

గీ. భారతీయుల దౌర్భాగ్యవశమువలన - వ్యాధి హెచ్చి యారోగ్య మత్యంతక్షీణ
గతిఁ గనిన పెద్దలెల్లరు నతిగఁ బట్టు - పట్టిన మహాత్ముసంతటివాఁడుగూడ
వ్రాసినను ధృతి సెడి యాత్మవ్రతము విడిచి - సత్యపథమును విడి యహింసావ్రతంబు
దూల్చి ధర్మముతప్పి ఈతుచ్ఛమైన - యసువులకుఁ బ్రతిజ్ఞాభంగ మగుట నొల్ల
ఈశ్వరుఁడుగాని ద్రుంప రక్షింప కర్త - మనమనుట వెఱ్ఱి ఈమాత్రమునకు మనుట
కల్లయని కోడిగ్రుడ్లను నొల్లనట్టి - నీప్రతిజ్ఞ మిక్కిలి వర్ణనీయముగద!

సీ. నీమీఁద నిజమైనప్రేమ యుండిన నీ మ - హాశయంబులఁ దీర్చ నమలబుద్ధి
ఆమరణాంతంబు స్వార్థంబుఁ ద్యజియించి - పలుకష్టనిష్ఠురములకు నోర్చి

రక్తమాంసములు ధరాతలంబున నోడ్చి - చిరకృషిచేసి సంసిద్ధి నొంది
భవదాత్మ సంతృప్తిపఱిచి మాతృ-ణంబు - దీరిచి నీదరిఁ జేరవలయు
నంతియేకాని భ్రమకులోనై నిరంత-రంబు దుఃఖింప నేమిలాభంబు వెల్తి
గాక శాశ్వత మెవరు లోకంబునందు? - శాశ్వతము శుభాశుభ కర్మచయము గాక.

చ. చింతిలనేటికమ్మ మృతిచెందిరటంచు వివేకమేది యు
శ్రాంతము నిత్య మెయ్యది? ధరాస్థలి విభ్రమమొండె కాక ధీ
మంతులు ఆత్మసత్యమని పల్కుదురింక శరీరమందుమా
భ్రాంతి, విసర్జనీయమగు వస్త్రముకైవడి సోదరీమణీ!

గీ. సాధ్వి, నీ కాత్మశాంతి, హృచ్ఛాంతి మాకుఁ - గలుగ హరి వేఁడి పద్యనక్షత్రమాలఁ
జేసితిని ఇంకఁ ద్వదభీష్టసిద్ధికొఱకుఁ - జీవితాంతంబునుం గృషి సేయుదాన.

మంగళమ్

విద్వాన్ కవితిలక కంచనపల్లి కనకమ్మ గారు

కేదారగౌళ రాగము-ఆదితాళము

మంగళం రామాయ-మానల్ల భాయ
సంగీతలోలాయ-శంకరాప్తాయ.

౧. ఆనందరూపాయ-హంసవేద్యాయ
జ్ఞానాధికరణాయ-కైవల్యదాయ. మం.

౨. దశరథతనయాయ-ధర్మరూపాయ
కుశలవజనకాయ-కోమలాంగాయ. మం.

3. కర్తృకర్మక్రియా-కలితరూపాయ
భర్తృభార్యాకేళి-పరవంచనాయ. మం.

౪. కోదండరామాయ-గూఢచర్యాయ
కోదండభంగాయ-కువలయేశాయ. మం.

౫. యమునాశుభాంగాయ-యాదవేంద్రాయ
కమనీయరూపాయ-కామితార్థాయ. మం.

౬. ప్రహ్లాదవరదాయ-పరమహంసాయ
ప్రహ్లాదవరదాయ-పరమేశ్వరాయ. మం.

౭. భూరికల్యాణాయ-బుధసేవితాయ
సారసనేత్రాయ-సద్భూషణాయ. మం.

౮. శ్రీగిరినిలయాయ-శ్రీనివాసాయ
భోగీంద్రతల్పాయ-పురుషోత్తమాయ. మం.

[మ. రా.—దీనిని ద్విపదగాకూడ చదువవచ్చును.]

పంచరత్నములు

కావ్యకంఠ గో. శ్రీ సూర్యనారాయణశాస్త్రి గారు

అర్పయే ఽంజలి మహం కుసుమానాం పాణిపంకజయుగే భవదీయే;
మంత్రివర్య! కరుణా మసృణై ర్మాం పాల యాశ్రిత మనూనకటాక్షైః.

శ్లో. అద్యాసీనే భవతి సుదినే మంత్రిపీఠీ మ్మహార్హాం
సర్వే పౌరా శ్శిథిలితమనోవ్యాధయ స్సాధువాదాః;
శిష్టా స్తుష్టా అపిచ సుధియ శ్శీర్ణదారిద్ర్యఖేదా
వేదోక్తాశీర్వచననిచయం చక్రు రానందమగ్నాః.

శ్లో. విద్వన్! భూసురవర్య! సంతి బహవః పృథ్వీతలే మంత్రిణః
కింతు త్వత్సదృశా న సంతి కవితా సారస్య సంవేదినః;
తద్వ త్సంతి బుధా న సంతి కవయో నిర్దుష్టవాగ్వైభవా
నానాగ్రంథవిచారచారుమతయః కాలే కలౌ మాదృశాః.

శ్లో. యత్పాణిస్థితలేఖనీ ఋజుపథే సంచారిణీ సాత్త్వికీ;
సంఖ్యావర్ధితకారిణీ నిజముఖోద్గీర్ణై స్సువర్ణై స్సుఖైః,
సోఽయం వేంకటరంగయేతి విదితః ప్రస్ఫీతకీర్త్యుజ్జ్వలః
స్థేయా న్మంత్రిపదే మహీయసి దయాశాలీ సుశీలీ చిరమ్.


శ్లో. ఇతో ఽప్యధికసంపత్తి, మితో ఽప్యధికవైభవమ్;
ఇతో ఽప్యధికమేధాం చ, దద్యా త్తే పరమేశ్వరీ.




సర్. ఆర్. వెంకటరత్నం నాయుడుగారు
చెన్నపుర విశ్వవిద్యాలయోపాధ్యక్షులు.



శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్యగారు, యం. ఏ.




మిస్. స్లేడుకన్య
అడ్మిరల్ స్లేడుగారికుమార్తె ఈమె మహాత్మా
గాంధికి శుశ్రూష చేయుచు వారి ఆశ్రమముననుండును.



శ్రీయుత లక్ష్మీసుందరరామ్‌గారు
M. A., F. R. Econ. S. (Lond.)



మిస్ కేథరైన్ మేయో
తీవ్రనిరసనమునకు గురియైన 'భారతమాత' యను
గ్రంథమును రచియించిన అమెరికాదేశపు స్త్రీ.
ఈమె అమెరికాలోనున్నపుడుతీసిన ఛాయాచిత్రమిది.



శ్రీ రోబిన్ చటర్జీగారు
వీరి నివాసస్థానము అలహాబాదు. వీరు బొంబాయివద్ద
సముద్రములో ముప్పదిమైళ్ళమేర $12\frac{1}{2}$ ఘంటలకాలమున
ఈదగలిగిరి. భారతీయు లెవ్వరు నిదివఱకిట్టి యద్భుత
సామర్థ్యమును జూపరైరి.

గురుదక్షిణ*

వెనురుగూడ్ వెంకటకృష్ణారావు గారు

శ్రీరమణీశోభితత్వం
గౌరహృదయ సంజనిత జగల్లీలావ్యా
పారి, యనంతుఁ డనంత
శ్రీరాజితుఁ జేసి నిన్ను క్షితినిమనుచుతన్!

గీ. సర్వదోషాపహారక శక్తి యగుచు,
తాఁకుమన్న తీర్థంబుగాఁ దనరఁ జేయు
విమలగంగాప్రవాహమై వెలయుఁగాదె
నీయకలుషితజీవిత మోహపతీంద్ర!

గీ. ప్రాణతేజ మిచ్చి పాలించు లోకంబు
లోకబాంధవుండు; శ్రీకరముగ
జ్ఞానతేజ మిచ్చి మానవాత్మలఁ బ్రోచు
దీనబంధు వీవు, జ్ఞానయోగి!

గీ. నీదుధర్మపరత, నీయేకపత్నీత్వ,
మింటిపేరు నరసి, యెంచుచుందు
రాఘువుండ వనుచు, రఘుపతివేంకట
రత్నగురువరేణ్య! రాజమాన్య!

గీ. తొలుత నే నెంతపుణ్యంబు సలిపినానొ
నీపద సరోరుహముల సన్నిధిని మెలఁగ!
తృణసమానుఁడ, దయయుంచుమనఘచరిత!
అదియెచాలు హేమాద్రినై యలరుటకును!

శ్రీయుత లక్ష్మీసుందరరామ్‌గారు **M. A. F. R. Econ. S. (Lond.)**

ఈయన ఆంధ్రవైదికయువకుడు. ఇరువది రెండు వత్సరముల ప్రాయము. మచిలీపట్టణము జన్మస్థానము. బందరునోబులు కళాశాలయందు పట్టపరీక్షలో రెండవ తరగతియందు ఉత్తీర్ణుడై, మద్రాసు విశ్వవిద్యాలయమున యం. ఏ. యందు కృతార్థుడై, లండను "రాయల్ యికనామిక్ సొసైటీ" యందు సభ్యత్వమును సంపాదించి, చిరకాలప్రాయముననే కీర్తిగాంచినాడు. ఈవత్సరము, కాకినాడవారి "సత్యలింగం ధర్మనిధి" సహాయమును పొంది ఇంగ్లాండునందు వాడేంస్లెండి, 'యికనామిక్స్' నందు డాక్టరేటును, ఐ. సి. యస్ డిగ్రీయును పొందుటకు, అక్టోబరు ఎనిమిదవతారీఖున పయనమై పోయినారు.

ఈతని తనకును, తనదేశమునకుగూడ కీర్తితెచ్చు ననుటకు సందియము లేదు. ఆదేశమం దున్నత పరీక్షల నిచ్చి, సంపూర్ణప్రజ్ఞావంతుడై, శాశ్వతయశస్సంపన్నత నార్జించి, విజ్ఞానవాటికలందు స్వైరవిహారణచేసి, సాహితీ సింహాసనమునుండి విజ్ఞానజ్యోతిత రత్నదీపికలను దెచ్చునో వేచి చూచెదము; మాది సంతసించెదము. ఈశ్వరు డితనికి పరిపూర్ణాయురారోగ్యములను ప్రసాదించుగాక!

[వెం. నా.]

---

* నాగరుపన్యులగు శ్రీ దివాన్‌బహదూర్ సర్ రఘుపతి వేంకటరత్నంనాయుడుగారి యఱువదియైదవ జన్మదినమహోత్సవసందర్భమున వందనపూర్వకముగా సమర్పించిన పంచరత్నములు. [వె. కృ.]

*భరతుఁడు - ఆత్మోపదేశము

భాగవతుల నృసింహ శర్మగారు

మునులున్ దేవతలున్ మహర్షివరులున్ మోక్షంబుఁ గాంక్షించి, యె
వ్వనిపాదాబ్జమరందపానరతిన్ వ్యామోహముం జంపి, పా
వననామంబు జపించుచుండు రతినిన్ వర్జించి భోగింతువే?
మనమా! దేహము శాశ్వతంబె? వినుమా, మా రాము సేవింపుమా.

మ. "జననాథుల్ భువి లేరొ? భోగపరులై శాసింపరో రాజ్యమున్
మునులున్ మేలని సన్నుతింపఁగఁ దుదిన్ మోక్షంబుఁ గాంక్షింపరో"
యని వాదించెదవేమొ, జ్యేష్ఠునకు నర్హంబెందు సామ్రాజ్య మో
మనమా! రాజ్యముఁ గోరరాదు వినుమా, మా రాము సేవింపుమా.

మ. జనకున్ మాటల మోసపుచ్చి, వసుధన్ శాసింప నాసించి, యా
తనిజీవంబు హరించి, జ్యేష్ఠసుతుఁ గాంతారంబునం బెట్ట నా
జననిన్ దేవతఁగా భ్రమించెదవె? సంసారంబు నిస్సార మో
మనమా! యాశకు లొంగరాదు వినుమా, మా రాము సేవింపుమా.

మ. తనయుం డంచును తల్లిదండ్రులు, జనుల్ ధాత్రీశ్వరుం డంచుఁ, బా
వనుఁ డంచున్ ఘనుఁ డంచు బ్రాహ్మణులు, సద్భక్తుల్ శివుం డంచు, నె
వ్వనినామంబు స్మరించుచుండు రతినిన్ భావింపుమా నిత్యమున్
మనమా! మాయకుఁ జిక్కరాదు వినుమా మా రాము సేవింపుమా.

మ. దనుజుల్ కొందఱ అధర్మకర్మపరులై ధాత్రిన్ విజృంభింప, యా
తన సైరింపఁగలేక లోక మసలన్ ధర్మావనార్థంబు, భూ
జనులన్ గారణజన్ముఁడై వెలసె సాక్షాద్విష్ణు శ్రీరాముఁడై;
మనమా! ధర్మపథంబుఁ బట్టి చనుమా; మా రాము సేవింపుమా.

మ. జననాథుల్ బలవంతులై స్థిరము లైశ్వర్యంబులన్ భావనన్
కవ కాంగీ కనకంబులన్ మరగి రొక్కం డైనఁ గొంపోయెనే
తనతో రాజ్యము, లేక కాలయమునిన్ దండించి జీవించెనే?
మనమా, శాశ్వత మింక నైన మనమా! మా రాము సేవింపుమా.

* శ్రీ తులసీరామాయణము, అయోధ్యాకాండమున ద్వితీయభాగమునుండి.

మ. జనుఁ డెవ్వండు దరిద్రుఁ డెవ్వఁడు మహాసంపన్నుఁ, డేవేళ కేన్
దిని జీవింపనివాఁ డెవండు? మఱిఁ దృప్తిన్ బొందువాఁడే క్షితిన్
ధనికుండంచు నెఱుంగుమా! సిరికి సంతాపించుటే సౌఖ్యమా?
మనమా! భోగవిలాసముల్ విడువుమా! మా రాము సేవింపుమా.

ఉ. ఎట్టులొ రాజ్య మబ్బెను, గ్రహింపవు మూఢుఁడవంచుఁ బల్కెదన్
బుట్టుకతోడ భాగ్యముల భోగములన్ గొనివచ్చితే? సిరిన్
గిట్టినవేళఁ జేకొని సుఖింతువె స్వర్గపురంబునందు? నీ
కట్టి విచార మేల? మనమా! రఘురాముని నాశ్రయింపుమా.

మ. అని యిట్లా భరతుండు ధర్మనిరతుం డాత్మోపదేశంబునన్
దన దీక్షన్ బ్రకటింప రాజసభలోఁ దద్ధర్మవాక్యంబులన్
విని శిష్టుండు వసిష్ఠుఁ డాత్మ నలరెన్ పృథ్వీసురుల్ మెచ్చి హె
చ్చిన భక్తిన్ గడు నుత్సహించి రడవిన్ శ్రీరాము దర్శింపఁగన్.

ఏమొ!

"కలిసి మెలఁగినపొలుపు కలఁగన్నయులు కేమొ!"

* యమ *

(హారితకృతము)

౧

పొలయల్క మఱుఁగునన్ - మొలకనవ్వుల మెఱుపు
గులికించి నావలపుఁ-గొల్లలాడిన చిన్ని—
పొలకువే కఱవయ్యెనే-గుండెలో-
కలఁతయే బరువయ్యెనే!

౨

అలరుసెజ్జల మ్రొగ్గి-యలికిడికిఁ జెవి యొగ్గి
.........ముచ్చట్ల-కతల వేగించునా—
—పొలకువే.

౩

నిలువుటద్దము చెంత-నిలిచి మురిసిన వింత
చెలిమి చీటీమీఁదఁ-జెల్లుపెట్టిన దేమొ!
—పొలకువే.

౪

తలఁపుమేడలలోన-వలపు వెన్నెలసోనఁ
గలిసి మెలఁగినపొలుపు-కలఁగన్నయులు కేమొ!
—పొలకువే.

---

*లయానుగుణముగ సురట ముఖారి, కేదార, హిందూస్థాని తోడి రాగములలో దేని నైనఁ బాడుకొనవచ్చును.—హారిత.



అమెరికనులు నేరస్థులనుపెట్టు చిత్రహింస

'న్యూరిపబ్లిక్' పత్రికవలన నిట్లు తెలియవచ్చుచున్నది.

"కాలదికాలము క్రిందట - ఇద్దఱు ముదుసళ్లను, సంపెనను నేరముపై 'లక్సింగ్ లీ' అను నాతనిని, న్యూయార్కుపట్టణమున ఖైదుచేసిరి. తనచే తప్పిదము నొప్పింప జేయుటకై పోలీసువారు వివిధవిధానముల తనపై ప్రయోగించిరనియు తత్ఫలితముగ తన రెండుప్రక్క ఎముకలు విరిగి యొడలంతయు గాయములతో నిండెననియు, తనతలవెండ్రుకల నూడబెరికిరనియు, విపరీతముగ బాధ కలుగునట్లు తన కాలుసేతులను మెలిపెట్టిరనియు, నాల్గ హోరాత్రములు కంటిపై రెప్పవాల్చనీయక నేరము నొప్పుకొనుటకై నిరంతరము అనవసరముగ ప్రశ్నవర్షము కురిపించుచుండిరనియు నాతడు చెప్పెను. అతని న్యాయవాది విపరీతములగు నీ ప్రహారచర్యలను నమ్మజాలక, రుజువయినచో అక్టోబరుమాసమున జరుగనున్న విచారణయందు ఖైదీకిది ముఖ్యాధారము కాగలదని యాతనిని ఖైదునందే డాక్టరులచే పరీక్షింపించుటకును, గాయములకు ఫోటోలను దీయుటకును కోరిరట. పోలీసువారందుల కంగీకరింపరైరి. న్యాయవాది పోలీసుహింసచర్యను ఖండించుచు వారిచే తీర్పును రద్దుచేయించుటకై మూడు న్యాయస్థానముల కెక్కెను కాని లాభము లేకపోయెను.

'లీ' నార్వే దేశమున జన్మించినవాడగుటచే నార్వే దేశపు ప్రరాయబారివద్దను స్టేటుడిపార్టుమెంటువారికి అప్పీలుచేసికొనిరట. అందుపై గవర్నరుస్మిత్తుగారిని ఈవిషయమును విచారించుటకు నియోగించిరి. పోలీసువారి చిత్రవధలయందలి సత్యాసత్యములు వెల్లడియగుదనుక స్మిత్తుగారు విచారణ నాపబోరని నమ్ముచున్నాము.

'లీ'ని ఖైదుచేయుటకు పూర్వమొకన్యాయవాది ఖైదీలు నేరముల నొప్పుకొనుటకై న్యూయార్కుపోలీసువారు వారిని చిత్రహింస కావించుచుందురని యొక్క న్యాయస్థానమున చాటిచెప్పినారు. ఇట్టివిధిప్రవర్తనము సహించు నాగరికదేశ మీప్రపంచమున నింకొకటి కానరాదు. అక్కడనే యిట్టిప్రవర్తనమున్నచో నిది యెన్నడో రూపుమాపియుండవలసినది."

ప్రపంచమున నాగరికతకు మిగులవాసిగాంచిన అమెరికాదేశమునందలి పోలీసువారు క్షమనిగంపలే చర్యలచే తమదేశమునకు కళంకమును దెచ్చిపెట్టుకొనుట తగదు. [మాడరన్ రివ్యూ]

ఇందిరా మహారాణిగారి ఆట-పాట-వేట

అక్టోబరు మాడరన్ రివ్యూ పత్రిక యిట్లు వ్రాయుచున్నది:

బహుసంతానవతియగు కూచబీహారు మహారాణి-ఇందిరాదేవి-యింగ్లాండులో భారతీయవితంతువుల కనుచితమైన ఆటపాటలతోను, వేటతోను కాలమును బుచ్చుచున్నదను పత్రికాప్రకటనములకు మేమెంతయు విచారమును, సిగ్గును జెందుచున్నాము. ఇదివఱకు భారతీయ మహారాజులు మాత్రమే అనాథలగు తమప్రజలనుండి సంగ్రహించిన ధనమును విదేశములయందు విరజల్లుకొన్నప మునకు లోనగుచుండిరి. ఇందిరామహారాణి త్రొక్కిన యీయనుచితమైన త్రోవను యితరమహారాణులు త్రొక్కుట సంభవించునేని యానాడు భారతదేశమునకు దుర్దినమగును. ఒక యాంగ్లపత్రికయందలి యీక్రింది ప్రకటనను నాగ్రహోద్రిక్తుడగు నొకానొక భారతీయ వార్తావిలేఖకుడు మాకు పంపినాడు:—

‘“వర్తకియగు మహారాణి”—ప్రస్తుతము లండను నగరమునందున్న సునిపుణురాలగు వర్తకీబృందమున కూచ్ బీహారు యువరాజ్ఞి యొకర్తు. ఈమె చాల అందకత్తె. ఆధునిక నాగరకత ననుసరించి యీమె తనశిరోజములను కత్తిరించుకొనుచున్నది. మేలిముసుగును మానివైచినది. కాని శిరమున్మాత్రము సింగారించుకొనుచునే యున్నది. ఈవారమున నీమె ‘వెకిల్ విక్టరు’భవనమున నాట్యము సల్పినది. ‘లెస్లీహెన్సన్’ గానముచేసిన వివిధవిధగానములయందలి సంగతుల నీమె గుర్తించి చాల మెప్పుకొనగలిగినది. ఈమెకుగల ‘ఆంగ్లభాషాపరిజ్ఞానమున కిది నిదర్శనము. ఈమె తండ్రి బరోడా గైక్వారును ఈమె భర్త, సోదరులు ఈటనులో విద్యనభ్యసించినవారును నగుటచే నిదియొక వింతకాదు.’

రాజ్యపరిపాలనమును వహించిన యువరాజ్ఞులు-అందును-విశేషించి పరమపవిత్రయగు ఇందూరు మహారాణి అహల్యాబాయియొక్క యుక్తిమార్గము ననుగమింపవలెను.”

యువతిజనసామాన్యమునకు మార్గదర్శకులుగ వెలయవలసిన భారతీయ మహారాణుల యిట్టి ప్రవర్తనము భారతదేశమున కంతకు వంతను గలిగింపక మానదు.

భారతశాసన నిర్మాణసభయందు రాష్ట్రములకుగల ప్రాతినిధ్యబలము

అక్టోబరు ‘మాడర్న్ రివ్యూ’ పత్రికయందు రామానందచటర్జీగారు భారతశాసననిర్మాణసభయందు పాశ్చాత్యదేశములయందువలె రాష్ట్రములసంఖ్య ననుసరించికాని, వానివిస్తీర్ణము, ఆదాయము ననుసరించికాని, జనసంఖ్య ననుసరించికాని ఆయారాష్ట్రముల ప్రతినిధులసంఖ్య సరిగా లేదనియు, ఎక్కువ విస్తీర్ణము, జనసంఖ్య గల రాష్ట్రములకు తక్కువ ప్రాతినిధ్యము, తక్కువ జనసంఖ్య, విస్తీర్ణము గల రాష్ట్రములకు ఎక్కువ ప్రాతినిధ్యమును గలదనియు, ఇందువలన రాష్ట్రములన్నియు సమానముగ అనగా వాని వాని విస్తీర్ణమునకు, జనసంఖ్యకు దగినట్లు వలసిన సౌకర్యములను సమకూర్చుకొనుటకు గాని, భారతదేశసేవ చేయుటకుగాని, రాజకీయార్థిక సమస్యలయందు సముచితానుభవమును గడించుకొనుటకుగాని తగిన యవకాశములు లభింపవనియు, ఇట్లు కొన్ని రాష్ట్రములు ఎక్కువ అవకాశమును, కొన్ని తక్కువ అవకాశమును కలిగియుండుటకు దగిన సకారణములు కాన్పింపవనియు వ్రాయుచు నిట్లు వివరించినారు.

“అమెరికా సంయుక్తరాష్ట్రములు, ఆస్ట్రేలియా, కానడా మొదలయిన దేశములయందు ప్రజాప్రాతినిధ్య రాజ్యాంగవిధానముల ననుసరించిన రాష్ట్రీయ సభలయందు ఎల్లరాష్ట్రములకును సమానసంఖ్యగల ప్రతినిధులుగలరు. శాసననిర్మాణసభయం దాయారాష్ట్రముల జనసంఖ్యనుబట్టి ఎన్నుకొనబడిన ప్రతినిధులు గలరు. భారతశాసన నిర్మాణసభ పైవిధానములనుగాని, మరేయితర న్యాయ్య విధానములనుగాని అనుసరించి యేర్పడినది కాదు.

భారతశాసన నిర్మాణసభయందు ఆయారాష్ట్రముల ప్రతినిధులను, వారల నెన్నుకొనిన జనసంఖ్యయును నీక్రిందకీయబడుచున్నవి.

రాష్ట్రము.	జనసంఖ్య	ఎన్నుకొనబడిన భారతీయ ప్రతినిధులసంఖ్య
మదరాసు	౪౨౩౧,౮౯౮౫	౧౫
బొంబాయి	౧౯౩౪౮౨౧౯	౧౫
బెంగాలు	౪౬౬౯౫౫౩౬	౧౯
సంయుక్త పరగణాలు	౪౫౩౭౫౭౮౭	౧౫
పంజాబు	౨౦౬౮౫౦౨౪	౧౨
బీహారు-ఒరిస్సా	౩౪౦౦౨౧౮౯	౧౨
మధ్యపరగణాలు	౧౩౯౧౨౭౬౦	౬
ఆసాము	౭౬౦౬౨౩౦	౩
డిల్లి	౪౮౮౧౮౮	౧
బర్మా	౧౩౨౧౨౧౯౨	౩
వాయువ్య సరిహద్దు	౨౨౫౧౩౪౦	౧

దీనివలన నాయా రాష్ట్రముల జనసంఖ్యనుబట్టి ప్రతినిధులసంఖ్య నిర్ణయముకాలేదని తెల్లమగుచున్నది. సంఖ్య నిర్ణయముకాలేదని తెల్లమగుచున్నది. సంస్కరణవిధానములయందు రాష్ట్రములకు ప్రాప్తించిన యీయసమాన స్థితినిగూర్చి జనుక వ్రాయుచు నీపద్ధతి రాష్ట్రములయందలి విద్యావంతులసంఖ్యను (దేశభాషలయందుఁగాని ఆంగ్లమునందుఁగాని)బట్టిగాని, రాష్ట్రములయాదాయమునుబట్టిగాని యనుసరించినదికాదని వ్రాసినాఁడు.

భారతదేశము మొత్తమున తక్కువజనసంఖ్యగల రాష్ట్రములకును, కొన్ని ప్రత్యేక రాష్ట్రములకును ప్రాధాన్యముగలుగుట అసంగతమును, అన్యాయ్యమునునగు నీవిధానముయొక్క ఫలితమగుచున్నది.

బ్రిటీషుభారతదేశజనసంఖ్యయందు దీ క్రిందిరాష్ట్రముల జనసంఖ్య యధికముగానున్నది.

రాష్ట్రము	జనసంఖ్య	ఎన్నుకొనబడిన భారతీయప్రతినిధులు
మదరాసు	౪౨౩౧౮౯౮౫	౧౫
బెంగాలు	౪౬౬౯౫౫౩౬	౧౪
సంయుక్తపరగణాలు	౪౫౩౭౫౭౮౭	౧౫
	౧౩౪,౩౯౦,౩౦౮	౪౪

క్రిందజూపిన ప్రత్యేకరాష్ట్రములజనసంఖ్య బ్రిటిషుఇండియాజనసంఖ్యయందు తక్కువభాగముగనున్నది.

రాష్ట్రము	జనసంఖ్య	ఎన్నుకొనబడిన భారతీయప్రతినిధులు
బొంబాయి	౧౯౩౪౮౨౧౯	౧౪
పంజాబు	౨౦౬౮౫౭౨౪	౧౨
బీహారుఓరిస్సా	౩౪౦౦౨౧౮౯	౧౨
మధ్యపరగణాలు	౧౩౯౧౨౭౬౦	౬
అస్సాము	౭౬౦౬౨౩౦	౩
ఢిల్లీ	౪౮౮౧౮౮	౧
బర్మా	౧౩౨౧౨౧౯౨	౩
అజ్మీరుమర్వారా	౪౯౫౨౭౧	౧
	౧౦౯౭౫౦౦౭౩	౫౨

పైరెండు పట్టికలవలన బ్రిటిషు భారతదేశమున నధికభాగము జనసంఖ్యకు, తక్కువభాగమునకంటె ఎన్నుకొనబడిన ప్రతినిధులు ఎనమందుకరు తక్కువగానున్నారని స్పష్టమగుచున్నది."

మఱియు ఛటర్జీగారు రాష్ట్రములగొన్నిటిని ప్రత్యేకముగ గైకొని వాని ప్రాతినిధ్యమునందలి తారతమ్యమును వివరించిచూపి, తుదకీ విపరీత విధాన మన్యాయమని చెప్పుచు, దీనిని క్రమపద్ధతికి దెచ్చుటకు దగినప్రయత్నములు చేయుటకయి నేషనల్ కాంగ్రెసు, ఇండియన్ నేషనల్ ఫెడరేషన్, మజ్లిములీగు, నాన్ బ్రాహ్మిన్ ఫెడరేషను మొదలగు ప్రజాసంస్థలదృష్టి నీవిషయమువంకకు మరల్చుచున్నాఁడు.

భారతీయుల ప్రాణము, ఐరోపీయుల మానము

'నెటాలు'లోని 'ఇండియన్ ఒపీనియను పత్రిక' చెప్పినట్లుగా 'విదేశములందలి భారతీయులు' అను శీర్షిక క్రింద నవంబరు మాడర్న్ రివ్యూ యిట్లు వ్రాయుచున్నది.

మాపత్రికయొక్క కడచినవారపు సంచికయందు ప్రకటించినట్లు అజాగ్రతతో మోటారుబండిని నడిపి యొక భారతీయ శిశువుయొక్క ప్రాణములను దీసినందుకై ఒక యూరపుదేశస్త్రీకి ఇరువది పౌనులు జరీమానా విధింపబడెను. ఇపుడొక భారతీయుఁ డొక ఐరోపీయస్త్రీతో తిరస్కారపూర్వకముగా మాటలాడినందుకై న్యాయమూర్తి మాథ్యూగారు ఐరోపీయ స్త్రీలపట్ల చూపిన యీ ప్రవర్తనమింకను తీవ్రదృష్టితో బరికింపవలసినదని చెప్పుచు వానికి ఆరుసంవత్సరముల కఠినదాస్యమును, ఎనిమిది దెబ్బలను శిక్షగా విధించిరి. ఈదేశపు న్యాయస్థానముల దృష్టియందు భారతీయుని ప్రాణముకంటె శ్వేతజాతి స్త్రీయొక్క మానము (పరువు) గొప్పదిగ నున్నది.

విదేశములందు భారత దేశవాణిజ్యము:—

పై 'విదేశములందలి భారతీయులు' అను శీర్షిక క్రిందనే 'మాడర్న్ రివ్యూ' పత్రిక యిట్లు వ్రాయుచున్నది:

భారతదేశవ్యాపారస్థుల భాగ్యాభివృద్ధి ప్రస్తుతము ఆఫ్రికాదేశములో శ్వేతజాతికిని భారతీయులకును జరుగుచున్న పోరాటముపై నాధారపడియున్నదని భారతీయుల కెల్లరకును విశదమైయున్నది. ఈరెండుజాతులకును నడుమ పెరుగుచున్న అసూయకు అచ్చటి వ్యాపారపరిస్థితులు ముఖ్యమైయున్నవి. ఆఫ్రికాదేశపు పత్రికయందు బ్రకటితమైన ఈక్రిందివిషయమువలన నది తెలుసుకొనవచ్చును.

"ఐరోపా మహాసంగ్రామమునకుముందు టాంగనీకా రాజ్యములో ప్రధానమైన నార(సీసల్)పరిశ్రమ శ్వేతజాతులహస్తగతమైయుండెను. యుద్ధానంతరము కొన్ని భారతీయవాణిజ్యసంస్థలు ఈనారపరిశ్రమలను స్థాపించి వ్యాపారము చేయగడంగుటను చూచి శ్వేతజాతివారు భారతీయులు ఈవ్యాపారములో నెగ్గలేరని తలంచుటయే కాక కృతనిశ్చయులునై కూడ నుండిరి.

ఈపరిశ్రమ భారతీయులకు క్రొత్తదైనను దానిని నిర్వహించుటకు బూనుకొనిన భారతీయవాణిజ్యసంస్థలు విశేషముగా పరిశ్రమచేసెననుటకు నైరోబీ ప్రదర్శనమునందు వారు పడసిన విజయమే ప్రబలనిదర్శనము.

నైరోబీప్రదర్శనమును చూడవచ్చినజనులందరును ప్రదర్శింపబడిన యీనారపరిశ్రమయందు తమసంతృప్తినిజూపిరి. ప్రదర్శింపబడిన పలుతెగలైన కెన్యా, టాంగనీకా దేశముల నారపరిశ్రమలో ఏరెండుమూడో తప్ప భారతీయులు ప్రదర్శించినవానితో సరిపోవునవి లేకుండెను. ఈపరిశ్రమయందారితేరిన కర్నల్ ఆర్. బి. టర్నర్ గారు ఆప్రదర్శనమునకు మధ్యవర్తిగానుండిరి.

మాంబ్యాసీలోని గొంబా భారతీయపరిశ్రమాధికారులు ఈనారప్రదర్శనమునందు ప్రథమబహుమతిని బడసినందులకై కెన్యాటాంగనీకాదేశములలోని భారతీయులు మిక్కిలి గర్వపడవలసియున్నది. ఈనారపరిశ్రమసంస్థ కరీంజీ జీవాన్‌జీ కంపెనీవారికి చెందియున్నది. దానిని అబ్దుల్లా యం. ఎ. కరీమ్‌జీగారు మిక్కిలి నిపుణతతోను, తెలివితేటలతోను నిర్వహించుచున్నారు.

పైప్రదర్శనమునకు మధ్యవర్తియైన కర్నల్ ఆర్. బి. టర్నర్ గారు ప్రథమబహుమతిని పొందిన యీకంపెనీవారకు 100 కి 94 మార్కులను ఇచ్చుటయే కాక అదిసర్వవిధముల శ్రేష్ఠముగ నున్నదని చెప్పిరి. అవకాశము లభించినపుడెల్లను భారతీయులు ఏపనినైనను కడుసమర్థతతో చేయగలరని తెలుపుటకు పైయుదాహరణమే సాక్ష్యము."

పూలతొట్లలో మహావృక్షములు

౧౯౨౮ సం. అక్టోబరు నెల ఎనిమిదవ తేది 'టిట్‌బిట్సు' అను పత్రికయం దిట్లు కలదు.

నూఱుసంవత్సరములవయసును మించిన దేవదారువృక్షము లనేకములు రెండడుగులుమాత్రమే పొడవుగలవి జపానులో గలవు. అవి కొంచెము పెద్దవగుపూలతొట్లలో పెరుగుచున్నవి. అడవులలోనున్న దేవదారువృక్షములకును వీనికిని బరిమాణమునందుమాత్రమే భేదము గలదు. బుద్ధిపూర్వకముగనే వీని నిట్లు పెరుగకుండ అచ్చటివారు చేయుచున్నారు. అందుచేత వారు నల్పసారవగు విత్తనములనే విత్తెదరు. వేళ్లను కత్తిరించెదరు. చురుకుగ పెరుగుచుండు రెమ్మలను ఎడతెగక త్రుంచివేయుచుందురు. కేవలము గిడసబారిన కొమ్మలనుమాత్రమే పెరుగనిచ్చెదరు. ఇట్లు నూఱేండ్లు చేసినచో నాచెట్లు పరిపక్వమగుస్థితికి వచ్చును. అవి ఒకటి లేక రెండు అడుగులకు మించని పొడవునే యుండును. ఈపొట్టిచెట్లొకప్పుడు రెండువందలయేండ్లు సైతము మనును.

హాలెండులో చాలచోట్ల నిట్లు పెంచబడిన నాగజెముడుచెట్లు చిన్నపూలతొట్లలో గలవు. వానిలో కొన్ని నీటితేమయే లేక పట్టుపనివాని వ్రేలితొడుగుకన్న కొంచెము పెద్దవిగ నుండును.

ఎవరయిన నిట్టిపొట్టిచెట్లను పెంచవచ్చును. ఆవిధానమిది: పలుచనిచర్మముగల నారింజపండును చెరుసగముగ కోసి, ఒకసగములోని గుజ్జునుతీసివైచి దానిపైభాగమున

లక్కపూసి లోపల సారవంతమగు మంటిని నింపి అందు రెండు దేవదారువి త్తనములను నిర్తించలెను. అంత దానిని ఒక గదియందు సూర్యరశ్మి విస్తారముగ సోకుట కనువైన-కోట ప్రేలగట్టియుంచి దాని కప్పుడప్పుడు నీరుపోయుచుండవలెను. ఆగదిలో వేడి యధికముగాకుండ జాగ్రత్తకొనవలెను.

డిప్పకుండా వేళ్లు దిగబారినప్పుడు వానిని డిప్పనంటునట్లు లక్కపూత చెడకుండ కత్తిరించవలెను. చెట్టు కొంచెము పెరిగినతర్వాత పెద్దతొట్టిలోనికి మార్చవచ్చును. కొనవేళ్లనుకత్తిరించుటచే నా చెట్టు పెరుగక ఎల్లప్పుడును పొట్టిగ నేయుండును.

రోడ్లపై మేకులు లేకుండ చేయుపద్ధతి

రోడ్లపైన మేకులు లేకుండ జేయుటకై కనుగొనిన యొకక్రొత్తసాధనమును గూర్చి 'ది అమెరికనుసిటి' అను న్యూయార్కు పత్రిక యిట్లు వ్రాయుచున్నది:

ఇరువది రెండు అంగుళములపొడవుగల రెండుమూడంటురాళ్లు అయిదుటన్నులబరువుగలబండికి ముందు, వెనుకనున్న చక్రములనడుమ రోడ్డుకు అయిదంగుళముల యెత్తున నుండునట్లు వ్రేలుచుండును. ఆయూడంటురాళ్లకు విద్యుచ్ఛక్తిని ప్రయోగింపగవి రోడ్లపైనున్న యినుపమేకులనన్నిటి నాకర్షించితీసికొనును. విద్యుచ్ఛక్తిని ప్రయోగించుటకు వలసినపరికరములన్నియు నాబండియందే కలవు. తొలుదొల్త నివెడారోడ్డుపై నీవిధానమును ప్రయోగించిరి. ఒకమారు చుట్టివచ్చినమూరుమైళ్ల మేరయందు 1870 పౌనులబరువుగల ఇనుపమేకులు, ముక్కలు మొదలయినవి యుండినవట. ఒకమైలు మేరకు సరాసరి ౧౫ విడిముక్కలు – మోటారుబండ్లచక్రముల రబ్బరుకట్లను పాడు చేయజాలినవి–ఉన్నట్లు తేలినది. ఈపద్ధతినిబాధకరమని తెలిసికొని 'కార్సను' నగరమునను నెలకొల్పిరి. రెండువారములకే ౧౭౫౦ పౌనుల ఇనుపమేకులు మొదలయినవి దొరకినవట. [ది రివ్యూ ఆఫ్ రివ్యూస్–అక్టోబర్. 1927.]

ముగ్గురుబిడ్డల ముద్దరాలు



శ్రీ. పి. మిస్త్రీ అనునామె యీముగ్గురు పిల్లలను ఒక్కనాడే కన్నది. ఈముగ్గురిలోను పెద్దబిడ్డ ౫౩ పౌనులబరువున్నందుకు, బొంబాయియందొకానొక ప్రదర్శనమున నుత్తమబహుమానమును బడసెను. 'ఇన్నెస్ డిమాంటి' అను నొకదొరసాని ముగ్గురుబిడ్డలకును మూడు ప్రత్యేకబహుమానముల నొసగెనట.

[ఇండియన్ డెయిలీ మెయిలుపత్రికనుండి]

ఫిలిప్పైనుదీవులలో కార్యరూపమైన విద్యాభ్యాసము

డి. స్పెన్సర్ హాచ్‌గారు 'భారతయువజనులు' (Young Men of India) అనేపత్రికలో ఫిలిప్పైనుదీవులలోని విద్యాభ్యాసమునుగురించి వ్రాసినారు. ఆదీవులలోనిప్రజలు తమ భావినాగరికులను గొప్పదక్షతయూ, ఆశయములునూ, అనుభవమునూ కలవారినిగానూ, దీవులకు తప్పకుండా అభ్యుదయమూ, ఔన్నత్యమూ చేకూర్చువారినిగానూ తయారుచేస్తూఉన్న విధమును వారు చక్కగా తెలియజేసినారు. వా రీలాగున చెప్పినారు ;

"ఫిలిప్పైనుదీవులలోని వ్యవసాయ వ్యాపార విద్యాశిక్షణమును గురించిన్నీ, జనులలోని తోటపనినిగురించిన్నీ వీలయినమట్టుకు తెలుసుకొనే సందర్భమున ఒక నొక్కనిఆశయము అక్కడ సిద్ధమైన ఆవరణలో ఉండటము చూడగా చాలాసంతోషము కలిగినది. ఆ ఆశయముపట్ల భారతదేశములో ఇప్పుడిప్పుడే తాత్పర్యమూ, ఆసక్తియూ ప్రబలుతూ ఉన్నవి.

కార్యరూపమైన విద్యాభ్యాసము

వివిధస్థలములలోనూ, వివిధపద్ధతులవిూదనూ ఈ ఆశయము పనిచేస్తూ ఉన్నదనేటందుకు ముఖ్యముగా 'మ్యూనజ్' లోని 'సెంట్రల్ ల్యూజన్ అగ్రికల్చరల్ స్కూలు'ను గురించి చెప్పితే మంచినిదర్శనము చూపించినట్టే. 'సుస్రోపర్వేకమిషను' దీనిని ఈదీవులలోఉన్న పదిహేను వ్యావసాయికవిద్యాసంస్థలలోనూ ఉత్తమమైనవాటిలో ఒకటిగా పరిగణించినది.

విద్యార్థులు పాఠశాలకు వచ్చి తాము గైకొనదల్చిన పనినిగురించి విద్యాలయాధికారులతో ఆలోచించి, తమతమ కార్యములు నిర్ణయించుకొంటారు. ప్రతివిద్యార్థియూ ఒకభాగస్వామిని ఎన్నుకొంటాడు. ఈ ఇద్దరు భాగస్వాములకూ ఒకకొంత భూభాగము ఇస్తారు. అందులోనే వారి నివాసమూ,పనియూను. అది కౌలుకు పుచ్చుకొన్నట్లే పుచ్చుకొంటారు. అక్కడ ఒకయిల్లు కట్టుకొంటారు. విత్తులూ, చేతిపనిముట్లూ, ఇతరసాధనములున్నూ, ఎద్దుగాని దున్నపోతుగాని ఒకటిన్నీ,వారిపనికి అవసరమైతే కోడిపిల్లలులూ, పాడిఆవులూ, పందులున్నూ పాఠశాల ఎరువిస్తుంది వారికి. కౌలుదారులవలెనే విద్యార్థులు ఇవన్నియూ సంతకముచేసి పుచ్చుకొంటారు. కోత అయినతర్వాత నిర్ణయము జరుగుతుంది. ఈలాగు జంటలుగా ఉండి పనిచేయడము అవసరము ఏమంటే: ఒకడు జాగ్రత్తగాపొలముపని చూస్తూఉండగా ఒకడు పాఠములకు వెళ్లవలెను. కొందరువిద్యార్థులు పనిమాత్రమే చూస్తూఉంటారు; వారికి ప్రతివారమూ క్రొత్తపనులు తగులుతూఉంటవి.

ఈపాఠశాల ఒకవిద్యార్థులపట్టణమువలె ఉంటుంది. విద్యార్థులు తమ భావిజీవితమున సంఘములో వలెనే తమవ్యవహారముల పరిపాలనకోసము ఒకఅధ్యక్షునీ, పాలకసభనూ ఎన్నుకొంటారు. విద్యార్థిపోలీసులు అరెస్టులుచేస్తూ సంఘములో నెమ్మది కాపాడుతారు; ఒకవిద్యార్థి న్యాయాధిపతి అభియోగములన్నియూ తన న్యాయస్థానములో విచారిస్తాడు. ఎన్నుకోబడిన ఆరోగ్యశాఖాధికారి పట్టణములో ఆరోగ్యమునూ, పరిశుభ్రతను చూచుకొంటాడు. ఒక పట్టభద్రుడైన రోగరక్షకుడు కొందరువిద్యార్థుల ఆరోగ్యశాఖాదళములయొక్క సహాయముతో గాయములకూ, రోగములకూ చికిత్స చేస్తూఉంటాడు.

అధ్యక్షుని అధికారము ఒక నటన కాదు. అతడు విద్యార్థిపాలకసభకు ఆధిపత్యము వహించి విద్యార్థులకు పనులు ఒప్పగిస్తూ, మెలకువతో సంఘక్షేమమునుగమనిస్తూ,యథార్థమైన కార్యనిర్వహణము చేస్తూఉంటాడు.

దీవులలో గుట్టలకూ, అడవులకూ సంబంధించిన వేర్వేరుప్రాంతములనుండి వచ్చినవిద్యార్థులలో చాలాభేదము ఉండడముచేత పరిపాలన మరింత క్లిష్టమవుతూ ఉంటుంది. వేర్వేరురాష్ట్రములవారికి వేర్వేరుపడకటిళ్లు ఉంటవి. ఆయారాష్ట్రముల సొంతవ్యవహారములను ఆ యాయిరాష్ట్రముల ప్రతినిధులైన విద్యార్థులు చూస్తూఉంటారు. విద్యాలయాధ్యక్షునికి నిషేధాధికారము (అంటే ఒకరినిర్ణయమును తుడిచిపెట్టే అధికారము) ఉన్నది: కాని అది అతను ప్రయోగించడము చాలాఅరుదు: చిత్రమౌతుంది.

ఈపాఠశాలయూ, దీనివల్ల ఏర్పడ్డ సంఘమున్నూ ఒక చురుకైన సంస్థ. సంవత్సరముపొడుగునా చాలా వ్యాపారము నడపవలసి ఉంటుంది. విద్యార్థులు తమసరుకులు అమ్మడమునకున్నూ, కావలసినవి కొనడమునకున్నూ ఒకసంతచావడి ఉంటుంది. మంచిస్థితిలో ఉన్న విద్యార్థులందరికీ ఇక్కడ అరువు ఉంటుంది. విద్యార్థుల కోశము (బ్యాంకు) వారిజమాఖర్చులు చూస్తూ వారిసంపాదనయూ, ఉన్నడబ్బుదస్కమునూ నిలువచేసిపెట్టుతుంది. వారము వారమూ వారివాడకము పోను మిగతఉన్నదానికి లెక్కలు ఏర్పడుతవి.

ఆదివారము విడిచి తక్కినరోజులలో రోజుకు నాలుగుగంటలవంతున పడినపాటు వారిభోజనమునకు చాలును. స్వయముగా విద్యార్థులే తమభోజనశాలలో రసాయనశాస్త్రానుసారము భోజనము తయారుచేస్తారు.

విద్యార్థులు నడిపే వ్యాపారములు ఒక పట్టణములోవలెనే పలువిధములుగా ఉంటవి. కిరాణాదుకాణము, రంపపుయంత్రము, సినిమెటోగ్రాఫు, ముద్రణాలయము కోశము, అన్నియూ వారుసొంతముగా పెట్టినడుపుతారు. తమబియ్యపుమిల్లులో తమచేలలో పండిన బియ్యమున్నూ, చుట్టుప్రక్కల ఉన్న రయితులబియ్యమున్నూ విసురుతారు. తమపడకటిల్లూ, వాసగృహములూ, తక్కినకట్టడములున్నూ స్వయముగానే నిర్మిస్తారు. తామే వంతుకొని నడిపించుకొంటారు. పీఠములూ, వంతెనలూ వగైరాలు నిర్మిస్తారు. ఇతరు లెవరు చెయ్యగలిగిన పనిఅయినాసరే వారు వెనుదీయకుండా చేసివేస్తారు. ఈవిషయమై వారికెంతో గర్వము. ఆగర్వము ఎంత ధార్మికము! ఎంత ప్రశస్తము!!

తక్కువరకమువస్తువులు తయారుచేయడమునకు వారు ఒల్లరు. ఒకపనిలో ప్రశస్తమైన వస్తువులు తయారుచెయ్యడమునకు వారికి అనుభవము చాలకపోయినట్టయితే ఆరితేరిన పనివానిని ఒకనిని పెట్టుకొని తమలో కొందరు తయారవుతారు. ఉదాహరణము చూడండి: ఈమున్య వారిముద్రణాలయము సర్వాంగశోభనముతో సిద్ధముకాగా వారు ఉత్తమపద్ధతిని పనిసాగించే నిమిత్తమున్నూ, ముఖ్యముగా తమలో కొందరు ఆరితేరి పెద్దపనివారు అయ్యేనిమిత్తమున్నూ 'మనిలా' నుంచి ఒక చెయితిరిగిన పనివానిని తీసుకువచ్చి పెట్టుకొన్నారు.

కృషికవిద్యార్థులందరూ ఒకవాదము పెట్టుకొని స్వయంకృషివల్ల ఎవరు ఎక్కువప్రతిఫలము తీస్తూ ఉన్నారో నిర్ణయించుకొంటారు. అన్నిసరుకులూ వినిమయము ద్వారా అమ్ముడుపోతవి. వారి కోత్సవపువారములలో బహుమతులున్నూ, గుణములు తెలిపే యోగ్యతాపత్రములున్నూ యథాయోగ్యముగా పంచిపెట్టబడుతవి.

[మాడరన్ రివ్యూనుంచి.]

వింతవృక్షములు

'పాప్యులరు పిక్టోరియలు' అను పత్రికయందు ఇవీరోజర్సు అను నాతడు వృక్షజాతిలో కొన్ని వింతవిషయముల నిట్లు వ్రాయుచున్నాడు:

ఈలవేయుచెట్టు

దీనినే 'విస్లింగు ట్రీ' అనెదరు. ఇటీవలనే దీనిని ఫ్రాంసుదేశములో పెంచుటకు ప్రారంభించిరి. ఈ చెట్టు ఆకులకు కన్నములుండును. దానిగుండా గాలినిరంతరము దూరి అపూర్వమగు గానము బయలుదేరును. వెన్నెలపట్ల యీ ధ్వని విన్నపుడు భయంకరముగ నుండును. ఈకన్నములను పురుగులు సదా చేయుచుండునట. అరబ్బు లీచెట్టును 'సోఫారు' అని పిలిచెదరట. సోఫారుఅనగా పిల్లనగ్రోవియని వారియర్థము. ఆశబ్దము విన్న ఒడలు కంపించును. బర్బుదాన్, సుడాను దేశములందు 'అకేషియా' చెట్టుగా దీనిని వాడుచున్నారు. యూరపియులు దీనికి 'విస్లింగు ట్రీ' అను పేరిడిరి. మనలో సంగీతపు చెట్లు అని ఉన్నవికాని ఆకు లుండవు. రంధ్రము లుండవు. వాటినే మనము వెదురుచెట్టు అనెదము.

"అక్సిడెంటు ట్రీ"

ఇది ఇంకను అద్భుతమగు చెట్టు. క్యాలిఫోర్నియా నెవేడా ఆరిజోనా దేశములందు దీనిని 'యాంగ్రీ ట్రీ' అనెదరు. ఇది ౧౦ నుంచి ౨౦ అడుగులు పొడుగుండును. గాలివచ్చి కదిపిన తను అసహ్యతను అనిష్టతను జూపుటకు శంకించును. ఆకులన్నియు జలజలకదలి ఒకవిధమగుశబ్దము నలుదిక్కుల వ్యాపించును. వాయువంతయు భరింపరాని దుర్గంధముతో నిండిపోవును. తనను ముట్టుకొన్న కోపమువచ్చుచెట్టు అని చెప్పవచ్చును. మనలోగూడ అత్తిపత్తిచెట్టు ఒకటిగలదు. దానినిముట్టుకొన్న ఆకులన్నియు ముడుచుకుపోవును. దీనినిగూడ కోపముగను, 'అయిష్ట'ముగను అర్థముచేయవచ్చునని తలంచెదను.

అగ్నిపర్వతపుచెట్టు

ఇది జపానులో నుండును. సూర్యుడస్తమించు సమయమున చిట్టచివరనున్న కొమ్మలనుండి తెల్లనిపొగ కాన్పించును. పొగలుక్రమ్మును. కారణము తెలియదుగాని చూచుటకు అద్భుతముగ నుండును. బాగా పెరిగిన చెట్టు ౨౦ అడుగులుఎత్తు ఉండును. సూర్యాస్తమయమునకు ముందు ఏకొమ్మయందుగూడ ఇట్టిపొగ కాన్పించదు.

"బర్నింగుట్రీ"

అనగా అగ్నివృక్షము. ఆకులు మ్రాను చుట్టుకొన్న గుచ్ఛకొనములుగ్గుండును. రోమములు బోలి

యుండును. ఎఱ్ఱగా గాలిన సూదులవలె ముట్టుకున్న చుఱ్ఱున కాలును. ఆమంట శరీరమంతయు ప్రాకి గంటలకొలది బాధపెట్టును. మనలో నెదురుపొదలు కొంతవరకీ పోలికనుండవచ్చును. అయినగూడ గ్రుచ్చుకొనునుగాని కాలినసూదిని ముట్టుకొన్నపుడు గలుగు బాధ యుండదు. గాలికి రాదుకొని అంటుకొనుస్వభావము గలదు. అంతవరకే పోల్చి చెప్పనగు.

సూది దారము నిచ్చు చెట్టు

మెక్సికోలో సూది దారము నిచ్చుచెట్టున్నది. ఏ అత్యవసరమైన పనికైనను బాటసారికి సూది దారము సప్లయిచేయును.

దీనినే 'మ్యాగ్ని ట్రీ' అనెదరు. నలుపుతో గూడిన ఆకుపచ్చని ఆకులుండును. ప్రతియాకుశిఖరమున ముల్లు వంటిసూది లోపలనుండును. పొరలోనుండునన్నమాట. దీని నా పొరలనుండి తీయగానే చాలనిడుపైన దారము వంటినార ననువుగా బయలు దేరును.

సిరా చెట్టు

దీనినే 'ఇంకుట్రీ' అనెదరు. ఇది కొలంబియాలోనున్నది. దీనినుండి ఎఱ్ఱనిరసము ద్రవించుచుండును. చక్కటి ఎఱ్ఱ సిరాక్రింద దీనిని ఉపయోగించవచ్చును. దీనితో వ్రాసినచో పాళీగాని కలముగాని తుప్పుపట్టదు. అలుకును పోదు. నీళ్లలో నానబెట్టిన తుప్పుపట్టదు.

కొన్నిగంటలయినపిదప కాగితముమీద వ్రాసిన అక్షరములన్నియు క్రమముగా నల్లగామారును.

"కాంపస్ట్రీ"

దీనినే దారిచెప్పినత్రోవను జూపుచెట్టు అనెదరు. ఇది దూరపాశ్చాత్య ప్రదేశములో నుండును. దారితప్పిప్రాణమువిసికిన బాటసారికి మహోపకారి. పచ్చనిపూవులుండును. ౪ నుండి ౬ అడుగులు ఎత్తుండును. ఆకులు తమచిగుళ్లను ఉత్తరముగను, దక్షిణముగను జూపును. అర్థరాత్రియందు పెనుచీకటిలో గూడ దారితప్పిన పాంథుడు తనత్రోవను కనుగొనగలడట.

"ట్రావెలర్సు ట్రీ"

ఇది మడగాస్కరులో నుండును. ప్రతిఆకుఅడుగున నీరుయుండును నిర్మలోదకము. తియ్యగా చల్లగా నుండును. ఒక్కొక్క ఆకుఅడుగున గ్యాలనులో ¼ వంతు నీరుండును. ప్రతిచెట్టులో అనగమను నాలుగుఆకులుండును. మండుకుపోవు ఆప్రదేశములో ఇది మనోహరముగ రమణీయముగనుండును. అచట ఉండు దేశీయులంతమకు నీరు గావలసినపుడు ఒక బాణముతో ఆకును పొడుతురు. ఆకు తమతలమీదుగానే యుండుటచే ఒక చెంబును ఆకు క్రిందుగా బట్టుదురు. నీరుకారుచున్నపుడు అది ఆచెంబులోపడును.

పరిహాసముచేయు చెట్టు

దీనినే క్యారికేచరుప్లాంటు అనెదరు. నలుపుతో గూడిన ఆకుపచ్చని ఆకులమీద వింతయగు పచ్చని గుర్తులుండును. వాటినిజూచువారిని వెక్కిరించుచున్నవా యన్నట్లుండు ముఖచిత్రములు ఆకులమీద కన్పించును.

మొదటి మూడురకముచెట్లను మనకున్న చెట్లను సమన్వయించితినిగాని ఇతరజాతులకు ఏమియుపోలిక లేదు. వృక్షశాస్త్రవిజ్ఞాన నిపుణులు ఈవిషయము నాలోచించి తెలుపగోరెదను. [జ. పా.]

ఈగలు

ఆస్ట్రేలియాలో సిడ్నినగరమున క్రిమిశాస్త్రజ్ఞులు ౩౦౦౦౦౦౦ ఈగలను లెక్కపెట్టిరి. రెండుసంవత్సరములలో రకమువారిగా ఈ ఈగలను ఏర్పాటుచేసిరి. గొఱ్ఱెలను బాధించుచుండ దానిని నివారణచేయుటకు ఇట్లు పూనుకొనిరి. ప్రతిసంవత్సరము వేలకొలది ఈజంతువులు చనిపోవుచున్నవని దానిని ఆపుటకు ఉపాయము కనుగొనుటకు ఈఎత్తు ఎత్తిరట. ఏసంవత్సరములో ఏమోస్తరు ఈగలు అభివృద్ధియగునో తెలిసికొనుమార్గమును దెలుపుచున్నారు. అయిదురకముల ఈగలను ఇంతవరకు ప్రత్యేకించిరి. వీటినిగుర్తించువారు రోజు ౧-కి ౧౦౦౦౦ ఈగలను రకమువారీగా ఏర్పాటు చేయగలరట. ఈ అయిదింటిలో రెండు గోధుమరంగుగాను మూడు ఆకుపచ్చరంగుగాను ఉండును. గోధుమరంగు ఈగకు రోమములతో గూడు కొన్న పొత్తికడుపుండును. ఇదియే ఆకుపచ్చవాటికి లేదు. మూడు ఆకుపచ్చని ఈగలలో ఒకటిచాలాచిన్నది. తెల్లనిముఖముండును. ఆస్ట్రేలియా కామన్వెల్తు

అంతటను ఈపరిశోధన శక్తి ఈగలను ధ్వంసముచేసినచో గొజైలమండలవారికి ప్రతిసంవత్సరము వేలకొలది ప్రాణములు మిగులును.

స్త్రీలకు ఇంటియందే విద్యను నేర్పుట

రజస్వలలయిన పెద్దపిల్లలకును, వితంతువులకును, సంసారముచేయు స్త్రీలకు నింటివద్దనే వ్రాయను, చదువను నేర్పుటకు పంజాబులో క్రొత్తగ నొకయుద్యమమును ఏర్పరిచిరని ఫార్వర్డుపత్రిక పంజాబు ప్రత్యేకవిలేఖకుడు వ్రాయుచున్నాడు. ౭౦ మంచి నీతిదాయకములగు పుస్తకములను చదువుకున్న స్త్రీకిచ్చి ప్రతిఇంటికి బంపి కావలసినవారికి ఇచ్చెదరట. ఈమె ఉచితముగ ఈపుస్తకములను ఇంటింటికి గొంపోవునట. డబ్బుఇవ్వనక్కరలేకయే స్త్రీలు ఈసంఘములో సభ్యత్వమును బొంది పంతికముచేసి తమకు కావలసిన పుస్తకములను తీసికొని చదువుకొనవచ్చును. ప్రతికోటున ఈపుస్తకములను కొంతకాల మగుసరికి మార్చి క్రొత్తపుస్తకములను సప్లయిచేసెదరు. లాహోరులో ఇట్లు ౧౬ సంచారకగ్రంథాలయములు ఏర్పడినవి. పంజాబురాష్ట్రమునందంతట నీయుద్యమమును వ్యాపింపచేయుటకు ప్రయత్నించుచున్నారు. స్త్రీలకు ప్రత్యేకముగ నుపయోగించుపత్రికలు, సంచికలు అందరికిని పంచి పెట్టెదరు. ఇట్లు ఒక్కొక్క గ్రంథాలయమునకు ఆదిలో ౧౦౦ రూపాయలు మాత్ర మగును.

పట్టణములో ప్రతివీధియందును పాఠములను చెప్పుటకు తరగతుల నేర్పరచెదరు. రజస్వలలై పాఠశాలకు బోవుటకు శంకించువారు, గృహిణులు, వితంతువులు ఎక్కడను బోకుండగనే నిత్యము ఇంటిలో కావలసిన చేతిపనులను, ఇతరకళలను తమకు తీరికయున్నప్పుడు నేర్చుకొనవచ్చును. ఇంటిలోపని అయిన పిదప నేర్చుకొనవచ్చును. ఇట్టి తరగతులను జయప్రదముగ సాగించితిమేని స్త్రీలను తమ ధర్మములను గ్రహించి, దేశసేవకు తోడ్పడునట్లు జేయగలము. దేశసేవకేకాక శిశుపోషణయందును, గృహకార్యభారనిర్వహణమందును నిపుణులగుదురు. నిత్యజీవితమున జరుగుసంగతులనే నేర్పెదరు కావున నేర్చుకొనుట ఉత్సాహముగ నుండును. కార్యక్రమము క్రియారూపమును దాల్చును. అందరిని ఆకర్షించును. పెక్కుమంది విద్యాధికులగు స్త్రీలు ఉచితముగ విద్యను గఱపుటకు ముందంజ వేయుచున్నారు. రోజు ౧-కి రెండుగంటలు నేర్పెదరు.

నేర్పువిషయములు

కుట్టుపని, గుడ్డలను కత్తిరించుతీరు, గుడ్డలమీద పువ్వులను తీగెలను అల్లుట, ఆటవస్తువులను చేయుట, జరీ చేయుట, నేతపని, ఇండ్లయందు ఆరోగ్యముగ నుండుటకు ఆరోగ్యశాస్త్రము, గృహోపచారచికిత్స, చదువు, వ్రాత, లెక్కలు, ముఖ్యముగ ధర్మములు; పరిపాలనవిధానమును మున్నగునవి నేర్పబడును. లాహోరులోనున్న సర్వెంట్సు ఆఫ్ ఇండియా సొసయిటీవారీపనికి పూనుకొని పంజాబులోనున్న సంఘసంస్కరణ సంఘమువారు తోడ్పడుచున్నారు.

ఈయుద్యమము ఎంతయు శ్లాఘ్యము. శిశుమరణములు తగ్గును. స్త్రీలలో దుర్బలలు తగ్గుదురు. జీవనోపాధికి ఒరులమీద ఆధారపడ నవసర ముండదు. సంఘము నీతిబాహ్యతనుండి వెలువడును. దేశారాధనకు సోదరీమణులెందరో తోడ్పడగలరు. ఈయుద్యమము నెరవేర్చినచో ప్రతి ఇల్లును భూలోకస్వర్గముగ ఏర్పడును.

ఇట్టి సంఘమును చెన్నరాజధానియందు గూడ నేర్పరచుటకు విద్యాధికులగు డాక్టరు ముద్దులక్ష్మమ్మ గారు మున్నగువారు పూనుకొన్న ఎంతయు బాగుండును. ఒక్కవిద్యాధికులేకాక మద్రాసురాజధానియందున్న సంఘసంస్కరణసంస్థలు, కాంగ్రెసు సంస్థలు, సర్వెంట్సు ఆఫ్ ఇండియా సొసయిటీవారును పూనుకొన్నచో దేశమున భాగ్యోదయమగును. స్త్రీలయందు విశాలభావము లుదయించును. రజస్వలానంతరవివాహము, బాలవితంతు సమస్యలు మున్నగునవి సులభముగ పరిష్కారము గాగలవు. వరదక్షిణల పిశాచము గూడ వదలును. కాంగ్రెసుసంస్థలు ఈయుద్యమమునకు తోడ్పడిన ఖద్దరు స్త్రీలలో తప్పక ప్రచారము గాంచును. స్త్రీలు అందరును ఖద్దరుమహత్తును గ్రహించినపుడే సత్వరస్వరాజ్య ప్రాప్తి గల్గును. ఇట్టి యుద్యమమును మన రాజధానియందుగూడ నెలకొల్పుటకు వెంటనే ప్రముఖులందరును పూనుకొనవలెను. పిఠాపురము మహారాజాగారు, డాక్టరు బెసంటుగారు మున్నగువారు మార్గదర్శకు లగుదురు గాక!

[జ. సా.]

అజంతా చిత్రములు



౧. విజయసింహుని సింహళప్రవేశము — క్రీ. పూ. ౫౪౪



౨. యుద్ధరంగము

అజంతాచిత్రములు



3. విజయుని పట్టాభిషేకము



ఆముక్తమాల్యద
సంజీవనీవ్యాఖ్యానసహితము

వ్యాఖ్యాత:—మహోపాధ్యాయ, కళాప్రపూర్ణ బిరుదాంచితులగు బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయశాస్త్రిలుగారు.

రాయలు ౮ పేజీలసైజున ౮౮౦ పేజీలు గల సంపుటము; క్యాలికో బైండు. వెల రు. ౮-౦-౦

విలాసము: గ్రంథకర్త పేర; నెం. ౮ మల్లికేశ్వర వీధి, ముత్యాలపేట, జార్జిటవును, మదరాసు.

కవిపండితపోషకుఁడును, బహుగ్రంథకర్తయు, భర్తయు నయి యాంధ్రభోజుఁడనఁ బ్రసిద్ధిగాంచిన విద్యానగరచక్రవర్తియగు శ్రీకృష్ణదేవరాయల కాలమున వెలసిన రసోత్తరప్రబంధములలో నెల్ల ప్రౌఢమయిన యీ యాముక్తమాల్యదకు నిరుపమానసంస్కృతాంధ్రాంగ్ల పాండితీమండితులును, సంస్కృతాంధ్ర వాఙ్మయ ప్రపంచమున నేబదిసంవత్సరములనుండి స్వతంత్రానువాద వ్యాఖ్యానరూపక గ్రంథములను పెక్కిటిని వెలయించిన ప్రతిభాశాలురును నగు శ్రీ వేంకటరాయశాస్త్రిలుగారియొక్క సిద్ధహస్తమునుండి బయలువెడలిన యీ సంజీవనీవ్యాఖ్యాన మాంధ్రవాణి చిరకాలమునుండి యాకాంక్షించుచుండిన యొకయుత్కృష్టాలంకారము. కడు వృద్ధులయ్యు, మందదృష్టులయ్యు, శ్రీ శాస్త్రిలుగారు దీక్షతో నీవ్యాఖ్యానమును రచియించి ప్రకటింపఁగల్గుటాంధ్రవాఙ్మయతత్త్వజిజ్ఞాసువుల భాగ్యఫలమనుట యతిశయోక్తి గాఁజాలదు. ఈయుత్తమగ్రంథమునకుసుస్వాగతమును జెప్పుభారము రసగ్రహణపారీణమగు నాంధ్రలోకముపైఁ గలదు.

ఉత్కృష్టకావ్యలక్షణసమంచితమును, నతిప్రౌఢమునునగు నీ యాముక్తమాల్యదయొక్క పూర్వపరిష్కారముల యందలి వ్యాఖ్యానములు బహుముఖముల నిండారియున్న కావ్యరస స్వరూపమును విస్తరించి సుగ్రహముగ వివరింపఁజాలనివిగను, అసంబద్ధములుగను, సమగ్రసంస్కరణాపేక్షితములుగను నుండుటచేత "నీ సమగ్ర సంస్కరణ—సాధుపాఠ నిర్ధారణ - దుర్వ్యాఖ్యావిషహరణ - సమంజసార్థావిష్కరణ - పూర్వోక్త విపులవ్యాఖ్యానమును" వీరు రచియించినారు.

శాస్త్రిలుగారి వ్యాఖ్యారచనావిధానమును వీరిదివఱకు రచియించి ప్రకటించి యాంధ్రలోకమునకుఁ బ్రసాదించిన శృంగారనైషధ వ్యాఖ్యానము చాటుచున్నది. ఆవ్యాఖ్యానము చూపియిచ్చుచున్న తత్కావ్యామృతరసమును సరసాంధ్రలోకము చవిచూచియేయున్నది. ఆముక్తమాల్యదావ్యాఖ్యానమును సైతము నట్టి సమీచీనవిధానము ననుసరించియే శాస్త్రిలుగారు రచించినారు. సంస్కృతాంధ్రవాఙ్మయముల యందలి ప్రామాణ్యగ్రంథములను పెక్కిటిని ఓర్పుమెయిఁ బరిశీలించి వానినుండి గైకొనిన బహుళప్రయోగములను బురస్కరించుకొని వీరిందు సాధ్వసాధుపాఠనిర్ణయమును, అర్థావిష్కరణమును గావించియున్నారు.

గ్రంథప్రాశస్త్యమును వెల్లడించుచు, పూర్వముద్రిత గ్రంథములసంస్కర్తలీగ్రంథముపై నారోపించిన దోషముల నుద్ఘాటించుచు సవిమర్శమును, సవిస్తరమును (౧౨౮ పుటలు) నగు పీఠికను వ్రాసి దీనితోఁ జేర్చినారు.

పూర్వముద్రిత గ్రంథముయొక్క "ఉపోద్ఘాతములో ఆముక్తమాల్యదను కృష్ణరాయప్రణీతత్వమును స్థాపించుటకై, అందులోనివి కన్ని సరు, హిండితశబ్దములు కన్నడపదములని వ్రాయఁబడియున్నవి......" అని వ్రాసి అవి కన్నడపదములు కావని సిద్ధాంతీకరించుచు 'హిండిత' శబ్దవిషయమై శాస్త్రిలుగారొసఁగిన యీ క్రింది ప్రయోగబాహుళ్యమువలన వీరు గావించిన సంస్కృతాంధ్రవాఙ్మయపరిశీలనక్రమము గోచరము కాఁగలదు.

"హింసితము.—ఇది పిండిత మనుటకు కన్నడమా? చూ.

'ఖండితపూగీనాగర
ఖండంబులు ఘనశశాంక ఖండంబులచే
హిండితములు గావించి యు
ఖండస్థిర భక్తి నొసఁగి కదలి చెలులతోఁ.'

ఈ పద్యములో ఆరొసఁగిన వస్తు వేదో లేదు. వ్రాఁతలలో మాఱిపోయినది గావలయు. 'హింసిత మగు తాంబూల మఖండ' అని పఠించినయెడల తాంబూలము దొరకును.—[టీక. హిండితములు గావించి = కలియఁ గూర్చి.] ఇందే 'పరిహిండితంబును' 'హిండన'యుం 'గండ పెండెరంబునం బొడము నఖండ ప్రభామండలంబునం బరిహిండితంబులై మల్లిపండుల వసువు గల మడమల చెసంగుపడి భావి నిజ కవతారావతార సూచకంబు లంబోలెఁ గొదమ తాఁబేళ్ల మీళ్లనగు మీఁగాళ్లతో'—౬ (౯౨). [టీక.—మండలంబునన్ = సమూహముచేత-పరిహిండితంబులై.]

'కొండయుఁబోలె భక్తి వలగొంచును వాఁడు నిజ ద్రుమభ్రమీ, హిండన వ్రాలుపాకలఫు లీనఁగువోలె నొసత్తపంక్షములఁ, దుండ రొవల్మహోగిరులు పోరవఁ బ్రస్తుతివ్రాలి'—౬ (౪౩.)

[టీక.—భ్రమీ=మట్టు తిరుగుటయొక్క - హిండనన్=తివృత్తిచేత.]

మను. ౪(౬౦) లో 'వెండికొండలఁ జండకరకర హిండనంబునం బాంసుప్రభలు నిండ.' [కర=కిరణములయొక్క - హిండనంబునన్=వ్యాపనచేత.]

శ్రీకాళహస్తిమాహాత్మ్యములో [దాసిని రాజులల గోరిగింపఁగా దానిశిరమునం దవ్యక్తలింగము పరమశివుఁడు హస్తమును ఉంపఁగా,] ౧(౫౫, ౫౩)

ఉ. 'ఎత్తిన నింద్రజాలకుఁడెత్తినబర్హ మనంగ, మన్మథుం - డెత్తిన పువ్వుటింటిమద మెత్తినకుమ్మెద పింఛునారి నాఁ, జిత్తజరాజ్యలక్ష్మి కభిషేకము సేయ శివుండు కాంతకై, యెత్తిన నీలకుంభరుచి హిండనమో యన నద్భుతంబుగాన్'

క. 'నెఱి మిగులఁ గలిగి నలుపై
తెఱచై మదనప్రతాప దావాగ్నిశిఖన్
మెఱయు నవధూమ మనఁగాఁ
దొఱఁగఁ గచభరము వన్నె దేవునికరుణన్.'

మఱియు దశావతారచరిత్ర-నృసింహావతార కథలో—

'చండవాతోత్థ ధూరజోహిండనమునఁ
గొండమెండునఁ గదలక యుండు దైత్య
మండలేంద్రుని దేహ ముద్దండముగను
గండకండూతి నొరయుచేసండగాను.' పు. ౭౯.

పారిజాతాపహరణచంపువు (౩ పు.)-౧ (౧౩-౧౪) లకు నడిమిగద్యలో—'ప్రచణ్డ భుజదణ్డ చణ్డ మాకర్ణకుణ్డలిత కోదణ్డ హిణ్డమాన కాణ్డప్రకాణ్డ తాణ్డవాడమ్బరోద్దణ్డ ఖణ్డితారిముణ్డ పుణ్డరీక ఖ(వ?)ణ్డ మణ్డితాఖణ్డ భూమణ్డలః'—

'పక్షిణ ఆహిణ్డన్తి' స్వప్నవాసవదత్త; 'ఇతస్తతో హ్యాహిణ్డన్తే' మృచ్ఛకటీ.

'అశ్మాత్యంత కఠోరమూర్తులు మహాహాలాహలజ్వాలధూమ్రమశ్మశ్రులు భుజదండ హిండితకుఠారప్రాసఖడ్గాగ్రోగ్రులు, రక్తవ్రాతముతోడ వెల్వడిరి రుద్రక్రూరగాత్రంబునన్, గూశ్మాండాగ్నివశీ (?) పిశాచగణరక్షోభూతభేతాళముల్.' వరాహ. ౫ (౧౦౬)

'మండువా రిడెంపకోట మాహు రాదిమేదినీ
మండలేశ్వరస్తుతాస మానమానుషోదయా
భండనాజితప్రచండ పటహ (వాద్య?) నిస్వనార్భటీ
హిండితాష్టదిక్కుడుంగ యీశ్వరాత్మసంభవా'—
,,—౧(౧౫౪)

'సంధ్యాతాండవ చండఖండపరశు స్ఫాయజ్జటామండలీ, సంధ్యాహిండితగాంగభంగజమిథ స్స్వంభుర్ణ పుండీకృతా, వంధ్యారావ ఘుమంఘుమోన్మితసన్య గ్యాచాలపుణ్యాకృతీ, వింధ్యక్ష్మాధరకూటకోటివివర ద్విద్వేషియోషిత్ త్రతీ.' కువలయాశ్వ. ౪(౨౧౬)

'తాండవఖేలనోద్దండ ఖండపరశు జటామండలాగ్ర హిండమాన పుండరీక' ౧(౧౬)

'హిండనము. సం. వి. అ. న ౧. వ్యాప్తి, ౨. భ్రమణము; 3. సురకము,' శ. ర.

'హిండితము. సం. విణ. (అ. ఆ. అ.) వ్యాపించినది.' శ. ర.

"హిండనము N. S. spread, extension. wandering; వ్యాప్తి, ప్రసరించడము, తిరగడము, (హిండనము, రతే, లేఖనే, † Sc) Swa. ౪(౬౦) 'జండీకొండ' [ఇత్యాది పూర్వోదాహృతము.] Calahasti mahatyam ౧(౬౦) 'నీలరుచి హిండనమో యన.' A. ౬(౫౭) 'నిజద్రుమభ్రమిహిండనభ్రాలు పాకలపుకేనుగుడోల"-బ్రౌన్యము.

'హిండితము-వ్యాపించే, తిరిగే,[ఇట్లర్థము వ్రాసి బ్రౌనుదొరగారు అందులకు తారాశశాంకవిజయము ౧(౬౫), వసుచరిత్ర ౬(౬౦),అను సంఖ్యలతో 'హిండితకీర్తియుక్తి', 'మదాకరవంశ హిండితంబు' అను ప్రయోగములను, ఆముక్తమాల్యదలోని 'ఖండిత పూగీనాగ' రేత్యాదిపద్యమును-ఉదాహరించినారు.] [హిండితములు గావించి=సమ్మేళనముచేసి అని వారిటీక.]

ఆతారాశశాంక పద్యము:—

'పండిత మండలీహృదయ పంకజభానుఁడు బుచ్చి కృష్ణయార్యుఁడు సుసీమార మణియుఁ దొలి నోమిన నోముపంటగా - హిండితకీర్తియుక్తి జనియించెను వేంకటరాఘవాహ్వయం - డ్రుండు విభాసమాన గుణ రుంద్రుఁడు వంగలవంశ చంద్రుఁడై.'

ఆ వసుచరిత్ర ప్రయోగపాదము:—

'మాణిక్యసారంబు లాణిముత్తెములు సు
మ్మిన్నవి మదాకరవంశ హిండితములు' ౬(౩౬)

[దీనిటీక.—'ఇవి-మదాకర=నాకు ఆకరమైన-వంశ=కులమందు-హిండితములు వర్ధమానము=ప్రసమ్ములైనవిసుమాయనియర్థము. మత్=నాసంబంధమయిన-ఆకర=గనులయందును-వంశ=వెదుళ్లయందును-ప్రవర్ధమానములైనవి-అని యర్థాంతరము.']

'మన్మథః—సఖే సాంఖ్యాయన, విప్రలబ్ధోఽసి పూర్వేద్యు ర్గ్రగభోజనసముత్సాహేన యన్నద్యస్తం దర్శనీయం త్వయా.

'విదూషకః—వయస్య, త్వయా తావత్ అనుధ్యాన్నం వృక్షం వృక్షం ప్రతి హిణ్డమానేన బుభుక్షా పరిశుష్కముఖేన సమాసాదితం సౌహిత్యమ్' రతిమన్మథ.

'నారదః - దమ్పత్యో ర్యనురక్తయోరపి మిషాత్ సంపాదితం వాకలిం, ప్రకాన్తం సహసా నియుద్ధమథవా శిష్యైస్త్వలైః ర్బాలకైః, ఉత్ఫ్లోవాథ నతు వ్యర్థేఽధిపతితో యోద్ధుం విషాణోద్ధురాన్, పశ్య న్నిర్వృత మానసోఽ సతతం హిణ్డే మహీమణ్డలే'

—॥— భా.

'విదూషకః వనరాజి ష్వాహిణ్డిత్వే అటవీతోటీమ్,' కౌముదీల.

'విదూషకః - భా. త్వం తావత్ అటవీతః అటవీ మాహిణ్డమానః శర వాసికామివ లోలుపస్య కస్యచి జీర్ణ ర స్య ముఖే నిపతిష్యసి'—

'అవికుణ్ఠవేగ హయమణ్డలికా, ఖురమణ్డ తాణ్డవిత మణ్డశతమ్, భుజదణ్డ కుణ్డలిత చణ్డధను, శ్చ్యుతికాణ్డ హిణ్డిత విశుణ్డగజమ్.' అచ్యుతరాయ 4 (17).

[టీక.–కాణ్డైర్బాణైః శిణ్డితాః దూరతో నిరస్తాః విశుణ్డా ఛిన్నకరాః గజాః యస్మిం స్తత్.] 'త్వం తావ న్మత్తోఽ త్రాహిణ్డసే.' ప్రతిజ్ఞాయౌగన్ధరాయణ.

హాలాయుధుని కవిరహస్యమునందు—

'హిణ్డన్తే యే మృషా రాత్రౌ పరస్త్రీషుహిణ్డ న్తియే,
హేడతే నీతిసంపన్నో దానవా నపి తా నసౌ.'

'అయి కురఙ్గి, కిమకాణ్డ మిత స్తతో హిణ్డసే.' యశస్తిలక. 2 (350 పు)

ఈప్రమాణమువలన 'హిండితములు' అనుపదమునకు 'వ్యాప్తములు' అని యర్థమనియు, 'శశాంక ఖండంబులచే హిండితములు గావించి' అనఁగా 'కర్పూరఖండనియలతో మిశ్రము చేసి' అని భావమనియు, స్పష్ట

ము. 'ఖండంబులచే' అను పదమందలి 'చేత' ప్రత్యయము కర్తను తెలుపుచున్నది. 'హిండితము' లో కర్మార్థమందు క్తప్రత్యయము. 'హిండితము' నకు అవ్యుత్పన్న కర్ణాటకపదముగా 'హార్చుట' యర్థమేని, 'ఖండంబుల ఘనశశాంకఖండంబులనూ' అని ద్వితీయయేని, 'ఘనశశాంక ఖండంబులతో' అని తృతీయయేని, ప్రయుక్తమై యుండును. మఱియు, అన్యదేశ్యమునకు 'పరి' యని యుపసర్గమయినెటు వచ్చునో? 'పరిహిండితంబులు,' 'జటామండలీ సంధ్యాహిండిత గాంగభంగ' అను స్థలములందు సంస్కృతసమాసములో ఇది యెట్లు చేరును. ఆకర్ణాటకకవిసాధారణంబును అగు నీపదముచే కర్ణాటక కవిని సాధించుట శక్యము గాదు."

దీనినిఁగాంచిన 'పండితమానులకండె నీటు'గాదా!

ఇట్లే కొన్ని పదములను ఏఱి, యఱువది దనుకను ప్రయోగముల నుదహరించి చూపియున్నారు.

ఈక్రింద నుదాహృతమైన వ్యాఖ్యానభాగమును పరికించిన …యేదెల శాస్త్రులుగారి సర్వతోముఖపాండిత్యము, అద్భుతమేధాశక్తియు వెల్లడికాఁగలవు.

ఉ. కర్కశుఁ డంబు కోర్వ, నుదకంబులు వాఃపతి నూర్చి
నట్లు నయ్యర్కుఁడుఁ దానుఁ నూర్చి, మఱి యా సలి
లాధిపచిహ్న వాహతం, బేర్కొలగంగ నాఁ డెలమి
నక్రరతిఁ గన్న నీర్ష్యఁ దాఁ, గర్కటకస్థుఁ డయ్యె
నవఁ గర్కటకస్థితిఁ గాంచె నర్తలిన్.

అర్తలిన్=గ్రీష్మసమయసంతరంబున, అర్కుఁడు = సూర్యుఁడు, కర్కశుఁడు అంటకున్ = తాను (సూర్యుఁడు) తీక్ష్ణుఁడు అని లోకులు పలుకుటను, ఓర్వక=సహింపక, వాఃపతి=వరుణుఁడు, ఉదకంబులు= జలములను, నూర్చినట్లు=కూడఁబెట్టినరీతిగా, తానున్= సూర్యుఁడును, నూర్చి=ఆవిరిరూపమున సేకరించుకొని, మఱి=ఇంక, ఆతఁడు=ఆవరుణుఁడు, ఆ-స...లిన్-సలిలాధిప = వరుణునియొక్క - చిహ్న=గుర్తయిన మొసలి- వాహతన్=తనకు వాహనము గాఁగలది, అని, పేరు= నామము, కల గంగన్=నహించినదైన (ప్రసిద్ధమైన) గంగానదియందు, ఎలమిన్=ప్రీతితో, మకరస్థితిన్=మొసలియందు ఉనికిని, కన్నన్=పొందఁగా, ఈర్ష్యన్=వరుణునిమీఁద నీసు వహించి, తాన్=సూర్యుఁడు, కర్కటకస్థుఁడు=ఎండ్రిదియందు ఉన్నవాఁడు, అయ్యెన్, అనన్ =అనునట్లుగా, ఎలమిన్=ప్రీతితో, కర్కటకస్థితిన్= కర్కటకరాశియందు ఉండుటను, కాంచెన్=పొందెను.

ఆ వెట్టినపు టెండల తర్వాత సూర్యుఁడు కర్కటక రాశికి వచ్చుట యెట్లుండెననన-సూర్యునికి ఆగ్రీష్మకాలమందు క్రూరుఁ డనునింద రాఁగా, ఆతఁడు దానికి కంటగించి, వరుణునికి వచ్చిన చల్లనివాఁడ యను పేరు తానును తెచ్చుకొనఁ గోరినవాఁడై, ఆవరుణుఁడు ఎట్లుగా, 'నదీనాం సాగరో గతిః' అన్నప్రకారము నదులన్నియు సముద్రమునఁ బడుటం జేసి, సముద్రరూపమున జలములను కూడఁబెట్టుకొనునో, అట్లే తానును పుడమిలోని నదులు, చెఱువులు లోనగు జలాశయముల జలమునెల్ల ఆవిరిరూపమున మింటం గూడఁ బెట్టుకొన్నవాఁడై, అంతటితో తనియక ఆవరుణునితో ఇంకను పోటికై ఆవరుణుఁడు గంగలో గంగకు వాహనమైన మకరము తనకును వాహనముగుటచేత గంగయందు సుఖముగా నుండఁగా, (సూర్యుఁడు) తానును గంగ చెంత మొసలివలెనే జలజంతువైన కర్కటకమందుఁ బ్రవేశించి సుఖముగా నున్నాఁడో యనునట్లుండెను. వర్షర్తువు వచ్చెనని భావము. ఉత్ప్రేక్షాలంకారము.

'కర్కశుఁడు'-'కర్కశో నిర్దయః క్రూరః ఖరస్పర్శశ్చ సాహసీ' నానా. 'వాఃపతి' - 'సలిలాధిప'- సముద్రవరుణ పర్యాయములలో 'ప్రచేతా వరుణః పాశీ యాదసాంపతి రప్పతిః' అని అమ. 'అర్కుఁడు' - 'అర్కో౽ర్క మఘోని స్ఫటికే జ్యేష్ఠభ్రాతరి భాస్కరే' నానా. - 'సలిలాధిపచిహ్న' - వరుణునికిని సముద్రునికిని మకరము చిహ్నము, అయినను ఇట వరుణచిహ్నార్థమే ఉచితతరముగా, గనఁబడుచున్నది.

'సంప్రాప్తం మకరధ్వజేన మథనం త్వత్తో మదర్థే పురా, తద్యుక్తం బహుమార్గగాం మమపురో నిర్లజ్జ వోఢుం స్తవ, తామే వామనయస్వభావకుటిలాం, హే కృష్ణకణ్ఠగ్రహం, ముఞ్చేత్యాహ రుషా యమద్రితనయా లక్ష్మీశ్చ పాయాత్స నః.' రత్నావళి.

వేల్పులకు ప్రాయికముగా వాహనమే ధ్వజము-

ఉ. గరుడధ్వజుఁడు, వృషధ్వజుఁడు. వరుణునికి మొసలి వాహనంబును, సితమును.

మ. వరుదీశద్వీపదానశోభ, శిఖిధూమ్యాశోచిః, గీవాశికా - పరదేహప్రభ, రాక్షసాళితిలకాంచద్దీధితిన్, వారిధీ - శ్వరకేతుద్యుతి, మాతరిశ్వ హరిణచ్ఛాయన్, ధనాధ్యక్షునీ - లరుచిన్, ధూర్జటికంఠకాంతిఁ దమముల్ వ్యాపించె దిక్ప్రాంతులన్. పారి. 4(46).

'చిహ్న'-'కళఙ్కాఙ్కౌ-లాఞ్ఛనం చ చిహ్నం లక్ష్మ చ లక్షణమ్' అమ. 'చిహ్నం లక్ష్మ పతాకయోః' మేదిని. 'వాజి వాహార్వ గన్ధర్వ హయ సైన్ధవ సప్తయః' అమ. 'ఆసలిలాధిపచిహ్నవాహతం బేర్కుల గంగన్'- ఈసమాసమున ఆశబ్దము గంగకు విశేషణము. నడుమ వ్యస్తపదంబుల కలిమికి; ప్రౌఢవ్యా. సమాస. ౧౨ వ సూ. ను జూచునది. అందు 'ఈ కన్నులు తెలివని శిశువు' భోజ. ౬ ఆ. అని, త్రికమునకును, 'గగనమనురుద్రభూమి నేకతమ తిరుగ నదరులుమిసెడు కీలివదయ్యంబు వీఁడె' అని నైష. ౨. ఆ., 'బలిమి గఁజేరుచిన్ గెలిచి బాగుగఁ గొన్న రవిప్రకాశమై యలరుచునున్న పుష్పకమునందు రమింపుము కోర్కు లారఁగన్.' రామా. ఆర. ౨ ఆ.. అని ధాతుజవిశేషణములకును, ప్రయోగములం జూపినారు. మకరము గంగకు వాహనమనుటకు- 'మకరేశ్వర పృష్ఠాధిశయితే చరణాకిసలయే' అని గంగాస్తుతిలో, క. క. ల.

'ఆలిఖ్య సఖ్యాః కుచపత్త్రభఙ్గీ
మధ్యే సుమధ్యా మకరం కరేణ,
యత్రాలపత్తా మిన మాళి యానం
మన్యేత్వదేకావలి నాకనద్యాః.' నైష. 6 (69)

అందు టీకలలో మల్లినాథనారాయణులు 'గఙ్గా మకరవాహినీ ఇతి ప్రసిద్ధిః' అని వర్ణించినారు. వరుణునికి మకరము వాహనము-'వరుణాయ జలాధిపతయే మకరవాహనాయ పాశహస్తాయ' అని వరుణప్రార్థనగతము.

'వనోద్య దమ్భోధరఘోరదర్శనే
యుద్ధాయ రూఢో మకరే మహత్తరే,
దుర్వారపాశో వరుణోరణోల్బణ
స్తమన్వియాయ త్రిపురాన్తకాత్మజమ్.' కుమార.4(9)

గంగయందు తద్వాహనము మకర మున్నది గాన మకర వాహనుఁడు వరుణుఁడు మన్నాఁడనుట. అట్లు గంగయందు సూర్యుఁడు లేఁడే యన్న? 'గంగన్' అనఁగా ఈపక్షమందు 'గంగాయాం ఘోషః'అనువాక్యమందుం బోలె 'గంగకడ' అని సామీప్యార్థమును చెప్పవలయును. మఱియు నిట నదిలోనికర్కటకమునకును కర్కటకరాశికిని అభేదోపచారము. నాలుగు వ్రాఁతప్రతులయందు ఇతరత్ర భేదములు మెండుగానేయున్నను, ఇచట మాత్రము పాఠము 'పేర్కుల గంగ' అనియే యున్నది.

'సితమకరనిషణ్ణాం శుక్లవర్ణాం త్రినేత్రాం
కరధృతకమలోద్యత్సూత్పలాభీష్టముద్రామ్,
విధిహరిహరరూపాం సేన్దుకోటీరచూడామ్
కలితసితదుకూలాం జాహ్నవీం త్వాం నమామి.'
గంగాధ్యానము."

ఆముక్తమాల్యదకర్తృవిషయమై శాస్త్రిులుగారిందు ముక్తకంఠముగ నెట్టిసిద్ధాంతమును గావింపక "సర్వజ్ఞులైన పెద్దలు ఈవిషయమున పరమసిద్ధాంతమును నెలకొల్పుదురు గాక" యనిరి. కాని, వీరు పీఠికయొక్క ఉపసంహారమునఁ గృష్ణదేవరాయకర్తృత్వవాదమును బూర్వపక్షముచేయుటకై కావించిన విపుల చర్చ, 'తారుణ్యాతిగ' (ఆ. ౨-౬౭) అనుపద్యమందలి 'మాత్స్యచ్ఛేదపాక' విషయికమయిన చర్చ, ఈగ్రంథమునుండియే యేర్పరిచూపిన 'సాజముగ కృష్ణదేవరాయని కలవడని వర్ణనలు', కృష్ణదేవరాయకృతములుగ 'పరీక్షితు క్షోణిపాలు' అనుపద్యమునఁ జేర్కొనఁబడిన 'సత్యావధూపరిణయ', 'రసమంజరీ' కావ్యములు అల్లసాని పెద్దనార్యకృతములుగఁ జెప్పిన 'ప్రపంచదర్పణ' మను సంస్కృతగ్రంథవృత్తాంతము, ఆంధ్రపత్రికయందు వెనుక బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిులుగారు ప్రకటించిన వ్యాసప్రస్తావన మొదలయినవి "ఆముక్తము పెద్దనప్రణీతమను నాభాణకమునకే కైదండ యొసంగుచున్నవి."

పూర్వవ్యాఖ్యానము లేవియు నందఁగా నడవని యేరతొల్కుసూక్తి తిమూలాధారముగు విశిష్టాద్వైతతత్త్వమును శాస్త్రిులుగారు వైదికపౌరాణికప్రమాణపూర్వకముగ మూడవయాశ్వాసము నందలి విష్ణుచిత్తవాద, అన్యమతఖండన, ఖాండిక్యకేశిధ్వజసంవాదముల వ్యాఖ్యానమున లెస్సవివరించియున్నారు.

'ఈవ్యాఖ్యానముఁ పూర్తిజెందిన యిప్పటి కయినదా కాంగ్లేయులీనాఁడు ప్రకటితమగుటయు, శాస్త్రిగారే తాము 'ఇన్నికడగండ్లపాలయితి' నని చెప్పుటయు, నాంధ్రలోకమునకుఁ గలవాఙ్మయాభి మానమును జాటుచున్నది. ఐననేమి? గ్రంథపారమ్యమును గుర్తించి యిప్పటికయినను బ్రకటితమగుటకు యథాశక్తిని దోడ్పడిన వదాన్యులగు పలువురు రసికులకు ధన్యవాదముల నర్పించుట సముచితము. సాహితీసంపన్నులతోపాటు సంపన్నులను నడుముకట్టి కట్టిప్రయత్నములను గావించిననే కాని సర్వతోముఖసాహిత్యాభివృద్ధి కాఁజాదు?

'అలఁతిసేవకె తనిసెడుఁడీ యన్నలార' యని శాస్త్రులుగారు నుడివిరి. కాని, యట్లు తలఁప నెవ్వరు సాహసింతురు? ఇది యత్యధికమగు సేవ గాక 'అలఁతిసేవ' యెట్లగును? శాస్త్రులుగారి యిట్టి యుత్కృష్టసేవను బడసి యాంధ్రభారతీదేవి ధన్యురాలయినది. ఇంకను జిరకాల మాతల్లి శాస్త్రులుగారివలన నితోధిక సేవనుబడయుచుండ 'మాల్యము దాల్చి పతికిసుమాతను' మెచ్చిన శ్రీరంగనాథస్వామి వారి కాయురారోగ్యములను బ్రసాదించి యనుగ్రహించుఁ గాక!

* * * *

బసవపురాణము (ద్విపద)

[ఆంధ్రగ్రంథమాలయందు ద్వితీయకుసుమము.]

కర్త:—ప్రాచీనాంధ్రకవి పండిత లోకమునఁ బేరుగన్న పాల్కురికి సోమనాథుఁడు.

పరిష్కర్త:—అర్వాచీనాంధ్రకవి పండిత లోకమునఁ బేరుగన్న బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు.

రాయలుసైజున ౪౩౦ పేజీలు గలవు. వెల రు. ౨-౦-౦ మాత్రము.

విలాసము:—ఆంధ్ర గ్రంథమాల, నెం. 7, తంబుశెట్టివీధి, మద్రాసు.

శివపారమ్యమును బ్రతిపాదించు నాంధ్రగ్రంథములలో నుత్తమమనఁదగు నీబసవపురాణము నందీశ్వరుని యవతారమని వీరశైవులు విశ్వసించిన బసవేశ్వరుని యొక్క చరిత్రము ప్రధానేతివృత్తముగాఁ గలది. అనుప్రసక్తములుగ నాంధ్రద్రావిడ కర్ణాటమహారాష్ట్రదేశములకుఁ జెందినవారును, బసవేశ్వరునకుఁ బూర్వులును, సమకాలికులును నగు శివభక్తులయొక్క చరిత్రములును నుపకథలుగ నిందువర్ణితములైనవి. క్రీ. శ. ౧౧౫౬ మొదలు ౧౧౬౭ వఱకుఁ గల్యాణకటకము రాజధానిగఁ బశ్చిమచాళుక్యరాజ్యమును బరిపాలించిన 'కలచుర్య' రాజగు బిజ్జలునియొద్ద బసవేశ్వరుని మేనమామయగు బలదేవమంత్రి దండనాయకుఁడుగా నుండి మృతుఁడు కాఁగా బిజ్జలుఁడు బసవేశ్వరుని రప్పించి యాదండనాయకపదము ననుగ్రహించెను. కర్ణాటదేశమున వేరుపాటుకొనియున్న జైనశైవమతములకు ద్వేషము ప్రబలి పరస్పరము రూపుమాపుకొనఁజూచుచున్న యాకాలమున బసవేశ్వరుఁడు జైనమతము నడఁగార్చి, వీరశైవమతమును బెంపొందించి, స్థిరముగ నెలకొల్పినాఁడు. కాన నీబసవపురాణమును శైవులు గొప్పమతగ్రంథముగఁ బరిగణించి యారాధించువారు. ఈగ్రంథ మాంధ్రభాషయందు వెలసినను శైవమతప్రతిపాదకగ్రంథ మగుటచే నాంధ్రదేశమునకంటె వీరశైవము మిక్కిలిగా వ్యాపించియున్న కర్ణాటదేశమున మిగులఁ బ్రచారమును గాంచినది.

తొలుకొత్త బసవేశ్వరుని చరిత్రము నిట్లు 'బసవపురాణ' మను పేరఁ దెలుఁగున రచియించిన యాతఁడే సోమనాథకవియే. ఈతఁడు క్రీ.శ. పన్నెండవశతాబ్దాంతమున (క్రీ. ౧౧౯౦ ప్రాంతముల) నుండినవాఁడు. శైవేతరుల మొగముసైనఁ జూడ నిచ్చగింపని వీరశైవుఁడీతఁడు; సంస్కృతాంధ్రకర్ణాటభాషాకోవిదుఁడు; వీరశైవమతప్రవర్తకులలో నొకఁడుగఁ బేరుగన్నవాఁడు; బహుగ్రంథకర్త.

"శ్రీ బసవపురాణంబు, పండితారాధ్యుల
చరితంబు, ననుభవసారమును, జ
తుర్వేదసార సూక్తులు, సోమనాథభా
ష్యమ్ము, శ్రీరుద్రభాష్యమ్ము, బసవ
రగడ, గంగోత్పత్తిరగడ, శ్రీబసవాఢ్య
రగడయు, సద్గురురగడ, చెన్న
మల్లు సీసములు, నమస్కారగద్య, వృ
షాధిపశతకంబు, నక్షరాంక

> గద్యపద్యముల్, పంచప్రకారగద్య,
> యష్టకము, పంచకము, నుదాహరణయుగము
> నాదియగుకృతు"

లీతఁడు రచించినవి. వానిలోఁ గొన్ని తెలుఁగుకృతులు; కొన్ని సంస్కృతకృతులు; తక్కినవి కర్ణాటకృతులు. ఇన్నియు శివపారమ్యమును, శైవమతాధిక్యమును బ్రతిపాదించునవి. ఈతని తెలుఁగుకృతులలో ద్విపదకృతి యగు పండితారాధ్యచరిత్రము గొప్పది. తరువాతి పెన్నఁ దగినది యీ బసవపురాణమే. సోమనాథుని పేరనుగూడఁ గొన్నికృతులు గలవు. తొలుతఁ దెలుఁగున వెలసిన యీ బసవపురాణమునకుఁ గ్రమముగ సంస్కృత ద్రావిడ కర్ణాటాదిభాషలయందుఁ బెక్కెన వాదములు బయలువెడలినవి. మఱియు నింకొక భక్తుల యుపాఖ్యానము లెన్నియో వర్వేలుగ ద్విపదపద్యప్రబంధములరూపమును దాల్చినవి. దీనిని సోమనాథునకుఁ దరువాతివారగు పెక్కు రాంధ్రకవులు ద్విపదపద్యకృతులుగను, శతకగానములుగను రచియించినారు. వీర శైవమతమువారికీ బసవపురాణము పారాయణ గ్రంథము కావున పరస్పర ప్రతులుగఁ బుట్టిన వేలకొలఁది ప్రతికలు క్రమముగ నవ్యుత్పన్న లేఖక ప్రమాదజనితదోషదూషితములుగాఁ జొచ్చినవి ముద్రణాదిసౌకర్యములు లభించినతరువాత నిటీవల నొండు రెండుమారులు భిన్న భిన్న కాలముల ముద్రితమయిన గ్రంథము సైతముఁ దద్దోషములకు దూరముగాకుండినది. ఆంధ్రవాఙ్మయమునకు మూలాధారమగు ప్రాచీన గ్రంథమయినను దోషభూయిష్ఠమగు స్థితికి వచ్చుటచే సర్వాచీన శ్రీగ్రంథప్రాశస్త్యమును, ప్రామాణ్యమును నంతగా గుర్తింపఁజాలకపోవుట వింతగాదు.

ఇపు డీగ్రంథమును బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు భిన్నభిన్నప్రాంతముల నుపలబ్ధములయిన బహుతాళపత్రమాతృకలను బరిశీలించి సముచితరీతిని బరిష్కరించియు, సర్వతోముఖగ్రంథవిమర్శనమును, విపులమును (౧౦౦ — పేజీలు), అమూల్యమును నగు పీఠికను రచియించి యిందుఁ జొందించియు నిట్లు క్రొత్త వెలయించి యాంధ్రవాఙ్మయమునకు మహోపకారమును గావించినారు. పరిష్కరణావసరలబ్ధములు, కతిపయాంతరగ్రాహ్యములు నగు పాఠాంతరములను మూలముతోఁ జేర్చినారు. పీఠికయందు శ్రీశాస్త్రిగారు కవికాల కులగోత్రములు, గ్రంథరచనాకాలము, బసవేశ్వరచరిత్రము, కాలము, బిజ్జలునిచరిత్రము, కాలము, బసవేశ్వరునిసమకాలము వారలచరిత్రము, శైవమతస్వరూపము, తద్వ్యాప్తి, వీరశైవమతప్రారంభకాలము బసవపురాణమునవర్ణింపఁబడిన ప్రాచీన భక్తులయొక్క ఆధారాంతరోపలబ్ధచరిత్రములు మొదలగు విషయములను శాసనాదులను, సంస్కృతాంధ్ర ద్రావిడ కర్ణాటాదివాఙ్మయములను బరిశోధించి వానివలన లభించిన యాధారములను బ్రమాణముగాఁ గొని సయుక్తికముగను, సమంజసముగను జర్చించి సిద్ధాంతీకరించినారు. గ్రంథమును విమర్శించుచు, కవియొక్క ఛందస్స్వాతంత్ర్యము, గ్రంథమునందలి యతిప్రాసవిశేషములు, అపూర్వప్రయోగములు, శబ్దవిశేషములు, ప్రాంతపలుకుబళ్లు మొదలయిన విషయములను జక్కఁగాఁ జర్చించి తమపాండిత్యప్రకర్షను జాటినారు. ఇదివఱకు సాధువులనియు వానిలో చితముగ కొందఱు ప్రాచీనులు, సర్వాచీనులు పెట్టివైచినఛందో వ్యాకరణాది విశేషములు, శబ్దస్వరూపములు, పలుకుఁబళ్లు సాధువులేయని యమూల్యమగు నీ బసవపురాణ పరిశీలనమువలనఁ దేలుచున్నది. ఈసిద్ధాంతము లనావశ్యకములగు పెక్కు నిర్బంధములచేఁ గట్టువడియున్న తెలుఁగుభాషయొక్క వికాసమున కెంతయు నుపకరించునది. ఈరూపకారము శాస్త్రిగారి పరిశ్రమయూలాగ మగుట సునిశ్చయము.

శ్రీ శాస్త్రిగారు పీఠికయందుఁ గావించిన పారస్పరతివిమయిక విమర్శావిధానమునకు రెండుదాహరణములు:

౧. గ్రంథమునందలి యసాధారణప్రయోగశబ్దములను జర్చించుచు 'తొంగిళ్లు' అను శబ్దమునుగూర్చి యిట్లు వ్రాసిరి:—"తొంగిళ్లు శ.ర.లో నీపదమునకు నీటిబొట్లు, నూనెబొట్లు అని యర్థము కలదు. భల్లాణచరిత్రలో నివిగా బసవపురాణములోని యీ ద్విపదలే యపపాఠములతో నందుదాహృతము లయ్యెను. (శబ్దరత్నాకరమునఁ బెక్కుపట్టుల బసవపురాణ పండితారాధ్య చరిత్రములలోని ద్విపదలే భల్లాణచరిత్ర ద్విపదభాగవత పతివ్రతాచరిత్రములలో నివిగా నుదహరింపఁబడినవి. ఆ కడ ద్విపద లాయా గ్రంథములందు నాకుఁ గానరాలేదు. శ. ర. లో గ్రంథ సంకేత వివరణ పట్టికలో భల్లాణచరిత్రము వాలేశ్వరుని

దిగాఁ జెప్పఁబడినది. పాలేశ్వరునిది పద్యకృతి.) ఇక్కడ ముద్రితమయిన పాఠమును శే. క. పాఠమును జూచినఁ దెలియఁగలదు. తలంటునప్పుడు పసిబిడ్డలఁ బండుకొనఁబెట్టుటకయి చాఁచిన యూరుద్వయమునకుఁ దొంగిళ్లని పేరు. 'దొంగిళ్ల పైనిడి లింగమూర్తికి నింగన గావించు నభ్యంజనంబు' అనుద్విపదను గన్నడకృతిలో భీమకవి యిట్లు పరివర్తించినాఁడు: 'ఎరడుతొడ గళమేలె పర మన | నిరిసిసలె యభ్యంగనవనా| చరిసు'. మఱియు అంగిటి మల్లోత్తుసంసంద్రేలఁ - దొంగిళ్లఁగార్చిరు దో నెత్తిమిమమ' అనుదానికి 'అంగళియమళ్లం సునతికం సంగళవి నొత్తువరు తుంగో | త్సంగదిం సురిదిఁబువని తంనెత్తి యొళెరెవరు."

౨. "షష్ఠీసమాసమున 'పుం, ప్ర'లు:— పు. ౩ ఆ— 'ధీరంబుకట్టె,' 'గంభీరంబు తిట్టె.' ఇత్యాదులు. ప్రాచీన కృతులలో షష్ఠీసమాసమున దుకారమునకు 'పు', 'ంపు'లు గానరా వని కొందఱందురు గాని యది సరికాదు. బసవపురాణపు వ్రాఁతప్రతులలో రెండురూపములును గానవచ్చుచున్నవి 'ధీరంపుఁగట్టె గంభీరంపుఁదిట్టె.' ఇత్యాది గాఁగూడఁ గలవు. తిక్కనాదులు పలుచుగా నిట్టి ప్రయోగించిరి. ప్రాఁతవ్రాఁతప్రతులు చూఁడవలెను. ప్రాసస్థలములలోని ప్రయోగము లనివార్యములు, వానిఁ జూపుచున్నాఁడను 'ద. శపథము—గల్గుక్రీడి క, య్యపు వెర వెక్కుడై గెలుచువట్లుగ'— కర్ణ. ౩ ఆశ్వా. 'లావు చేవక| య్యపువెర వేపుదాల్మి'— శల్యపర్వము. 'కృపఁ దిలకింపఁ దెంపఁ బరికింపఁ గలాఁ దుదయిఁచు నంద వే, దపుగని పేల్చు సెప్పిఁ'— సోమనహరివంశము, ౨ ఆశ్వా. 'కపటమువన్ని జానకి సకల్మషఁదెచ్చినయట్టి పాపక ర్మపుఁబోఁడువక.'— భాస్కర రామాయణము, యుద్ధకాండము. ఇత్యాదులు కవిలోకచింతామణిలో నెల్లంకి తాతంభట్టుగారుకూడ షష్ఠీసమాసమున నీయాదేశము గలదని వచించెను."

దేశీయపద్ధతిని జానుఁదెనుఁగున వెలసినయీగ్రంథము యొక్క రచనాసౌందర్యమునుగూర్చి శాస్త్రిగారు క్రిందితీరునఁ జెప్పిరి:

"మన సోమనాథుని రచన మసాధారణ సౌందర్యము గల్గియున్నదనుట యతిశయోక్తిగాదు. ఛందస్సు, భావ, విషయము మూఁడును దేశీయములే యగుటయు, కవి శివతత్త్వానుభవమున నోలలాడుచుఁ దన్మయుఁడై కవితావేశము వొందియుండుటయు వట్టి యసాధారణ సౌందర్యమునకుఁ గారణములు.

పడిఁ బాలు జలమున కొడలెల్లఁ గాళ్లు
పడిఁ గాలు చిమ్మిన కొడలెల్ల నోళ్లు
పడి పీను గాద్పున కొడలెల్లఁ దలలు
పడిఁ జేయు బసవన కొడలెల్ల భక్తి.

అని బసవనిఁగూర్చి సోమనాథుఁడు భావప్లుతములుగాఁ బలికిన పలుకులు స్వభావములనఁగూడ సమన్వితము లయ్యెను. ప్రతిపద్యమును శివభక్తిపరవశుఁడైయుండి సోమనాథుఁడీ గ్రంథముల రచియించెను. ముగ్ధభక్తుల కథలు కొందలగువానిలోఁ గొన్నిపట్టులు చదువునప్పుడు మనసు ద్రవించితీఱును. బెజ్జమహాదేవి కథయు, గొడగూచికథయుఁ, గన్నప్పకథయు జదువునప్పుడు నేను వెక్కిరిడవలు కరఁగితిని. మాయమర్మములు లేని విశుద్ధ ముగ్ధభక్తిని బ్రకటించుటలో సోమనాథుఁ డక్కడక్కడ మధురమధురములయిన జానుఁదెనుఁగుఁ బలుకుల జాలువార్చి ముద్దులు గరిపించెను. శబ్దాలంకారములకయి, యర్థాలంకారములకయి, సోమనాథుఁ డెక్కడను బాధపడలేదు. తనకుఁ దెలియక యప్రయత్నముగాఁ బొందుపడినవే కాని యాలంకారికులు పేర్కొన్న కావ్యగుణముల ననుధ్యానించి పనిపూని చొప్పించినట్లు కన్పట్టు పట్టు లీగ్రంథమున నెక్కడను గానరావు. సులువుగా రచింపఁదగిన ద్విపద మగుటచే సోమనాథుని చూపు కథాకల్పనమందును, విషయవిన్యాసమందును, భావప్రపంచనమందును బరుగులువాఱినదే కాని యతిప్రాసచ్ఛందోభాషా బంధములందుఁ జిక్కుకొని యెక్కడను ద్రొక్కులాడలేదు. అట్లు పరుగువాఱుటలో చిక్కుపట్టులం దీతఁడు పాఠకుఁడు సరిగాఁ దన్ను వెన్నాడఁగలఁడా యనికూడఁ జూడఁబోఁ డయ్యెను."

ఇఁక వాదివిషయమునుగూర్చి యిటుఁ జర్వితచర్వణముగ జేమియుఁ జెప్ప బనిలేదు. కాని యీ క్రింది యుదాహరణమును గాంచఁదగును:

'రుద్రపశుపతి' యను నొక ముగ్ధభక్తుఁ డాదిపురాణమునందలి సముద్రమథనకథ నెవరో చదువుచుండ నం

దు శివుఁడు హాలహాలమును మ్రింగొననుటను వినెనట. దాన శివున కేమిచేటు వాటిల్లునోయని యాతఁ డిట్లు పరితాపమును జెందుచున్నాఁడు:

"ఆరుద్రపశుపతి యాలించి భక్తుఁ
డారగింపుట నిక్క మా విషం! బనుచు
'ననుమానమా! త్రావె హరుఁడు విషంబు
బనుగొన నటమీఁదిపను లెఱుంగమన
విని యుల్కిపడి పీఁపురిలిగి "హా! చెడితి"
నని సోలఁబడి పార్లి యక్కటా' నిన్ను
జెట్టఁ జేసిరిగాక! విశ్వేశ! యెట్టి
జెట్టివా నైనను విషముఁ ద్రావుదురె?
బ్రదుకుదురె విషమ్ము ప్రాలైన వార?
లిది యెట్లు వినవచ్చు; నేమి సేయుదును?
నిక్క మెవ్విధమున నిన్ను కాచి (కే?)ఱుఁగ
ముక్కంటి! నా కింక దిక్కెవ్వరయ్య?
నాకొఱకైనఁ బినాకి! యివ్విషము
చేకొన కుమియవే నీకు మ్రొక్కెదను
కటకటా! మేన సగంబున నుండి
యెట నోయితివమ్మ! నీ వెఱుఁగవే గౌరి!
ప్రమథగణములార! పరమాప్తులార!
చనుసిన వెండి మీకర్వమే కాద?
శతరుద్రులార! యసంఖ్యాతులార!
క్షితిధరకన్యకాపతిఁ గావరయ్య!
వీరభద్రయ్యరో! విషముఁ బ్రాణేశుఁ
డారగించె నిఁ కెట్టు లవునో కదయ్య!
ఓపురాతనులార! యొకఁడు బ్రదుక
నోపు నోకో! విషం బొగి నారగించెఁ
జావుఁ దప్పింపరే సద్గురునాథు
జీవన లీయరే కావరే శివునిఁ
దల్లిలేని ప్రజలఁ దలఁతురే యొరులు
తల్లి యున్న విషముఁ ద్రావ నేలిచ్చు!
పరమేశుఁ డీబారి బ్రదికె నేనియును
మరణంబు లేదునో మఱి యెన్నఁటికిని!
నని ప్రలాపింపుచుఁ బనవుచు నొండు
వినఁజాలఁ బ్రాణముల్ విడుతు నేననుచుఁ
దడయక ఘనజలాంతరమున మునుఁగఁ
బనికుండ నారుద్రపశుపతిఁ బట్టి
పార్వతీసహితుఁడై ప్రమథరుద్రాది
సర్వసురాసురసంఘంబుఁ గొలువ
హరుఁడు ప్రత్యక్షమై"

తాను విషమును కుత్తుకను దాఁటనీయకుందునని యాభక్తునికి వరమిచ్చెనట. ఈపరితాపవర్ణన మెం[illegible]హృదయద్రావకముగ నున్నది. ఇట్టులే భావోద్రేకమును గలిగించి పాఠకులఁదన్మయులఁ జేయు పట్టు లీపుస్తకమున లెక్కకుమిక్కిలిగఁ గలవు.

దేశోద్ధారకులు, శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు (గ్రంథమాలాసంపాదకులు) శైవ వీరశైవ మతములయొక్క ఉత్పత్తి, వ్యాప్తి, స్వరూపతత్త్వములను వివరించుచు రచియించిన విలువగల ప్రస్తావన (౩౮ పేజీలు) గ్రంథాదిని చెలసియున్నది.

కృతికర్త కవివతంసము; పరిష్కర్త పండితవతంసము. ఇఁకఁ జెప్పవలసినదేమి? బంగారమునకుఁ బరిమళమబ్బినది. తత్సౌందర్యసౌరభ్యములను గ్రహించి యానందింపవలసిన నేర్పు ఆంధ్రలోకమునకుఁ గలదని విశ్వసించుట పొరపాటు కానేరదు.

జానుఁదెనుఁగు నుడికారములు, జాతీయములు, నానుడులను వెలలేని మానికములకీ గ్రంథము గని. గ్రంథరచనాభిలాషులగు రసికాంధ్రసహృదయులెల్లరు నిందలి రత్నములను సంగ్రహించి తమరచనముల నలంకరించుకొనఁదగుదురు. ఈగ్రంథముయొక్క ప్రాచీనతను, ప్రాశస్త్యమును గుర్తించి విద్యాశాఖాధికారులు ఉన్నతపాఠశాలలయందును, కళాశాలలయందును దీని నావశ్యకపాఠ్యగ్రంథముగ నిర్ణయించి ఆంధ్రవిద్యార్థుల మాతృభాషాభివృద్ధికిఁ దోడ్పడుట పరమావశ్యకము.

* * * *

త్యాగరాజస్వామిచరిత్రము (పద్యకావ్యము)
[ఆంధ్రగ్రంథమాలయందలి సప్తమకుసుమము]

గ్రంథకర్త: శ్రీయుత పసుమర్తి కృష్ణమూర్తి శాస్త్రిగారు, బరంపురము, గంజాముమండలము.

క్రౌను ౧౬ పేజీలసైజున రెండువందలపుటలు గల గ్రంథము. వెల రు. ౦-౧౦-౦

విలాసము:- ఆంధ్రగ్రంథమాల, 7 లంబుశెట్టివీధి, మదరాసు.

ఆంధ్రదేశమున త్యాగరాజు రచించిన కృతులను ఎఱుఁగని రసజ్ఞు లుండరు. ఒక్క ఆంధ్రదేశముననే యేల? ఆంధ్రేతరప్రాంతములను సైతము నుండరను టతిశయోక్తి గాదు. త్యాగరాజు చోళమండలమునందున్న పంచనదక్షేత్రమున నివసించుచుండిన యొక యాంధ్రకుటుంబమునందు కాకర్ల నగరాజబ్రహ్మమను నాయనకు ద్వితీయపుత్రుడుగ జన్మించినవాడు; సంగీతసాహిత్యములయం దసమానపాండిత్యము గడించి, పుట్టువు మొదలు శ్రీరామచంద్రుని పరదైవముగా నమ్మి తత్సేవాపరాయణుఁడై ప్రాపంచికవ్యామోహములం దగుల్కొనక జీవితమును పవిత్రముగ గడపిన మహానుభావుఁడు. అట్టి రామభక్తాగ్రేసరుడు ఉత్తమసంగీతలక్షణసమంచితములుగను, లలితలలితములుగను, సరసభావసంపన్నములుగను రచియించిన గేయములు భక్తిరసమును జాలువార్చుచు కర్ణరసాయనములై రసికశ్రోతృబృందమును మైమఱపించుచుండుట అనుభవసిద్ధము.

శ్రీ కృష్ణమూర్తిశాస్త్రిగారు గాయకబ్రహ్మ యగు నామహనీయుని చరిత్రమునే యిట్లు రసవత్ప్రబంధకావ్యముగా రచియించినారు. ఇందలి రచనము భాషాశుద్ధి గలిగి, లోకోక్తులతో నొప్పి యెంతయు హృదయంగమముగ నున్నది.

త్యాగరాజు జీవితచారిత్రమునందలి వివిధసందర్భములకు దగినట్టులు తద్రచితకృతులయందు డెబ్బదియైదింటి నేర్చి యిందా యాపట్టుల జేర్చినారు. ఈసాంఘిక గ్రంథమునకు మఱింత వన్నె దెచ్చి పాఠకులను భక్తిపరవశులను గావింపజాలియున్నది.

ఈగ్రంథము నిఖిలాంధ్రజనసమాదరణపాత్ర మగుట నిస్సంశయము.

మచ్చునకు :

ఉ. చూడక యుండలేను భవ,
శోషణ నీ నగుమోము చందురుం
బాడక యుండలేను మృదు,
భాషణ నీవిలసద్గుణంబులం
గూడక యుండలేను రఘు,
కుంజర నీపదపద్మభక్తులన్
వేఁడెద రమ్మ కంటఁబడి
వేడుకనొందెదు నన్నుఁ బ్రోవుమా.

ఉ. రామనృపాల, నే జనక
రాజున నీకొకకన్నె నిచ్చి నీ
ప్రేముడిఁ జూరకొంటనె?
సఖిష్ఠుతమై యలరారుచున్న నీ
నామము రేయిఁ బవలు
నాక జపించుచు నున్న పేద న
న్నేమిటి కన్నియుం దెలిపి
యిట్టుల నట్టుల లెట్టుచుంటివో.

* * * *

పైడిలేడి-అపవాదము

శ్రీనాళము కృష్ణారావుగారు రచించినది. క్రౌను. ౩౨ పైజున ౨౦ పుటలున్నవి. వెల ౧-౪-౦.

రెండుకావ్యములందును కేవలము సంభాషణములును, ఆత్మభాషణములును దక్క కవి స్వయముగ జెప్పినదేమియు లేదు. కథాభాగములు పరిచితములే కాని యీ నవీనకావ్యరచనయం దవి రక్తినే కూర్చుచున్నవి.

ఇందు 'పైడిలేడి' యను కావ్యము—

'అదిగో! సౌమిత్రి! వింటివే యార్తరవము'

అను సీతవాక్యముతో నారంభమై,

'దురితమారుని లక్ష్మణు దూఱితయంటి,
గట్టికుడుపక యున్నె యాకర్మఫలము?'

అను సీతవాక్యములతో ముగియుచున్నది. ఆ 'ఆర్తరవము'న నంకురించిన కావ్యవస్తువు ఆ ఆర్తరవమున నుద్విగ్నయై లక్ష్మణుని నిందించి పుచ్చిన సీత యొక్క పశ్చాత్తాపమున పరిణతమై, ఆమె యవిమృష్టకార్యము వలన ప్రాప్తింపనున్న దుఃఖములను సూచించుచు సౌష్ఠవము గ్రక్కుచున్నది.

'అపవాదము' అను కావ్యము లక్ష్మణుడు సీత నడవియందు విడువగా నామె,

'ఏమి లక్ష్మణా! నేఁడు నీమోముఁ జూడ
విన్ననై యున్న దేటికి చెన్నదొఱఁగి?'

అని యాశంకించుటతో మొదలగును. అతనివలన నామె నిజావస్థ నెఱిఁగి, వందుఱి, దుడుకు—

'వగపుచే నిట్లు నోరికి వచ్చినట్లు
పదరితిని గాక, లోకాపవాదమునకు
పతిని గురిసేయ నేనెట్లు పాలుపడుదు!
విభుని యానతి పడియుండు విపినమందు.'

అని తన శీలప్రాశస్త్యమున తనవ్యగవు నాహుతిచేసి,

'ప్రజల బిడ్డలంబోలెఁ గాపాడు మనుము
తలఁప నాకేమగడ యొప్పు తానె యనుము
భావ మెప్పుడు తనమూర్తిఁ బాయదనుము
నెమ్మి యొకయింత నాపైఁద నిలుపుమనుము.'

అని తన పతిహిత పరాయణత్వమును, నైరాశ్యాంధకారమున మునిగిపోవుచున్న తన ఉజ్జ్వలప్రేమజీవనమును దండడించిన తుదిసందేశము వెలిబుచ్చును. కావ్య మిట్లు ముగియుట బాగున్నది.

నిర్వహణ నైపుణికితోడు శైలీసారళ్యమును, రసస్ఫురణమును నీ కావ్యములకు వన్నె పెట్టుచున్నవి.

ఈచిన్ని సంపుటము చాలముద్దుగ నున్నది. వెల యింకను తక్కువ అయిన బాగుండెడిది.

ముద్రాపకులు: మల్లయ్యా ఆర్టుప్రింటింగ్ వర్క్సు, రాజమండ్రి.

శ్రీ మహాభక్తవిజయము-ప్రథమ సంపుటము:—గ్రంథకర్త: కీర్తిశేషులైన శ్రీమాన్ పరవస్తుజియ్యరు సూరిగారు. క్రౌను సైజు ౩౩౬ పుటలు. క్యాలికో బైండు. వెల రు. ౨-౮-౦.

'దేవా, అవధరింపుము' వంటివి గ్రంథ పీఠిక మన కావ్యపురాణాదిసంప్రదాయము ననుసరించి పద్యగద్యాత్మకమైయున్నది. గ్రంథమమాత్రము గద్యాత్మకము. శైలి ప్రౌఢస్నిగ్ధమై యొప్పుచున్నది.

'వలయువారు—1. బెంగుళూరుసిటీ, నగర్తపేట, పావుగడ వెంకటరమణప్పశ్రేణియందుండు రామానుజాచార్య అండ్ కంపెని వారి పేరఁగాని'—

'2. బెంగుళూరు సివిల్ అండ్ మిలిటరిస్టేషన్ సెప్పింగ్స్‌రోడ్డునందలి గాయక గ్రామణీవిద్యాసంఘ కార్యదర్శిగారగు ఆర్. యతిరాజులపేరఁ గాని—సొమ్ము పంపి తెప్పించుకో వచ్చును.'

సీత (పురాణకథ):—శ్రీ. వెలికాని సూర్యారావుగారు రచించినది. క్రౌను సైజు ౧౩౦ పుటలు. (వెల తెలియదు.) శ్రీరామముద్రాక్షరశాల, చిత్రాడ. పిఠాపురము.

ఇది సులభశైలితో నొప్పుచు జనసామాన్యమునకు సుబోధముగ నున్నది. నడుమనడుమ పద్యములు గలవు. "ఇట్టి గ్రంథములు పాఠశాలలయందలి బాలికా బాలకులకు నిర్మలచరిత్రబోధకంబులును, నీతిమార్గసాధకంబులును, ధర్మోపదేశకంబులును, సత్త్వప్రకాశకంబులునై మహోపయోగకరంబులుగా నుండఁగలవు." అని శ్రీ వేంకటపార్వతీశ్వరకవులు దీని యుపోద్ఘాతమున నుడివియున్నారు.

సూక్తిసుధార్ణవము (గద్యకావ్యము):—గ్రంథకర్త: శ్రీ. తూనా విశ్వనాథశాస్త్రిగారు, పచ్చయప్పపాఠశాలాంధ్ర పండితులు, చెన్నపురి. క్రౌనుసైజు. వెల ౮ అ.

ఇందు ధర్మవ్యాధోపాఖ్యానము; ౩౭ పుటలు; సావిత్ర్యుపాఖ్యానము; ౩౫ పుటలు.

పాండిత్యప్రకర్షను ప్రకటింపగోరుచున్నది శైలి. విద్యార్థులకు పదజాల మెక్కువ నేర్చుకొనుట కిది తోడ్పడును. ఇది నీతిదాయకముగను నున్నది.

శ్రీరామచరిత్రము (సటీకము):—ఇది పోతనామాత్య భాగవతాంతర్గతము. క్రౌనుసైజు ౯౦ పుటలు. వెల ౮ అ. ఏడవకూర్పు.

శ్రీ. గా. హరిసర్వోత్తమరావు, యం.ఏ. గారు తమ టీకను చేర్చి దీనిని ప్రకటించినారు. "చదువరులెల్లరు శ్రీమద్రామాయణకథనే యెక్కువగా నెఱింగియుండువారు గాన ఆకథకును, భాగవతకథకును గల తారతమ్యముల వ్యాఖ్యానమందుఁ గొంచెము విపులముగఁ గనఁబఱచినాఁడ" అని టీకాకారులు పీఠికలో నుడివిరి. అర్థతాత్పర్యములే కాక విశేషాంశముల వివరముకూడ నీఁదుచున్నది. తగినతావుల విశేషములకు వ్యాకరణవిషయములుగూడ నున్నవి.

ఈపుస్తకములు వలయువారు టీకాకారుల పేర వందాలకు వ్రాసి తెప్పించుకొనవచ్చును.

కేదారేశ్వర వ్రతకల్పము:—విద్వాన్ శ్రీ. ముదిగొండ వీరేశలింగశాస్త్రిగారిచే నిది పరిష్కృతము. క్రౌను సైజు ౮౦ పుటలు. వెల ౮ అణాలు. శైవప్రచారిణీగ్రంథమాల, వరంగల్, దక్కను.

లలితాంధ్రకథావళి:—గ్రంథకర్త: శ్రీ వెంకటపతి కుటుంబయ్యశాస్త్రిగారు. డెమ్మీసైజు ౨౬ పుటలు. చివరగల 'ఉపదేశరత్నములు' ౧౮ పుటలు. వెల ౮ అణాలు.

లలితాశ్రమగ్రంథావళీ, నెం. 6–9, సోలయప్ప మొదలివీథి, మైలాపూర్, మద్రాసు.

సురభి:—గ్రంథకర్త: బుక్కపట్నము తిరుమలనరసింహాచార్యులుగారు. క్రౌను సైజు ౬౭ పుటలు. వెల ౭ అణాలు.

ఇది యొకఖండకావ్యముల సంపుటము. ఇందు ప్రేమప్రధానములగు ఖండకావ్యములు చాలగ నున్నవి. ఆశానైరాశ్యములు మెండుకొన్న కవిహృదయమందలి వ్యగ్రత యిందు బాగుగ గోచరించుచున్నది. చివర 'వడిసెల' యనుకథ యున్నది. ఇందు కవికిగల ప్రకృతిప్రేమయు, విపన్న జీవనము నెడ సానుభూతియు ప్రకటితములగుచున్నవి. కథనశైలి సరళముగ నున్నది. అటనట భాషాదోషములు, ఛందోదోషములును గలవు.

ఫెదరువైటు కాగితముపై చక్కని ముద్రణముతోడను, మంచిబైండుతోడను సంపుటము ముద్రితమై యున్నది.

వలయువారు 'ఆంధ్రాబుక్ డిపో, 45, బందరు వీథి, మద్రాసు' అని వ్రాయవలెను.

హరిశ్చంద్రమహారాజు:—గ్రంథకర్త: శ్రీ చెలికాని వేంకటనరసింహారావుగారు. డెమ్మీసైజు ౭౦ పుటలు. వెల ౭ అణాలు.

శైలి మృదుమధురమై యొప్పుచున్నది. కథనము ప్రవాహమువలె నున్నది. శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు గ్రంథాదిని, 'ఇట్టి వచనప్రబంధములు స్కూలు విద్యార్థుల కత్యంతోపకారకములుకావున విద్యాశాఖవారు పరిశీలించి పఠనీయగ్రంథముగా నియమించి గ్రంథకర్తకు ప్రోత్సాహము లొసగుదురని నమ్ముచున్నాను' అని నుడివినది యుక్తము.

వలయువారు 'సెక్రెటరీ, యస్. ఆర్. లైబ్రరీ, లక్ష్మీనరసాపురము, పిఠాపురముపోస్టు, తూర్పుగోదావరిజిల్లా' అని వ్రాయవలెను.

నీతిముక్తావళి:—గ్రంథకర్త: శ్రీ. నూతులపాటి నరసింహశతశిల్పిగారు. క్రౌను సైజు ౫౫ పుటలు. వెల ౮ అణాలు. చంద్రికాముద్రాక్షరశాల, గుంటూరు.

'అన్నమాటను తప్పకుము,' 'ఆడవారి నొంటరిగ నాటకములకు పంపకుము,' 'నీపుస్తకములను కుదురుగ నుంచుకొనుము'—ఇట్టినీతివాక్యములు నింపిన పుస్తకమిది.

రామదాసునాటకము:—గ్రంథకర్త: రావుసాహెబు డి. వేంకటరమణయ్య, బి. ఏ. గారు. డెమ్మీసైజు ౯౦ పుటలు. వెల ౧ రు. రెండవకూర్పు.

తొలి కూర్పులోని కొన్ని పాటలకు మారుగా నిందు కొన్నిపద్యములు రచింపబడినవి. పాటలన్నియు గ్రంథముచివర అనుబంధముగా చేర్పబడినవి 'ఈ రెండవకూర్పులో గ్రంథము నింకను రంగానుకూలముగా నొనర్చినాను' అని గ్రంథకర్తగారు ఉపోద్ఘాతమున వ్రాసుకొన్నారు.

ఈ పుస్తకము దొరకుచోటు:—

వావిళ్ల రామస్వామిశాస్త్రి అండ్ సన్స్, 292, ఎస్ప్లనేడ్, చెన్నపురి. హిగిన్ బాతమ్ కంపెనీ రైల్వే పుస్తకశాలలలో కూడ దొరకును.

శ్రీమన్నారాయణకవచము:— బమ్మెరపోతనామాత్యకృతము. శ్రీ. అయ్యగారి వీరభద్రరావుగారిచే టీక వ్రాయబడినది. వెల ౮ అణాలు.

నేషనల్ బుక్ డిపో, రాజమండ్రి.

శ్రీసూర్యపురాణము:—గ్రంథకర్త: శ్రీ వేమూరి జగన్నాథశర్మగారు. శ్రీ గిడుగు వేంకట సీతాపతిగారిచే సంశోధితము డెమ్మీసైజు ౧౩౮ పుటలు.

శ్రీ గిడుగు వేంకట రామమూర్తిపంతులు గారు దీనిపై నొసగిన యభిప్రాయము తిలకింపదగినది. అందు వారు-'అష్టాదశపురాణసారము తెలుగున వచనముగా రచించిన శ్రీ వేమూరి జగన్నాథశర్మగారు సంస్కృతభాషలో నున్న సూర్యపురాణము తెలుగుచేసి తెలుగువారికి వందనీయులైనారు...రచన సొంపుగానే ఉన్నది ...ఇదివరకు పేరు కనివిని ఎరుగని యున్నట్లు ఎన్నో ఈపురాణమం దున్నవి. ఇతరపురాణములు ఏయుద్దేశముతో తెలుగువారు చదువుతున్నారో ఆయుద్దేశముతోనే ఈసూర్యపురాణము కూడా చదివితే వారికోరిక తప్పకుండా నెరవేరుతుంది.' అని వ్రాసినారు.

వలయువారు గ్రంథకర్తగారి పేర 'సహోపాధ్యాయులు, ఆస్కా-స్కూలు, ఛత్రపురం, గంజాం జిల్లా' అని వ్రాయవలెను.

దీనబంధు కబీరు:—గ్రంథకర్త: శ్రీ తారానాథ్ గారు. ప్రకాశకులు: అమెచ్యూర్ డ్రమేటిక్ అసోసియేషన్, బెంగుళూరుసిటీ. క్రౌనుసైజు ౬౨ పుటలు. (వెల తెలియదు.)

ఇది యొక హిందీనాటకము. దీనికి గాంధిమహాత్ముడు వ్రాసిన భూమికయనువాదము ఈదిగువ గలదు:

'నాకు నాటకజ్ఞాన మేమియు లేదు. నేనీప్రయత్నము ననుమోదించుచున్నాను. దీనివలన రాష్ట్రభాషాప్రేమ యీప్రదేశమున వృద్ధిపొందు ననుఆశతో అట్లు చేయుచున్నాను.'

ఇది స్వల్పకాలములో ప్రదర్శించుట కనువుగ వ్రాయబడినది.

భద్రాద్రిరాముడు:—కర్త: శ్రీ. అల్లమరాజు నారాయణరావుగారు. క్రౌనుసైజు ౯౯ పుటలు. వెల ౦-౨-౦. లలితా అండ్ కో., గవర్నరుపేట, బెజవాడ, కృష్ణాజిల్లా.

చపల:—అనువాదకర్త: శ్రీ పండిత ఆదిభట్ల తరిణయ్యసిద్ధాంతిగారు. డెమ్మీసైజు ౨౩౪ పుటలు. వెల రు. ౧-౦-౦.

పునర్యోగ నిర్మాణకల్పనము. ఇది శ్రీ. క్షేత్రమోహన ఘోషుగారి వంగమాతృక కనువాదము. కథ రక్తి గూర్చుచున్నది. శైలియు సరళముగనే యున్నది.

వలయువారు వేగుఁజుక్క గ్రంథమాలాధికారులకు, 'పూడిపెద్దివారి వీధి, బరంపురం (గంజాం)' అని వ్రాయవలెను.

వెన్నెలకుప్పలు:—సంపాదకులు: శ్రీ కోటకూరు సత్యనారాయణరావుగారు. క్రౌనుసైజు ౫౬ పుటలు. వెల సారస్వతచంద్రికామండలి చందాదారులకు రు. ౧, ఇతరులకు రు. ౧-౪-౦.

సారస్వతచంద్రికామండలి, అన్నపాడు, గంపలగూడెంపోస్టు (కృష్ణాజిల్లా.)

ఇది కొన్ని ఆధునిక ఖండకావ్యముల సంపుటము.

శ్రీ నందిరాజ లక్ష్మీనారాయణ దీక్షితచరిత్రము

అబ్బరాజు హనుమంతరాయశర్మ పాకయాజి విరచితము

పద్యకావ్యము ౫ ఆశ్వాసములు. డబుల్ క్రౌను సైజులో ౩౪౦ పేజీలుగల గ్రంథము. ఆంధ్రదేశమునందు సుమారు ౧౦౦ సం. క్రిందట జన్మించి నియోగిబ్రాహ్మణులయందు వేదవిద్యను వ్యాపింపజేసిన నందిరాజ లక్ష్మీనారాయణదీక్షితులవారి జీవితచరిత్ర మిందు వివరముగ వర్ణింపబడియున్నది. పాఠకులకు సులభముగ తెలియుటకై పీఠికయందు దీక్షితులవారిచరిత్రము సంగ్రహముగ వచనమున వ్రాయబడియున్నది. వెల రు. ౧.

విలాసము: అబ్బరాజు హనుమంతరాయశర్మ పాకయాజిగారు. హైస్కూలు తెలుగుపండితులు, పెరవలి-చావలిపోస్టు, గుంటూరుజిల్లా.

ధమ్మపదము:—[ఆంధ్రగ్రంథమాలయందలి ఎనిమిదవకుసుమము] ఇది శ్రీ కిడాంబి రంగాచార్యులుగారు అనువదించినది. క్రౌనుసైజు ౧౧౨ పుటలు. వెల ౧౨ అణాలు.

ఆంధ్రగ్రంథమాల, ౮, తంబుచెట్టివీధి, మదరాసు.

ఇది 'పాళీభాషయందు వ్రాయబడిన బౌద్ధవైదికగ్రంథములలో' నొక్కటి. క్లిష్టపదములున్నను అనువాదము సుబోధముగనే యున్నది.

ఇందు 'బుద్ధునిధర్మోపదేశములు,' 'బౌద్ధమతసిద్ధాంతములు' అను రెండనుబంధములు చేరియున్నవి. కట్టతుదను కొన్ని పారిభాషికపదములకు దిక్కూనిటిప్పణమున్నది. శ్రీకాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారు దీనికి ప్రశస్తమైన ప్రస్తావన వ్రాసియున్నారు.

ఇది ఆంధ్రభాషలోని బౌద్ధమతవిషయికవాఙ్మయమున నొక విలువగలగ్రంథము.

పత్రికలు

సుభాషి. సంపుటం ౧. సంచిక ౧.

౧౯౩౪ సం. అక్టోబరునెలలో క్రొత్తగాపుట్టింది యీపత్రిక. సంపాదకులు శ్రీయుత పందిరి మల్లికార్జునరావుగారు. రాజమండ్రి.

చందా సంవత్సరానికి	రు.	౩-౦-౦
„ ఆరునెల్లకు	రు.	౨-౦-౦

దేశంలో విజ్ఞానంపరుగులు వారాలంటే మంచిపత్రికలు కావాలె. కాని మనదేశంలో ఉండేవెన్ని? ఎవరైనా ఉత్సాహంకొద్దీ డబ్బుపెట్టి పత్రికలు ప్రకటిద్దామంటే వాళ్లకు మంచివ్యాసాలు వ్రాసేవాళ్లూ, చదివేవాళ్లూ దొరకడం కష్టంగా ఉంటుంది. అసలు మనదేశంలో చదువుకొన్న వాళ్లే తక్కువ. ఆకొందరిలోనైన పత్రికలు చదవడానికి, వ్యాసాలు వ్రాయడానికి ఆశ, ఉత్సాహం ఉండేవాళ్లు చాలాకొంచెం మంది. ఇట్లాంటప్పుడు పత్రికలను ఎట్లా నెగ్గించడం? కాని ధైర్యంచేసి ఒక్కొక్కరు ప్రారంభిస్తూనే ఉంటారు. శ్రీమల్లికార్జునరావుగారట్లాంటివాళ్లలో ఒక్కరు. ఉపక్రమణికలో వారుచెప్పారు:

"ఆంధ్రులభాషాసేవాభిలాషతో డగిన మొగ్గలలో ఇదికొత్తది. కొత్తభావాలతో రేకెత్తింది." అనీ,

సారస్వత, మత, సాంఘిక, రాజకీయ ఆర్థికరంగాల్లో ప్రబలిన వాదప్రతివాదాలనుగూర్చి ఉపక్రమణికలో ముచ్చటగా చర్చిస్తూ వాటి "సంరంభంలో- ఈనవయుగములలో సారస్వతము, కళ, చరిత్ర, ఈమూటిరూపంగా తెలుగు హృదయాన్ని వ్యక్తీకరించడమే మాఆశయము" అనీ,

"ఈ సైసంకల్పాలు నిండుమనస్సులో తొణుకులాడిన ఫలితమే యీపత్రిక" అనీ.

ఇట్లాంటి తనఉద్దేశాలను నెరవేర్చుకోడానికి ఈపత్రిక బాగాపనిచేస్తూ చిరంజీవిగా మనవాలె.

ఈసంచికకు తెలుగుదేశంలో సారస్వతప్రపంచాన పేరువచ్చిన పెద్దలే వ్యాసాలు వ్రాశారు.

శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు వ్రాసిన 'అన్నయదేవుడు—వింతచరిత్రాంశములు' అనేవ్యాసం 'అకాలమున ననులోమవివాహములు బాహాటముగా రాజకుటుంబములలో జరుగుచున్నట్లు స్పష్టముగా' తెలియజేస్తూంది. శ్రీయుతులు-శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, విశ్వనాథసత్యనారాయణగారు వ్రాసినపద్యవ్యాసాలు భావగర్భితాలు, రసోత్తరాలు. శ్రీ. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు వ్రాసినకథ మంచియెత్తుమీద నెగ్గి వ్యావహారిక భాషాసారస్యాన్ని చమత్కారంగా చూపిస్తూంది. ఇంకా రెండుమూడు గద్యపద్యవ్యాసాలూ కలవు.

సాభిప్రాయ విశేషములు

శ్లో. సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత,
శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధస్స ఏవసః.

మానవులు సంకల్పసిద్ధిని బడయుటకు భక్తిశ్రద్ధలు మూలసాధనములుగ నున్నవి. భక్తిశ్రద్ధలులేని పనులు వ్యర్థములైన మనోరథములవలెను పుట్టిగిట్టుచుండును. భక్తిశ్రద్ధలు గలుగకను తామసించి పనులను జేయుట తగదని వేమనయోగి చేసిన హితోపదేశమును వర్తమానకాలమునందు ప్రపంచ మంతయును మననము చేయదగి యున్నది. వేగిరపడుటవలనను విషమస్థితి గలుగుచున్నది. వాయువిమానములు, వాయువార్తలుపరిపాటియైన యుగమునందైనను వేగిరపడుట ప్రయోజనకరము గాదు. వ్యక్తులు, కులములు, సంఘములు, జాతులు ఒక్కసారి స్వర్గారోహణము చేయుదలపడుచున్నవి. ఎవరికిని సాధ్యాసాధ్యములతో నిమిత్తము గనుపడకున్నది. ఈవేగావేశమునందు చెప్పుటకును వినుటకును సావకాశము గలుగకున్నది. సత్త్వశుద్ధిలేకను కార్యసిద్ధి దుర్లభమగుచున్నది. సత్త్వశుద్ధిలేకను ప్రపంచ మంతయును సంక్షోభమును బొందుచున్నది.

శాంతిని ప్రతిష్ఠించుటకేర్పడిన నానాజాతి సమితి శాంతిస్థాపనమునకు నిరర్థకమైనది; ప్రబలములైన పాశ్చాత్యరాజ్యముల స్వప్రయోజనములకు వినియోగపడుచున్నది. బ్రిటీషు మంత్రివర్గ మాయుధధారణనియమమున కభ్యంతరములను గల్పించుచున్నది. ఇటలిదండయాత్ర నభినయించుచున్నది. ఫ్రాన్సుసంగ్రామభయమున నటించుచున్నది. రుష్యా సోవియటు ప్రాజాపత్యమును విశ్వమునందంతటను స్థాపింప గోరుచున్నది. యూరపురాజ్యములన్నియును యుద్ధజ్వరదాహమును గోరుచున్నవి. మాటలందు జినీవా సమావేశము, శాంతిస్థాపనము, ఆయుధనియమనము, మానవస్వాతంత్ర్యము- చేతలందు సంగ్రామము, మానవ దాస్యము, పరపీడనము ప్రత్యక్షమగుచున్నవి. యూరపు సంగ్రామఫలము శ్మశానవైరాగ్యము, ప్రసూతి వైరాగ్యము చందమైనది.

యుద్ధము ముగిసి పదేండ్లు గాకపోయినను యుద్ధజ్వరము యూరపురాజ్యముల నావహించినది. యూరపు రాజ్యముల విజయములకును, ప్రపంచపీడనమునకునుగారణంబైన ఆయుధసంచయము యూరపురాజ్యములవినాశనమునకు గారణంబగుట ప్రకృతి

ధర్మము. సుందోపసుందోపాఖ్యానమునందు మొదటి యధ్యాయములు యూరపుమహాసంగ్రామముతో ముగిసినవి. కడపటి యధ్యాయములు యూరపునందును, ఆసియాయందును నారంభమగుచున్నవి. భవిష్యాధ్యాయముల ఫలము మహాదారుణముగ నుండగలవిధమును యూరపుపరిస్థితులు, చీనాపరిస్థితులు విశదము చేయుచున్నవి. రుష్యాయందు మహాపరివర్తన మేర్పడినది. ఇంగ్లాండునందు సంపన్నకార్మిక సంరంభము వృద్ధియగుచున్నది. చీనాయందు మహాసంక్షోభము చెలరేగుచున్నది. ఆసియాయందలిచిత్రకథ భావికాలమునం దాఫ్రికాకు వ్యాపించ గలదు. లియోనార్డు వుల్ఫుగారు మొదలగువారు చేసెడి హితోపదేశములు సామ్రాజ్యలోభోపహతులకు సంతృప్తినిగలుగజేయజాలవు.

యూరపు విజయములు పశుబల విజయములు; స్వప్రయోజన విజయములు; పరపీడన విజయములు. యూరపు విజయము లాసియాహృదయమును నిర్వీర్యము చేసినవి. యూరపురాజ్యముల యంతఃకలహములు ఆసియాప్రజల నిశ్చేష్టతను తొలగించినవి. ఆసియాప్రజల కాత్మవిశ్వాసము గలిగినది. పాశ్చాత్యపాశబద్ధులైన ప్రజల కాత్మవిశ్వాసము గలిగినను పాశబంధములను తొలగించెడి మార్గము సాధ్యము గాకున్నది. పాశ్చాత్య పాశబంధములు భిన్నదేశములందు భిన్నరూపముల నున్నవి. తురుష్క పారసీకరాజ్యముల నార్థికపాశములు బంధించుచున్నవి. చీనాను ఆర్థికవాణిజ్య పాశబంధములు బంధించుచున్నవి. భరతవర్షమును ఆర్థికవాణిజ్యరాజకీయవైజ్ఞానికాది నానావిధ పాశములును బంధించుచున్నవి. పాశబద్ధములైన దేశములందు భరతవర్షస్థితి బహుదైన్యముగ, నున్నవిధము ప్రపంచవిఖ్యాతముగ నున్నది.

విజ్ఞానపరాక్రమ సంపన్నులైన ముప్పదికోట్లప్రజలుకొంగాములగుచు మహాకష్టముల ననుభవించుచున్నారు. ప్రజలదుస్సహమైనస్థితి కోపావేశమును గలుగజేయుచున్నను సంఘనాయకుల స్వప్రయోజన పరాయణత్వము పాశబంధములను బిగదీయుటకు వినియోగపడుచున్నదిగాని సడలించుటకు వినియోగపడుటలేదు. జపాను తుర్కీదేశములు పరదేశ పాశబంధములను విడిపించుకొనగల సాధనమును ప్రాచ్యులకు విశదము చేసినవి; ఇపుడు ఈజిప్టు పరిషియా చీనారాజ్యములు విశదము చేయుచున్నవి. భారతీయులకును అంతఃకలహములుపోయి సంయోగము గలుగనంతవరకును పాశబంధములనుతొలగించుటకు ప్రజలకుశక్తి చాలదు. మొదటి పాఠపుస్తకమునందు గల కట్టెలమోపు కథనే భారతీయుల యంతర్విభేదములు సంస్మరింపజేయుచున్నవి. కట్టెలను ప్రత్యేకించి విరుచుట సులభము. మోపుగ నేకమై యున్నపుడు భేదించుట దుర్లభము. ఈరహస్యము బ్రిటీషుప్రభుత్వబలమును, భారతీయుల దుర్బలమును విశదము చేయుచున్నవి. అంతర్విభేదములకును, పరాధీనత్వమునకును చిరకాలాభ్యస్తమైన భరత ఖండమునందు సంయోగము దుస్తరముగ నున్నది. సంయో

గావసరమును భారతీయులు గ్రహించుచున్న విధమును కలకత్తాయందు గూడిన సంయోగ సమావేశము, ఢిల్లీయందు గూడిన రాజప్రతినిధి సమావేశము విశదము చేయుచున్నవి.

* * * *

సంయోగసమావేశము

శ్రీమాన్ శ్రీనివాసయ్యంగారు వారి శక్తిసామర్థ్యములు వినియోగించి సంయోగ సమావేశమును సఫలముచేసి భారతీయుల కృతజ్ఞతకు బాత్రులగుచున్నారు. హిందూ మహమ్మదీయసమస్య, హిందువులును మహమ్మదీయులును నున్నంతవరకును నిలిచియే యుండును. ఆసమస్య తీవ్రరూపమును దాల్చినపుడే శాంతిసహానము లవసరములు. శ్రద్ధానందస్వాములు మొదలగు వారి హత్యలు హిందూ మహమ్మనీయ సమస్యను భయప్రదము చేసినవి. శుద్ధి తాన్జీను ఉద్యమములు, మేళతాళములు, గోబలులు హిందూ మహమ్మదీయ సమస్యకు పరోక్షకారణంబులైనను ప్రత్యక్షకారణంబులు గాజాలవు. ఈ సమస్యలు చిరకాలము నుండియును వచ్చుచున్నవి; చిరకాలముండగలవు. కాని ప్రస్తుతసమయమునందు భయంకరాకారమును దాల్చుటకు గారణము రాజకీయముగాని మతసంబంధము గాదు. పరాధీనస్థితియందున్న దేశమునందు రాజకీయసంరంభము సహజముగను గలుగుచుండును. పట్టుదల లేర్పడినపుడన్ని విషయము లందును పట్టుదలలు ప్రబలుచుండును. హిందూ మహమ్మదీయులు పట్టుదలలను విడిచినపుడు దేశముమీదను ప్రజలకు భక్తిశ్రద్ధలు వర్ధిలుట కవకాశములు విస్తరింపగలవు.

కొందరు చెప్పినటులు గోబలులు లేనిచోట్లను గోబలులు హెచ్చుటయును, అలవాటు లేనిచోటను మేళతాళముల నాపుటయును సంప్రాప్తము గాజాలదు. సంప్రాప్తమైనను హిందూమహమ్మదీయులు ప్రత్యేకమైన హక్కులను రక్షించుకొనుటకు పట్టుపట్టినంతవరకును సమావేశములు నిరర్థకములు. సమరసభావముతో నీవిషయమును నిర్ణయించవలయును. ఈవిషయవిచారణ చిరకాలము నుండియును జరుగుచున్నది. కాలయాపనము విభేదములను పెంచుచున్నది గాని సంయోగమునకు వినియోగపడుట లేదు. ఇట్టి విషమపరిస్థితులందు కలకత్తాయందు సంయోగ సమావేశము చేసిన తీర్మానములు ప్రశంసార్హములుగాని నిందార్హములు గావు. సంధిషరతులకు సమగ్రత్వ మసంభవము. ఈషరతులమీదను సంయోగసౌధమునుగట్టుట కవకాశములు గలవు. ప్రజానాయకుల యందు భేదాభిప్రాయము లీవిషయమై పెరుగుట యనవసరము. సంయోగ సమావేశ మామోదించినయొడంబడికలు సమగ్రములుగాని, శాశ్వతములుగాని కాజాలవు. క్రొత్తపరిస్థితులు క్రొత్తరాయబారములు నిరంతరము సంప్రాప్తమగుచుండును.

ప్రస్తుతము నిర్ణయించిన యొడంబడికలు మహమ్మనీయుల కనుకూలములైనను భరత ఖండమున శాంతి స్థాపనమునకు ప్రయో

జనకరములై సంయోగమున కవసరంబులుగ నున్నవి. హిందూమహమ్మదీయుల కన్యోన్య విశ్వాసము, మిత్రత్వము గలుగుట కుభయ పక్షములును మహాత్యాగము చేసినను నష్టము గలుగదు. మహమ్మదీయులు బాహ్య దృష్టిని వదలి మాతృదేశమునందు వారిదృష్టిని లగ్నముచేయుటకు హిందువులబలము, త్యాగము సాధనములుగ నున్నవి. హిందువులందన్నికులముల వారును వర్ణాశ్రమ ధర్మములందలి నామరూపములను విసర్జించి భావము నారాధించుట ప్రయోజనకరము. శుద్ధిసంఘటనోద్యమములను దేశమంతయును నవలంబించునపుడు హిందూసంఘమున కపూర్వమైనబలము గలుగగలదు. మహమ్మదీయసంఘమునందు ప్రబోధము వ్యాప్త మగునపుడు గోవధరూపమైన జీవహింస సహజముగను నంతరింపగలదు. మాంసాశనమును మహర్షులును, మునులును, భక్తులును నిరసించిన విధమునను ప్రపంచ మంతయును నిరసించునపుడు మహమ్మదీయులును గోవధను, గోమాంసభక్షణమును నిరసింపగలరు.

హిందువులు హిందూధర్మోద్ధరణమును జేయుటయె భారతాభ్యుదయమునకును, ప్రపంచకల్యాణమునకును సాధనముగ నున్నది. అహింసాధర్మమును, మాంసాశననిరసనమును ప్రపంచమునకు ప్రసాదించిన భారతభూమియందు మాంసాశనులు, బలులు, జాతరలు ప్రబలుట భారత ధర్మవైకల్యమును విశదము చేయుచున్నది. భారతధర్మోద్ధరణమునకు భారతసత్వోద్ధరణము సాధనముగ నున్నది. ప్రజానాయకులు భక్తిశ్రద్ధలు గలిగి అంతర్విభేదములను విసర్జించి ప్రజాసత్వాభ్యుదయమునకై పాటుపడి మాతృదేశ పాశబంధములను ధర్మమార్గమునను విచ్ఛేదము చేయుదురు గాక! బ్రిటీషు రాజ్యాధికారులు వారిపాశబంధములను దృఢతరము చేయుటకు చేయుచున్న ప్రయత్నములు బ్రిటీషుసామ్రాజ్యమునం దంతటను ప్రత్యక్ష మగుచు భారతీయులకు ప్రతిబంధకముగ నున్నవి. మహోపద్రవావస్థయందైనను భారతీయు లంతర్విభేదములను విసర్జించి సంయోగబలమును విశదముచేసి కృతార్థులగుట వివేకము, ధర్మము.

* * * *

బ్రిటీషుసామ్రాజ్యము—భారతీయులు

బ్రిటీషుసామ్రాజ్యము శ్వేతసామ్రాజ్యము గాని మానవధర్మసామ్రాజ్యము గాదని సకలదేశవ్యవహారములు విశదము చేయుచున్నవి. సామ్రాజ్యాంతర్భాగములందును, స్వదేశమునందును, విదేశములందును భారతీయులు దాసులుగ నుండుట కవకాశములు గలవు గాని సమానులుగ నుండుట కవకాశములు లేవు. ఫ్రాన్సురణరంగమునందు బ్రిటీషు సామ్రాజ్యమునకును, మానవస్వాతంత్ర్యమునకును ఆత్మార్పణము చేసిన భారతీయయోధులకు సమాధులను నిర్మించుటయును, వారిగుణములను సంకీర్తనము చేయుటయును సుకరము. బర్కెనుహెడ్డుప్రభువు, రీడింగుప్రభువు, ఫాకుసేనాధ్యక్షుడు భారతయోధుల త్యాగమును, శౌర్యప్రతాపములను కొనియాడుట

సూరము. క్రియ వచ్చినపుడు మాత్రము బర్కెను హెడ్డుప్రభువునకును, శ్వేతముఖులకును చేతులు వెనుకబడుచున్నవి.

భారతీయులు సైన్యమునందును, పరిశ్రమలందును, రాజ్యాంగములందును దాసులుగను బనిజేయునంతవరకును, వారు వీరులు, విశ్వసనీయులు, ప్రభుభక్తిపరాయణులును నగుచున్నారు. స్వతంత్రమును వ్యక్తము చేసిన వెంటనే పిరికిపందలును, కుత్సితులును, రాజద్రోహులును నగుచున్నారు. ఈ విపరీతభావములకు స్వప్రయోజనపరాయణత్వము, శ్వేతజాత్యభిమానము, సంభావనాభావము గారణములుగ నున్నవి. భారతీయుల సాహచర్య మంతరించిన వెంటనే బ్రిటీషుసామ్రాజ్యప్రతిభకు దౌర్బల్యము గలుగుట సహజము. బ్రిటీషుగయానాయందును, కెనియాయందును, తూర్పుదక్షిణాఫ్రికాలందును, మలయాసింహాళములందును భారతీయుల సహాయము తెల్లదొరల లాభములకు సాధనంబుగ నున్నది. భారతీయుల సహాయము లేనపు డిపుడు వారు తలచునట్టులు దేశమునంతను ననుభవించి జీర్ణముచేసికొనజాలరు.

కన్సర్వేటివుప్రభుత్వము భారతీయుల హక్కులను నిర్మూలము చేయుటకు సామ్రాజ్యమునం దంతటను చేయుచున్న దుష్ప్రయత్నములకును, బర్కెను హెడు ప్రభువున్యాయపీఠమునందు జెప్పిన తియ్యని మాటలకును సంబంధ మెచ్చటను గనుపడదు. బ్రిటీషు ప్రభుత్వాధికారులు రానున్న యుపద్రవమునుండి తప్పించుకొనుట కవలంబించుచున్న మార్గము మాత్రము నిరర్థకముగ నున్నది. నిర్బంధములు భక్తివిశ్వాసములను గలుగ జేయజాలవు. శ్వేతప్రజలపట్లను జూపుచున్న భక్తివిశ్వాసములను శ్వేతేతర ప్రజలకు వారి స్వగృహము లందు జూపకుండుట శ్రేయః ప్రాప్తికి సాధనము గాదు. తుపాకులు ప్రాణహింసను జేయుటకు వినియోగపడును గాని ప్రాణసంవర్ధనమును జేయుటకు సాధనంబులు గావు. గయానా, కెనియా, ఆఫ్రికా మొదలగు దేశములందు భారతీయుల సాహచర్యము తెల్లవారు బాగుపడుటకును, బ్రిటీషు సామ్రాజ్యము వికసించుటకును నవకాశములను గలుగజేసినది. సమానుల సాహచర్యమువలెను బానిసల సాహచర్యము కార్యసిద్ధికి ప్రయోజనకరము గాదు. ప్రపంచానుభవమిాధర్మమును సహస్రముఖములను బోధించుచున్నను సంకుచితహృదయము ప్రతిబంధకముగ నున్నది. బ్రిటీషుప్రభుత్వమును, భారతప్రభుత్వమును దలపెట్టిన స్టాట్యూటరి కమిషను బ్రిటీషుప్రభుత్వమువొక్క సహజమైన సంకుచితహృదయమును విశదము చేయుచున్నది.

* * * *

స్టాట్యూటరీ కమిషను - భారతీయులు

కమిషను నిర్ధారణను భారత బ్రిటీషు ప్రభుత్వములు ఆగస్టుమాసమునందు జేసినవి: పార్లమెంటరికమిషను నిర్ణయించినది. కమిషనునందు భారతీయప్రాతినిధ్యము లేకపోయినను కార్యనిర్వాహకసభ యామోదించినది. సర్ హబీబుల్లా సాహేబుగారు మాత్రము ప్రతికూలాభిప్రాయమును దెలిపిరట! ఇపుడు సుగుణసంపన్నులైన ఇర్విను ప్రభువుగారు ప్రదర్శించుచున్న ప్రదర్శనమునకు మాత్రమర్థము గనుపడకున్నది. స్థిరపడిన విషయమునుగురించి నాయకులతో సంప్రతించుటకు రాజప్రతినిధి ఏల పూనుకొనెనో తెలియ

కున్నది. గాంధిమహాత్ముడు, శ్రీనివాసయ్యం గారు, అన్సారి, జిన్నా, పటేలుగారులు మొదలగువారితో ఇర్విను ప్రభువు సానుభూతిని గలిగి మాటలాడినను ఫలము మాత్రము సమానముగ నున్నది. రాజప్రతినిధి యవలంబించిన చతురోపాయమె బ్రిటీషు భారత ప్రభుత్వము లవలంబించిన యనుచిత విధానమునకు వ్యాఖ్యానముగ నున్నది. భారత రాజ్యాంగమునకు సంబంధించిన కమీషను నందు భారత ప్రతినిధులు లేకుండుట నాయకుడులేని నాటకమువలె నున్నది. అస్సెసరులను, సహకారసభ్యులను నియమించుట నిరర్థకము. బ్రిటీషు ప్రభుత్వము పార్లమెంటు సభ్యులను నియమించునటులు భారత ప్రభుత్వము సామ్రాజ్య శాసనసభ్యులను నియమించుట సమంజసముగ నుండును. న్యాయదృష్టిగల ఇర్విను ప్రభువునకు నాయకులతో జేసిన సంప్రతింపులు కర్తవ్యమును వ్యక్తముచేసి యుండును. పార్లమెంటు పక్షములనుండి వలె సామ్రాజ్య సభాసభ్యులపక్షములనుండి సమాన సంఖ్యగల సభ్యులను నియమించి ఇర్విను ప్రభువు స్వధర్మనిర్వహణమును జేయునని నమ్ముచున్నాము. కేవలము పార్లమెంటరి కమిషనును భారతీయులు బహిష్కరించుట సహజమని బ్రిటీషుప్రభుత్వము గ్రహించి వారి నిర్ణయములను మార్చుకొనియెదరని నమ్ముచున్నాము. వర్తమానమహోపద్రవ సమయమునందైనను భారతీయు లంతర్విభేదములను విడిచి సంయోగబలమును వ్యక్తము చేసి భారతసత్త్వమును బ్రిటీషుప్రభుత్వమునకు విశదము చేయుదురు గాత! గాంధిమహాత్ముడు ప్రతిపాదించిన సాత్త్వికనిరోధమును జూపుటకు వర్తమానసమయమును భారతీయులు వినియోగించి కృతకృత్యు లగుదురు గాత!

* * * *

సాత్త్వికనిరోధము

రాజ్యాంగవ్యవహారములం గల వితలభాయి పటేలుగారు భా
పాశబంధవిమోచనమునకు సాత్త్వి
శరణ్యమని పునహాయుం డిటీవల
యుండిరి. యూరపుసంచారానంతరం
గా రీభావమును ప్రకటించుట వారికి
ప్రభుత్వముపట్లను గల విశ్వాసాభా
నిదర్శనముగ నున్నది. కన్సర్వేటి
ము శ్వేతపాశబంధములను సర్వత్ర
చున్న విధమును భారతవర్ష వ్యవహ
వలన రాజ్య వ్యవహారములను వి
చున్నవి. సంకల్పసిద్ధికి సాత్త్విక
మన సాధనములు ఉత్తమ మధ్య
సాధనములుగ నున్నవి. పశుబలము
సిద్ధి కధమసాధనముగ నున్నది. య
రాజ్యముల విజయముల కవలంబనముగ
ఆయుధధారణము ప్రపంచనాశనమునకు
యోగపడుచున్నది. ఆయుధభారము ప్ర
సత్త్వమును నాశనము చేయుచున్నది. దేశ
దాయ మంతయును ఆయుధధారణ వ్యయమునకు వినియోగపడుచున్నది. ప్రజాసత్త్వము నిర్వీర్యమై రాజనతానుసరూపములను దాల్చు
చున్నది. ఆయుధనియమము కుదిరినను యూ
రపు రాజ్యముల ప్రయోజనముల కేర్పడు
చున్నది గాని తదితరుల కుపయోగపడజాల
దు. పరాధీన దేశములం దాయుధధారణము స్వదేశస్థులయందును రాజద్రోహముగ నున్నది. పిస్తోళ్లకును రాజద్రోహములకును సంబంధము భారతకోశమునందు బాగుగ జీర్ణించి

నది. ప్రస్తుతము దేశమునం దంతటను పిస్తో
ళ్లను బట్టుకొనుటకు జరుగుచున్న సోదాలు
పోలీసు పరిపాలనమునకు నిదర్శనముగ ను
తామస సాధనములు స్వరాజ్య
ందు గలుగ జేయగలసంక్షోభము
ంభముమహాదృశ్యముగనున్నది.
యుధులైన చీనాప్రజ లనుభ
దుఃఖవేదన నిరాయుధులైన
లనుభవింపగల విధమునకు నిదర్శ
న్నది. జలియనువాలాబాగుహత్య
నిరాధారస్థితిని భయంకరముగను
యు చున్నవి. ఈ బీభత్సనాటక
ించుటకు భారతీయులకు దగిన
ములు లేవు శక్తిసామర్థ్యములు
ందు గలిగినను రాజస తామస
పరమానర్థములకును సాధన
విధమును యూరపు రాజ్యముల
ము విశదము చేయుచున్నది. యూర
ముల చరిత్రము చరమాధ్యాయము
ప్రదర్శింపబడనున్నది.

ఇపుడు నానాజాతి సమితి నిర్ణయింప దలచిన ధర్మ సందేశమును అశోకచక్రవర్తి 2300 ఏండ్లక్రితము ప్రపంచమున కుపదేశించిన విధమునకు వారి శిలాశాసనములు నేటి సాక్షి భూతములుగ నున్నవి. ప్రపంచ మునందు ధర్మ విజయము వలెను ఆయుధ విజయములు ధర్మసిద్ధికి సాధనములు గావు. భారతీయులుప్రాచీన కాలమునందు ప్రదర్శించిన సాత్త్వికవిజయమె వర్తమాన కాలమునందును ప్రపంచ శాంతికి సాధనంబుగ నున్నది. భారతీయులుసాత్త్వికనిరోధమునభ్యసించుటకు భారతీయ సంస్కారము అనుకూలముగ నున్నది.

బుద్ధభగవానుని ధర్మసందేశము ప్రపంచము నంతయును జయించినది. భారత విజయములు ధర్మవిజయములుగాని తామ విజయములు గావు. భారతీయ విజయముల ప్రతిభను నేటికిని జావా, బలి, సయాము ప్రాంతములందు ప్రత్యక్షముగ నున్నది. రవీంద్రనాథ ఠాకూరు గారు జావా సయాము యాత్రానంతరము చాటిన సందేశము భారతీయవిజ్ఞానవిజయములను వ్యక్తము చేయుచున్నది పరదేశాక్రమణము, పరధనాపేక్ష, పరదాస్యము రాజస తామసపరమైన పాశ్చాత్యవిజయములకు ఫలము. ఆ విజయముల దుష్ఫలము ననుభవించుచున్న ప్రపంచమంతయును పాశ్చాత్యాయుధ విధానమున ప్రతిఘటనమును జూపుచున్నది. అప్రతిఘటనమునందు నాయకత్వమును వహించుటకు భారత సంస్కారము సకల విధములను తగియున్నది. భారతీయసాత్త్వికవిజయము విజ్ఞాన విజయము, త్యాగవిజయము, ధర్మవిజయము, ప్రేమవిజయము. వర్తమాన కాలమునందు ప్రపంచము రాజసవిజయములను నిరసించి సాత్త్వికవిజయములను బడయుటకు పరితపించుచున్నవిధము మహానుభావుల యుపదేశములు విశదముచేయుచున్నవి. భారతహృదయమునందు ప్రతిష్ఠితముగనున్న ధర్మసంస్కారమును గాంధిమహాత్ముడు సాత్త్వికనిరోధరూపమునను లోకమునందు ప్రతిష్ఠించుటకు బూనుకొనుచున్నాడు. భారతీయులు ప్రతిష్ఠితముగ నున్న సత్త్వమును ప్రత్యక్షముచేసి శ్రద్ధాపరాయణులై సాత్త్వికనిరోధము నభ్యసించుచు సకల శుభంబులను బడయుదురు గాత!

ited and Published by K. NAGESWARA RAO, at the Andhra Patrika Press, No.7, Thumbu Chetty Street, G.T., Madras



దమయంతి

చిత్రకారుడు: ఏ. వెంకటేశ్వరరావు గారు, రాజమండ్రి